
# లోకానికి నేనే వెలుగు













**జూబిలీ 2025 సన్నాహాలు**

**వాటికన్ II - నాలుగు పత్రాల అధ్యయనం మరియు ప్రార్థనా సంవత్సరం**

**సంపుటి : 47** **అక్టోబర్ - డిసెంబర్ 2024** **సంచిక : 4**

**భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం, హైదరాబాదు**

## ప్రచురణ

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయ ప్రచురణలు
రామాంతపురం, హైదరాబాదు.

## సంపాదక వర్గం :

ఫాదర్ పిల్లి అంతోని దాస్
ఫాదర్ సగినాల ప్రకాష్
ఫాదర్ దొడ్డ రాజా
ఫాదర్ మేడంకి ఆనంద్ అంద్రూ

## గురు విద్యార్థుల బృందం :

బ్రదర్ చాట్ల అలెగ్జాండర్
బ్రదర్ నెకూరి జాయ్ చందు
బ్రదర్ పెండేల ఉమేష్ చంద్ర
బ్రదర్ వంపుగుళ్ళ ప్రదీప్‌కుమార్
బ్రదర్ పచ్చిగొర్ల ఒబేజ్
బ్రదర్ పగుర్ల భానుప్రసాద్
బ్రదర్ పెంటారెడ్డి బాల సంజయ్
బ్రదర్ బడిపాటి జాకబ్
బ్రదర్ అరికోట్ల భరత్ కుమార్
బ్రదర్ బాలసాని ప్రభు దాస్
బ్రదర్ దొప్పలపూడి రవీంద్ర
బ్రదర్ గొన్నాబత్తుల హేమంత్
బ్రదర్ కాకుమాను జాన్‌రాజు
బ్రదర్ కొట్టె అరవింద్
బ్రదర్ తుడుం సంపత్
బ్రదర్ తురకా మహేష్

# చందా వివరములు

సంవత్సరానికి మీ చందాను రూ॥ 100/- యం.ఓ., డి.డి.ల ద్వారా **St. John's Regional Seminary Society, Hyderabad** పేరున పంపించి మమ్మల్ని ప్రోత్సహించమనవి. అన్ని సంప్రదింపులకు మరియు మీ విరాళము పంపవలసిన అడ్రస్:


## St. John's Regional Seminary

Ramanthapur, Hyderabad - 500 013.
Ph: 91-040-29561761, 29561762
e-mail: stjohnshyd2@gmail.com

# లోకానికి నేనే వెలుగు

సంపుటి : 47 అక్టోబర్-డిసెంబర్ 2024 సంచిక : 4

## జూబిలి 2025 సన్నాహాలు
## వాటికన్ II - నాలుగు పత్రాల అధ్యయనం మరియు ప్రార్థనా సంవత్సరం

**ఫాదర్ దొడ్డ రాజా**

సంచిక సంపాదకులు

**ఫాదర్ పిల్లి అంతోని దాస్**

ప్రధాన సంపాదకులు

భక్త యోహాను ప్రచురణలు, భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం
రామాంతపురం, హైదరాబాదు-500 013.
ఫోన్ : 91-040-29561761, 29561762
E-mail : stjohnshyd2@gmail.com
Website : stjohnseminary.org

# విషయసూచిక


**సంపాదకీయం**

*– ఫాదర్ దొడ్డ రాజా* ........................................ **05**

**తెలుగు కతోలిక దైవశాస్త్రజ్ఞుల 10వ వార్షిక సదస్సు – నివేదిక సందేశం**

*– ఫాదర్ కొమ్మారెడ్డి మర్రెడ్డి* ........................................ **09**

**1. జూబిలి 2025 : సంసిద్ధత స్థూలాంశాలు – కీలక ఉపన్యాసం**

*– మహా॥ ఘన॥ ఉడుమల బాల*........................................ **14**

**2. జూబిలీ యాత్ర – ప్రార్థన పాత్ర**

*– ఫాదర్ యుగల్ కుమార్ పసుపలేటి*........................................ **21**

**3. దైవార్చన చట్టం** *(Sacrosanctum Concilium)*

*– ఫాదర్ మొదంకి ఆనంద్ ఆంద్రు*........................................ **47**

**4. లోకానికి వెలుగు శ్రీసభ** *(Lumen Gentium)*

*– ఫాదర్ కొండవీటి అంతయ్య*........................................ **98**

**5. దైవవాక్కు** *(Dei Verbum)*

*– ఫాదర్ గోవిందు రాయన్న*........................................ **118**

**6. శ్రీసభ ప్రపంచానికి హృదయం** *(Gaudium et Spes)*

*– ఫాదర్ పిల్లి అంతోని దాస్*........................................ **133**

# సంపాదకీయం



2025వ సంవత్సరాన్ని మన జగద్గురువులు పావన ఫ్రాన్సిస్ పాపుగారు సాధారణ జూబిలి సంవత్సరంగా ప్రకటించారు. శ్రీసభ ప్రతి 25 సంవత్సరములకు ఒకసారి సాంప్రదాయబద్ధంగా జరుపుకోనే సాధారణ జూబిలీ ఇది. జూబిలీ అనే పదం హీబ్రూ భాషలోని "ఖేరెన్ హై యోబెల్" అనే పదం నుండి వచ్చింది. దీని అర్థం "పొట్టేలు యెక్క కొమ్ము". ఇస్రాయేలీయులు ఈ పొట్టేలు కొమ్ముతోనే బాకాను (బూరను) ఊది జూబిలీ సంవత్సరాన్ని ప్రకటించే వారు. లేవీయకాండమ 29:5 ప్రకారం ఇశ్రాయేలీయులు ఏడు సబ్బాతు సంవత్సరాల తరువాత అనగా 49 సంవత్సరముల తరువాత జూబిలీ సంవత్సరాన్ని కొనియాడెవారు. ఈ విధంగా హెబ్రీయులు వారి సాంప్రదాయాన్ని అనుసరించి ప్రతి యేబదియువ సంవత్సరాన్ని స్వేచ్ఛా సంవత్సరముగా, జూబిలీ సంవత్సరముగా జరుపుకునేవారు. ఈ పవిత్ర సంవత్సరములో బానిసలకు స్వేచ్చను ప్రకటించేవారు, అప్పులను రద్దు చేసేవారు, భూమిని సాగు చేయటం నిలిపే వారు. ఈ జూబిలీ సంవత్సరాన్ని దేవునికి అంకితం చేయబడిన పవిత్ర సంవత్సరముగా కొనియాడెవారు. మన క్రైస్తవ జూబిలీ వేడుకలకు పవిత్ర గ్రంథం ఆధారము కూడా ఇదియే.

ప్రప్రథమంగా విశ్వ కతోలిక శ్రీ సభలో పావన 8వ బోనిఫేస్ జగద్గురువులు 1300 సంవత్సరంలో క్రైస్తవ జూబిలీ వేడుకలను ప్రారంభించారు. అప్పటినుండి శతాబ్దాల తరబడి ప్రతి 25 సంవత్సరాలకు ఒకసారి "సాధారణ జూబిలీ సంవత్సరం" శ్రీసభలో కొనియాడబడుతూంది.

విశ్వ కతోలిక శ్రీసభలో విశ్వాసులందరు వారి ఆధ్యాత్మిక జీవితాలను నూత్నీకరించుకోవడమే ఈ వేడుకల పరమార్థం.

2024 సంవత్సరం, మే నెల 9వ తేదీన యేసుక్రీస్తు మోక్షారోహణ మహోత్సవంనాడు, పావన ఫ్రాన్సిస్ జగద్గురువులు తన 12వ పాలనా సంవత్సరంలో, 2025 సంవత్సరాన్ని "సాధారణ జూబిలీ సంవత్సరము"గా రోము నగరములో, పునీత పేతురు బసిలికా దేవాలయంలో ప్రకటించారు. ఈ జూబిలీ సంవత్సర ధ్యేయం **"నిరీక్షణ యాత్రికులు".** "మన నిరీక్షణ మనకు నిరాశను కలిగింపదు" (రోమీ 5:5). ఈ భావనతో అందరూ ధృడ నమ్మకము కలిగిన మనస్సులతో భవిష్యత్తును సహృదయంతో ఆలింగనం చేసుకుంటూ ముందుకు సాగాలని మరియు దేవుడు మనకు ప్రసాదించిన 'నమ్మకాన్ని' ప్రతి ఒక్కరితో పంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ జూబిలీ సంవత్సర వేడుకలు, 2024 డిసెంబర్ 24 సాయంత్రం క్రీస్తు జయంతి పూజ ప్రారంభంలో మన పావన ఫ్రాన్సిస్ జగద్గురువులు పునీత పేతురు బసిలికా దేవాలయం పవిత్ర ద్వారాలను తెరవడంతో అధికారికంగా ప్రారంభమై, సంవత్సరం పాటు కొనసాగి, 2026 జనవరి 6వ తేదీన యేసుక్రీస్తు సాక్షాత్కార మహోత్సవముతో పావన జగద్గురువులు పవిత్ర ద్వారాలను మూసివేయడంతో అధికారికంగా ముగుస్తాయి.

ఈ నూతన జూబిలీ సంవత్సరాన్ని దైవవరాలనందిచే ఒక ప్రత్యేక సంవత్సరముగా, పాప మన్నింపును పొందుటకు ఒక సువర్ణ అవకాశముగా పరిగణిస్తూ భక్తి శ్రద్ధలతో కొనియాడుకుందాం.

మన జగద్గురువుల ఆకాంక్ష మేరకు తెలుగు కతోలిక పీఠాధిపతుల సమాఖ్య ఈ జూబిలీ సంవత్సరాన్ని అర్థవంతమైన విధంగా జరుపుకునేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహించుచున్నారు. అందులో ఒకటైన తెలుగు కతోలిక పీఠకాపరుల మండలి: సిద్ధాంత, దైవం శాస్త్రం విభాగం దైవశాస్త్రాజ్ఞుల సదస్సు– అక్టోబర్–29–30 2024, పునీత యోహాను ప్రాంతీయ గరువిద్యాలయం, హైదరాబాద్ నందు నిర్వహించారు.

ఈ సదస్సులో ద్వితీయ వాటికన్ మహాసభ శ్రీసభకు అందించిన ముఖ్యమైన నాలుగు పత్రాల మూల అంశాలను ప్రధానంగా అధ్యయనం చెసి చర్చించారు.

ఈ సందర్భంగా కొందరు దైవశాస్త్రజ్ఞులు ఈ అంశాలపై ప్రసంగించారు. అవే అంశాలను వ్యాసం రూపంలో కూడ అందించారు.

మహా పూజ్య శ్రీ ఉడుమల బాల గారు: "జూబిలీ 2025: సంసిద్ధత స్తూలాంశాలు". గురు శ్రీ మెడంకి ఆనంద్ ఆంద్రూ గారు: "దైవార్చన చట్టం" గురు శ్రీ కొండవీటి అంతయ్య గారు: "లోకానికి వెలుగు శ్రీసభ", గురు శ్రీ గోవిందు రాయన్న: "దైవ వాక్కు", గురు శ్రీ పిల్లి ఆంతోని దాస్: "శ్రీసభ: ప్రపంచానికి హృదయం". గురు శ్రీ పసుపులేటి యుగళ్ కుమార్: "జూబిలీ యాత్ర-ప్రార్థన పాత్ర". ఈ సంచికలో ఈ వ్యాసాలను అందించుచున్నాము.

పరిశోధనాత్మకంగా వ్రాసిన ఈ వ్యాసాలు గురువులకు, మఠవాసులకు, సామాన్య క్రైస్తవులకు వారి విశ్వాసాన్ని మరింత స్పష్టమైన విధంగా అవగాహన చేసుకోని జీవించటానికి మరియు భోధించటానికి దోహద పడగలదను ఉద్దేశ్యంతో వీనిని ప్రచురిస్తూన్నాము.

పైన పేర్కోనిన రచనలను ముద్రించుటకు అనుమతించిన సిద్ధాంత దైవశాస్త్రం కమిషను అధ్యక్షులు మహా పూజ్య శ్రీ ఉడుమల బాల, వరంగల్ పీఠాధిపతులకు ప్రప్రథమంగా హృదయ పూర్వక కృతజ్ఞతలు. ఈ కమిషను కార్యదర్శి గురు శ్రీ కొమ్మా రెడ్డి మర్రెడ్డి గారు ఈ సదస్సును నిర్వహించి, ఈ ప్రతులను సేకరించి మరియు వాటిని ముద్రించుటలో సహకరించినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నాను.

విశ్వాసంలో వెళ్లూనుకొని కతోలికులందరు ఈ 2025 సాధారణ జూబిలీ సంవత్సరాన్ని అర్ధవంతంగా, ప్రార్థనా పూర్వకంగా మరియు ఫలభరితంగా జరుపుకుంటారని ఆశిస్తూన్నాను. అందరికీ జూబిలీ సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ మరియు దీవేనలు అందిస్తున్నాను.

ప్రభూ సేవలో.....
**ఫాదర్ దొడ్డ రాజా**
సంచిక సంపాదకులు.

# తెలుగు కతోలిక దైవశాస్త్రజ్ఞుల 10వ వార్షిక సదస్సు - నివేదిక సందేశం

- ఫాదర్ కొమ్మారెడ్డి మర్రెడ్డి



దేవునిపట్ల కృతజ్ఞతతో, శ్రీసభపట్ల విశ్వసనీయతతో వివిధ పీఠాలనుండి దైవశాస్త్రజ్ఞులమైన మేము 38 మంది సభ్యులం పునీత యోహాను ప్రాంతీయ గురువిద్యాలయంలో రెండు రోజులపాటు 29, 30 అక్టోబరు, 2024 సమావేశమయ్యాము. ఇందు సామాన్య విశ్వాసులు తొమ్మిదిమంది, మఠకన్యలు ఆరుగురు, గురువులు ఇరువది ముగ్గురు పాల్గొన్నారు. తెలుగు కతోలిక సిద్ధాంత, దైవశాసస్త్ర కమిషను సారథి, మహాపూజ్య ఉడుమల బాలగారి ఆధ్వర్యంలో దైవశాస్త్రజ్ఞుల సంఘ సమావేశం జరిగింది. రానున్న జూబిలి, ప్రత్యేకంగా సనాతనధర్మ పునరుజ్జీవన ధోరణి నేపథ్యంలో, విశ్వశీసభ కోరిన విధంగా, రెండవ వాటికన్ మహాసభల నాలుగు సంవిధాన పత్రాలను అధ్యయనం చేసి, 2024కు అంకితం చేయబడిన ప్రార్ధనా అంశాలను అన్ని కోణాలనుంచి విశ్లేషించి, దైవశాస్త్రజ్ఞుల వ్యక్తిగత వికాసానికి, తెలుగు ప్రాంతీయ శ్రీసభ జూబిలి 2025 సంవత్సరాన్ని "నిరీక్షణ నిరాశపరచదు" (రోమీ 5:5) అన్న ప్రధాన అంశంతో అర్ధవంతంగా కొనియాడుటకు ఉద్దేశించాం.

## 1) కీలక ఉపన్యాసం

మహా ఘన. ఊడుమల బాల గారు, వరంగల్ పీఠాధిపతులు మరియు సిద్ధాంతం మరియు దైవశాస్త్ర కమిషన్ రథసారథి ఈ కీలక ఉపన్యాసము సమర్పించారు. వారు అల్ఫోన్సియానమ్, రోమ్ నుండి నైతిక దైవాశాస్త్ర డాక్టరేట్

పట్టము పొందారు. 1994 నుండి 2006 వరకు హైదరాబాద్‌లోని పునీత యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం నందు రెక్టర్గా ప్రొఫెసర్‌గా నైతిక దైవశాస్త్రం బోధించారు. అటుపిమ్మట, 2006 నుండి అతనుపునీత యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం హైదరాబాదు నందు విజిటింగ్ ప్రొఫెసర్‌గా సేవలు అందిస్తున్నారు.

కీలక ఉపన్యాసంలో దైవశాస్త్రం, దైవశాఃస్త్రజ్ఞుల పిలుపు ప్రత్యేకతను తెలిసికొని, తెలుగునాట దైవశాస్త్రజ్ఞుల బాధ్యతను గుర్తించి, వారి కర్తవ్యాన్ని తెలుసుకున్నాం. అలాగే, జూబిలి వేడుకల పుట్టుపూర్వోత్తరాలు, పరిశుద్ధ గ్రంథం, శ్రీసభ చరిత్ర ఆధారంగా సాధారణ, అసాధారణ జూబిలి విశిష్టతలను గ్రహించినాం. శ్రీసభకు విశ్వసనీయ దైవశాస్త్రజ్ఞులుగా 2023 సంవత్సరానికి కేటాయించిన సంవిధాన పత్రాల అధ్యయనంను విశిష్టులయిన వక్తలు సభకు శాస్త్రోక్తంగా సమర్పిస్తారని సారథి ఉడుమల బాల కాపరిగారు తెలియపరచారు.

## 2) ప్రార్థనా సంవత్సరం - 2024

రెవ. ఫాదర్ పసుపులేటి యుగల్ కుమార్ గారు “జూబిలీ యాత్ర – ప్రార్థన పాత్ర” అను సోదహరణ పత్రమును సమర్పించారు. వారు ‘క్యానన్‌లా’లో లైసెన్షియేట్ పట్టము పొంది ఉన్నాడు. సాంటా క్రోస్ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న వెనిస్‌లో చదువుకున్నాడు. విశాఖపట్నంలోని కోడూరు మాత పుణ్యక్షేత్రం నందు విచారణ గురువుగా సేవలందిస్తున్నారు. మీరు ఆర్చ్ డయోసెస్ యొక్క జ్యుడిషియల్ వికార్గా కూడా పని చేశారు. మీరు ఆధ్యాత్మిక ప్రసంగాలు మరియు వడకములు బోదిస్తారు.

ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా, మరెన్ని సంవిధాన పత్రాలను అధ్యయనం చేసినా, ప్రార్థనే అణ్వాయుధాల కంటే బలమైనదని ధంకా బజాయిస్తూ ప్రకటించారు. ఈ నేపథ్యాన క్రైస్తవ జీవితంలో వ్యక్తిగత, సామూహిక ప్రార్థనా విధానాలను వివరిస్తూ, పవిత్ర గ్రంథంలోని కీర్తనలతో ప్రార్థించుట, క్రీస్తువలె ప్రార్థించుట, పునీతుల వలె జపించుట, బైబులులోని ప్రార్థనా ఉపమానాలను ఉటంకిస్తూ ఎవరెస్టు శిఖరం లాంటి శ్రీసభ అనుదిన ప్రార్థనా ప్రశస్తతను వివరిస్తూ, ప్రార్థనలన్నిటికి మకుటాయమైనది. పరలోక ప్రార్థన అని చెబుతూ, నిరుత్సాహపడక,

నిరంతరం, నిర్విరామంగ ప్రతీ జాములోను ప్రార్థించాలని పవిత్రగ్రంథ ప్రార్థనావీరులను పేరు పేరున ఉటంకిస్తూ, ప్రసంగ ప్రజాదరణ పొందిన పూజ్య పసుపులేటి యుగళ్ కుమారుగారు ఉద్బోధించారు.

## 3) రెండవ వాటికన్ సమావేశంలో కీలకమైన "ధైవార్చన సంవిధాన పత్రం"

రెవ. ఫాదర్ డాక్టర్ మేడంకి ఆనంద్ ఆంద్రూ గారు "దైవార్చన చట్టం" అను పత్రమును సమర్పించారు. పాదువలోని పాస్టోరల్ లిటర్జీ ఇన్స్టిట్యూట్ నుండి పవిత్ర దైవార్చన శాస్త్రం నందు డాక్టరేట్ పట్టము పొందాడు. ఇతను సెయింట్ జాన్స్ రీజినల్ సెమినరీ, హైదరాబాద్ నందు పవిత్ర దైవార్చన శాస్త్ర ప్రొఫెసర్గా సేవలందిస్తున్నారు. ఇతను CCBI యొక్క నేషనల్ పవిత్ర దైవార్చన కమిషన్ వర్గం నందు సభ్యుడు. ఇతను పుస్తకాలలో మరియు పత్రికలలో వ్యాసాలను ప్రచురించాడు.

ఈ పత్రముఖ్య అంశాలన్నీ క్రోడీకరిస్తూ, శ్రీసభ ఆరాధనలో దివ్యసంస్కారాలు ప్రముఖపాత్ర వహిస్తాయని, సంస్కారాలకే సంస్కారమైన దివ్యబలి పూజ సర్వోత్కృష్టమైన సమర్పణ అని, అదియే క్రైస్తవ ఆరాధనకు మూలం, శిఖరాగ్రం అని పూజ్య మేడంకి ఆంద్రు ఆనంద్ ఆచార్యులు ఉద్బోధించారు. దైవార్చన అనుదిన ప్రార్ధన్నా విశిష్టతను ప్రభోదిస్తు, జనాదరణ పొందిన జపమాల, ఇతర భక్తిప్రపత్తులను ప్రస్తావించారు. దైవార్చనలో జరుగు దుర్వినియోగాలను ఖండిస్తూ, వాటిని రూపుమాపాలని పిలుపునిచ్చారు.

## 4) లోకానికి వెలుగు శ్రీసభ

రెవ. ఫాదర్ డాక్టర్ కొండవీటి అంతయ్యగారు "లోకానికి వెలుగు "శ్రీసభ" అను అంశముపై శాస్త్రీయ పత్రమును సమర్పించారు. వారు సిస్టమాటిక్ థియాలజీ నందు మాస్టర్స్ డిగ్రీని జ్ఞాన–దీప విద్యాపీఠ్, పూణే నుండి పొందిన్నారు. పొంటిఫికల్ అర్బనియానా విశ్వవిద్యాలయం, రోమ్ నుండి సిస్టమాటిక్ థియాలజీలో డాక్టరేట్ పట్టము పొందారు. ప్రస్తుతము రెవ. ఫాదర్ కొండవీటి అంతయ్య గారు TCBC కమీషన్ ఫర్ ఎక్యుమెనిజం మరియు డైలాగ్ నందు సెక్రటరీగా సేవలందిస్తున్నారు. ఇతను పునీత యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం, హైదరాబాద్ నందు విజిటింగ్ ప్రొఫెసర్గా సేవలు అందిస్తున్నారు.

ప్రపంచానికి సూర్యుడు ఎలాగో, అలానే లోకానికి కతోలిక శ్రీసభ. అది రక్షణ సంస్కారపు వెలుగులను, వెన్నెలలను ప్రసరిస్తుంది. ఎలాగు దేశమంటే మట్టికాదో, అలాగే శ్రీసభ అంటే బడులు, భవనాలు కాదు, అది దైవప్రజలు, క్రైస్తవవిశ్వాసులు. ఈ దైవప్రజలందరు సరిసమానులని, ఎవరి పిలుపు మేరకు వారు సువార్తా సాక్ష్యపు ధర్మాన్ని నిర్వర్తించాలి. గృహస్త క్రైస్తవులు, మఠవాసులు, అర్చకవర్గం కలిసికట్టుగా, అన్యోన్యసభగా మరియమాత సంరక్షణలో యాత్రికశ్రీసభగా పయనిస్తుందని, దైవరాజ్య పరిపూర్తికి కృషి చేస్తుందని పూజ్య కొండవీటి అంతయ్య ఆచార్యులు ఉద్ఘాటించారు.

## 5) శ్రీసభ నిధి, పెన్నిధి అయిన దేవుని వాక్కు

రెవ. ఫాదర్ డాక్టర్ గోవిందు రాయన్న గారు "దైవవాక్కు" అనే అంశంపై శాస్త్రీయ పత్రమును సమర్పించారు. వారు సెయింట్ పీటర్స్ పోంటిఫికల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ థియాలజీ, బెంగళూరులో బిబ్లికల్ థియాలజీలో మాస్టర్స్ డిగ్రీ పొందారు. రోమ్‌లోని పొంటిఫికల్ అర్బన్ విశ్వవిద్యాలయం నుందు బిబ్లికల్ థియాలజీలో డాక్టరేట్ పట్టం పొందారు. ఇతను హైదరాబాద్‌లోని పునీత యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం పవిత్ర బైబిల్ ప్రొఫెసర్‌గా సేవలందించారు. ఇతను ఎన్నో పుస్తకాలు రాసి ప్రచురించారు.

మరో సంవిధాన పత్రమైన "దేవుని వాక్కు" ఆధారంగా విస్తృతమైన దైవ ఆవిష్కరణను ప్రస్తావిస్తూ, పవిత్ర గ్రంథంలో పొందు పరచిన దేవుని వాక్కును, అంతకన్నా మిన్నగా ఆదినుండి ఉన్న వాక్కు అయి, శరీరధారుడైన యేసు విశిష్టతను స్పష్టీకరించారు. పాత కొత్త నిబంధనల పరమార్థంను ప్రబోధిస్తూ, ఆది శ్రీసభలో వెలువడిన లేఖలను ఉటంకిస్తూ, వాటితోపాటు పవిత్ర పారంపర్య సమాన విలువను పూజ్య గోవిందు రాయన్నగారు గలగలా వక్కాణించారు. శ్రీసభ జీవితంలో దేవుని వాక్కు ప్రాముఖ్యతను వివరిస్తూ తర్జుమా విషయాలలోని సవాళ్లను పేర్కొన్నారు.

## 6) ఆధునిక ప్రపంచాన శ్రీసలో ప్రేషిత ధర్మము

రెవ. ఫాదర్ డాక్టర్ పిల్లి ఆంతోనీ దాస్ గారు "శ్రీసభ ప్రపంచానికి హృదయము" అనే అంశంపై శాస్త్రీయ పతమ్రును సమర్పించారు. వారు పునీత

యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం, హైదరాబాద్‌లో డాగ్మాటిక్ థియాలజీ ప్రొఫెసర్‌గా సేవలందినస్తున్నారు. అతను రోమ్‌లోని పోంటిఫికల్ అర్బన్ విశ్వవిద్యాలయం నుండి డాగ్మాటిక్ థియాలజీ నందు లైసెన్షియేట్ మరియు డాక్టరేట్ పట్టము పొందాడు. ఇతను ఆదివారపు ప్రసంగాలు వ్రాసి ప్రచురించాడు.

క్రైస్తవ కుటుంబం, మానవ కుటుంబాల మధ్య సన్నిహిత సంబంధం ఉందని, మానవజీవన పవిత్రతను, ప్రతిమనిషి గౌరవాన్ని నిలపెడుతు, సమాజ శ్రేయస్సు పట్ల శ్రీసభ బాధ్యతలను వివరించారు. ప్రపంచంలోగల కుటుంబ, సాంస్కృతిక, సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాలలోగల తీవ్రమైన సమస్యలను పేర్కొంటూ, సంవిధాన-సంభాషణ మార్గాల ద్వారా సమస్యలను పరిస్కరిస్తూ, యుద్ధాన్ని నివారించే అన్ని ప్రయత్నాలను చేపడుతూ, విశ్వజనీన శాంతి సౌభాతృత్వం స్థాపింప నిర్విరామ కృషి సల్పాలని, స్థానిక సమస్యలు మొదలుకొని జాతియ, అంతర్జాతీయ విభిన్న మానవ జాతుల మధ్య సామరస్య సంబంధాలను నెలకొల్పుతూ, నవ్యలోక నిర్మాణాన్ని చేపట్టాలని, సకల ధర్మాలలోకెల్ల అదే ఉత్తమోత్తమమైన శ్రీసభధర్మం అని, దానిని చేపట్టుట శ్రీసభ భగీరథ కర్తవ్యమని పూజ్య పిల్లి అంతోనిదాసు ఆచార్యులు ఘంటాపథంగా ప్రబోధించారు.


ముగింపుగా: ఈ విషయాలన్నింటిని ప్రశోత్తరాల తదుపరి, వేదాంతుల సభ ముక్త కంఠంతో ఆమోదించి, తమ వ్యక్తిగత వికాసానికి ఉపయోగపడు పరిశుద్ధాత్మ ప్రేరణలు, ప్రాంతీయ తెలుగు శ్రీసభ సభ్యులకు ఉపయోగపడతాయని, జూబిలి 2025ను అర్థవంతంగా, భక్తి యుతంగా కొనియాడుటకు ఉపకరిస్తాయని నమ్ముతూ దైవశాస్త్రజ్ఞులుగా ప్రాంతీయ శ్రీసభకు ఉడతాభక్తిగా మా సమావేశ సందేశంగా అంకితమిస్తున్నాం! నిరీక్షణ మనకు నిరాశను కలిగింపదు (రోమీ 5:5). నిరీక్షణ యాత్రకులుగా, మనం ముందుకు సాగుదాం. (జై ఏసు!!)

❋ ❋ ❋ ❋

# 1. జూబిలీ 2025: సంసిద్ధత సూత్రాంశాలు - కీలక ఉపన్యాసం

– మహా॥ ఘన॥ ఉడుమల బాల

## పరిచయం



దైవశాస్త్రం (వేదాంతశాస్త్రం) అను పదం ఆంగ్ల పదమైన Theologyకి తెలుగు పదం. వెరసి, Theology అను పదమూలమే గ్రీకు భాషలోని Theologia అను పదం: Theos అనగా దేవుడు, logos అనగా పదం, హేతుబద్ధం, ఆలోచన, తర్కం, మొదలైనవి. స్థూలంగా దైవశాస్త్రం అంటే “దేవుని గూర్చిన అధ్యయనం”. వివరంగా చెప్పాలంటే దేవుడు ఎవరు? ఎలా ఉంటాడు? ఆయన గుణగణాలు లక్షణాలు ఏంటి? ఆయన ప్రవర్తన ఎలా ఉంటుంది? లోకంతో, జీవులతో ముఖ్యంగా మనుషులతో ఎలా వ్యవహరిస్తాడు? కతోలికవిశ్వాస ప్రకారం దైవశాస్త్రం అంటే భక్త ఆన్సలోమొగారి ప్రామాణిక నిర్వచనమే శరణం: “అవగాహన కోరుకొను విశ్వాసం” (Faith seeking understanding). దానిలో నమ్మకం లేదా విశ్వాసం ముందుగా ఉంటుంది. దేవుని నమ్ముటలో, ఆయన్ని గూర్చిన పూర్తి అవగాహన అవసరం లేదు. “నీవే దేవుని పరిశుద్ధుడవని మేము యేసుతో పేతురు విశ్వసించి తెలుసుకున్నామని చెప్పెను” (యోహాను 6:19). విశ్వాసం అవగాహనకు నడిపిస్తుంది. అవగాహన విశ్వాసం లోతుల్లోకి నడిపిస్తుంది. భక్త అగస్తీను “అర్థం చేసుకోనుటకు నమ్ముతాను. అర్థం చేసుకునేది ప్రగాఢంగా నమ్ముటకే” అని అంటాడు. విశ్వాసం అవగాహనను ఆవశ్యంగా కోరుతుంది. ఎందుకంటే కథోలిక విశ్వాసం, గుడ్డి విశ్వాసం, మూఢనమ్మకం కాదు కదా!

## విశ్వాస సిద్ధాంతాలు: మొదటి సహస్రాబ్ది

పెంతుకోస్తు నుండి కతోలిక విశ్వాస ప్రబోధం అసలు సిసలైన బంగారంలా ఓవైపు దగదగ మెరుస్తుంటే, మరోవైపు కల్తీ బంగారంలా దబ్బర సిద్ధాంతాలు తలెత్తాయి. ఉదాహారణకు క్రీస్తు యేసు స్వభావాన్ని గూర్చిన ఏరియను వివాదం (311) కతోలిక విశ్వాసానికి విరుద్ధమైన సిద్ధాంతం ఆయన ఒక గురువు. దేవుడు ఒక్కడే నిత్యుడు, మార్పు లేని వాడు క్రీస్తు దేవునిచే చేయబడ్డాడు. ఆయన నిండుగా దేవుడు కాడు. ఆయన మానవుడే అని దబ్బర సిద్ధాంతం ప్రబోధించాడు. ఏసుక్రీస్తు నిజంగా నిండుగా దేవుడు మానవుడు కూడా. దాన్ని వ్యతిరేకిస్తూ ఏసుక్రీస్తు యొక్క దైవత్వాన్ని తిరస్కరించాడు. ఆదినుండి ఇలాంటి తప్పుడు బోధలను ఖండిస్తూ సరియైన బోధలను నిసియ (325), అలెగ్జాంద్రియా (362), కాన్స్టంట్‌నోపుల్ (381) లాంటి విశ్వశ్రీసభ సమావేశాలు శ్రీసభ సిద్ధాంతాలను ప్రకటించాయి.

ప్రఖ్యాత అరిస్టాటిల్ తత్వవేత్త తాత్విక ఆలోచనకు ఆరంభం "ఆశ్చర్యం, అబ్బురం" అని అన్నాడు. ఈలోక అద్భుతాలను గమనించి అజ్ఞానంనుండి, మూఢనమ్మకాలనుండి బయటపడుటకు మనిషి తాత్వికంగా ఆలోచించడం మొదలుపెట్టాడు. క్రైస్తవ విశ్వాసం అతీంద్రియం (Supernatural), ఆది దైవిక కానుక. దీనిని పొందిన క్రైస్తవుల్లో కొందరి, విశ్వాస లోతుపాతులు తెలుసుకోవాలన్న దాహం, కొత్త దైవజ్ఞాన వ్యక్తికరణ మలుపుకు శ్రీకారం చుట్టింది. వారి సత్యాన్వేషణకు దైవం మూలం. యేసుక్రీస్తులో దేవుడు ఆవిష్కరించిన ఈ వెలుగు ద్వారా క్రైస్తవులు దీర్ఘంగా, సుందరంగా ఆలోచించడం ప్రారంభించారు. వారి అన్వేషణా ఉత్సుకత ఎందరి మనసులనో కదిలించింది, హృదయాలను కరిగించింది. అలా క్రైస్తవ దైవశాస్త్రం ఆరంభమై తప్పటడుగులు వేస్తూ, తప్పులను ఖండిస్తూ, సత్య సిద్ధాంతాలను ప్రకటిస్తూ శ్రీసభ మొదటి సహస్రాబ్ది పయనం సాగించింది.

## క్రమబద్ధమైన దైవశాస్త్రానికి (Systematic Theology) శ్రీకారం

రెండవ సహస్రాబ్దిలో శ్రీసభ నావ అనేక తుఫానులను ఆటుపోట్లకు గురైంది. మొదటి సహస్రాబ్దిలో ప్రముఖంగా సిద్ధాంతాల నిర్వచించి, వివరించిన

కాలమైనా, దైవశాస్త్ర ఎదుగుదల లేకపోలేదు. దానికి పితృపాదుల ఆధ్యాత్మిక వేదాంతం (Patristics) ఒక చక్కటి ఉదాహరణ. రెండో సహస్రబ్దిలో 12వ శతాబ్దం నుండి దైవశాస్త్రం రూపుదిద్దుకోవడం ప్రారంభమైంది. దానిని క్రమబద్ధమైన పరిశోధనాత్మక దైవశాస్త్రం (Systematic Theology) అని నేడు పేర్కొంటున్నాం. దేవుని గూర్చిన సాధ్యమైన జ్ఞానమంతా సేకరించి, దానిని జ్ఞాన యుక్తంగా, హేతుబద్ధంగా క్రమబద్ధంగా, వివరణాత్మకంగా దైవ ఆవిష్కరణపరంగా వివరించేదే క్రమబద్ధమైన దైవశాస్త్రం. దానిలో పవిత్ర గ్రంథ, ఆధ్యాత్మిక, నైతిక, సత్యోపదేశ, దైవార్చన మున్నగునవి అంతర్భాగ శాస్త్రాలు. 11– 12 శతాబ్దంలో భక్త ఆన్సలోమొగారు దైవశాస్త్రం అంటే ఏంటో నిర్వచించిన విషయం ముందే తెలుసుకున్నాం. అది శాస్త్రీయ నిర్వచనంగా శ్రీసభలో ఉండిపోయింది. పవిత్రాత్మ మార్గదర్శకత్వంలో అపోస్తులుల సువార్త ప్రకటనకై పునాదులు వేశారు. శ్రీసభ అభివృద్ధి చెందేకొలది, దేశ విదేశాల్లో వేళ్ళూనే కొలది, వివిధ ప్రశ్నలు, సవాళ్లు, ఎదురై దైవావిష్కరణ సత్యాలను వారి వారి సాంస్కృతిక నేపథ్యంలో లోతుగా అన్వేషించుట ఆవశ్యమైంది. ఆ అన్వేషణ ఫలితం దివ్యసత్యాల వ్యక్తీకరణకు దారితీసింది. ప్రాచ్య–పాశ్చ్యాత్త దేశాల వేదాంతాలు, సంస్కృతులు, తత్వశాస్త్రాలు, ఆలోచనా ధోరణలు దైవశాస్త్రాన్ని ప్రభావితంచేశాయి. సత్యం ఒకటే అయినా వివిధ కోణాలనుండి, వివిధ రకాల ఆలోచన దోరణుల నుండి, వివిధ రకాల్లో ఒకే సత్యాన్ని నిర్వచించారు. అందుకే దైవశాస్త్రం ఇతర శాస్త్రాలన్నీటికి 'మహారాణి' అని పేరు గాంచింది. క్రమబద్ధమైన దైవశాస్త్రం 'మహారాణి కిరీటం'గా ప్రసిద్ధి పొందింది!

## దైవశాస్త్రజ్ఞులు అంటే.....

దైవశాస్త్ర ఆధారం, పవిత్రగ్రంథం, శ్రీసభ బోధనాపీఠం, పవిత్ర పారంపర్యం. విశ్వాస విషయాన్ని తీవ్రంగా తీసుకుంటే, అతిశ్రద్ధగా ఆలోచిస్తే, దైవాన్ని గూర్చి అతని ఆవిష్కరణను లోతుగా ధ్యానిస్తే, వారు దైవ శాస్త్రజ్ఞులు అగుటకు అర్హత పొందినట్లే! అప్పుడప్పుడు దీర్ఘంగా ఆలోచించే సామాన్య క్రైస్తవునికి, దైవ ఆవిష్కరణకు గూర్చిన అధ్యయనంపట్ల తీవ్రమైన 'అభినివేషం, ధృడనిర్ణయం' గల వ్యక్తికి మధ్య భేదం ఉన్నది. ఈ రెండవ కోవకు చెందిన వారే దైవశాస్త్రజ్ఞులు.

దానికి తోడు ఆయా రంగాలలో మరింత అధ్యయనం, చదువు, అర్హత ఉంటే అవి అదనపు యోగ్యతలు అవుతాయి. దైవశాస్త్రం వెనుక విశ్వాసముంటుంది. దాని ముందు పవిత్రజీవితం ఉంటుంది. కాబట్టి నాణ్యమైన దైవశాస్త్రం, నాణ్యమైన జీవితంవైపుకు నడిపిస్తుంది. అందుకే "నీ దేవుడు ఎవరో చెప్పు నీవెవరో చెపుతాను" అని నానుడి వచ్చింది.

## సాధారణ జూబిలీ 2025

## నిరీక్షణ నిరాశపరచదు (రోమీ 5:5)

పద వ్యుత్పత్తి (పదమూలం) ప్రకారం జూబిలీ (Jubilee) అను పదం ఈ హీబ్రు భాషలోని (yobel) అను పదం నుండి వచ్చింది. ఊదెడి కొమ్ము (శంఖం) అని దాని అర్థం. పాత నిబంధనలో 50 సంవత్సరాలకు ఒకసారి జరుపుకొనే సంవత్సరకాలం వేడుక అది (లేవి 25:8-13). యెషయా ప్రవక్త పేర్కొన్న పవిత్రవత్సరం (యెషయా 61:12), యేసుప్రభు ఉద్దేశించిన ప్రభుహిత సంవత్సరం (లూకా 4:19) జూబిలీ అర్థపు లోతులను సూచిస్తున్నాయి. దేవుని కరుణను ప్రకటించే కృపాకాలమది. గత కాలంలో దేవుడు ప్రసాదించిన విమోచన, ప్రస్తుత కాలంలో ప్రసాదించు ఓదార్పు, భావి కాలంలో అభయమిచ్చు దివ్యదర్శన వేడుక ఇది.

8వ బోనీపాసు పోపుగారు క్రీస్తుశకం 1300 సంవత్సరాన్ని సాధారణ జూబిలీ సంవత్సరంగా ప్రకటించారు, వంద ఏళ్ళకొకసారి జరిగే సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. 1343 లో 6వ క్లెమెంటు పోపుగారు 50 సంవత్సరాలకు ఒకసారి, 1470లో 2వ పాల్‌పోపు గారు 25 సంవత్సరాలు ఒకసారి జరిగే కొనియాడు సంస్కృతిని ప్రవేశపెట్టారు. 9వ భక్తినాథ పోపుగారు అసాధారణ (extraordinary) జూబిలీగా 1900ని రక్షణ సంవత్సరముగా, ఫ్రాంచీసు పోపుగారు 2015ని కారుణ్య జూబిలీగా ప్రకటించారు. చివరి సాధారణ జూబిలీ 2000 సంవత్సరములో మహా జూబిలిని కొనియాడిన విషయం చాలామందికి తెలిసిందే!

## జూబిలీ 2025

ఈ సాధారణ జూబిలీ నినాదం “నిరీక్షణ తీర్థయాత్రికులు (Pilgrims of Hope). నేటి విశ్వవ్యాప్త ప్రపంచానికి ఆశాభావం, కల్పించి, మంచిదే తుది గెలుపు” అను అభయాన్ని, భరోసాన్ని ఇచ్చుట పోపుగారి ఉద్దేశం. ఈ జూబిలీ చిహ్నం (logo) నాలుగు రంగుల్లో, నలుగురు వ్యక్తులు, ప్రపంచ నలుమూలల నుండి సంఘీభావంతో, సోదర భావంతో ఆలింగనం చేసుకుంటూ, ఎగిసిపడే అలల సంద్రంలో సిలువ కింద భాగం, నమ్మకలంగరులా, పై వైపు విజయ పతాకంలా కలిసికట్టుగా ప్రయాణించు యాత్రికులను పోలి ఉన్నది. ఆపరం పైభాగాన జూబిలీ 2025 క్రింద “నిరీక్షణగా తీర్థయాత్రికులు” అను నినాదం ఉన్నది.

## జూబిలీ 2025కు సంసిద్ధత

**2023వ సంవత్సరం నేర్చుకొను వసంతం:** ఏదో ఆశామాషిగా గాక చాలా అర్థవంతంగా, గంభీరంగా కొనియాడాలని శ్రీసభ కోరుతుంది. దానికి సంసిద్ధం కావాలని ఆశిస్తుంది. రెండవ వాటికను 16 పత్రాల్లోని సిద్ధాంత పత్రాలైన 4 రాజ్యాంగా పత్రాలను అధ్యయనం చేయాలని శ్రీసభ కోరుతుంది. విశ్వశ్రీసభ సమావేశంలోని ముఖ్యాంశాలను ప్రత్యేకంగా ఏసుప్రభు, శ్రీసభ, నేటి ప్రపంచంలో మన జీవితాలను గూర్చి విశ్లేషించి, ధ్యానించి, ప్రార్థించమంటుంది. ఆ నాలుగు అధికార పత్రాలు ఏవనగా:

1. **పవిత్ర దైవార్చన చట్టం (Constitution on Sacred Litugy-Sacrosanctum Concilium):** 1963న ప్రకటించిన పత్రస్థూలాంశం “యేసు నిగూఢ సత్యానుభవంలోకి విశ్వాసులను పరిచయం చేయు శ్రీసభ కార్యక్రమాలన్నింటికీ దైవార్చన మూలం, శిఖరాగ్రం. (SC 10).

2. **లోకానికి వెలుగు శ్రీసభ (Dogmatic Constitution on the Church-Lumen Gentium):** 1964లో ఆమోదం పోందిన ఈ పత్రం శ్రీసభ నిగూఢ సత్యాన్ని, శ్రీసభంటే దేవుని ప్రజలు, ప్రత్యేకంగా

సాధారణ విశ్వాసుల పాత్ర ఔన్నత్యం, మున్నగు ముఖ్య విషయాలను పైకెత్తి చూపెడుతుంది.

3. **దైవవాక్కు (Dogmatic Constitution on Revelation - Dei Verbum):** 1965లో ప్రకటించిన ఈ పత్రం దైవ ఆవిష్కరణలో పవిత్ర గ్రంథ (Sacred Scripture), పారంపర్యం (Tradition)లకు శ్రీసభ జీవన ప్రస్థానంతో గల సంబంధాన్ని స్పష్టంగా తెలుపుతుంది.

4. **ఆధునిక ప్రపంచంలో శ్రీసభ (Pastoral Constitution on the Modern World-Gaudium et Spes):** 1965లో ప్రకటించిన ఈ పత్రం సువార్త వెలుగుల్లో కాలసంజ్ఞలను నిశితంగా పరిశీలిస్తూ, శ్రీసభ పిలుపు కర్తవ్యాన్ని, ప్రస్తుత కాల సమస్యలను, సవాళ్లను, అగ్నిపరీక్షలతో పాటు, సాంస్కృతిక, ఆర్థిక, సాంఘిక, రాజకీయ సమస్యలను దీటుగా ఎదుర్కొంటూ ప్రపంచ శాంతి సామరస్యాలకై కృషిసల్పాలని ఉద్బోధిస్తుంది.

## 2024 సంవత్సరం: ప్రార్థనా సవత్సరం (Year of Prayer)

జూబీలి 2025 సమీపిస్తున్న కొలది ప్రపంచ శ్రీసభ వివిధ పీఠమండలాల్లో వ్యక్తిగత మరియు సాముదాయిక/సామూహిక ప్రార్ధనా ప్రాముఖ్యతను తెల్పు కార్యక్రమాలు చేపట్టాలని కోరింది. శ్రీసభ అనుదిన ప్రార్థనను ప్రపంచ రక్షణ కొరకు ప్రార్థించు ప్రక్రియను, క్రైస్తవ జీవితంలో ప్రార్థనా ఆవశ్యకతను, దివ్యసంస్కారాలు, ప్రసిద్ధ భక్తి ప్రపత్తుల ఆచరణల పై ధ్యానించి, ప్రార్థించమని విశ్వశ్రీసభ ఆహ్వానించింది. ప్రార్దనా వీరులుకమ్మని పిలుపునిచ్చింది.

## జూబిలి 2025: ముఖ్య విశేషాలు

డిసెంబర్ 24, క్రీస్తుజనన జాగరణ సమయంలో రోమా పట్టణంలోని భక్త పేతురు పెద్ద బృహదేవాలయ "జూబిలి ద్వారమును" పరిశుద్ధ ఫ్రాన్సిసుగారి చేతులమీదుగా తెరచుటతో పవిత్రవత్సరం ప్రారంభం అవుతుంది. ఆ తదుపరి వచ్చు ఆదివారం, డిసెంబర్ 29, 2024 ప్రపంచంలోని అన్ని పీఠమండలాల బృహ దేవాలయాల్లో పీఠకాపరి ప్రత్యేక శిలువ ప్రార్దన కార్యక్రమంతో

ప్రారంభిస్తారు. ఆసంవత్సరం నిండా కొనియాడు వివిధ విశ్వవ్యాప్త కార్యక్రమాలను ఇప్పటికే ప్రకటించింది విశ్వశ్రీసభ. డిసెంబర్ 28, 2025 నాడు ప్రాంతీయ శ్రీసభల్లో వివిధ పీఠ మండలాల్లో జూబీలి సంవత్సరం ముగుస్తుంది. జనవరి 6, 2026 ఏసు సాక్షాత్కార పండుగ నాడు రోమా పట్టణంలో స్వస్తి శుభవచనంలో ముగిస్తారు!

కాబట్టి ఎంతో నిగూఢ సత్యాలను కలిగిన జూబీలి 2025ని సాధారణ విశ్వాసుల కన్నా నిశితంగా విశ్లేషిస్తూ, లోతుగా ధ్యానిస్తూ అత్యంత అర్థవంతంగా, తెలుగు నాట శ్రీసభ దైవశాస్త్రజ్ఞులుగా ఆశీర్వాదకరంగా, ఆనందంగా కొనియాడుదాం. ఇతరులకు మనం ఒక దైవ దీవెనగా ఉందుముగాక! జై యేసు! జై క్రీస్తు! జై జూబిలీ 2025!!

# ౨. జూబిలీ యాత్ర - ప్రార్థన పాత్ర

– ఫాదర్ పసుపులేటి యుగళ్ కుమార్

## పరిచయం



"కలిసి నడుద్దాం... కలిసి పయనిద్దాం" అనే సినడల్ నినాదంతో ప్రారంభమైన "క్రీస్తు జూబిలి 2025." జూబిలీ యాత్ర చివరి మజిలీకి చేరుతున్న ఈ సందర్భంలో ఈ యాత్రా గమ్యం చేరాలన్నా, నిరీక్షణతో పయనిస్తున్న శ్రీసభ లక్ష్యాలు సాధించాలన్నా ప్రార్ధనా ప్రాధాన్యత ప్రధానం. పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారు ఈ జూబిలీ యాత్ర సన్నాహకాలు ఆరంభిస్తూ "We must fan the flame of hope to restore the climate of hope and trust" - "నిరీక్షణాపూరితమైన, నమ్మకపాత్రమైన వాతావరణాన్ని తిరిగి పునరుద్ధరించాలంటే నిరీక్షణ జ్వాలలు రగిలించే వారముగా, మండించేవారముగా మనం మారాలని" పిలుపునిచ్చారు. ఈ మంటలు రగిల్చే "విసన కర్ర" ప్రార్ధన. గడిచిన దినాల్లో రకరకాల కారణాల వలన శ్రీసభలోను, సభ్య సమాజంలోనూ ఈ నిరీక్షణ, నమ్మకాలు క్రమక్రమంగా సన్నగిల్లుతూ, క్రొత్త, వింత రూపాలకు, పోకడలకు తావిస్తున్న తరుణంలో ఈ జూబిలీ యాత్ర, ప్రార్ధనాయుధంతో పునరుద్ధరించుటకు, పునర్వ్యావస్థీకరించుటకు, పునర్నిర్మించుటకు ఎంతో దోహద పడుతుంది. "ఏదైన ఒక నూత్నీకరణ, నూతనోత్తేజం తీసుకురావాలంటే మొదట్లో ప్రజలు వ్యతిరేకిస్తారు, తర్వాత క్రమంగా జరగవచ్చేమో అన్న ఆశను వ్యక్తపరుస్తారు. తర్వాత జరుగుతుందని నమ్ముతారు. చివరకు జరిగిన తర్వాత ఇంత అద్భుతకార్యం ఇన్నేళ్ళు ఎందుకు జరగలేదా అని ఆశ్చర్యపోతారు". ఆశ, నిరీక్షణ, నమ్మకం

లేకుండా ఏమీ చేయలేం, కాని ఆ ఆశానమ్మకాలను నిత్యం రగిలేలా, మండేలా చేసేది మాత్రం ప్రార్ధనే.

"HOPE" = Hold on Pain Ends.

= Healing, Optimism, Positivity, Empowerment.

సినడల్ యాత్రతో ఆరంభమైన ఈ జూబిలి యాత్రలో, నిరీక్షణ కలిగి, కలిసి సాగే ఈ సమయంలో, ఆశయ లక్ష్య సాధనలో గమ్యం వైపు దూసుకుపోతున్న ఈ సందర్భంలో ఒక వైపు లక్ష్యం చేరుతున్నామనే ఆనందం, మరోవైపు చేరాలనే ఆశ, ఇంకోవైపు చేరగలమో లేదో అనే నిరాశ, నిసృహ మన గమనాన్ని శాసిస్తూనే వున్నాయి. ఇశ్రాయేలీయుల ఎడారి యాత్రలో వారికి ఎదురైన సవాళ్ళు, సంఘర్షణల మధ్య పగలు మేఘమై, రాత్రి అగ్ని స్థంభమై తోడుగ వుండి నడిపిన ఆ భగవంతుడు మన ఈ జూబిలీ యాత్రలో ప్రార్ధించే శ్రీసభను మనం కోరిన రేవుకు నడిపించాలని ఆశిద్దాం, ప్రార్ధిద్దాం. జూబిలీ లక్ష్యాలు నెరవేరాలన్నా, మన నిరీక్షణ జ్వాలలు నిత్యం మండాలన్నా ప్రార్ధనతో ఈ లోకాన్ని స్పర్శించే ప్రార్ధనా వీరులు లేవాలి. ప్రార్ధించు కుటుంబాలు పెరగాలి. "ప్రార్ధించే శ్రీసభ"గా మారాలి.

మన ఈ జూబిలీ యాత్రలో ప్రార్ధనావశ్యకతను గుర్తిస్తూ ఇశ్రాయేలీయులు వారి యాత్రల్లో ప్రార్ధించిన కీర్తనల గూర్చి ఓ చిన్నమాట. 150 కీర్తనల్లో 120 నుండి 134 వరకున్న 15 కీర్తనలను యాత్రా కీర్తనలు అని పిలుస్తారు. ఇశ్రాయేలీయులు బాబిలోను చెరలో 70 సంత్సరలు బానిసలుగా బ్రతికిన తర్వాత ప్రవచన నెరవేర్పుకు దానియేలు ప్రార్ధించగా నాటి పారశీక రాజైన కోరెషు అనుమతితో బాబిలోను నుండి అనేక మంది యూదులు తమ స్వదేశానికి యాత్రగా తిరిగివస్తూ ఈ 15 కీర్తనలను జపించి క్షేమంగా తమ గమ్యం చేరారని పవిత్ర గ్రంథంలో మనం చదువుతాం.

మరొక సందర్భంలో దేవుని సన్నిధికి గుర్తుగా వున్న మందసాన్ని తిరిగి యెరూషలేమునకు ఒక యాత్రగా తీసుకువచ్చిన క్రమంలో ఈ 15 యాత్రా కీర్తనలు ఆనందంతో పాడేవారని, ఇంకో సందర్భంలో సంవత్సరానికి ఒకసారి ఇశ్రాయేలీయులు యోరూషలేంనకు యాత్రగా వచ్చే ప్రయాణ మార్గంలో ఈ

15 కీర్తనలు పాడేవారని చరిత్ర చెపుతుంది. మనమూ యాత్రికులమే, పరలోక యాత్రికులమే. కనుక ఈ జూబిలి యాత్రలో బాటసారులముగా ప్రభుని కీర్తిస్తూ, ప్రార్థిస్తూ గమ్యం వైపు నిరీక్షణతో సాగుదాం.

ఈ జూబిలి వేడుకలకు సిద్ధపాటుగా, ఈ జూబిలి యాత్రలో దారిబత్తెంగా, సద్దెమూటగా శ్రీసభ మనకు ద్వితీయ వాటికన్ మహాసభల నాలుగు చట్ట సంబంధమైన సిద్ధాంత పత్రాలను (4 dogmatic constitutions) పఠించి, పాటించి లక్ష్యసాధనకు ప్రయత్నించమని సూచిస్తుంది. ఈ నాలుగు చట్టసంబంధమైన సిద్ధాంత పత్రాల్లో ప్రార్ధన గూర్చి క్లుప్తంగా ఈ క్రింది విధంగా ప్రస్తావించబడింది.

## I. చట్ట సంబంధ సిద్ధాంత పత్రాల్లో ప్రార్ధన :

## 1. దేయీ వెర్బుమ్ : (Dei Verbum)

దైవవాక్కు కేంద్రంగా వ్రాయబడిన ఈ పత్రంలో ప్రార్ధన అనేది దివ్యగ్రంథ పఠనంతో కొనసాగాలని ప్రస్తావించబడింది. ఆ వాక్య పఠనంలోనే అంతవరకూ ప్రార్ధనలో మనం సంభాషించిన దేవుడు వాక్య పఠనం ద్వార మనతో సంభాషిస్తారని, ఈ క్రమంలోనే భగవంతునితో భక్తుడు నాడు ఏదేను తోటలో నడిచినట్లు దైవగ్రంథ పారాయణాన్ని ప్రార్ధనా హృదితో చేసేవారితో భగవంతుడు మరోసారి కలిసి నడుస్తూ సంభాషించే గొప్ప అవకాశం వుందని, కావున దైవ వాక్కును, ప్రార్ధనను వేరుగా చూడలేమని, దైవవాక్కు పఠించ కుండా ప్రార్థించు మనస్సు వుండదని, ప్రార్థించు వారు దైవ వాక్కు పఠించకుండా జీవించ లేరని ఈ పత్రిక దైవ వాక్కు ప్రాధాన్యతను తెల్పుతుంది. కావున ఈ జూబిలీ యాత్రలో కలిసి పయనించే ఈ యాత్రిక శ్రీసభ, భగవంతునితోనూ కలిసి నడవాలి, సంభాషించాలి.

## 2. సాక్రోసాంక్తుమ్ కొంచీలియుమ్ : (Sacrosanctum Concilium)

పవిత్ర దైవార్చన చట్టాన్ని వివరించే ఈ పత్రికలో శ్రీసభ సంఘ, సామూహిక ప్రార్ధనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన సూచనలు వివరించబడ్డాయి. సామూహిక, వ్యక్తిగత ప్రార్ధనల వివరణ, దైవార్చనలో వినియోగించాల్సిన వివిధ సంజ్ఞలు, గుర్తులు, భంగిమలు, దైవార్చనా సంగీత

విధి విధానాలతో పాటు, నిశ్శబ్ద మౌన ప్రార్థన, దైవార్చనా కార్యనిర్వహణలో ఎవరెవరు ఏఏ విధులు నిర్వహించాలో వారికి ఒక క్రమాన్ని, క్రమశిక్షణను ఈ పత్రిక దిశానిర్దేశం చేస్తుంది. దైవార్చనలో దేవుడు తన ప్రజలతో మాట్లాడుతారని, క్రీస్తే స్వయంగా సువార్తను ప్రకటిస్తారని దానికి బదులుగా భక్తులు తమ ప్రార్థనలు, భక్తి గీతాలాపన ద్వార దేవునితో సంభాషిస్తారన్నది ఈ పత్రిక సారాంశం.

## 3. గౌదియమ్ ఎత్ స్పెస్ : (Gaudium et Spes)

ఆధునిక ప్రపంచంలో శ్రీసభ పాత్ర గూర్చి ఈ పత్రిక వివరిస్తూ దేవుని దరి చేరుటకు ప్రార్థన, శిష్యరికం ఎంతో అవసరమని తేటతెల్లం చేస్తుంది. ఆధునిక ప్రపంచంలో మానవుడు ఎదుర్కొనే ఆర్థిక, సామాజిక, రాజకీయ సవాళ్ళను ఎదుర్కోవాలంటే, సమకాలీన ప్రపంచంలో నైతిక, వైవాహిక, సంస్కృతి పరమైన సమస్యలకు సరైన పరిష్కారం కోసం ప్రజలంతా దేవునిపై నమ్మకంతో ప్రార్థించాలని, దేవదూతల కాపుదల, నడిపింపుకై సదా ప్రార్థించాలని ఆధునిక శ్రీసభలో పయనించే విశ్వాస బాటసారులకు ఈ పత్రిక హితవు పలుకుతుంది.

## 4. లూమెన్ జెన్సియుమ్ : (Lumen Gentium)

లోకానికి వెలుగు శ్రీసభ అని ఉద్ఘాటించే ఈ పత్రికలో మన ప్రార్థనలు, ఆరాధనలన్నీ మహోన్నతుడైన ఏకైక దేవునికే చెందుతాయని, మరియతల్లి, పునీతుల ప్రార్థనావశ్యకతను పేర్కొంటూ దేవుని ఎదుట వారు చేయు విజ్ఞాపన ప్రార్థన ఎంతో అవసరమని ప్రస్తావించింది. పునీతుల సంబంధ బాంధవ్యాన్ని విశ్వసించే శ్రీసభ, పునీతుల పట్ల చూపే ప్రార్థనా భావాన్ని బట్టి దేవుని సన్నిధిలో ఈ పునీతులు నిత్యం ఆనందిస్తున్నారనే సత్యాన్ని ప్రకటిస్తూ, వారి ప్రార్థనా సహాయాన్ని కోరుకుంటున్నాం. యాత్రిక శ్రీసభలో అపోస్తులతో కలిసి ప్రార్థించిన మరియతల్లి ప్రార్థనా సహకారం, ఆమె విజ్ఞపన ప్రార్థన ఆవశ్యకతను గూర్చి ఈ పత్రిక ఉటంకిస్తూ ఆ తల్లిని సహకారిగా, ఉపకారిగా, మధ్యవర్తిగా అభివర్ణిస్తుంది. (L.G .62)

నిరీక్షణతో కలిసి ప్రయాణిస్తున్న శ్రీసభ నిరీక్షణ ఫలించాలన్నా, ఈ నాలుగు చట్ట సంబంధమైన సిద్ధాంత పత్రాల లక్ష్యాలు నెరవేరాలన్నా ప్రార్థన లేకుండా ఏదీ సాధ్యం కాదు.

**"క్రీస్తు జూబిలీ 2025" లక్ష్యాన్ని ఒక వృక్షంతో పోల్చి చూద్దాం:**

a) ఓ చెట్టుకున్న వ్రేళ్ళు "శ్రీసభ సహవాసం" Communion

b) ఆ చెట్టు కాండం "భాగస్వామ్యం" Participation

c) ఆ చెట్టు కొమ్మలు, రెమ్మలు "ప్రేషిత కార్యం" Mission

**ఈ లక్ష్యసాధనతోనే "కలిసి నడిచిన సినడల్ యాత్ర" కూడా 3 దశల్లో జరిగింది.**

a) మేత్రాసన పరిధిలో (2021–22 వరకు)

b) ఖండాంతర పరిధిలో (2022–23 వరకు)

c) విశ్వశ్రీసభ పరిధిలో (2023–24 వరకు)

ఏ దశలోనైన వేరుకు నీరెంత అవసరమో శ్రీసభ లక్ష్యసాధనకు, అభ్యున్నతికి ప్రార్థన అంతే అవసరం. పునీత అవిలాపురి తెరేసమ్మగారు ప్రార్థనలో వివిధ దశలను తోటకు నీరు పెట్టడంతో పోలుస్తూ...

- బావి నుండి నీరు తోడడం ప్రార్థనలో తొలిదశ అని
- ఒక బక్కెట్‌లో మొక్కలకు నీరు పోయడం రెండవ దశ అని
- ఒక నీటి కాలువ సాయంతో తోటకు నీరు పెట్టడం, ప్రార్థనలో ఉత్తమ దశ అని
- ఒక పెద్ద వర్షం తోటపై విస్తారంగా కురవడం, ప్రార్థనలో అత్యుత్తమమని ఆ పునీతురాలు ప్రార్థనా దశలను గూర్చి వివరించిరి.

## II. జూబిలీ స్వరం, చిహ్నం, లక్ష్యాలు – ప్రార్థనే :

"యోబెల్" (Yobel) అనే హీబ్రూ మూలపదం నుండి వచ్చింది జూబిలీ. దీనికర్థం పొట్టేళ్ళు కొమ్ము అని. ఈ కొమ్మునే బూరగా ఊది జూబిలీ సంవత్సరాన్ని ప్రకటించేవారు. (లేవి 25:8...) 49 సంవత్సరాలు నిండిన తర్వాత ఈ బూరను ఊదేవారు. జూబిలీ స్వరం, నాదం, నినాదం ఒక్కటే "విడుదల". యెషయా 61, లూకా 4:16 వచనాలు ఈ జూబిలీ స్వరాన్నే ప్రకటిస్తాయి. ఈ విడుదల కోసమే మన నిరీక్షణ. అందుకే ఈ జూబిలీ యాత్రలో నిరీక్షిస్తూ కలిసి ప్రయాణిస్తున్నాం. కనుక ఈ జూబిలీ కేవలం ఒక వేడుక కాదు. ప్రార్థించే

వేదికగా మారాలి, గమ్యానికి నడిపించే వారధిగా మారాలి. వాక్యామృతాలు ప్రవహించే వాహినిగా మారాలి. అందుకే జూబిలీ చిహ్నంలో (Logo) నాలుగు రంగులు కలిగిన నల్గురు మనుష్యులు నలుదిక్కులకూ చెందిన జనసమూహంగా ఒకరినొకరు సోదర భావంతో, సంఘీభావంతో కౌగిలించుకొనిబీ వీరంతా కలిసి మన నిరీక్షణకు మూలాధారం, మన రక్షణాయుధమైన సిలువకు హత్తుకొని వున్నారు. ఆ సిలువ నేర్పే పాఠం ప్రార్ధన. ఆ సిలువపై యేసు తన కోసం, ఇతరుల కోసం ప్రార్ధించారు. క్షమ, ఓర్పు, సహనం నేర్పించారు. ఇవన్నీ ప్రార్ధించు వారికే సాధ్యం. "ప్రార్ధించు వారు పాపం చెయ్యలేరు, పాపం చేసినవారు ప్రార్ధించలేరు". నలుదిక్కుల ప్రజాసమూహం ఐక్యమవ్వాలన్నా, సిలువ ధారియైన క్రీస్తు చెంతకు రావాలన్నా ప్రార్ధన ద్వారానే ఇది సాధ్యం. జూబిలీ చిహ్నంలో అలజడి రేపే అలలు శ్రీసభ చుట్టూ, మన సమాజం చుట్టూ అలముకున్న సమస్యల వలయాన్ని జ్ఞాపకం చేస్తున్నాయి. ముంచెత్తే అలలు, నావను చిందరవందర చేసే పెనుగాలి, తుఫాను మధ్య నాటి శిష్యులు చేసిన ప్రార్ధన, "ప్రభూ! మమ్ము రక్షింపుమనే" ఈ కేక పొలిమేర్లు దాటి ప్రతిధ్వనించాలి. ఈ జూబిలి యాత్ర వ్యక్తిగత యాత్ర కాదు, సామూహిక యాత్ర. కావున జూబిలీ లక్ష్యాలు సాధించాలన్నా, ఆటంకాలను ఆశీర్వాదాలుగా మలచుకోవాలన్నా ప్రార్ధనా జీవితం ఎంతో ప్రధానం.

## 1. యాత్ర (Pilgrimage) :

ఏ యాత్ర నల్లేరు మీద నడక కాదు. ఎన్నో కానరాని అవాంతరాలు, ఎన్నెన్నో విన్పించని ఆటంకాలు, మరెన్నో ఊహించని అడ్డంకులు ఎదురౌతాయి. వీటన్నిటినీ ప్రార్ధన ద్వార మాత్రమే ఎదుర్కోగలం, దాటగలం, అధిగమించగలం. ప్రార్ధన ద్వార ఎర్ర సముద్రాన్ని, యెరికో నదిని దాటినట్లు, ధీనతతో ప్రార్ధించువారే విజయవంతమైన విశ్వాసులుగా తీరం చేరగలరు.

## 2. పవిత్ర ద్వారం (Holy door) :

ఈ యాత్రలో ద్వారం నేనే, మార్గం నేనే అని పలికిన యేసుని చేరాలన్నా, శ్రీసభ ఆంతరంగిక ద్వారం గుండా ప్రవేశించాలన్నా, ద్వారం వద్ద నిల్చుని తట్టేవాని స్వరాన్ని వినాలన్నా "పుణ్యక్షేత్రాల పవిత్ర ద్వారాలతో" పాటు

వృద్ధాశ్రమ ద్వారాలు, నిర్భాగ్యుల మనస్సుల ద్వారాలు, వలసదారుల ద్వారాలు ఇంకా మనలను హింసించు వారి ద్వారాలు, కలహించు వారి ద్వారాలు ఇలా ఎన్నో ద్వారాల గుండా ప్రవేశిస్తే జూబిలీ స్వరమైన "విడుదల" మన జీవితాల్లో సార్ధకమవుతుంది. అపోస్తుల కార్యాలు 12వ అధ్యాయంలో ఏ పేత్రుని విడుదలకై ఆ విశ్వాసులతో పాటు రోదా అనే స్త్రీ ప్రార్థించిందో ఆమే పేత్రు కోసం ద్వారాలు తెరిచింది. అంటే నిండు హృదయంతో ప్రార్థిస్తే మనం కోరుకున్న వాటిని మన గుమ్మం ముందుకు దేవుడే తీసుకువస్తారు. ఇంతకు ముందు ప్రస్తావించిన ఆ ద్వారాల గుండా మనం ప్రయాణిస్తే, మనం కోరుకున్న దీవెన ద్వారాన్ని దేవుడే మన కోసం తెరుస్తారు.

### 3. సంధి, సయోధ్య (Reconciliation):

పాపసంకీర్తనమనే దేవద్రవ్యానుమానంతో దేవునితోనూ, క్షమ, ప్రేమల ద్వార పొరుగువారితోనూ సయోధ్య కుదిరే ఏకైక మార్గం ప్రార్ధన. ఆదికాండం 32:22-32లో యబ్బోకు అనే రేవు వద్ద రాత్రంతా ప్రార్థించిన యాకోబు, "నన్ను దీవించుదాక నిన్ను వదలనని" పట్టుదలతో ప్రార్థించి, తెల్లారే సరికి ఏసావుతో పొత్తు, సంధి కుదుర్చుకున్నాడు. ఆ ప్రార్ధనా ఫలమే చంపడానికి వచ్చిన ఏసావు చేతులెత్తి దీవించి వెళ్ళేలా చేసింది.

కావున ఈ జూబిలీ యాత్రలో ఆ నిరీక్షణకై యాత్ర చేద్దాం, ఆశతో జీవిద్దాం, ఆ జీవితాన్ని పదిమందికి పంచుదాం. అందుకై నిత్యం ప్రార్థిద్దాం. ఆ ప్రార్ధన విశ్వాసంలో వ్రేళ్ళూనుకున్నదై వుండాలి. ఆ ప్రార్ధన నిరీక్షణతో ముడిపడి, ప్రేమతో జీవించునదై వుండాలి.

## III. ప్రార్ధన : కతోలిక శ్రీసభ సత్యోపదేశ వివరణ

పునీత చిన్న తెరేసమ్మ గారి మాటల్లో "ప్రార్ధన ఎగసిపడే హృదయ తరంగం. మోక్షం వైపుకు సారించిన సాధారణ దృష్టి. ప్రేమతో గుర్తింపుతో పెట్టిన పొలికేక, కష్టసుఖాల ఆలింగనం". అంటే ప్రార్ధన హృదయంలో పొంగే ఒక ఉప్పెన వంటిదని, జీవిత సుఖదు:ఖాలను రెంటినీ జతచేర్చి, పరలోకంలోవున్న ప్రభుని గుర్తిస్తూ, ప్రేమతో చూస్తూ చేసే 'నిశ్శబ్ధ శబ్ధమే' ప్రార్ధన. సర్వం ఇచ్చిన దేవునికిచ్చే సంపూర్ణ సమర్పణమే ప్రార్ధన. పునీత 2వ జాన్ పాల్ పోపుగారి మాటల్లో

"Totus Tuus" – సర్వం మీదే, సర్వం మీకే అనే భావనే ప్రార్థన. సిలువపై వ్రేలాడిన యేసు సర్వం తండ్రి చేతుల్లో సమర్పించినట్టు, మరియతల్లి దైవ చిత్తానికి అంకిత మొనర్చు కొనినట్లు భగవంతునికి మన గతం, వర్తమానం, భవిష్యత్తును అర్పించడమే ప్రార్థన. ప్రార్థన కేవలం ఒక కార్యం కాదు, అది ఒక స్థితి, ఉన్నతమైన స్థితి, ఇచ్చే స్థితి, సమర్పించే స్థితి. దేవునిపై మనకున్న ప్రేమను వ్యక్త పరచడమే ప్రార్థన. పూర్ణ హృదయంతో తనువు, మనస్సు జత చేర్చి, మన భావోద్వేగాలన్నిటినీ ప్రభు సన్నిధిలో వుంచుతూ, ఆ దేవునితోనే గడపడం ప్రార్థన. పునీత అగుస్తీను గారి మాటల్లో "దేవుని సమక్షంలో మనిషి ఓ బిచ్చగాడు". దాహం గొన్న ఆ దేవుని దాహాన్ని గుర్తించి, ఆయన ప్రేమ దాహానికి మనం ఇచ్చే ప్రేమపూర్వక సమాధానమే ప్రార్థన.

ఒక్కమాటలో చెప్పడం కష్టమైనా, చెప్పాలంటే 'ప్రార్థన దేవునితో చేసే ఓ సంభాషణ'. 'దేవునితో మనకున్న ఓ సమాచార వ్యవస్థ' (It is a communication). నేటి ఆధునిక యుగంలో ఎన్నో సమాచార, ప్రసార, దృశ్య, శ్రవణ మాద్యమాలున్నాయి. వీటన్నిటినీ మించి దేవునితో మనకు వున్న ఉత్తమ సమాచార మాద్యమం, వ్యవస్థ, ప్రార్థనే. (Communication is expressed in Communion). దేవునితోనూ, పొరుగువానితోనూ ఏర్పడే సహవాసం ఐక్యతను బట్టే ఈ ప్రార్ధన అనే సమాచార వ్యవస్థ మెరుగుపరచబడుతుంది. ఈ సహవాసం అనేది దివ్యప్రసాద సాంగ్యంలోనూ, దివ్యబలి పూజలోనూ ఉత్తమంగా వ్యక్త పరచబడుతుంది. అందుకే దివ్యబలి పూజను మించిన ప్రార్థన లేదని అంటూంటాం. గుండెల నిండా వున్న ప్రేమను వ్యక్తపరిచేది సంభాషణ ద్వారా, మాట్లాడుకోవడం ద్వారానే కనుకనే ప్రేమించుకొనే వారు మాట్లాడుకోకుండా వుండలేరు. చాలా బంధాలు విడిపోవడానికి, చెదరిపోవడానికి ప్రధాన కారణం సంభాషణా లోపమే. ప్రార్థన ద్వార దేవునితో సంభాషించి, ఆయనపై వున్న ప్రేమను వ్యక్త పరిస్తే ఆ బంధం దృఢ పడుతుంది. కాని ఈ ప్రార్ధనా జీవితమే మసకబారితే బంధం సన్నగిల్లిపోతుంది.

(CCC.2562) ప్రార్థన దేవునితో చేసుకొనే ఒక నిబంధన. హృదయం మనకు మనమే నివాసముండు అత్యంత రహస్య స్థావరం. కేవలం దేవుని

ఆత్మమాత్రమే మానవ హృదయలోతును పరిశీలించి సంపూర్ణంగా తెలిసికోగలదు. ప్రార్ధనకు హృదయం, మనస్సే మూలమని పవిత్రగ్రంథం తెల్పుతుంది. ప్రార్ధించేది హృదయమే, అలాంటి హృదయం దేవునికి దగ్గరగా వుంటేనే ప్రార్ధన ఫలిస్తుంది. ప్రార్ధన మనిషికి దేవునికి మధ్య ఒక ఒప్పంద బాంధవ్యం కనుక ప్రార్ధించు హృదయం దేవుని హృదయంతో ఒప్పదం ఏర్పరచుకొని, నాడు నోవా, అబ్రహాము, దావీదుతో ఒడంబడిక చేసుకున్న దేవునితో ప్రార్ధన ద్వారా ఒడంబడిక చేసుకోవాలి. ఈ నిబంధనలో దేవుడు తన ఆలోచనలను మనకు బహిర్గతం చేస్తారు. అలానే మనమూ మన ఆలోచనలను, ఆశలను ఆ దేవునితో పంచుకుంటాం. ఇతరుల గూర్చి మనకు బాగుగా తెలిస్తేనే, అవగాహన వుంటేనే వారితో మనం అన్నీ పంచుకోగలం, బహిర్గతం చేయగలం. కనుక ప్రార్ధించేముందు ఆ దేవుని గుణగణాలను, సంకల్పాన్ని, ఆలోచనలను ద్వితీయ వాటికన్ మహాసభ అందించు ఈ నాలుగు చట్ట సంబంధమైన సిద్ధాంత పత్రాల ద్వార తెలుసుకోవాలి. దేయీ వెర్భుమ్ ద్వారా వాక్కు ద్వార దేవున్ని తెలుసుకోగలం, ఆయన్ను ఎలా ఆరాధించాలో సాక్రోసాంక్తుమ్ కొంచీలియుమ్ ద్వార తెలుసుకోవాలి. ఆయన సంఘాన్ని, శ్రీసభను ఎందుకు స్థాపించాలో, సంఘారాధన అంటే ఏమిటో లూమెన్ జెన్సియమ్ ద్వార అర్ధం చేసుకోగలం. మాటల్లో వ్యక్త పరిచే ఈ ప్రార్ధన క్రియారూపంలో సమాజంలో ఎలా జీవించాలో గౌదియమ్ ఎత్ స్పెస్ తెలుపుతుంది ఈ పత్రాల అవగాహన దేవునితో ఒప్పంద బాంధవ్యం ఏర్పరచుకొనుటకు మరింత దోహదపడుతుంది.

“క్రైస్తవునిగా జీవించాలంటే ఏం చెయ్యాలి?” అనే ఈ ప్రశ్నకు విశ్వసించాలి, సేవ చేయాలి, ప్రేమించాలి అనే మంచి సమాధానాలు ఎన్నో వింటాం. అవన్నీ సరైనవే అయినా ప్రార్ధన లేకుండా ఎవ్వరూ క్రైస్తవులుగా జీవించలేరు. పునీత యాకోబు గారు అన్నట్లు క్రియలు లేని విశ్వాసం మృతప్రాయమైనట్లే, ప్రార్ధన లేని క్రైస్తవ జీవితం కూడ అంతే. దేవుడు కావాలి, అత్యవసరం అనుకుంటే ప్రార్ధన కూడ అత్యవసరమే. ఎందుకనగా ప్రార్ధన దేవుని వద్దకు చేర్చే ఒక వారధి, వంతెన, సేతువు. వెయ్యి పుస్తకాలు చదివి ఆ దేవున్ని తెలుసుకొనే దానికంటే ఒక్క ప్రార్ధన ద్వార ఆ ప్రభుని మరింత లోతుగా తెలుసుకోగలం. ఎవరో అతని గూర్చి చెప్తే విని తెల్సుకొనే దానికన్నా అతనితో

వ్యక్తిగతంగా మాట్లాడితే మరింత ఎక్కువగా తెలుసుకోవచ్చు. ప్రార్థించడం అంటే పరమ త్రిత్వైక దేవుని సన్నిధిలో వుండడమే. పరలోకంలో ఆ త్రీత్వైక దేవునిలో నిత్యమూ సహవాసం చేసేముందు ఈలోకంలోనే ఆయన సహవాసంలో ఎలా బ్రతకాలో నేర్చుకొనే ఓ తర్ఫీదు వంటిది ప్రార్ధన. పరలోకపు మాధుర్యపు రుచులు చూసే ముందుస్తు రుచి దైవార్చన అని సాక్రోసాంక్తుమ్ కొంచీలియుమ్ 8 లో మనం చూడగలం. కొందరు పాశ్చాత్యలు పోల్చినట్లుగా ఇహలోకంలో ప్రార్థించుట అనేది వివాహ బంధం ముందు ప్రేమించుకోవడం వంటిది. (నిండు దాంపత్య జీవితానికి ముందు ఒకరినొకరు అర్ధం చేసుకోడానికి కేటాయించే సమయం వంటిదని అర్ధం.)

## 1. ప్రార్ధనా ఆవశ్యకత

మనకేదో అవసరముందనో, పొందిన మేలుకు వందనాలు చెప్పాలలో ప్రార్ధన చేయాలన్న జవాబులు కొంతమేరకు సమంజసమే అయినా ఎందుకు ప్రార్థించాలంటే ప్రార్థించమని ప్రభువే అడిగారు, కోరారు కనుక, ఆయనకు ఏదో మేలు జరుగుతుందని కాదు, మన స్తుతి ఆయన స్థితిని ఏమాత్రం మార్చదు గాని మన స్థితినే మారుస్తుంది. ప్రార్ధన మన మేలుకేబీ ఆయన్ను గుర్తించి, జ్ఞాపకం చేసుకోడానికే. "ఊపిరి పీల్చుకొనే దానికంటే ఎక్కువగా దేవున్ని జ్ఞాపకం చేసుకోవాలని" పునీత గ్రెగోరి గారు పలికారు. ప్రార్ధన ద్వార మన మదిలో వున్న చీకటి, గందరగోలం, అపోహలు, మనస్పర్థలన్నీ తొలగిపోతాయి. పడిపోకుండా, జారిపోకుండా ప్రార్ధనే మనలను కాపాడుతుంది. అలాంటప్పుడు యేసు ఎందుకు ప్రార్థించారనే ప్రశ్న వస్తే, ఆయన ప్రార్థించింది పడిపోకుండా వుండడానికి కాదు, తన మానవ ప్రయత్నాన్ని, సంకల్పాన్ని దేవుని సంకల్పానికి, ప్రణాళికకు సమర్పించుటకే ప్రార్థించారు. మనం కూడా ఇలా చేయుటకే ఆయన ప్రార్థించుట నేర్పారు. 'మీ చిత్తం జరగాలి, మీ రాజ్యం రావాలి' అన్న మాటలో ఆంతర్యంబీ అంతా, అన్నీ ఆ భగవంతుని నుండే వచ్చాయి, ఆ భగవంతుని వద్దకే చేరుతాయని అర్ధం. దివ్యబలి పూజలో జరిగేది ఇదే... దేవుని వద్ద నుండి వచ్చిన మనం దివ్యపూజలో యేసుతో పాటు విరగ్గొట్టబడి, పవిత్రాత్మ సహాయంతో తిరిగి తండ్రి వద్దకు చేర్చగలిగే అత్యుత్తమ ప్రార్ధన

దివ్యబలిపూజ. పునీత పౌస్టీన గారు తన డైరీ 146 లో "ప్రతి దీవెన మన దరి చేరేది ప్రార్ధన ద్వార మాత్రమే".

ప్రార్ధన గూర్చి ఎంత విన్నా, చెప్పినా, వ్రాసినా, చదివినా కొందరిలో కొన్ని అపోహలు, ప్రశ్నలు, సందేహాలు మిగిలే వుంటాయి. దేవుని కన్నీ తెలుసు కదా! (లూకా 12:7 తల వెంట్రుకలు కూడా లెక్కించబడినవి కదా!) ఇంకెందుకు ప్రార్ధించాలని కొందరు, అడగక పోతే అమ్మ అయినా పెట్టదు (మత్తయి 7:7) అడగండి ఒసగబడునని ప్రభువే చెప్పారు కదా అని మరికొందరు, ఎప్పుడు, ఎక్కడ, ఎలా ప్రార్ధన చేయాలనే సందేహాలు లేకపోలేదు. సూక్ష్మంగా చెప్పాలంటే మన దేవుడు మాట్లాడు దేవుడు (ఆది 1:3). కనుక మనమూ ఆయనతో మాట్లాడాలని, సంభాషించాలని, ప్రార్ధించాలని ఆ దేవుడే కోరుకుంటున్నారు (CCC. 2736). మన విజ్ఞాపన కోసం దేవుడు ఎదురు చూస్తారు, నిరీక్షిస్తారు. ఎందుకంటే ఆయన బిడ్డల హుందాతనం వాళ్ళ స్వేచ్ఛపై ఆధారపడింది. ఆయనకు ఏది ఇష్టమో వాస్తవంగా తెలుసుకోడానికి, స్వేచ్ఛనిచ్చే ఆయన ఆత్మతో కలిసి మనం ప్రార్ధించాలి (రోమీ 8:27).

## 2. ప్రార్ధనకు అర్హత

ప్రార్ధించాలంటే గొప్ప పాడిత్యం, భాషా పరిజ్ఞానం, లౌకిక, భౌగోలిక, అధికార హోదాలు అక్కర్లేదు. ప్రార్ధనకు కావాల్సినవి ప్రేమ, విశ్వాసం, నిరీక్షణ, ధీనత. వీటన్నిటికీ పునాది మాత్రం ధీనత, వినమ్రత. పునీత ఫ్రాన్సిస్ దె సాలెస్ గారి మాటల్లో "పరలోకంలో వున్న ఆత్మలు ఒకప్పుడు చాలా పాపాలు చేసిన వారే కాని ఇప్పుడు పరలోకంలో వున్న ఒక్క ఆత్మలోనూ గర్వం లేదు. అలానే నరకంలో వున్న ఆత్మలు ఒకప్పుడు మంచి పనులు చేసిన వారే కాని ఇప్పుడు నరకంలో వున్న ఏ ఆత్మలోనూ ధీనత లేదు." కావున పరలోకపు తాళం చెవి ధీనతతో చేయు ప్రార్ధనే, అటువంటి ప్రార్ధనే దేవునికి ప్రీతికరము. ధీనత మనలను ఖాళీ పాత్రగా మారుస్తుంది కనుక ధీనతతో ప్రార్ధిస్తే ఈ ఖాళీ పాత్రలో దేవుడు అమూల్య వరాలతో నింపగలరు. కానాపల్లెలో ఆరు ఖాళీ రాతి బానలను ధీనత్వమనే నీటితో నింపగా శ్రేష్టమైన ద్రాక్షారసమనే దీవెనలతో నింపినట్లుగా మనం చేసే ప్రార్ధనలో ధీనత వుంటే శ్రేష్టమైన ద్రాక్షారసమనే ఆత్మీయ దీవెనలతో నింపుతారు.

దేవుడు ఆత్మస్వరూపుడు, ప్రేమస్వరూపుడు. రోమా 8:26 ప్రకారం ఎలా ప్రార్థించాలో తెలియని మన కొరకై ఆత్మయే దేవుని ప్రార్థించును. ధీనతతో చేసిన ప్రార్థనను దేవుడు వింటారు గాని, అసలు ప్రార్థించాలంటే వుండాల్సింది ప్రేమ. ప్రార్థించుటకు పునాది ప్రేమే. ప్రేమ లేనిచో ప్రార్థించలేం. ఎవరికోసమైనా ప్రార్థిసున్నామంటే ప్రేమ వుండబట్టే కదా! కాని ఆ ప్రేమ త్యాగాన్ని కోరుతుంది. 'త్యాగం చేయకుండా ఎవరు ప్రేమించలేరు, ప్రేమించకుండా ఎవరూ ప్రార్థించలేరు.' అలానే ప్రేమ స్వరూపుడైన ఆత్మ మనకోసం ప్రార్థిస్తారు. ప్రేమ, ప్రార్ధన రెండూ హృదయం నుండి జనిస్తాయి. నమ్మకం లేదా విశ్వాసముంటే చాలదా పరలోకం చేరడానికని కొందరంటారు. కాని పిశాచము కూడ దేవుని శక్తిని నమ్ముతుంది కదా! విశ్వాసం ముఖ్యమే కాని ఆ విశ్వాసం పరిపక్వమై ప్రేమ ఉద్భవిస్తుంది. అలానే నిరీక్షణ ముఖ్యమే... శాస్త్రీయంగా, భౌతికంగా చూడని, స్పర్శించని వాటికోసం నిరీక్షణ కలిగి సాగుతుండాలి (అందుకే Peregrinantes in Spem). కాని వీటన్నిటిలో ప్రేమ శ్రేష్ఠమైనది. (1 కొరింతీ 12:31)

## 3. ప్రార్ధనా పద్దతులు:

పెంతెకోస్తు నాడు ప్రార్ధనతోనే రూపొందింపబడిన శ్రీసభ అనాది నుండి అపోస్తుల ఉపదేశంలో, వాళ్ళ సహవాసంలో, రొట్టెను విరుచుటలో, ప్రార్థించుటలో నిమగ్నమయ్యారు. ఈ క్రమమే శ్రీసభ ప్రార్ధనా లక్షణమైంది. క్రైస్తవ ప్రార్ధనకు మార్గదర్శక సూత్రాలుగా వున్న శ్రీసభ ఆమోదించిన ప్రార్ధనా పద్దతులను గమనిద్దాం.

### A) స్తుతి ఆరాధన :

(CCC.2626, 2627) దేవుని మహిమ ప్రభావాలను తలంచుకొని అతని కోసమే, అతన్ని స్తుతించి గౌరవించే ప్రార్ధన స్తుతి ఆరాధన. దేవుడిచ్చే కానుకలకు నరుడిచ్చే సమాధానమే స్తుతిప్రార్థన. దేవుడు దీవిస్తాడు, దానికి ప్రతిగా అన్ని దీవెనలకు మూలమైన దేవున్ని మానవ హృదయం స్తుతిస్తుంది. సృష్టికర్త ఎదుట తానొక సృష్టి జీవినని గుర్తించే మనిషి ప్రధమ దృక్పధమే ఆరాధన మహిమ రాజుకు ఆత్మ ఘటించే అంజలి ఆరాధన. నిత్యమూ ఉన్నతుడు, గొప్పవాడైన

దేవుని సన్నిధిలో గౌరవ పూర్వక మౌనమే ఆరాధన. యెషయా 6:3లో 'సైన్యములకు అధిపతియైన యావే పరిశుద్ధుడని ముమ్మారు పలికి సర్వలోకం ఆయన మహిమతోనే నిండియున్నదని' ఆరాధించిన దేవదూతలను పోలి ఆరాధించాలి. దేవుడు చేసిన ఉపకారాలను తలంచి అతన్ని స్తుతిస్తే అది కృతజ్ఞతా ప్రార్ధన అవుతుంది. అలా కాకుండా ప్రభువు, మహిమ, పరిశుద్ధత్వం మొదలైన దైవలక్షణాలను స్మరించుకొని దేవుని కోసమే అతన్ని స్తుతిస్తే అది ఆరాధన అవుతుంది. పరిశుద్ధ గ్రంథంలో శిరమువంచి ఆరాధించుట (ఆది 24:48), నమస్కరించి ఆరాధించుట (దర్శన 19:4, కీర్తన 95:7), మోకాలు వంచి ఆరాధించుట (ఫిలిప్పీ 2:10) అనే వివిధ ఆరాధన పద్దతులు కలవు.

**B) విజ్ఞాపన ప్రార్ధన :**

(CCC.2630, 2631) ఇతరుల కోసం మనం చేసే ప్రార్ధన ఇది. క్రైస్తవ విజ్ఞాపనను "మూలుగు" అని పునీత పౌలుగారు అన్నారు. అది వేరొక లోతునుంచి పెల్లుబుకుతుంది. ప్రసవ వేదనలో వున్న సృష్టి నుంచి మన దేహ విముక్తి కోసం ఎదురు చూస్తున్న మనలో నుంచే అది పెల్లుబుకుతుంది. విజ్ఞాపన ప్రార్ధనలో మొదటగా సువార్తలో సుంకరి వలె పాపాల క్షమాపణ కోసం అడగాలి. క్షమాపణ అడగడం ఇటు కృతజ్ఞతార్చనకు అటు వ్యక్తిగత ప్రార్ధనకు ముందుగా అవసరమయ్యే షరతు. క్రీస్తు వాక్యానుసారం నడుచుకోవడం, ఆయన రాజ్యన్ని వెదకడం క్రైస్తవ విజ్ఞాపనకు కేంద్రం. ఆది 18:22-23లో సొదొమ గొమొర్రా ప్రజల తరపున అబ్రహాం చేసిన విజ్ఞాపన ప్రార్ధన మనందరికీ తలమానికం. యేసు ప్రభువు లూకా 22:31-32 లో 'పేతురు నేను నీ కోసం ప్రార్ధించితినని' అదేరీతిగా లూకా 23:34లో సిలువపై వ్రేలాడుతూ తనను హింసించు వారికొరకు 'తండ్రి, వీరిని క్షమింపుమని' విజ్ఞాపన ప్రార్ధన చేసారు. అపో.కా 12:5లో చెరలోవున్న పేతురు కోసం సంఘమంతా ప్రార్ధించునట్లు చూస్తున్నాం. మధ్యవర్తిత్వ ప్రార్ధన కూడా విజ్ఞాపన ప్రార్ధనే. పాపులందరి తరపున తండ్రి దగ్గర ఏకైక మధ్యవర్తి యేసే (1 తిమోతి 2:5) పవిత్రాత్మ స్వయంగా మనకోసం వేడుకుంటారు (రోమీ 8:27). అబ్రహాం కాలం నుండి అలవాటుగా వున్న ఈ ప్రార్ధన శ్రీసభ యుగంలో పునీతులతో

సంబంధ సమైక్యతను అభివ్యక్తం చేస్తూ, క్రైస్తవ మధ్యవర్తిత్వ ప్రార్ధన క్రీస్తు మధ్యవర్తిత్వ ప్రార్ధనలో పాల్గొంటుంది. మధ్యవర్తిత్వ ప్రార్ధనలో ప్రార్ధించేవారు తన అభీష్టసిద్ధి కోసమే కాక ఇతరల మేలు కూడా కాంక్షిస్తూ చివరకు తనకు కీడు తలపెట్టే వాళ్ళ కోసం కూడా ప్రార్ధిస్తారు.

**C) కృతజ్ఞతా ప్రార్ధన :**

ప్రభువు మనకు చేసిన మేలులను తలంచుకొని అతనికి కృతజ్ఞతా స్తుతులు చెల్లించే ప్రార్ధన ఇది.

కృతజ్ఞతలు చెల్లించడం శ్రీసభ ప్రార్ధనా లక్షణం. పునీత పౌలు గారి లేఖల ప్రారంభంలోను, ముగింపులోను తరచుగ కృతజ్ఞతలు అర్పించటం వుంటుంది. అన్ని పరిస్థితుల్లో కృతజ్ఞతలు చెల్లించండి, మీ కోసం క్రీస్తునందు ఇది దేవుని సంకల్పం. (1 తెస్సలో 5:18) "ప్రార్ధనలో నిలకడగా వుండండి, కృతజ్ఞతలు చెల్లిస్తూ జాగరూకతతో మెలగండి (కొలొస్సీ 4:2). లూకా 17:18 లో పదిమంది కుష్టరోగుల్లో ఒక్కడే వచ్చి కృతజ్ఞతలు చెల్లించిన సందర్భంలో యేసు 'మిగతా 9 మంది ఎక్కడ?' అని ప్రశ్నించడంతో ప్రభువు మనందరిని కృతజ్ఞతా భావం కలిగి వుండాలని కోరుకుంటున్నారని తేట తెల్లమవుతుంది.

**D) పశ్చాత్తాప ప్రార్ధన :**

మన పాపాలకు పశ్చాత్తాపాన్ని వెలిబుచ్చుతూ చేసే ప్రార్ధన ఇది. లూకా 15:21 లో చేసిన ప్రతి పాపం పరలోకానికి, దేవునికి వ్యతిరేకంగా పాపం చేసామనే కనువిప్పు కలిగి దేవుని మన్నింపు కోరాలి. కీర్తన 51:4 లో పాపం చేసిన దావీదు పశ్చాత్తాప హృదయంతో పాపమన్నింపు కోరుతూ 'దేవా! నీకే నీకే ద్రోహంగా నేను పాపం చేసితినని" ప్రార్ధించాడు. కొందరు మంచినీళ్ళు త్రాగినంత సులభంగా పాపం చేస్తుంటారు. పాపం భగవంతునికి విరోధంగా పోతుందని అర్ధం చేసుకున్నవారు అంత సులువుగా పాప కార్యాలకు పూనుకోరు. పశ్చాత్తాప ప్రార్ధనకు ఒక షరతు వుంది. మన పాపాలకు పరిహారం పొందాలి అంటే మనమూ మన పొరుగువారిని క్షమిస్తుండాలి. మన ఆరాధ్య దైవం క్షమాపరుడు కనుక అతన్ని కొలిచే భక్తులు కూడ క్షమించడం నేర్చుకోవాలి.

## E) మనవి ప్రార్ధన :

మనకోసం మనం చేసే ప్రార్ధన ఇది. ఓ పసిబిడ్డ తల్లి దండ్రులను సమీపించునట్లు ఆ దేవుని దరి చేరి మన అక్కరలను తెలియ చేయటమే మనవి ప్రార్ధన. లూకా 11:9–10 లో అడగండి, మీకీయబడుతుందని చెప్పిన ఆయన మాటపై నమ్మకముంచి ప్రార్ధించాలి. పరలోక ప్రార్ధనలో క్రీస్తు మనకు నేర్పిందంతా మనవి ప్రార్ధనే. మకేరియుస్ అనే ఎడారి ముని ఇలా చెప్పారు. “పసి బిడ్డ నడవలేదు, తల్లి దగ్గరికి పోలేదు. కాని తనకు తల్లి అవసరం కనుక ఆమె కొరకు ఏడుస్తుంది. తల్లి ఆ ఏడ్పును చూసి జాలిచెంది, బిడ్డకు తాను అవసరమని గుర్తించి, పసిబిడ్డ నడచి తన దగ్గరికి రాలేదు. కనుక తానే ఆ బిడ్డ దగ్గరికి వెళ్తుంది. ఆమెలోని ప్రేమే ఆమెను కదిలించి బిడ్డ దగ్గరికి పంపుతుంది. తాను బిడ్డను లాలించి, ఓదార్చి పాలిస్తుంది. ప్రేమమయుడైన భగవంతుడు కూడ భక్తుని పట్ల ఈ తల్లిలాగే ప్రవర్తిస్తారు. భక్తుడు భగవంతున్ని కోరుకుంటే చాలు ఆ ప్రభువు శీఘ్రమే అతని వద్దకు వస్తారు.”

## 4. ప్రార్ధనా విధానాలు :

ప్రార్ధనావిధానాలు అనేక విధాలుగా వుంటాయి. వ్యక్తిగతంగానూ, సామూహికంగానూ, మాటలతోనూ, నిశ్శబ్ధంగానూ ఇలా అనేక విధాలుగా ప్రార్ధించవచ్చు. క్రైస్తవ సంప్రదాయం ప్రార్ధనను అభివ్యక్తం చేసే మూడు విధానాలను భద్రపరచింది. అవి మౌఖిక ప్రార్ధన, ధ్యాన ప్రార్ధన, మేధో ప్రార్ధన: ఈ విధానాలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటంటే హృదయ ప్రశాంతత, వాక్కును పాటించుట, దేవుని సమక్షంలో జీవించుట.

## A) మౌఖిక ప్రార్ధన : (Vocal prayer)

దేవుడు మాట్లాడువాడు కావున మాటల ద్వార దేవునికి చేసే ప్రార్ధనే మౌఖిక ప్రార్ధన.

మాట్లాడుతున్న ఆ దేవునికి హృదయాన్ని అర్పించి ప్రార్ధించుట చాలా ముఖ్యం. యేసు శిష్యులకు నేర్పిన పరలోక ప్రార్ధన మౌఖిక ప్రార్ధనేబీ అంతేకాక యేసు తాను కూడా ప్రార్ధన మందిరాల్లో గళమెత్తి ప్రార్ధించుట మొదలు గెత్సెమనిలో శ్రమల వరకు ప్రార్ధించడానికి గళమెత్తారు. మనం ఆత్మదేహాలం

కనుక మన హృదయాంతరంగాల నుండి పెల్లుబికే భావాలను బహిర్గతం చేయడం ఆత్మయందు సత్యమందు ఆరాధించే వాళ్ళ కోసం ఎదురుచూసే దేవునికి ఇష్టం. ఈ మౌఖిక ప్రార్ధననే ఇంతకు ముందు వివరించిన 5 ప్రార్ధనా పద్ధతుల్లో వ్యక్త పరచవచ్చు. ఈ మౌఖిక ప్రార్ధన మేధో ప్రార్ధనకు ప్రాధమిక రూపమవుతుంది. మాటలు, పాటల ద్వారా వ్యక్తిపరిచే ఈ మౌఖిక ప్రార్ధన, సాధారణంగా మన దైవార్చనలో చేసే ప్రార్ధనలు, దివ్యసంస్కారాలన్నీ ఈ కోవలోకే వస్తాయి.

## B) ధ్యాన ప్రార్ధన : (Meditation)

మన మనస్సు, హృదయాన్ని పర సంబంధమైన సత్యాలపై లగ్నం చేయడమే ధ్యాన ప్రార్ధన ప్రధాన ఉద్దేశ్యం. ధ్యానం అంటే ఒక అన్వేషణ. దేవుని కోసం, ఆయన చిత్తాన్ని ఎలా పాటించి ఆయనకు అంటిపెట్టుకోవాలా అని మన మెదడును ధ్యానం ద్వార అన్వేషింప చేయాలి. ఇందుకోసం పరిశుద్ధ గ్రంథ పఠనం, పునీతులు, పితృపాదులు రచించిన ఆధ్యాత్మిక రచనల పఠనం చేసి, పఠించిన దాన్ని మననం చేసికొని మన స్వంతం చేసుకోటానికి ధ్యానం ఎంతో ఉపకరిస్తుంది. విత్తువాని ఉపమానంలో మొదటి మూడు రకాల నేలల మాదిరి కాకుండా సారవంతమైన నేలను పోలి వాక్కు అనే విత్తును గ్రహించి, సంగ్రహించి, ఫలించడమే ధ్యాన ప్రార్ధన లక్ష్యం. మానవ శక్తి సామర్ధ్యాలన్నిటినీ సమీకరించి, మానవ ఆలోచనలను ఊహను, ఉద్రేకాన్ని, కోరికను నియంత్రించి మన క్రైస్తవ విశ్వాసాన్ని దృఢతరం చేసికోడానికి ధ్యానం ఓ దివ్యౌషధం. శ్వాస మీద ధ్యాసే కాదు ఆ శ్వాసనిచ్చే సృష్టికర్తపై ధ్యాసే నిజమైన ధ్యానం.

## C) మేధో ప్రార్ధన : (Contemplation)

(CCC.2709) పునీత చిన్న తెరేసమ్మ గారి మాటల్లో "మేధో ప్రార్ధన అంటే స్నేహితులు అన్యోన్యంగా ఒకరికొకరు ఇచ్చిపుచ్చు కోవటం తప్ప మరేమి కాదు. మనల్ని ప్రేమిస్తున్నాడని తెలిసిన వ్యక్తితో సమయాన్ని వెచ్చించి, ఆ ప్రేమించు వ్యక్తితో తరచుగా ఏకాంతంగా గడపడమే మేధోప్రార్ధన." పరమగీతాలు 1:7, 3:1–4లో ప్రస్తావించినట్లు ప్రేమించినవాన్ని ఆత్మతో, హృదయంతో అన్వేషించడమే మేధోప్రార్ధన. ఈ అంతరంగిక ప్రార్ధనలో మనం ధ్యానిస్తూనే

మన దృష్టినంతా ప్రభువుపైనే కేంద్రీకరించాలి.

కృతజ్ఞతార్చన (దివ్యపూజ)లో ప్రవేశించిట్లే మేధో ప్రార్ధనలో కూడ ప్రవేశిస్తాం. పవిత్రాత్మ ప్రోద్బలంతో హృదయాన్ని కూడగట్టుకుంటాం. మనమే ప్రభు నివాసస్థానం కాబట్టి మన ముసుగులు తొలగించి ఆయన నివాస స్థానంలో వుంటూ మనలను ప్రేమించిన ప్రభువైపుకు మన హృదయాలను మళ్ళించడమే మేధో ప్రార్ధన ముఖ్యోద్దేశ్యం. పేదరికం, వినమ్రతతో తండ్రిప్రేమ సంకల్పానికి, ఆయన ప్రియపుత్రునితో గాఢమైన ప్రేమానుబంధం ఏర్పరచు కోవడమే మేధో ప్రార్ధన.

మన హృదయాల్లో దేవుడు స్థాపించిన ఒప్పంద సంబంధమే మేధోప్రార్ధన. ప్రార్ధనా నిగూఢ సత్యాలను మేధో ప్రార్ధన బహు సులభమైన రీతిలో అభివ్యక్తం చేస్తుంది. మేధోప్రార్ధన అంటే విశ్వాసపు తదేక దృష్టిని యేసుపై నిలపడం. 'నేను అతన్ని చూస్తాను, అతడు నన్ను చూస్తాడు' అని ఓ సాధారణ వ్యవసాయ కూలి, మందసం ముందు తన ప్రార్ధనా తీరుగూర్చి పునీత జాన్ మరియ వియాన్ని గారితో చెప్పిన మాటలు మేధో ప్రార్ధన ఆంతర్యాన్ని తెల్పుతుంది. కనుక మేధో ప్రార్ధన చేయడానికి పాండిత్యం, పండితులే కానక్కర్లేదు, వినయాన్విత హృదయంతో దేవునిపై దృష్టి సారిస్తే చాలు, ప్రతిదాన్ని ఆయన దృష్టితో చూస్తేచాలు. దేవుని స్వరాన్ని ఆలకించడమే మేధో ప్రార్ధన. పునీత సిలువ యోహాను, పునీత నినివేప్రాంతపు ఇస్సాకు గారు మాటల్లో మేధోప్రార్ధన నిశ్శబ్ధమైనది. రాబోయే ప్రపంచానికి చిహ్నం, ఇదొక నిశ్శబ్ధ ప్రేమ.

## IV. పరిశుద్ధ గ్రంథంలో ప్రార్ధన :

### 1. పాత నిబంధన:

a) **చొరవ తీసుకొనే దేవుడు :-** ఆది 3:9లో పాపం చేసిన మనిషిని పలకరించడానికి, సంభాషించడానికి దేవుడే ముందుకొచ్చి పేరుపెట్టి పిలిస్తే, ఆ పలకరింపుకు మనిషి ఇచ్చిన సమాధానమే భగవంతునికి భక్తునికి మధ్య జరిగిన సంభాషణ. దీనినే ప్రార్ధనగా అభివర్ణించవచ్చు. ఈ సంభాషణలో తొలి అడుగు దేవునిదే.

b) **సమర్పణే ప్రార్ధన :-** ఆది 4:3,4 లో ఆబేలుని, కయీను ప్రధమ ఫలాల సమర్పణే ఒక బలిగా, ఆది 22:13 లో అబ్రహాము ఇస్సాకుకు బదులుగా పొట్టేలును దహన బలిగా సమర్పించుట, మున్నగు అనేక సందర్భాల్లో ప్రజలు భగవంతునికి అర్పించే సమర్పణే ఒక ప్రార్ధనగా పేర్కొనబడింది.

c) **దృఢ విశ్వాసం ప్రార్ధనగా :-** అబ్రహాం తన జీవితంలో విశ్వాస పితామహునిగా పేరునొంది దేవుడు తనను పిలిచినపుడు, తనతో వాగ్ధానమేర్పరచుకున్నపుడు విశ్వాసంతో స్పందించి, ఆ విశ్వాసంతోనే సొదామ గొమొర్రాలో నీతిమంతుల విమోచనకై ప్రార్ధించెను.

d) **ప్రార్ధన ఓ పోరాటంలా :-** ఆది 32:22-32 లో యబ్బోకు రేవు వద్ద ఆ రాత్రంతా యాకోబు దేవుని దూతతో 'నీవు నన్ను దీవించుదాక వదలనని' పోరాడిన విధానాన్ని ప్రార్ధనగా భావించవచ్చు.

e) **విజ్ఞాపనే ప్రార్ధనగా :-** మోషే జీవితంలో నిర్గమ 33:11 లో నరుడు తన మిత్రునితో సంభాషించినట్లే ప్రభువు మోషేతో ముఖముఖి సంభాషించే వారని, నిర్గమ 32:7 లో ఆ సంభాషణలో సీనాయి పైకి వెళ్ళిన మోషేకు ప్రజలు ఏఏ పాప కార్యాలు చేసి మత భ్రష్టులైరో దేవుడే మోషేకు పూసగుచ్చినట్టు చెప్పగా నిర్గమ 32:11-14 లో మోషే మనవిచేయగా దేవుడు శిక్షించాలన్న తన తలపు విరమించు కొనెనని పవిత్ర గ్రంథం తేట తెల్లం చేస్తుంది.

f) **కృతజ్ఞత ఓ ప్రార్ధనగా :-** నిర్గమ 15:20 లో ఎర్రసముద్రం దాటగానే మిర్యాము తంబుర చేబూని మిగతా స్త్రీలతో కలసి నాట్యమాడుచూ దేవునికి కృతజత తెలిపిరి.

g) **స్తుతి ప్రార్ధన :-** 1 సమూ 2:1-10 గొడ్రాలైన హన్నా సంతాన వరాన్ని అనుగ్రహించిన దేవున్ని స్తుతించే విధానం.

h) **కీర్తనలే ప్రార్ధనలు :-** కీర్తన అనగా దేవుని వాక్కు రూపంలో వుండే ప్రార్ధన. చక్కని కావ్య రూపంలో వున్న ఈ కీర్తనల్లో ప్రజల చరిత్ర, దేవుని వాగ్ధానాలు, దేవునిపై వారికున్న నమ్మకాన్ని ప్రస్ఫుటిస్తాయి.

## 2. నూతన నిబంధనలో ప్రార్ధన:

a) **మరియతల్లి ప్రార్ధన :-** మంగళవార్త సమయంలో దైవదూతయైన గాబ్రియేలుకు ఆమె ఇచ్చిన సమాధానమే తరతరాలు ఆమెను ధన్యురాలుగా గుర్తించే గొప్ప ప్రార్ధన. ఈ ప్రార్ధనలో ఆమె తననుతాను దాసురాలినని ప్రకటించుకుంది. ప్రార్ధించు వారికి వుండాల్సినది ఈ ధీన మనస్సే. లూకా 1:38 లో దైవ చిత్తానికి, దేవుని మాటకు పూర్తిగా లోబడి, సమర్పించుకొని ప్రార్ధించువారికి ఓ సుమాతృకగా నిలిచింది. ఆమె పాడిన స్తోత్ర గీతంలో ప్రార్ధన యొక్క సంపూర్ణ భావాలు కన్పిస్తాయి.

లూకా 1:46-49లో జరిగిన వాటికి, పొందిన వాటికి కృతజ్ఞతను తెల్పుతుంది.

లూకా 1:50-53లో చరిత్రలో దేవుడు చేసిన ఘనకార్యాలను జ్ఞప్తికి తెచ్చుకొని స్తుతిస్తుంది.

లూకా 1:54-55లో అబ్రహాముకు అతని సంతతి వారికి దేవుడు చేసిన వాగ్ధానాలను స్మరిస్తూ ప్రార్ధిస్తుంది.

లూకా 2:19, 2:51లో మరియ అంతయూ మనస్సున పదిలపర్చుకొని ధ్యానప్రార్ధనకు శ్రీకారం చుట్టింది.

యోహాను 2:1-11లో కానాలో ఆమె చేసిన విజ్ఞాపన ప్రార్ధన యేసుని అద్భుత మహిమలకు తెరలేపింది.

b) **యేసుని ప్రార్ధన :-** ఒక యధార్ధమైన యూదునిగా యేసు వ్యక్తిగత, సామూహిక ప్రార్ధనల్లో పాల్గొని, ఏకాంత స్థలాలకు, నిర్జన ప్రాంతాలకు, పర్వతాలకు, తోటలకు, ప్రార్ధనామందిరాలకు వెళ్ళి తరచూ ప్రార్ధించేవారు. గంటల తరబడి తండ్రితో ప్రార్ధనలో గడపడమే తన విశ్రాంతిగా జీవించారు. ఎన్నెన్నో సందర్భాల్లో ఎలా ప్రార్ధించాలో నేర్పుతూ లూకా 18:10-14 పరిసయ్యుని-సుంకరి ప్రార్ధనలో గర్వం, డంబం ప్రార్ధనకు వుండరాదని, సుంకరి వంటి ధీన మనస్సే పరలోక దేవునికి ప్రీతికరమని బోధించారు. మత్తయి 6:5 లో పదుగుర కంట బడటానికై చేసేది కాదు ప్రార్ధనని, మత్తయి 7:21 లో పెదాలారాధన కాదు తండ్రి చిత్తాన్ని

పాటించడమే నిజమైన ఆరాధన అని, మార్కు 11:17, మత్తయి 21:13 లో ప్రార్ధనాలయమైన దేవాలయాన్ని వ్యాపార స్థలంగా మార్చవద్దని ఇలా పలు సందర్భాల్లో దేవుడు మెచ్చే ప్రార్ధన విధానాలను నేర్పారు. మనం చేసే ప్రార్ధన దేవుని చిత్తాన్ని, ప్రణాళికను మార్చుటకు కాదు, రక్షించు దేవుని చిత్తాన్ని అర్ధం చేసుకొని దేవుని ప్రణాళికలో జీవించడమే ప్రార్ధన. 'తండ్రి చిత్తాన్ని నెరవేర్చడమే ప్రార్ధన' అని మనకు నేర్పడమే కాదు, యేసు తన పరిచర్యలోను, గెత్సెమనిలో తన శ్రమలు, వేదనలను తండ్రి చిత్తానికే సమర్పిస్తూ జీవించారు. యేసు ప్రార్ధన తండ్రి దేవుని కేంద్రిత ప్రార్ధన.

## V. పునీతుల, వేదపండితుల దృకృధం:

శ్రీసభ చరిత్రలో కొందరు తమ పుణ్యజీవితముతోనే గాక తమ అనన్య సామాన్యమైన రచనల ద్వార మరియు పాండిత్యం ద్వార క్రైస్తవ మత సిద్ధాంతాలపై, పరిశుద్ధగ్రంధ బోధనలపై, వేదశాస్త్ర నిగూఢ సత్యాలపై నూతన వెలుగును ప్రసరింపచేసి, ఆధ్యాత్మిక జీవితయాత్రపై గల అవగాహనను రెట్టింపు చేసినవారున్నారు. వీరిలో పునీతులు, వేదాంత పండితులు, తపస్వులు, మునీశ్వరులు ఎందరో వున్నారు. వారిలో ప్రార్ధనా జీవితం పట్ల కొందరి అభిప్రాయాలను తెలుసుకుందాం.

### 1) పునీత బెనెడిక్టు :

నర్సియాపుర పునీత బెనెక్టు గారిని పశ్చిమ దేశాల క్రైస్తవ మఠవాస జీవిత పితామహునిగా పేర్కొంటారు. ప్రతిదినం, రోజు పొడువునా శ్రీసభ ప్రార్ధనావళిని జపించే అలవాటును పరిచయం చేస్తూ "Opus Dei" (Work of God) గా పిలుస్తుండేవారు. తను రచించిన "The Rule" అనే పుస్తకంలో మఠవాస జీవిత విధానానికి మార్గ దర్శకాలు సిద్ధంచేసారు. బెనెడిక్టు గారి ప్రకారం సామూహిక లేదా సమాజ ప్రార్ధన హృదయశుద్ధితో చేసేదిగా వుండాలని అదే విధంగా వ్యక్తిగత ప్రార్ధన శబ్ధ ధ్వనులతో కాక పశ్చాత్తాప కన్నీటితో, హృదయపూర్వకంగా చేయాలని ప్రస్తావించారు. పునీత బెనెడిక్టు గారు ఒక గురువు కాదు అయినా ఓ మఠవాసిగా తాను స్థాపించిన బెనెడిక్టు వారి సభ

ద్వార ఇప్పటికి శ్రీసభకు 24 మంది జగద్గురువులను, 4600 మంది పీఠాధిపతులను, 5 వేలకు మించి పునీతులను కానుకగా ఇచ్చియున్నారు.

మూడు రకాల ప్రార్ధనా విధానాలను పునీత బెనెడిక్టు గారు పరిచయం చేసారు.

**మొదటిది :-** Lectio (లెక్సియో) : పరిశుద్ధ గ్రంథ పఠనం చేసి, మన హృదయానికి హత్తుకొనే ఒక వచనాన్ని పదేపదే పఠిస్తూ వుండాలి.

**రెండవది :-** Meditatio (మెడితాసియో) : మన మనస్సుకు హత్తుకొనే ఆ వచనాన్ని పదేపదే వల్లిస్తూ, ధ్యానిస్తూ, ఆ వాక్కు మనసంతా నిండిపోయేలా ధ్యానించాలి.

**మూడవది :-** Oratio (ఒరాసియో) : నిశ్శబ్ధ ధ్యానంలోనికి వెళ్ళేంత వరకు ఆ వాక్కునే ప్రార్ధనగా పదేపదే ఉచ్చరిస్తూ, జపిస్తూ వుండాలి.

**2) పునీత అవిలాపురి తెరేసమ్మ :**

తప:సంపన్నురాలైన పునీత అవిలాపురి తెరేసమ్మ గారి కలము నుండి జాలువారిన ఆణిముత్యాలు, ఆమె తపోమానసంలో వికసించిన దివ్య పారిజాతాలు ఎన్నో ఆధ్యాత్మిక జీవితయాత్రలో వున్న విశ్వాసులను ప్రేరేపిస్తాయి, భక్తి జీవన సాఫల్యానికి సహకరిస్తాయి. కార్మెల్ సభాపున: స్థాపకురాలిగా తన సభా సహచరులను ప్రోత్సహించుటకు ఆమె చేసిన అనేకమైన ఆద్యాత్మిక రచనల్లో ప్రధానమైనవి ఆత్మకధ, పరిపూర్ణతా మార్గము, అంతరంగిక దుర్గము, మఠస్థాపనల చరిత్ర.

స్పెయిన్ దేశమంత కోటలమయం. ఆ దేశంలో జన్మించిన తెరేసమ్మ గారికి కోటలను, అంత:పురాలను, వివిధ దుర్గాలను చూసి హృదయమనే కోటలో ఆశీనుడైన హృదయేశ్వరుని మన హృదయాంతరంగంలో కలుసు కోవాలంటే 7 రకాలైన గదులను దాటుకుంటూ వెళ్తేనే గాని ఇది సాధ్యపడదని తాను గ్రహించి, ధ్యానించి, "అంతరంగిక దుర్గము" (The interior Castle) అనే గ్రంథం ద్వారా సర్వజన కోటికి 7 దశల ప్రార్ధనా విధానాన్ని పరిచయం చేసారు. ఓ దివ్య దర్శనంలో తెరేసమ్మ గారు క్రీస్తును దర్శిస్తూ స్వచ్ఛమైన స్ఫటికం లాంటి వజ్రరూపమైన "ఆత్మ" అనే ఆ కోటలో పరలోకంలో వున్నట్లే

అనేక గదులున్నాయని, ఆ ఆత్మ అనే కోట మధ్యలో సూర్య తేజోమయమై ప్రకాశించు రాజాధిరాజు నివాసమున్నారని, ఆ ప్రకాశంతో కోట అంతా తేజరిల్లుతుందని, ఆ కోట మధ్యలోనికి ఒక్కో అడుగు వేసేకొలది దాని ప్రకాశం మరింతగా దేదీప్య మానమవుతుందని చెప్పారు. ఈ దర్శనం దర్శనగ్రంథం 21 వ అధ్యాయంలో వున్న పరలోక దివ్య దర్శనాన్ని పోలివున్నట్లు గమనించాలి. మానవ జీవితాన్ని ప్రార్థన నుండి వేరుగా ఊహించుకోలేమని, ప్రార్థన అనేది దేవునితో ఓ సన్నిహిత సంబంధమని, ఓ భక్తుని హృదయం భగవంతుని హృధితో సంభాషించుట అని ఆమె రచనల సారాంశం. ప్రార్థనను చదరంగ క్రీడతో పోలుస్తూ ఎంత తరచుగా ఆడుతుంటే అంత త్వరగా “రాజుకు” చెక్ పెట్టగలమని, ఈ ‘చెక్’ అనే ప్రేమ పరిధి దాటి ఆ రాజాధిరాజు మన నుండి కదల్లేరు. అలా ప్రార్థించి, ప్రేమించు వారిని దాటి వెళ్ళడం ఆయనకూ ఇష్టం లేదని చెపుతూ, ఈ క్రీడలో రాజును మన పరిధిలోనే వుంచుటలో ప్రముఖ ప్రాత మాత్రం ప్రార్థనదే.

పునీత అవిలాపురి తెరేసమ్మగారి ఈ 7 గదుల అంతరంగిక దుర్గాన్ని 7 దశల ప్రార్థనతో పోలుస్తూ ప్రార్థనా విధానాన్ని తోటకు నీరు పెట్టే విధానంతో పోలుస్తూ మనకు అందిస్తున్నారు. ఆ దశలనే క్లుప్తంగా చూద్దాం.

### a) మొదటి గది : (Prayer)

ఈ దశను తోటకు నీరు పెట్టే క్రమంలో మానవ శ్రమ, ప్రయత్నంతో లోతైన బావిలో నుండి నీటిని తోడుట, చేదుటతో ఈ తపస్వి పోలుస్తున్నారు. ఈ తొలిదశ హృదయం నుండి వచ్చే భావాలను మాటలు, పాటల ద్వార వ్యక్తపరిచే ప్రార్థన. మన దైవార్చనలో ప్రార్థనలు, పాటలన్నీ ఈ కోవకు చెందినవే. ప్రార్థనలో ఏకాగ్రతతో ప్రార్థించాలంటే మన ధ్యాసంతా మన హృదిలో వున్న దేవునిపై, దివ్య మందసంలో వున్న ప్రభునిపై లగ్నం చేస్తూ ప్రార్థించాలని తెరేసమ్మ గారి సలహా. ఈ మొదటి గదిలో ప్రవేశించు వారి పరిస్థితి ఎలా వుంటుందంటే దేవున్ని బాధపెట్టే చావైన పాపాలకు దూరంగా వుంటారే గాని ఇంకా ఎక్కడో లోక వ్యామోహాలను వదులుకోలేని బలహీనత. అందుకే దేవునితో వీరి బంధం బలహీనంగా వుంటుంది. కనుకనే ఆ తేజోమయుని వెలుగును

అంతగా గ్రహించలేరు. వీరికి తెరేసమ్మ గారి సలహా ఏంటంటే బావిలో నీరు తోడేటప్పుడు ఎంతగా మానవ శ్రమ, ప్రయత్నం అవసరమో లోక ఆకర్షణల బంధనాల్లో నుండి బైటపడి ప్రభుతో ఐక్యమై ప్రార్ధించడానికి అంతే శ్రమించాలి, ప్రయత్నించాలి.

## b) రెండవ గది : (Meditation)

ఈ దశలో మొదటి గదిని దాటి పరిశుద్ధతలో కాస్త పరిపక్వతను సాధించినా ఇంకా లోకపు ఆకర్షణలు ఒకవైపు, దేవుని ప్రేమ మరోవైపు, ఈ రెండింటి మధ్య పెనుగులాట నిరంతర ఆధ్యాత్మిక యుద్ధాన్ని తలపిస్తుంది. పునీత తెరేసమ్మ గారు చెపుతూ "చాలా ఆత్మలు పక్షవాత దశలో వున్నాయి. 38 ఏళ్ళుగా బెతస్థ అనే కొలను వద్ద వున్నవాన్ని 'లెమ్ము' అని శాసించినట్లు గానే ఈ ఆత్మలను ప్రభువు ఆజ్ఞాపించక పోతే ఈ ఆత్మలు నాశనమయ్యే పరిస్థితి వస్తుంది. కనుక వాక్యపఠనం చేసి చక్కగా చేసే ధ్యాన ప్రార్ధన మన ఆధ్యాత్మిక పురోగతికి ఎంతో తోడ్పడుతుంది." ఏకాగ్రతతో చేసే ధ్యానం మన ధృక్పధాన్ని, ప్రవర్తనను మార్చగలదు. ఆంతరంగిక రూపాంతరానికి ధ్యానం ఎంతగానో తోడ్పడుతుంది.

## c) మూడవ గది : (Affective Prayer)

దేవుని ముందు తమ్ముతాము ఆవిష్కరించుకొనే దశ ఇది. మౌఖిక ప్రార్ధనలా కాకుండా దేవుని ముందు హృదయన్ని తెరచి వుండడం. ఒక్కమాటలో చెప్పాలంటే ఒక ద్వారం ముందు కదలక, నిశ్శబ్ధంగా ఓ పిల్లి కూర్చొని ద్వారం తెరిచే సమయం కోసం ఎదురుచూసినట్లు ఈ దశలో భక్తుడు దేవుని సన్నిధిలో మౌనంగా కూర్చొని దేవుని శక్తిని, ప్రభావాన్ని అర్ధం చేసుకొనే ఓ దశ. ఒక విధంగా ధ్యానమే గాని ధ్యానంలో రెండవ దశగా చెప్పవచ్చు.

## d) నాల్గవ గది : (Prayer of Simplicity)

గడిచిన మూడు దశల్లో మానవ ప్రయత్నం ఎక్కువగా కన్పిస్తుంది. ఈ దశ నుండి దేవుని చొరవే ఎక్కువగా కన్పిస్తుంది. తోటకు నీరుపెట్టే ఉదాహరణతో పోలిస్తే ఒక నీటి చక్రాన్ని (జల చక్రం) వినియోగించి ఒక జలధార గుండా తోటకు నీరు పెట్టడం. ఇందులో మానవశ్రమ తక్కువే కాని

ఎక్కువ నీటిని ఉత్పత్తి చేస్తుంది. ఈ దశలో విశ్వాసులు దైవీక ఆనందాన్ని ఆస్వాదించి, అన్ని భూసంబంధమైన కోరికలను విడనాడి, అంతర్గత స్వేచ్ఛను అనుభవిస్తూ దేవునిలో మరింతగా ఏకమవ్వాలని కోరుకుంటారు. ఈ దశకు చేరుటకు గడిచిన మూడు దశల్లో కంటే ఎక్కువ సమయం కేటాయించి ప్రార్ధన చేయాల్సి వస్తుంది.

**e) ఐదవ గది : (Prayer of Quiet)**

ఈ దశలో తోటకు నీరుపెట్టే విధానంలో ఒక నది కాలువ ద్వార నీరు పెట్టడంతో పోలుస్తారు. దీనికి ఇంకా తక్కువ మానవ శ్రమ ఖర్చు అయినా అధిక మొత్తంలో నీరు పారుతూ తోటనంతా పచ్చగా వుంచుతుంది. ఈ దశలో భక్తులు పూర్తిగా తమ్ముతాము మరచి ఏకాంతంగా ఆ దేవునిలోనూ ఆయన మహిమలోనూ లీనమయ్యే ఓ దశ. దేవునితో సంపూర్ణ ఐక్యత ఈ దశలో పొందుతారు. అందుకే దేవుని సన్నిధిలో మౌనంగా, నిశ్శబ్ధంగా, ప్రశాంతంగా రోజులు తరబడి గడపగలరు. ఈ దశలో తెరేసమ్మ గారు ఇచ్చే సలహా ఏంటంటే స్వప్రేమ, స్వచిత్తం పూర్తిగా వదిలి కొన్ని త్యాగక్రియలు, ప్రార్ధనలు, పశ్చాత్తాప క్రియల ద్వార దేవుని ఐక్యతలో మరింతగా ఆనందించగలం.

**f) ఆరవ గది : (Prayer of Simple Union)**

ఈ దశలో తోటకు నీరుపెట్టే విధానాన్ని ఆకాశం నుండి కురిసే కుంభ వర్షంతో పోలుస్తూ ఏ మాత్రం మానవ జోక్యం, ప్రమేయం లేకుండానే దేవుని కృపావర్షం కురిసే ప్రార్ధనా దశ ఇది. ఈ దశలో భక్తులు ఎప్పుడూ దేవుని ధ్యానంలోనే, ఐక్యతలోనే వుంటూ వారి ఆలోచనలు, మాటలు సైతం దేవుని కేంద్రంగానే వుంటాయి. తద్వార లోకంతో గాని లోక సంబంధ వ్యవహారాల్లో గాని ఏమాత్రం సంబంధం లేకుండా జీవించగలుగుతారు.

**g) ఏడవ గది : (Prayer of Transforming Union)**

ఈ దశలో పరమ త్రిత్వైక దేవుని దివ్య దర్శనంతో క్రైస్తవ విశ్వాస జీవిత పరిపూర్ణత సాధిస్తుంది. మానవ హృదయం దైవ హృదయంతో మమేకమై సంపూర్ణ సంగమమవుతుంది.

## 3. పునీత సిలువ యోహాను:

పునీత అవిలాపురి తెరేసమ్మ గారితో కలిసి కార్మెల్ సభ పునర్వ్యవస్థీకరణకు తమ రచనల ద్వార ఎంతో కృషి చేసారు పునీత సిలువ యోహాను. ప్రార్ధనా జీవితాన్ని ఆయన వివరిస్తూ ప్రార్ధనను ఏనాడూ వదులు కోవద్దని, ప్రార్ధనా జీవితంలో వెనుకబడినప్పుడు తిరిగి పట్టుదలతో ప్రార్ధించాలని బోధించారు. పరిశుద్ధ గ్రంథ పఠనంతో దేవున్ని వెదికితే ఆ వాక్కు ధ్యానంలో ఆయనను కనుగొంటారు. ప్రార్ధన ద్వార తట్టితే అది ధ్యానంలో మీకు తెరువబడుతుందని తెలియజేసారు. ప్రార్ధనలో దేవుడు మనకు ఏమి చేయాలో అని నిర్దేశించక, దేవుడు ఏంచేసినా మన మంచికే, అది ఉత్తమమైనదే అని గుర్తించి ఆయన మహిమార్ధం ఆయన చిత్తం జరగడానికి ఓపికతో, సహనంతో నిరీక్షించాలి. ఒక్క మాటలో ప్రార్ధనలో దేవుని ముందు మౌనంగా వుండుట అవసరం. దేవుడు వినే ఏకైక భాష నిశ్శబ్ధ ప్రేమభాష. సృష్టి కర్తకు తమ హృదయాన్ని అర్పించడమే ప్రార్ధన అని నిర్వచించారు.

## 4. పునీతుల మాటల్లో ప్రార్ధన:

- పునీత లొయోలా పురి ఇన్యాసి వారు : “ప్రతి కార్యం దేవునిపై ఆధారపడినట్లు ప్రార్ధించండి. ప్రతి క్యార్యం మీమీదే ఆధారపడినట్లు పని చేయండి.”
- పునీత సిప్రియన్ : “పదేపదే ప్రార్ధనలోను, వాక్య పఠనంలోనూ తరించండి. ప్రార్ధన ద్వార దేవునితో మనం మాట్లాడుతాం వాక్కు పఠనం ద్వార దేవుడు మనతో మాట్లాడుతారు.”
- పునీత అగుస్తీను : “ఆత్మకు ఊపిరి – శ్వాస వంటిది ప్రార్ధన”
- పునీత జాన్ క్రిసోస్టమ్ : “ప్రార్ధన మనలను దేవుని సహచరులుగా మార్చి, దేవునితో ఐక్యమొందేలా చేస్తుంది.
- పునీత మహా సింహరాయలు : “ప్రార్ధనకు మనం కేటాయించే సమయమే దేవునికి మనమర్పించే మహా ఐశ్వర్యం”
- పునీత సిరిల్ : “ప్రార్ధించు వారిలో మార్పు లేని ప్రార్ధన, ప్రార్ధనే కాదు.

- పునీత మటిల్డా : “ధ్యేయం–లక్ష్యం లేని ప్రార్థన దిక్సూచిలేని నావ వంటిది.”
- పునీత ఫ్రాన్సిస్ శౌరి : “స్వచిత్తాన్ని దైవచిత్తానికి అర్పించడమే ప్రార్థన.”
- పునీత ఫ్రాన్సిస్ దె సాలెస్ : “ప్రార్థనంటే దేవుని వైపు ప్రేమతో చూడడమే, దేవుని ఎదుట చాచిన చేతులతో వుండడమే.”
- పునీత గ్రెగొరి : “దేవునితో సంభాషించడమే ప్రార్థన.”

**ముగింపు :**

“క్రీస్తు జూబిలి 2025” ను పురస్కరించుకొని కలిసే ప్రయాణించాలన్న లక్ష్యంతో గమ్యం వైపు గురి కలిగి నిరీక్షిస్తూ సాగిపోతున్న ఈ ప్రార్థనా సంవత్సరంలో మహా సముద్రం లాంటి ప్రార్థన అనే అంశంలో కొన్ని కెరటాలను, అగాధ లోతులను పరిశీలించి తీరమెంత దూరమో, సంద్రమెంత లోతో, ఎంత విశాలమో కొంతమేరకు అవగాహన చేసుకున్నాం. ఎంత చెప్పినా, ఎన్ని వ్రాసినా అన్నీ ప్రభునేర్పిన ‘పరలోక ప్రార్థన’ తోనే మిళితమవుతాయి. ఈ ప్రార్థనలో ఎవరికి ప్రార్థించాలో, ఏమని ప్రార్థించాలో, ఎప్పుడు, ఎక్కడ, ఎలా ప్రార్థించాలో ప్రభువే స్వయంగా నేర్పారు. ఈ జూబిలీ యాత్రలో ప్రార్థన జూబిలీ బూరధ్వనిగా మారాలి. ప్రార్థన అనే ఈ బూరధ్వనే విడుదలను, విమోచనను కొనిరాగలదని, ప్రభుహిత వత్సరాన్ని ప్రకటించే జూబిలీగా ఈ ‘క్రీస్తు జూబిలీ’ మారాలంటే నాడు మిద్యానీయులపై యుద్ధానికి వెళ్ళిన గిద్యోను బూరధ్వనిలా, దర్శనగ్రంథం 21వ అధ్యాయంలో విన్పించిన పరలోక బూరధ్వనిలా ప్రతి క్రైస్తవుని నోట, ప్రతి ఇంట ప్రార్థనా ధ్వని తరంగాలు ప్రతిధ్వనించాలి. ఫలితంగా ప్రార్థించు శ్రీసభగా మారి 2025 సంవత్సరాల క్రితం పశుల పాక ముందు దేవదూతలు గాన ప్రతిగానాలతో బాలయేసును ఆరాధించినట్లు, ఈ జూబిలీ ద్వారాలను ప్రార్థన అనే తాళం చెవితో తెరుద్దాం. మరో నూతన శఖాన్ని ఆరంభిద్దాం.

ప్రభుని 2వ రాకడలో కలిసే ఎత్తబడటానికి కలిసే వుందాం, కలిసే నడుద్దాం, కలిసే ప్రార్థిద్దాం.

❋ ❋ ❋ ❋

# 3. దైవార్చన చట్టం
## *(Sacrosanctum Concilium)*

**– ఫాదర్ మెడంకి ఆనంద్ ఆంద్రు**



### ఉపోద్ఘాతం

### 1. చారిత్రిక నేపథ్యం – దైవార్చన ప్రాముఖ్యత

'పవిత్ర మహాసభ' అని పిలువబడు, ఈ 'దైవార్చనపై సంవిధాన పత్రం' ద్వితీయ వాటికను మహాసభచే ఇకనుండి ' ద్వితీయ వాటికను మహాసభ' అని కాకుండా 'మహాసభ' అని మాత్రమే ఈ అధ్యయనంలో వ్రాయబడుతుంది. విడుదల చేయబడిన 16 పత్రాలలో మొట్టమొదటిది. ఇది ఉపోద్ఘాతంతో మొదలై చివరిలో ఒక అనుబంధముతో ముగుస్తుంది. ఇది 130 సంఖ్యలతో ఏడు అధ్యాయములుగా విభజింపబడినది. ఈ పత్రం ఈ రూపురేఖలు, నిర్మాణం పొందటానికి మహాసభను ప్రకటించి, ప్రారంభించిన 23వ జాన్ పోపుగారు ఏర్పాటు చేసిన దైవార్చన కమీషన్ సంఘము నవంబరు 1960 నుండి, ఈ పత్రం మహాసభ ఆమోదంపొంది, 6వ పాల్ జగద్గురువులచే డిశెంబరు 4, 1963న ప్రకటించబడే వరకు, నిర్విరామ కృషి సల్పినది. ఈ ప్రక్రియలో కొంతమంది సభ్యులు వారి త్యాగ కృషి ఫలితం చూడలేకపోయినప్పటికీ, దైవార్చనలో క్రీస్తు ప్రసాదించు పాస్కాపరమరహస్య రక్షణానుగ్రహశక్తి పరిపూర్ణ ఫలమైన దైవరాజ్య బహుమానమును పొందుకొని, భూలోక ఆరాధన రుచిగా సూచించన త్రిత్వైక దేవుని పరలోక ఆరాధనలో శాశ్వతంగా నిమగ్నులైనారు. 23వ జాన్ పోపుగారు, డిసెంబరు 8, 1962 న, మహాసభయొక్క మొదటి సమావేశమును ముగిస్తూ, ఈ విధంగా పలికారు: (మహాసభలో) "పరిశీలింపబడిన మొదటి అంశం (స్కీమా) దైవార్చనను

గురించినదై ఉండటం అనుకోకుండా జరిగినదేమీ కాదు. దైవార్చన మానవునికి దేవునితోగల సంబంధమును తెలియచేస్తుంది. ఈ సంబంధము అత్యంత ప్రధానమైనది". కావుననే 'దైవార్చన' అంశం మహాసభలో మొదటి స్థానంలో, అన్నింటికన్నా ప్రధానమైన అంశంగా (లూకా 10:41–42 "అవసరమైనది ఒక్కటే") చర్చించబడినది. వాస్తవానికి మహాసభ పరిశీలనకు మొట్టమొదటిగా వచ్చిన ఏడు అంశాలలో దైవార్చన అంశం ఐదవది. వరుస క్రమంలో దానికి ముందున్న వేదాంతానికి, సిద్ధాంతాలకు సంబంధించిన నాలుగు అంశాలను వదిలిపెట్టి దైవార్చనాంశాన్ని అతి ముఖ్యమైన, అత్యవసరమైన అంశంగా మహాసభ పరిశీలించింది (Annibale Bugnini, The Reforms of the Liturgy 1948-1975, 33, 29).

23వ జాన్ పోపు గారి మరణానంతరం మహాసభను కొనసాగించిన 6వ పాల్ పోపుగారు, సభ రెండవ సమావేశమును ముగిస్తూ, దైవార్చన గురించి ఈ విధంగా పలికారు: "కష్టమైన మరియు జటిలమైన చర్చలు ఖచ్చితంగా ఫలించాయి, ఎందుకనగా (చర్చించిన) అంశాలలో ఒకటైన ప్రప్రథమంగా చర్చించబడిన, ఒకవిధంగా చెప్పాలంటే, శ్రీసభ జీవితానికి అత్యంత ముఖ్యమైన, దైవార్చన గురించిన అంశం (స్కేమా) ఒక సంతోషకరమైన ముగింపుకు చేరుకున్నది. ఈరోజు మేము దానిని సగర్వంగా ప్రకటించాము, మరియు ఈ సాఫల్యమునకుగాను (దీనిని సాధించినందుకు గాను) ఎంతో ఆనందించుచున్నాము. దీనిలో మనము విలువలు మరియు విధుల యొక్క సరైన క్రమముయొక్క గుర్తింపును చూడవచ్చు: ప్రథమ స్థానములో దేవుడు ప్రార్ధన మన ప్రథమ విధి దైవార్చన, ఆధ్యాత్మికతకు ప్రథమ పాఠశాల విశ్వసించి మనతో కలిసి ప్రార్ధించే క్రైస్తవులకు మనమివ్వగలిగే మొదటి బహుమతి. ప్రపంచానికి ప్రథమ ఆహ్వానము కూడా ఇదే..." (Annibale Bugnini, 38). ఈ మాటలనుబట్టి దైవార్చన ప్రాముఖ్యత ఎటువంటిదో, ఈ పత్రాన్ని అధ్యయనం చేసి దైవార్చననుగూర్చి తెలుసుకోవడం ఎంత ముఖ్యమో ఎవరైన ఇట్టే గ్రహించగలరు. అయితే ఈ అధ్యయనం చేసి, దానిలో ఉన్న వివిధ దైవార్చనా అంశాలను తెలుసుకొనే ముందు, అసలు దైవార్చనంటే ఏంటి, సంస్కరణలకు దారి తీసిన, మహాసభకు పూర్వము ఉన్న దైవార్చనా పరిస్థితులేంటి,

అనే వాటిగురించి క్లుప్తంగా తెలుసుకోవలసిన అవసరం ఉంది. అప్పుడే దైవార్చన పత్రంలోని అంశాలు మనకు బోధపడతాయి.

## 2. దైవార్చన అనగా ఏమి?

దైవార్చనను ఇంగ్లీషులో 'లిటర్జి' అని అంటాము. లిటర్జి అనే పదము 'లెయ్తుర్గీయా' అనే గ్రీకు భాష పదం నుండి పుట్టింది. ఇది రెండు గ్రీకు పదాల కలయిక: లాఓస్, అనగా ప్రజలు ('laity', 'lay' అనే పదాలు దీని నుండి పుట్టినవే) యెర్గోన్ అనగా పని ('energy' అనే పదం దీనినుండి పుట్టినదే). కావున లెయ్తుర్గీయా అంటే, ప్రజల పని. 'ప్రజల కోసం, ప్రజల తరపున, ప్రజల ప్రయోజనార్ధం ఉచితంగా, ప్రేమతో, భక్తితో స్వచ్ఛందంగా ఒక వ్యక్తి లేదా ఒక కుటుంబము తనంతటతాను ముందుకు వచ్చి చేసే పని' అని దీనియొక్క ప్రధానమైన అర్ధం. దీనిని బట్టి దైవార్చన అంటే 'తండ్రి దేవుడు క్రీస్తుప్రభువు ద్వారా పరిశుద్ధాత్మతో కలసి మానవాళి రక్షణ కార్యమును తలపెట్టి, తనంతట తాను చొరవ తీసుకొని ఉచితంగా ప్రేమతో (యోహాను 3:16; ఎఫెసీ 5:2) తన నామ మహిమకోసం చేసిన రక్షణ కార్యము'. అనగా క్రీస్తే ప్రధాన యాజకుడు, అర్చకుడు, దైవార్చకుడు. ఆయన యాజకవిధిని నిర్వర్తించడం ద్వారా క్రీస్తు చేసిన ఈ రక్షణ పనిలో ప్రజలు పాల్గొంటారు, ఆ విధంగా అది వారి ప్రధమ పని అవుతుంది ("నన్ను ఆరాధించ నా ప్రజలను పోనిమ్ము" నిర్గమ 7:16;8:1, 20:9:1, 13:10:3).

## 3. దైవార్చన సిలువబలి

పై అర్ధమును బట్టి దైవార్చనకు ఆది, మూలం, ముగింపు దేవుడే. మానావాళి రక్షణ కార్యమును క్రీస్తు ప్రభువు పాస్కా పరమరహస్యములో, అనగా ఆయన పవిత్ర శ్రమలు, మరణము, పునరుత్థానము, మోక్షారోహణము, పవిత్రాత్మ రాకడ ద్వారా నెరవేర్చెను. ఆవిధంగా మానవులను పాపములనుండి విమోచించి వారికి స్వర్గద్వారములను (పరలోకానికి చిహ్నమైన 'ఏదేను తోట యొక్క మూయబడిన ద్వారములను' ఆది. 3:24) తెరచెను, దేవునికి మహిమను చేకూర్చెను. దైవార్చనలో అసలు విషయమైన 'సిలువబలి' శాశ్వతంగా కొనియాడబడుటకు, ఆయనే ఆ రక్షణ బలిని కలువరిలో తండ్రికి అర్పించుటకు

ముందు రోజున, కడరా భోజన సమయములో దివ్యసంస్కారముగా ఏర్పాటు చేసి, దానిమూలమున తనే అన్ని కాలాలలో ప్రతి ఒక్కరిలో రక్షణ కార్యమును నెరవేర్చుటకు సంకల్పించుకొనెను. తాను దేవునికి అర్పించిన రక్షణబలిలోనుండే జన్మించిన (యోహాను 19:34), తన జ్ఞాన శరీరమైన శ్రీసభను ఈ బృహత్తర పనిలో ఏకంచేసుకొని శ్రీసభలో, ముఖ్యంగా దివ్యబలిపూజలో, నిత్యమూ ఉంటూ, శ్రీసభతో, శ్రీసభ ద్వారా దైవార్చనలో మానవులను రక్షించుచున్నాడు, దేవుని (తనను తాను) మహిమపరచు(కొను)చున్నాడు.

## 4. శ్రీసభ చరిత్రలో దైవార్చన

"నేను .... మీతో ఈ పాస్కను భుజింపవలయునని ఎంతో ఆశించితిని" (లూకా 22:15) అని క్రీస్తు శిష్యులతో ప్రథమ సంస్కారబలిని అర్పించిన రీతిలో, అపోస్తోలిక కాలమునుండి దైవార్చన విశ్వాస సంఘమంతా కలిసి చేసుకొనే బహిరంగ ప్రార్ధనగా వస్తుంది. మొదటినుండి విశ్వాసులు దైవార్చన వేడుకలలో చురుగ్గా, నిండు భక్తివిశ్వాసాలతో పాల్గొనేవారు. ఇందుకు శ్రీసభ పితామహుల రచనలు మనకు ఋజువుగా ఉన్నాయి. పూజ ప్రథమభాగమైన దైవవాక్యార్చనలో విశ్వాసులు 'అల్లెలూయా' పాడేవారు. దీనిగురించి మాట్లాడుతూ నాల్గవ శతాబ్దానికి చెందిన పు. క్రొమాత్సియుస్ అనే పీఠాధిపతి ఇలా అన్నారు: 'విశ్వాసులందరూ కలిసి అల్లెలూయ పాడటం విశ్వాసుల మధ్య ఐక్యతకు, మరియు ప్రతి విశ్వాసి ఒకే శ్రీసభకు చెందిన వ్యక్తి అను దానికి చిహ్నం'. రెండు బృందాలుగా ఒకరి తరువాత ఒకరు పూజలో విశ్వాసులు పాటలు పాడేవారు (పు. అగస్టీను 2వ శతాబ్దంలో అన్యుడైన ప్లిని ట్రాజన్ చక్రవర్తికి వ్రాస్తూ ఈ విషయాన్ని తెలియచేసారు) ఆదివారం పూజ పఠనముల అనంతరం చేసే విశ్వాసుల ప్రార్ధనలో, సమావేశమైన వారందరూ భక్తి, ఆసక్తితో వారికొరకు, అందరికొరకు ప్రార్ధన చేసేవారు. పూజ రెండవభాగమైన కృతజ్ఞతార్చనలో, స్తుతిగీతమునకు ముందు గురువు ఆహ్వానము మేరకు, 'ప్రభువు వైపు తిప్పియున్నాము', (వారికి కృతజ్ఞత తెలుపుట) 'యుక్తము న్యాయము' అని బదులు పలికేవారు. తరువాత అందరూ 'దళాధిపతియైన సర్వేశ్వరుడు పవిత్రుడు' అను పాట పాడేవారు (పు. సిప్రియన్, పు. యెరుషలేము సిరిల్

నుండి ఈ విషయం తెలుస్తుంది) ప్రార్ధన చివరిలో 'ఆమెన్' అని చెప్పేవారు (పు. జస్టిన్)బీ దివ్యసత్ప్రసాద క్రమములో ప్రవేశించిన తర్వాత, ఒకరికొకరు ముద్దుతో సమాధానమును తెలుపుకోవటం, పరలోక ప్రార్ధన చెప్పటం, గురువు 'క్రీస్తు శరీరము' అన్నప్పుడు 'ఆమెన్' అని బదులివ్వటం చేసేవారు (తెర్తూలియన్ యెరుషలేము సిరిల్). ఈ విధంగా పీఠాధిపతిగురువు మరియు విశ్వాసులు కలిసి పూజను అర్పించేవారు, భక్తివిశ్వాసాలతో పాల్గొనేవారు.

ప్రభువు 'పై మేడగదిలో' దివ్యసత్ప్రసాదమును స్థాపించిన నాటినుండి, అపోస్తలుల కాలంలో, వేద హింసలలో 'దేవుని కుటుంబ వేడుక'గా గృహ దేవాలయాలలో సమష్టిగా సాగిన దైవార్చన, 4వ శతాబ్దంలో వేదహింసలు ముగిసి, మత స్వేచ్ఛను పొందుకొని, కాన్సెటెంటైన్ చక్రవర్తి కాలంలో వృద్ధిచెందుతూ వైభవోపేతంగా మారి, రాజకీయ, సమాజిక, వేదాంత (తప్పుడు బోధనలను అరికట్టుటకు దైవార్చనా నియమాలను కఠినతరం చేయటం), లౌకిక, నైతిక, మొదలైన పరిస్థితుల ప్రభావానికి లోనై 'విశ్వాస సంఘమంతా కలసి కొనియాడే బహిరంగ ప్రార్ధన' అనే దాని అసలు స్వభావమును కోల్పోయింది. మధ్యయుగాలలో (క్రీ.శ. 5 నుండి 15 శతాబ్దాల మధ్య కాలం, ముఖ్యంగా 9 వ శతాబ్దం నుండి) దైవార్చన ప్రజలకు ఒక అర్థంకాని విషయంగా మారింది. పాటల ద్వారా, పూజలో ఇచ్చే బదులు ప్రార్ధనల ద్వారా ప్రజలు పాలుపంచుకోవటం తగ్గిపోయింది. చేసే పూజల సంఖ్య పెరిగింది, కాని విశ్వాసులు పూజలో దివ్యసత్ప్రసాదమును స్వీకరించేవారు కాదు. ఈ కారణం చేతనే ఏడాదికి ఒక్కసారైనా పాపసంకీర్తనం చెయ్యాలని, సంవత్సరానికి ఒక్కసారైనా, అనగా పాస్కా పండుగ రోజున దివ్యసత్ప్రసాదమును స్వీకరించాలని 1215 లో జరిగిన 4వ లాతెరను మహాసభ కట్టడ చేసింది. పూజ గురువు మాత్రమే వ్యక్తిగతంగా చేసుకొనేదిగా మారింది. గురువు పూజ చేసుకొనేటప్పుడు విశ్వాసులు వేరే ప్రార్ధనలు చెప్పుకొనేవారుబీ నడి పూజలో మాత్రమే శ్రద్ధగా ఉండేవారు (అందుకే నడిపూజను సూచించటానికి నడిపూజలో గంట కొట్టే నియమం వచ్చింది). దైవార్చన, శ్రీసభ వేడుక అనే అర్థం పూర్తిగా కోల్పోయింది. దైవార్చనా దుర్వినియోగాలు పెరిగాయి (పూజ వినుచున్నంత సేపు వినేవారు ముసలివారు కారని, విన్న తరువాత భోజనం రుచిగా మారుతుందని...).

పూజలో పాల్గొనటం పోయి, పూజను వినటం చూడటం అనే పదజాలం పుట్టుకొచ్చింది విశ్వాసులను కేవలం చూసే, వినే మూగ ప్రేక్షకులుగా, అపరిచితులుగా మార్చేసింది. వీటన్నింటినీ అదుపు చేయుటకు 16వ శతాబ్దంలో ట్రెంట్ మహాసభ తరువాత జరిగిన సంస్కరణలలో చరిత్రలో మొట్టమొదటి సారిగా దైవార్చన గ్రంథాలలో నియమనిబంధనలు ముద్రించబడ్డాయి అప్పటినుండి దైవార్చన ధ్యాసంతా నియమాలను అనుసరించి చేయటం మీదకే పోయింది. 17వ శతాబ్దంలో దైవార్చన నైపుణ్యంతో పాడే, వాయించే సంగీతంతో ప్రేక్షకులను అలరించే ఒక ప్రదర్శనగా మారింది.

19 వ శతాబ్దం చివరిభాగం నుండి దైవార్చనను క్రైస్తవ జీవితానికి కేంద్ర బిందువుగా పునరుద్ధరించే ప్రక్రియ అక్కడక్కడ (ఫ్రాన్స్, బెల్జియం, జర్మని... ప్రధానంగా పు. బెనెడిక్టు సభ గురువులచే) ప్రారంభమై 20వ శతాబ్దంలో, ("దివ్యసత్ప్రసాద పోపుగారు" గా ప్రసిద్ధికెక్కిన)10వ భక్తినాద పాపుగారు ప్రజలను దైవార్చనలో పాల్గొనమని పిలుపునిస్తూ, దివ్యబలిపూజలో పాల్గొనువారు దివ్యసత్ప్రసాదమును స్వీకరించాలని 16వ శతాబ్దంలో ట్రెంట్ మహాసభ ఇచ్చిన పిలుపును మరొకమారు నొక్కి చెబుతూ, ప్రధమ దివ్యసత్ప్రసాదమును స్వీకరించే వయస్సును 7 సంవత్సరాలకు తగ్గిస్తూ 1903, 1905, మరియు 1910 సంవత్సరాలలో వ్రాసిన *'Tra le sollecitudini'* ,*'Sacra Tridentina synodus'* , *'Quam Singulari'* అను శ్రీసభ అధికారిక పత్రాలు ఇచ్చిన స్పూర్తి, ప్రోత్సాహం, ప్రోద్బలంతో చివరికి అది ఒక దైవార్చన ఉద్యమంగా అవతరించింది. 12వ భక్తినాద పోపుగారు 1947 లో వ్రాసిన *'Mediator Dei'* ('దేవునికి మనుజులకు మధ్యవర్తి') అనే చరిత్రలోనే దైవార్చన అంశానికి పూర్తిగా అంకితమైన తొలి పత్రంతో ఈ ఉద్యమాన్ని అధికారికంగా గుర్తించి, సవరణలు చేపట్టారు. 1956 లో ఇటలీ దేశంలోని అస్సీసి నగరంలో జరిగిన అంతర్జాతీయ దైవార్చన సదస్సులో పాల్గొన్న 50 మంది పీఠాధిపతులు, 6 గురు కార్డినల్స్‌తో సహా మొత్తం 1500 మంది సభ్యులు, సదస్సు ముగిసిన తరువాత రోము నగరానికి వెళ్ళగా, వారినుద్దేశించి మాట్లాడుతూ, 12వ భక్తినాద పోపుగారు, 'ప్రజలను విశ్వాస పరమరహస్యమునకు మరియు దైవార్చనలో పాల్గొనుట ద్వారా లభించే అనుగ్రహానికి చేరువ చేసే ఈ ఉద్యమం దేవుని

కృపావరానికి మరియు శ్రీసభలో పరిశుద్ధాత్మ దేవుని సాన్నిధ్యానికి ఒక సంకేతం', అని తెలియచేసారు. ఆయన తరువాత జగద్గురువులైన 23వ జాన్ పోపుగారు జనవరి 25, 1959 న ద్వితీయ వాటికను మహాసభను ప్రకటించారు. దానిలో దైవార్చన అంశాన్ని మొట్టమొదటిగా పరిశీలించి, దైవార్చనకు దూరమైపోయిన విశ్వాసులను తిరిగి చేరువ చేసి, దైవార్చనలో చేసేది వారు సులువుగా అర్థం చేసుకొని, నిండు భక్తివిశ్వాసాలతో కొనియాడి, పాస్కాపరమరహస్యములో పాల్గొని, రక్షణానుగ్రహమును పొందుటకు సంపూర్ణ సంస్కరణను శ్రీసభ చేపట్టింది.

ఈ చారిత్రక నేపథ్యంలో 'పవిత్ర మహాసభ' అను ఈ 'దైవార్చనపై సంవిధాన పత్రము'ను చదివి దైవార్చన గురించి మరిన్ని విషయాలను నేర్చుకుందాం. ఈ పత్రమును చదివేవారికి, దానిలోని దైవార్చన విషయాలు సులువుగా అర్థమయ్యే ఉద్దేశ్యంతో, దీనిని మూడు భాగాలుగా వివరించటమైనది. మొదటి భాగంలో వాటికను మహాసభ సాధారణ లక్ష్యాలను, దైవార్చన ప్రాథమిక సూత్రాలను, రెండవ భాగంలో దైవార్చన అంతర్భాగాలను, మూడవ భాగంలో ప్రస్తుత కాలంలో ఉన్న దైవార్చన పరిస్థితులను ధ్యానపూర్వకంగా తెలుసుకుందాం.

## I. ద్వితీయ వాటికను మహాసభ లక్ష్యాలు

## దైవార్చనా సంస్కరణ యొక్క ప్రాథమిక సూత్రాలు

ఏదైనా ఒక పని చేయాలనుకున్నప్పుడు దానికి ఒక ఖచ్చితమైన లక్ష్యం ఉండి తీరాలి. ఆ లక్ష్యాన్ని సాధించడానికి ప్రణాళికలు, విధానాలు రూపొందించాలి. అయితే ఇవి గాలిలో కాకుండా (ఇంటి నిర్మాణం వలె) ఒక పునాదిపైన జరగాలి. ఈ పునాదిని మనకు ఏర్పాటు చేసేవే సూత్రాలు. ఈ సూత్రాలు మనం చేసే పనికి మద్దతును, బలాన్ని ఇచ్చే సిద్ధాంతాలు. వీటికి కట్టుబడే లక్ష్య సాధనలో ముందుకు సాగాలి. కనుక వాటికను మహాసభ ఈ పత్రం ఆరంభంలోనే ఉపోద్ఘాతంలో (సంఖ్య 2) మహాసభ సాధారణ లక్ష్యాలను, మొదటి అధ్యాయంలో (సంఖ్యలు 546) దైవార్చన సంస్కరణ ప్రక్రియకు మార్గాన్ని చూపించే ప్రాథమిక సూత్రాలను తెలియచేసింది. వీటిమీదనే దైవార్చన

అధ్యయనం, సంస్కరణలు, దైవార్చన నిర్వహణ ఆధారపడియున్నవి. మొట్టమొదటిగా వీటిని తెలుసుకుందాం. ఈ సూత్రాలు మనకు దైవార్చనంటే ఏంటో తెలియచేస్తూ, దాని ప్రాముఖ్యతను మన కళ్ళముందు ఉంచుతాయి.

## 1. ద్వితీయ వాటికను మహాసభ లక్ష్యాలు:

'పవిత్ర మహాసభ' అను ఈ పత్రం ద్వితీయ వాటికను మహాసభచే విడుదల చేయబడిన 16 పత్రాలలో మొట్టమొదటిది. కావున మహాసభయొక్క 4 ప్రధాన లక్ష్యాలు ఈ పత్రం యొక్క ఉపోద్ఘాతం ఆరంభంలోనే తెలియచేయబడినవి. వీటిని తప్పక తెలుసుకోవాలి. ఎందుకంటే వీటి సాధనలో భాగంగానే శ్రీసభ దైవార్చన సంస్కరణలను చేపట్టింది. ఇందువలన దైవార్చన సంస్కరణల లక్ష్యాలు కూడా ఇవే అని కూడా చెప్పవచ్చు. ఇవి చిన్న లక్ష్యంతో మొదలై పెద్ద లక్ష్యం వైపు సాగుతాయి. ప్రాధాన్యతా వరుసక్రమంలో 'ఇంట గెలిచి రచ్చ గెలువు' అన్నట్టుగా ఉంటాయి. అవి ఏమనగా:

### 1.1 విశ్వాసుల క్రైస్తవ జీవితాన్ని మరింతగా చైతన్యవంతం చేయటం, వారిని ఉత్సాహవంతులనుగా తీర్చిదిద్దటం:

ఇది మొదటి లక్ష్యం, అన్నింటికన్నా ముందుగా సాధించవలసిన లక్ష్యం. అనగా ప్రథమ ప్రాధాన్యత సిద్ధాంతాలకో, వేదాంతానికో, విధివిధానాలకో, నియమనిబంధనలకో, మరోదానికో కాకుండా విశ్వాస సంఘానికి, సంఘ పరిచర్యకు, విశ్వాసుల జీవితాలను చైతన్య పరచుటకు మహాసభ ఇవ్వటం మనం గమనించాలి. సంస్కరణలను తలపెట్టింది ఇందుకే. వాటికను మహాసభ సంఘ పరిచర్యకే పెద్ద పీట వేసింది.

### 1.2 మార్పు చేయవలసిన వ్యవస్థలను ప్రస్తుత కాల అవసరాలకు అనుగుణంగా సంస్కరించటం:

''మానవుల కొరకే విశ్రాంతిదినము నియమింపబడినదిగాని, విశ్రాంతిదినము కొరకు మానవుడు నియమింపబడలేదు'' (మార్కు 2:27) అని ప్రభువు చెప్పిన నియమం ఇక్కడ కనిపిస్తుంది. వ్యవస్థలు మనుషులకు ఉపయోగపడేవిగా ఉండకపోతే, అవి మ్యూజియంలో పురాతన వస్తువులను

తలపిస్తాయి. చూసుకొని ఆనందించటం తప్ప వాటివలన ఏ ఉపయోగం ఉండదు. కనుక వ్యవస్థలు, ఆచారాలు, నియమాలు, భాషలు సువార్తీకరణకు ఉపయోగపడేవిగా చేసుకోవాలి.

**1.3 క్రైస్తవ విశ్వాసుల మధ్య సఖ్యతను పెంపొందించే వాటిని బలపరచటం:**

"వారందరు ఒకరుగ ఐక్యమై ఉండునట్లు ప్రార్ధించుచున్నాను" (యోహాను 17:21). వివిధ శాఖలుగా విడిపోయిన క్రైస్తవులు, విడిపోవుటకు కారణమైన మానవ అంశాలను ప్రక్కనపెట్టి క్రీస్తునందు విశ్వాసులందరిని ఒకటిగా చేసే దైవాంశాలకు ప్రాధాన్యమిచ్చుకోవాలి. "క్రీస్తునందు జ్ఞానాస్నానం పొందిన వారందరు ఒక్కరే" (గలతీ. 3:26-28). ఆత్మ ఒసగు ఐక్యమును నిలుపుకొనుటకు సాధ్యమైనంతగ ప్రయత్నించాలి (ఎఫెసీ. 4:36).

**1.4 శ్రీసభలోనికి సమస్త మానవాళిని అహ్వానించుటకు దోహదపడేవేవో గుర్తించి వాటిని బలపరచటం:**

"ఈ గొఱ్ఱెల దొడ్డికి చెందని వేరే గొఱ్ఱెలును నాకు కలవు. వానిని కూడ నేను తోడుకొని రావలయును. అవి నా స్వరమును ఆలకించును. అపుడు ఒకే మందయు, ఒకే కాపరియు ఉండును" (యోహాను 10:16). సువార్తీకరణ అంటే ఇదే. సకల మానవులను క్రీస్తు జ్ఞాన శరీరంలోకి చేర్చటం.

**2. దైవార్చన సంస్కరణకు ప్రాథమిక సూత్రాలు:**

మొదటి అధ్యాయంలో ఉన్న ప్రాథమిక సూత్రాలను రెండు రకాలుగా విభజింపవచ్చు మార్గదర్శక సూత్రాలు మరియు కార్యాచరణ సూత్రాలు.

**2.1 మార్గదర్శక సూత్రాలు:**

ఇవి, దైవార్చనను సంస్కరించి నవీకరించటానికి అవసరమైన ప్రణాళికలను రూపొందించటానికి, వాటిని అమలుచేసే ప్రక్రియకు మార్గాన్ని చూపించి నడిపించేవి. వీటిలో ముఖ్యమైన 6 సూత్రాలను వివరంగా చూద్దాం.

**2.1.1 దైవార్చన దేవుని రక్షణ ప్రణాళికలో, రక్షణ చరిత్రలో ఒక అంతర్భాగం, ఆఖరి ఘట్టం, "రక్షణ దినం" (సంఖ్యలు 56):**

దైవార్చన ప్రాముఖ్యతను తెలిపే ఈ సూత్రాలు ఊహాజనితమైనవి కావు. ఇవి వాస్తవ రక్షణ సంఘటనపై నిర్మించబడినవి. మానవులను రక్షించాలనే

దేవుని తలంపు, కోరికే మానవాళి రక్షణకు ఆరంభం. దేవునియొక్క ఈ కోరికనే రక్షణ ప్రణాళిక అని పిలుస్తాము (ఆది. 3:15). రక్షణ చరిత్ర ఈ రక్షణ ప్రణాళికతో ప్రారంభమై, క్రీస్తు పాస్కా పరమరహస్యముతో పరిపూర్ణ దశకు చేరుకొని, ప్రభువు స్థాపించిన దివ్యబలి, దివ్యసంస్కారాలలో కొనసాగుతుంది. దైవార్చన ద్వారా పాస్కా పరమరహస్యములో పాల్గొని, రక్షణ పొందుకొను అవకాశం అందరికీ ఇవ్వబడుతుంది. కావున దైవార్చన ఈ రక్షణ ప్రణాళికలో, రక్షణ చరిత్రలో అంతర్భాగం. మోక్షారోహణమైన ప్రభువు మరలా తిరిగి వచ్చేవరకు కొనసాగే ఆఖరి ఘట్టం, ప్రతి ఒక్కరికి వారివారి కాలాలలో "రక్షణ దినం" (2 కొరింతీ. 6:2; లూకా 19:9 "నేడు ఈ ఇంటికి రక్షణ వచ్చినది").

### 2.1.2 దైవార్చన అనగా క్రీస్తు జ్ఞాన శరీరం, ఆయన యొక్క యాజకవిధిని నిర్వహించడమే (సంఖ్య 7):

మన ప్రధాన యాజకుడైన క్రీస్తు, పాస్కా పరమరహస్యమైన తన దివ్య శ్రమలు, మరణం, పునరుత్థానం, మోక్షారోహణం ద్వారా మానవాళిని రక్షించాడు, దేవునికి పరిపూర్ణ మహిమను చేకూర్చాడు. దైవార్చనను కొనియాడినప్పుడెల్లను ప్రభు పాస్కా పరమరహస్యములో పాల్గొంటున్నాము. దైవార్చన అనగా ప్రభు పాస్కా పరమరహస్యమును సాంగ్యం రూపంలో కొనియాడటమే. అంటే పాస్కా పరమరహస్యమే దైవార్చనంతటికీ గుండెకాయలాంటిది. దీనిని కొనియాడినపుడెల్లా రక్షణశక్తి మనకు అనుగ్రహించబడుతుంది. ఎందుకంటే దైవార్చనలో కేంద్ర బిందువుగా, మోక్షారోహణమై తండ్రి కుడిప్రక్కన కూర్చొనియున్న, క్రీస్తు ప్రభువు ఎల్లప్పుడు ఉన్నాడు. పూజను అర్పించే గురువులో, దివ్యసత్ప్రసాదంలో, దివ్యసంస్కారాలలో, ప్రకటించబడు ఆయన వాక్కులో, చివరిగా ప్రార్థించు శ్రీసభలో ప్రత్యక్షమై ఉన్నాడు. కాబట్టే దైవార్చన క్రీస్తు యాజకవిధి నిర్వహణ. ఇది క్రీస్తు జ్ఞాన శరీరం, అనగా శిరస్సు అయిన క్రీస్తు, ఆయన అవయవములు అయిన విశ్వాసులు కలిసి అర్పించే పరిపూర్ణ బహిరంగ ఆరాధన. ఇది క్రీస్తు, శ్రీసభ కలిసి చేసే పవిత్ర కార్యం కావున ఇది శ్రీసభ చేసే పనులన్నింటికన్నా ప్రధానమైనది. శ్రీసభలో ఇతరత్రా ఏదీ కూడా స్థాయిలోను, సామర్థ్యంలోనూ, పేరులోనూ దైవార్చనతో సరితూగవు, సాటిరావు.

### 2.1.3 భూలోక దైవార్చన పరలోక దైవార్చనకు ఒక ముందస్తు రుచిగా ఉన్నది (సంఖ్య 8):

ఈ భూలోకంలో శ్రీసభ చేసేవన్నీ పరలోకంలో ఉన్నవాటికి, జరిగేవాటికి ఛాయలే (నీడలే), చిహ్నములే. ఇక్కడున్నవాటికి పరలోకంలో ఉన్నవే పరిపూర్ణ రూపం భూలోక శ్రీసభ పరలోక యెరుషలేమునకు, దేవాలయము పరలోకానికి, భూలోక ఆరాధన పరలోక ఆరాధనకు, చిహ్నములు. అనగా పూజకు దేవాలయానికి వెళ్ళటం అంటే పరలోకానికి వెళ్ళటం పూజలో పాల్గొనటం అంటే పరలోక ఆరాధనలో ఇప్పుడే ఇక్కడే పాల్గొనటం. ఈ విధంగా దైవార్చన మనలను పరలోక అర్చనలో పాల్గొనేలా చేస్తుంది. దీనినే మరో మాటలో ఈ విధంగా చెప్పుకోవచ్చు: దైవార్చనంటేనే పరలోకంలో ఉన్న ప్రభువును అక్కడున్న దేవదూతలు, పునీతులతో కలసి మనం ఆరాధించి మహిమపరచడం సంస్కార రూపంలో ప్రత్యక్షమైయున్న త్రిత్వేక దేవుని మనతో కలిసి పూజించుటకు పరలోక సమూహమంతా క్రిందికి రావటం. నిజానికి దైవార్చనలో పరలోకం, భూలోకం ఒకటవుతాయి. భూలోకం పరలోకమవుతుంది.

### 2.1.4 దైవార్చన శ్రీసభ జీవితానికి, చేసే పనులన్నిటికీ శిఖరంగమ్యం మరియు చెలమఊట (సంఖ్యలు 9-10, 12-13):

దైవార్చనకు క్రీస్తు, ఆయన పాస్కా పరమరహస్యం కేంద్ర బిందువు. కావున, దైవార్చన శ్రీసభ జీవితానికి కేంద్రం అవుతుంది. శ్రీసభకు దైవార్చన ఒక పరిపూర్ణమైన చిత్రాన్నిస్తుంది: శ్రీసభ అంటే దేవుని ఆరాధించటానికి ఒకే బలిపీఠం చుట్టూ చేరే విశ్వాస సంఘం సమూహం. ఈ చిత్రం లేదా చిహ్నం వాస్తవం కూడా, ఎందుకంటే దివ్యసత్ప్రసాదమే శ్రీసభను పోషించేది దివ్యబలిపూజ, దివ్యసంస్కారాలను కొనియాడుట ద్వారానే శ్రీసభ నిరంతరాయంగా వృద్ధిచెందుతూ, ఎప్పటికప్పుడు నూత్నీకరించబడుతుంది. అందుకే పు. అగస్టీను గారు 'దివ్యసత్ప్రసాదమే శ్రీసభను నిర్మించేది' అన్నాడు.

అయితే శ్రీసభ దైవార్చనతో పాటు చాలా పనులు చేయవలసి ఉన్నది. అవేమనగా, 1. క్రీస్తునుగూర్చి తెలియనివారికి చేసే సువార్తీకరణ (రోమీ. 10:14-15). 2. విశ్వాసులకు నిరంతరం చేసే సత్యోపదేశం, దైవార్చనోపదేశం,

జీవితోపదేశం (పవిత్రమైన జీవనం సాగించటం, పుణ్యక్రియలు చేయటం,..). కాని ఎన్ని పనులున్నా వీటన్నిటియొక్క అంతిమ లక్ష్యం ఒక్కటే: విశ్వాసము, జ్ఞానస్నానం ద్వారా శ్రీసభ సభ్యులైన ప్రతి ఒక్కరు కలిసి దేవుని స్తుతించటం, దివ్యబలిపూజలో పాల్గొనటం, ప్రభువిందును భుజించటం, ప్రభువులో ఒకటవటం (communion). అనగా ఈ పత్రంలో పలుమార్లు చెప్పబడినట్లు, "దేవుని మహిమపరచటం, మానవులను రక్షించటం" (సంఖ్యలు 5, 7, 10, 59, 112). మరో ప్రక్కన, శ్రీసభ ఈ పనులన్నిటినీ చేయటానికి శక్తినిచ్చేది దైవార్చనే. ఈ సందర్భంలో పు. ఫౌస్టీనమ్మ గారి మాటలు మనం జ్ఞాపంకం చేసుకోవాలి: "నేను నా అనుదిన పనులను చేయుటకు నాకు శక్తినిచ్చేది దివ్యసత్ప్రసాదమే. నేను దివ్యసత్ప్రసాదమును స్వీకరించలేని రోజును తలంచుకుంటేనే నాకు భయం వేస్తుంది."

ఇదే సూత్రం శ్రీసభ చేసే ఇతర ప్రార్థనలకు కూడా వర్తిస్తుంది. ఆధ్యాత్మిక ప్రార్థనాజీవితం దైవార్చనలో పాల్గొనుటకే పరిమితం కాదుబీ దానితోనే అయిపోదు. దానితోపాటు విశ్వాసులు వ్యక్తిగత ప్రార్థన కూడా చేసుకోవాలి. అలానే దైవార్చనకు అనుగుణంగా ఉండే వివిధ భక్తి కృత్యాలు (జపమాల, స్లీవ మార్గము, తీర్థయాత్రలు, కుటుంబ ప్రార్థనలు, దీక్షలు, కరుణ జపమాల, ..) ఆచరించాలి. అయితే ఇవన్నీ కూడా వాటి శిఖరమైన దైవార్చనవైపే సాగాలి, దైవార్చనకు విశ్వాసులను సిద్ధపరిచేవిగా ఉండాలి. అలానే దానినుండే పుట్టినవై (చెలమ) ఉండాలి. ఎందుకంటే దైవార్చన దాని స్వభావమునుబట్టి వీటన్నింటికన్నా ఎన్నో రెట్లు గొప్పది. దైవార్చన మరియు మిగతా భక్తి కృత్యాలు తల్లిబిడ్డల బంధం కలిగి ఒకదానినొకటి పోషించుకొనునవిగా ఉండాలి.

### 2.1.5 దైవార్చన వివిధ సాంగ్యాల ద్వారా, మానవులకు గోచరమయ్యేఅర్థమయ్యే సంజ్ఞల ద్వారా నిర్వహించబడు పవిత్ర కార్యము (సంఖ్య 7):

మనిషి ఆత్మశరీరముల కలయిక. శరీరము మూలమున అతడు చూస్తాడు, వింటాడు, గ్రహిస్తాడు, బదులిస్తాడు. అందుకనే అదృశ్యుడైన దేవుడు మనకు కనిపించే విధంగా మానవరూపం దాల్చి మనమధ్య ప్రత్యక్షమయ్యాడు మనకు అర్థమయ్యే మన భాషలో మాట్లాడాడు మనం గ్రహించగలిగే విధంగా రక్షణ

కార్యం నెరవేర్చాడు. కనుక ప్రభు మనుష్యావతారమే దైవార్చనను కొనియాడు మార్గం, పద్ధతి అయింది. అదృశ్యుడైన క్రీస్తును, ఆయన పాస్కాపరమరహస్య రక్షణశక్తిని మనం గ్రహించగలిగి పొందుకొనే రీతిలో వివిధ సాంగ్యాలు, సంజ్ఞల ద్వారా దైవార్చన కొనియాడబడుచున్నది.

దైవార్చనలో క్రీస్తు ఉండుటవలన, శ్రీసభను తనతో కలుపుకొని పని చేసేది ఆయనే కావున, దివ్యబలిపూజ, దివ్యసంస్కారాలను ఒక్కసారి చేస్తే చాలు, అవి సూచించు శాశ్వత ఫలాలను ప్రసాదిస్తాయి (*ex opere operato*). దైవార్చన సంజ్ఞలు సజీవ సంజ్ఞలుబీ అవి సూచించు క్రీస్తును కలిగి ఉంటాయి, మనకిస్తాయి. దైవార్చనలో పూజను అర్పించే గురువు, ప్రార్ధించే సంఘము, ఆచరించే సాంగ్యాలు, చేసే ప్రార్ధనలు, పాడే పాటలు, చదివే వాక్యం, చెప్పే మాటలు, చేసే పనులు (ధూపం వేయటం, గంటలు కొట్టటం, క్రొవ్వొత్తులు వెలిగించటం, ప్రదక్షణలు), భంగిమలు (చేతులు జోడించటం, చాచటం, మోకరించటం, నిలబడటం), దేవాలయ నిర్మాణం, పవిత్ర కళారూపాలు, అలంకరణలు (పూజ వస్త్రాలు, పాత్రలు, పూజాపీఠం, గురువు ఆసనం, పూజ పుస్తకం, సువిశేష గ్రంథం), ప్రార్ధించే గడియలు, ప్రార్ధనా ప్రదేశాలు, మననంతో కూడిన నిశ్శబ్దం, ఇవన్నీ అదృశ్యుడైన క్రీస్తును, క్రీస్తు పరమ రహస్యాన్ని, దాని రక్షణానుగ్రహాన్ని సూచించి అనుగ్రహించే పవిత్ర సంజ్ఞలు. అందువలన దైవార్చన క్రీస్తును కలుసుకొనే మహాద్భుత సందర్భంగా మారుతుంది.

### 2.1.6 దైవార్చనలో విశ్వాసుల భాగస్వామ్యం (సంఖ్యలు 14, 11, 21, 26, 32, 50):

విశ్వాసులందరు కలిసి పరస్పర భాగస్వామ్యంతో దేవుని ఆరాధిస్తేనే అది దైవార్చన అవుతుంది. అలా భాగస్వాములు కాకపోతే యధార్ధమైన క్రైస్తవులుగా జీవించలేరు. ఎందుకనగా, వారు నిజమైన క్రైస్తవ స్ఫూర్తిని పొందడానికి దైవార్చనే అనివార్యమైన మూలాధారం. అలానే దైవార్చన పరిపూర్ణ ఫలాలను వారికి అందజేయాలంటే, అందుకు విశ్వాసులు తమను తాము సిద్ధపరచుకొని, భక్తిశ్రద్ధలతో దైవార్చనలో పాల్గొనాలి. కావున దాని స్వభావాన్ని బట్టి, విశ్వాసులందరూ దైవార్చన వేడుకలలో భాగస్వాములు కావాలి, అనగా దేవుని

పట్ల ఆరాధనా భావంతో ఇష్టపూర్తిగా చైతన్యవంతంగా పాల్గొనాలి. ఇది జ్ఞానస్నానం పొందిన వారందరియొక్క హక్కు మరియు బాధ్యత (1 పేతురు 2:9). దీనిని సాధ్యం చేయటమే శ్రీసభ ప్రధాన లక్ష్యం. ఇది ఈ పత్రంలో ప్రతి అంశంలోనూ మరలా మరలా పునరావృతం కావటం చూస్తాము దైవార్చనోపదేశం, సంస్కృతీకరణ (inculturation), సామూహిక ఆరాధన, భాష, పవిత్ర గ్రంధ పఠనాలు, దివ్యపూజాబలి, దివ్యసంస్కారాలు, పవిత్ర గడియల ప్రార్థన, దైవార్చనా సంవత్సరం, పవిత్ర సంగీతం, కళలు.

వత్తాసు చేసేవారు, పూజ పఠనాలు చదివేవారు, వ్యాఖానం చదివేవారు, గాయక బృంద సభ్యులు, వివిధ పవిత్ర కళలు, పవిత్రాలంకరణలు చేసేవారు అందరూ దైవార్చన విధులను నిర్వహించేవారే ("మీరు వెళ్ళి మనము భుజించుటకు పాస్కభోజనము సిద్ధము చేయుడు. అతడు మీకు మేడ పైభాగమున అమర్చబడియున్న విశాలమైన ఒక గదిని చూపును. అచటనే మీరు భోజనము సిద్ధము చేయుడు.. వారు వెళ్ళి ... సిద్ధము చేసిరి." లూకా. 22:8, 12-13). ఎవరి పనిని వారు సంఘం మొత్తం యొక్క మేలుకై దైవార్చన స్ఫూర్తితో, భక్తితో, అంకితభావంతో, నైపుణ్యంతో చేయాలి. దైవార్చనలో విశ్వాసులందరూ భక్తిశ్రద్ధలతో ప్రార్థనలతో, భక్తి కీర్తనలతో, పలుకవలసిన జవాబులతో, దేహ భంగిమలు, సంజ్ఞలతో, ప్రార్థనాపూర్వకంగా పాల్గొనాలి.

## 2.2 కార్యాచరణ లేదా నిర్వహణ సూత్రాలు

అనుకున్నది సాధించటానికి ఏం చెయ్యాలి, ఏం చెయ్యగూడదు, ఎలా చెయ్యాలి, ఎలా చెయ్యగూడదు, ఎవరెవరు ఏం చెయ్యాలి, వారి పరిధి, మొదలగునవి స్పష్టంగా తెలిపే సూత్రాలివి. దైవార్చనా సంస్కరణల ప్రధాన ఉద్దేశ్యమైన 'దైవార్చనలో జరుగుతున్నది విశ్వాసులు అర్ధంచేసుకొని భక్తిశ్రద్ధలతో, ఆసక్తితో, ఇష్టంతో, నిండుగా, చైతన్యవంతంగా పాల్గొని' పరిపూర్ణ ఫలాలు పొందేలా చేయటానికి, కార్యాచరణ ఏంటి, ఏం చెయ్యాలో ఈ సూత్రాలు మనకు తెలియజేస్తాయి.

### 2.2.1 దైవార్చనా భాష (సంఖ్య 36, 54, 63, 101):

మొదటి నాలుగు శతాబ్దాలలో ఆనాటి సామాన్య ప్రజల వాడుక భాషయైన గ్రీకు భాష దైవార్చనా భాషగా ఉండేది. రోములో లతీను వాడుక భాషగా

అయినప్పుడు, అపోస్తుల కాలం నుండి దైవార్చన భాషగా వస్తున్న గ్రీకు భాషను విడిచిపెట్టడం కష్టమే అయినప్పటికీ, ప్రజల ప్రయోజనార్ధం వారికి అర్ధమయ్యే లతీను భాషను దైవార్చనా భాషగా చేసుకోవటానికి శ్రీసభ సంకోచించలేదు. అదే సూత్రమును ఆదర్శంగా తీసుకొని, నాల్గవ శతాబ్దం నుండి 20వ శతాబ్దం వరకు దైవార్చన భాషగా కొనసాగిన లతీనును వదిలిపెట్టడం అంత సులువైన విషయం కానప్పటికీ, మరొకమారు శ్రీసభ ధైర్యం చేసి ప్రజల ప్రయోజనార్ధం, దేవునితో సొంత భాషలో సులువుగా సంభాషించుటకు వీలుగా ప్రాంతీయ భాషలను ఉపయోగించుటకు అనుమతి జారీచేసింది. ఇది ఒక సంచలనాత్మకమైన నిర్ణయం. దీనిని హర్షించినవారున్నారు, వ్యతిరేకించినవారూ ఉన్నారు. 6వ పాల్ జగద్గురువులు పునీత అగస్టీను గారి మాటలను గుర్తు చేస్తూ, "దైవార్చన ప్రజలకు అర్ధంకానిదిగా ఉండటంకంటే విధ్యావంతులచే మనం విమర్శింపబడటమే మంచిది", ఈ సంచలనాత్మక నిర్ణయాన్ని ప్రవేశపెట్టారు. మరొక వైపున లతీనును ప్రామాణిక గ్రంధాల రూపంలో కాపాడుకుంటూ, దైవార్చనకు చక్కగా సరిపోయే దాని సహజ శైలిని, ఒరవడిని ప్రాంతీయ భాష అనువాదాలలో శ్రీసభ కొనసాగిస్తూనే ఉంది. భక్తిని, విశ్వాసమును పుట్టించి, పెంపొందించే లతీను పాటలను, ప్రార్ధనలను నేర్చుకొనుటకు ప్రోత్సహిస్తూనే ఉంది.

### 2.2.2 పవిత్ర గ్రంథం (సంఖ్యలు 7, 24, 33, 35, 51, 52, 92, 121):

దైవార్చనలో మొదటి భాగం దైవవాక్యార్చన (దేవుని వాక్కు), రెండవ భాగం కృతజ్ఞతార్చన్‌దివ్యసంస్కారం. ఇది మనకు తెలియనిదేమీ కాదు. కాని ఆదినుండి ఉన్న ఈ విధానం మధ్యకాలాల్లో నిర్లక్ష్యానికి గురయ్యింది, దైవవాక్యార్చన దాదాపు కనుమరుగైపోయింది. కావున దానిని మహాసభ తిరిగి పునరుద్ధరిస్తూ, 'దేవుని వాక్కు లేకుండా దైవార్చనా కార్యమేదీ ఉండకూడదనే' సూత్రం జారీచేసింది. క్రీస్తు ఆయన వాక్కులో ఉన్నాడని, దైవార్చనలో దేవుని వాక్కు చదవబడినప్పుడు ఆయనే మాట్లాడేదని (సంఖ్య 7), క్రీస్తు ఇంకా తన సువిశేషమును ప్రకటిస్తున్నాడని (సంఖ్య 33) తెలుపుతూ, అందుకనే దైవార్చనలో పవిత్ర గ్రంథం అత్యంత ప్రముఖమైనదని (సంఖ్య 24) బోధిస్తుంది.

పవిత్ర గ్రంథము ఒక దైవార్చన గ్రంథము. ప్రధానంగా దైవార్చనలో చదవబడుటకు ఉద్దేశింపబడిన గ్రంథము. దానిని మనము ఎక్కడైననూ పఠించవచ్చును, కాని దైవార్చనలో చదివినప్పుడే అది తిరిగి మరలా దేవుని సజీవ వాక్కు అవుతుంది, పరిపూర్ణంగా నెరవేరుతుంది. దేవుని వాక్కు అయిన క్రీస్తు (పవిత్ర గ్రంథము అనగా క్రీస్తే) మరియమాత గర్భంలో ప్రవేశించి శరీరధారియై మనమధ్య నివసించినట్లు, దైవార్చనలో శరీరమును ధరిస్తాడు, అనగా మనము ఆయనను చూడవచ్చు, వినవచ్చు, అర్థం చేసుకోవచ్చు, అక్కడ అది చదవబడి వివరించబడినప్పుడు మన హృదయములు ప్రజ్వరిల్లుతాయి. “నేడు మీ ఎదుట ఈ లేఖనము నెరవేరినది” (లూకా 4:21) అని ప్రభువన్నట్లు, దైవార్చనలో మన ఎదుట పవిత్ర గ్రంథ లేఖనములు నెరవేరతాయి. దైవార్చనలోని దాదాపు అంశాలన్నీ, అనగా ప్రార్థనలు, పాటలు, క్రియలు, సంజ్ఞలు పవిత్ర గ్రంథం నుండే ప్రేరణను, అర్థాన్ని పొందుకొనును. కావున సంస్కరణలు దాని పట్ల ప్రేమను భక్తిని మరింతగా కలుగ చేయాలి (సంఖ్య 24). దైవార్చనలో సాంగ్యమునకు, పఠించే దేవుని వాక్యాలకు మధ్య గల సంబంధం స్పష్టంగా వ్యక్తం కావాలి. కనుక సందర్భానికి తగిన పవిత్ర గ్రంథ పఠనాన్ని ఎంపిక చేయాలి. పూజ పఠనాలు, దైవార్చన సాంగ్యాల ఆధారంగానే ప్రతి పూజలో గురువు తప్పక ప్రసంగించాలి. “ప్రత్యేక దైవార్చనలను” (Bible services) ప్రోత్సహించాలి (సంఖ్య 35). పవిత్రగ్రంథ నిధులను ప్రజలకు సమృద్ధిగా తెరవాలి (సంఖ్య 51) అని పవిత్రసభ ఆదేశిస్తుంది.

### 2.2.3 దైవార్చనోపదేశం (సంఖ్యలు 14-19):

దైవార్చనా నూత్నీకరణ ఏదో కొన్ని నియమాలను యాంత్రికంగా పాటిస్తే సాధించగలిగే కార్యం కాదు. దానికి ఒక స్ఫూర్తి, చెయ్యాలనే మనస్సు, కోరుకొనే హృదయం, పట్టుదల, అంకితభావం ఉండి తీరాలి. అది జరగాలంటే దైవార్చనలో శిక్షణ తప్పనిసరిగా ఇవ్వాలి.

#### 2.2.3.1 ఆత్మల కాపరులకు దైవార్చనా శిక్షణ:

ఆత్మల కాపరులు (పీఠాధిపతులు, గురువులు) దైవార్చనా స్ఫూర్తితో నింపబడి, దాని శక్తిని రుచి చూసినవారై ఉండాలి. కావున ముమ్ముందుగా

వారికి దైవార్చనలో తర్ఫీదు ఇవ్వాలి. అప్పుడే వారు విశ్వాసులను ఆ స్ఫూర్తితో నింపగలుగుతారు. తర్ఫీదు కాలమునుండే గురువిధ్యాలయాలలో, మఠవాసుల శిక్షణా కేంద్రాలలో దైవార్చన అంశాన్ని సమర్ధులైన, శిక్షణపొందిన అధ్యాపకులచే ప్రధానమైన బోధనాంశంగా తప్పనిసరిగా నేర్పించాలి. వేదాంత, చరిత్ర, ఆధ్యాత్మిక, సంఘ పరిచర్య, చట్టం కోణాలనుండి సమగ్రంగా నేర్పించాలి. ఇతర బోధనాంశాలకు దైవార్చనకు మధ్యగల సంబంధాన్ని వివరించాలి. ఈ శిక్షణా కేంద్రాలు దైవార్చనా స్ఫూర్తితో నిండి ఉండాలి. వారికి పవిత్ర సంస్కారాల గురించి లోతైన అవగాహన కల్పిస్తూ, దైవార్చన నియమాలు పాటించడం నేర్పిస్తూ, పవిత్ర సాంగ్యాలు మరియు భక్తికృత్యాలను వారిచే నిర్వహింప చేస్తూ (దివ్యసత్ప్రసాద ఆరాధన నడిపించటం, పవిత్ర గడియల ప్రార్ధన చెప్పించటం, పవిత్ర సంగీతం పాడించటం, వాయించటం, జపమాల, స్లీవ మార్గము, ఇతర ప్రార్ధనలు చెప్పించటం,...) దైవార్చన వాతావరణంలో పెరిగేలా చేయాలి. అప్పుడే వారు ఆ రుచిని, స్ఫూర్తిని విశ్వాసులకు అందించగలరు.

### 2.2.3.2 విశ్వాసులకు దైవార్చనా శిక్షణ:

దైవార్చనానుభూతిని రుచి చూసినవారుగా, ఆత్మల కాపరులు విశ్వాసులకు తర్ఫీదునివ్వాలి. ఇది చేసేటప్పుడు వారి వయస్సు, పరిస్థితులను పరిగణనలోనికి తీసుకోవాలి. సరైన బోధనా పద్ధతిని అవలంబించాలి. కేవలం చెప్పటమే కాక, వ్యక్తిగత ఆదర్శంతో దైవార్చనలో మక్కువతో, తపనతో పాల్గొనుటకు ప్రేరేపించాలి. ఈ విధంగా దేవుని పరమరహస్యాలను విశ్వాసపాత్రులుగా ప్రజలకు పంపిణీ చేసిన వారగుదురు. ఉదాహరణకు తొలి శతాబ్దాలలో శ్రీసభ పితామహులు (సంఘకాపరులైన పీఠాధిపతులు పు. యెరుషలేము సిరిల్, పు. జాన్ క్రిసోస్టం, పు. ఆంబ్రోసు, పు. అగస్టీను,...) చేసిన విధంగా దివ్యసంస్కారాలకు విశ్వాసులను సిద్ధం చేయటం, అవి స్వీకరించిన వెనుక వారిలో ఏమి చోటుచేసుకున్నదో దైవార్చన ఆధారంగా వివిధ సాంగ్యాలను, సంజ్ఞలను, భంగిమలను,... వివరించటం చేయవలెను (mystagogical catechesis). దైవార్చన ప్రధానంగా దేవుదేవుని ఆరాధన అయినప్పటికీ, విశ్వాసులకిది ఉపదేశం కూడా అందిస్తుంది. ఎందుకనగా దైవార్చనలో దేవుడు తన ప్రజలతో మాట్లాడుతున్నాడు,

మరియు క్రీస్తు తన సువిశేషమును ఇంకా ప్రకటిస్తూనే ఉన్నాడు. దీనికి ప్రజలు పాట ప్రార్థన ద్వారా బదులిస్తారు. ఈ ప్రక్రియలో పాల్గొనే విశ్వాసుల విశ్వాసం పోషింపబడుతుంది. ప్రార్థనే, ప్రార్థించే విధానమే ఒక ఉపదేశం అవుతుంది. కావున సాంగ్యాలు సరళత్వం గాంభీర్యం కలగలిపి ఉండాలి. ప్రజలను దృష్టిలో పెట్టుకొని అవి చిన్నవిగా, స్పష్టముగా, సులువుగా అర్థంచేసుకోగలిగినవిగా ఉండాలి.

**2.2.4 దైవార్చనా సంస్కరణ:**

అనుకున్న లక్ష్యం చేరాలంటే చాలా దూరం, చాలా కాలం కలిసి ప్రయాణించవలసి ఉంటుంది. ఇది సులువుగా అయ్యే పని కాదు, కొద్ది కాలంలోనే జరిగే పని కాదు, కొంతమంది మాత్రమే చేసే పని కాదు. దీనిని నిదానంగా, సహనంతో, బుద్ధితో, కృషిని జోడించి, ఒక నిరంతర ప్రక్రియగా, నిర్ధిష్ట విధానంలో, పద్ధతిలో శ్రీసభ అంతా సమష్టిగా చేస్తేనే సాధ్యం చేసుకోవచ్చు. ఇలా చేసినప్పుడు పరిశుద్ధాత్మ నడిపింపుతో మనం తప్పక గమ్యం చేరతాము. కడన నూత్నీకరించబడిన దైవార్చన ఏర్పడుతుంది. అది తిరిగి ప్రజలకు దైవ రహస్యానుభూతినిస్తుంది, ఆ పరమ రహస్యంలో ప్రవేశించి వారి జీవితాలను నూత్నీకరించుకొనే అనుగ్రహం కలుగుతుంది. ఈ ఆశాభావంతో దైవార్చన సంస్కరణలు గతంలో జరిగాయి, ఇప్పుడు జరుగుతున్నాయి. కాబట్టే వాటిని మొదలుపెట్టినప్పటినుండి అనుకున్న లక్ష్యాన్ని అంచెలంచెలుగా చేరుకొని పరమరహస్యాల అనుభూతిని మనం పొందుకుంటున్నాము.

దైవార్చనా సాంగ్యాలను సంస్కరించటం, కొత్త సాంగ్యాలను రూపొందించటం, ప్రామాణిక గ్రంథాలు సిద్ధమైన తరువాత ప్రాంతీయ భాషల్లోకి తర్జుమా చేయటం, అవసరంలేని అంశాలను తొలగించటం, కాలక్రమంలో మరుగైపోయిన ఉపయోగపడేవానిని పునరుద్ధరించడం, పవిత్ర గ్రంథ నిధులను ప్రజలకు సమృద్ధిగా అందించటం, సంస్కృతీకరణ, దైవార్చనా సంవత్సరాన్ని ప్రక్షాళన చేసి క్రమంలో పెట్టటం, సంగీతాన్ని, కళలను, అలంకరణలను పవిత్రంగా ఉండేలా చూడటం, మొదలగు సంస్కరణ చర్యలు చేపట్టి

సాధించాలంటే స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్ళాల్సిందే. ఇందుకుగాను మహాసభ ఈ క్రింది నియమాలు చేసింది:

**a) దైవార్చన సంస్కరణల పరిధి (సంఖ్య 3):**

శ్రీసభలో అనేక దైవార్చన సాంప్రదాయాలు ఉన్నవి. ఇవి రోమను సామ్రాజ్యంలో ప్రముఖ పట్టణాలైన యెరుషలేము, రోము, కాన్స్టాంటినోపుల్, అలెగ్జాండ్రియా, అంతియోకులలో వృద్ధిచెందాయి. ఇవి ఆయా పట్టణాల పేర్లతోనే పిలవబడుచున్నవి. వీటిలో నుండి పుట్టిన ఉప సాంప్రదాయాలు కూడా ఉన్నవి. అలానే ఇటలీ దేశంలో, మిలాను పట్టణంలో 'ఆంబ్రోసియను' దైవార్చన సాంప్రదాయము ఇప్పటికీ ఉన్నది. వీటిని దృష్టిలో పెట్టుకొని మహాసభ సంస్కరణల పరిధిని నిర్ధేశించింది. దైవార్చన సాంప్రదాయాలు ఎన్నున్నప్పటికీ, అపోస్తుల కాలం నుండి వస్తున్న సత్సాంప్రదాయం మాత్రం ఒక్కటే ఉన్నది. కాబట్టి ఆ సత్ సాంప్రదాయమును ప్రామాణికంగా తీసుకొని సంస్కరణలు అందరూ చేపట్టాలి. ఇక్కడ ఇవ్వబడిన మార్గదర్శక సూత్రాలు అన్ని దైవార్చనా సాంప్రదాయాలకు వర్తిస్తాయి. ఆచరణ నియామాలు మాత్రం ప్రధానంగా రోమను దైవార్చనా సాంప్రదాయానికి వర్తిస్తాయి.

**b) పవిత్ర దైవార్చనయొక్క నియంత్రణాధికారం (సంఖ్య 22):**

ఇది సంపూర్ణంగా విశ్వశ్రీసభ అధిష్టానికే, అనగా జగద్గురువుల పీఠానికి, పాక్షికంగా అనుమతించబడిన మేరకు వారివారి పరిధిలో పీఠాధిపతులకు, పీఠాధిపతుల సమాఖ్యలకు మాత్రమే ఉంటుంది. వీరికితప్ప ఇక ఎవరికీ, గురువులకు గాని, విశ్వాసులకు గాని, మరెవరికిగాని సొంత అధికారంతో ఎటువంటి సవరణలు చేయటానికి అనుమతిలేదు.

**c) వివిధ ప్రత్యేక దైవార్చన సంఘాలనుకమీషన్స్ ని ఏర్పాటు చెయ్యాలి (సంఖ్యలు 44-46):**

ప్రతి మేత్రాసనంలో ఒక దైవార్చన సంఘం, పవిత్ర సంగీత సంఘం, పవిత్ర కళల సంఘం వేరువేరుగా గాని లేదా మూడు కలిపిగాని ఏర్పాటు చెయ్యాలి. ఎలా చేసినా అవి కలిసి పనిచేయాలి.

**d) దైవార్చన శిక్షణా కేంద్రాల ఏర్పాటు (సంఖ్యలు 15, 115, 127):**

ఈ సంస్కరణ పనికి యావత్ శ్రీసభంతా కూడ కదలాలి, పనికి పూనుకోవాలి. ఆత్మల కాపరులు మొదటిగా దైవార్చన స్ఫూర్తి కలిగి, తగిన శిక్షణ పొందుకొని, విశ్వాసులకు దైవార్చనోపదేశం చెయ్యాలిబీ వారు పాటలతో, ప్రార్ధనలతో, ఇచ్చే బదులుతో చురుగ్గా వేడుకల్లో పాల్గొనేలా సహాయపడాలి. విశ్వాసులు ఈ పయనంలో తమ ఆత్మలకాపరులతో కలిసి వారికి సహకరిస్తూ పాలిభాగస్తులు కావాలి. కావున దైవార్చనా బోధనా సంస్థలను నెలకొల్పాలి. పవిత్ర సంగీత ఉన్నతస్థాయి శిక్షణా సంస్థలను, పవిత్ర కళల్లో శిక్షణ ఇవ్వడానికి ప్రత్యేక సంస్థలను ఏర్పాటు చేసుకోవాలి.

**e) దైవార్చన మాధ్యమాల ద్వారా ప్రసారం (సంఖ్య 20):**

దైవార్చన సాంగ్యాలను ముఖ్యంగా దివ్యపూజను రేడియో టెలివిజన్ (ఇంటర్నెట్, యుట్యూబ్) మాధ్యమాల ద్వారా ప్రసారం చేసేటపుడు ఆయా సాంగ్యాల ఆధ్యాత్మిక ఔన్నత్యానికి, గౌరవానికి భంగం కలుగకుండా చూడాలి. ఈ బాధ్యతను దైవార్చన స్ఫూర్తిలో శిక్షణ పొందిన తగిన వ్యక్తికి అప్పగించాలి.

## II. దైవార్చన అంతర్భాగములు

దైవార్చనపై సంవిధానపత్రంలో 7 అధ్యాయాలలో 6 అధ్యాయాలు దైవార్చనలో అంతర్గత భాగాలైన దివ్యబలిపూజ, దివ్యసంస్కారాలు, శ్రీసభ సంస్కారాలు ఉపసంస్కారాలు, పవిత్ర గడియల ప్రార్ధన, దైవార్చన సంవత్సరం, పవిత్ర సంగీతం, పవిత్ర కళలు మరియు పవిత్రాలంకరణల గురించి తెలియచేయును. ప్రతి అధ్యాయంలో మొదట ఆయా భాగముల ప్రాముఖ్యతను వివరిస్తూ, రెండవ భాగంలో వాటి సంస్కరణ గురించి ఆదేశాలు పొందుపరచడమైనది. ఇప్పుడు ఒక్కొక్క భాగము గురించి ఈ పత్రం చెబుతున్న ముఖ్య విషయాలను తెలుసుకుందాం. ఇది ఆయా భాగాల ప్రాధాన్యతను మనకు వివరించి, వాటిని మనం మరింత ఎక్కువగా అర్ధం చేసుకొని వాటిలో భక్తివిశ్వాసాలతో పాల్గొనుటకు సహాయపడును.

## 1. పవిత్ర పరమరహస్యమైన దివ్యబలిపూజ (సంఖ్యలు 47-58):

శ్రీసభ ఆధ్యాత్మిక సంపదంతా దివ్యబలిపూజలోనే ఉన్నది. ఆ సంపద క్రీస్తే. మన విశ్వాసమంతా ఈ దివ్యబలిలోనే ఉన్నదిబీ ఇది మన విశ్వాస సారాంశం. దైవార్చన గురించి ఇప్పటివరకు చెప్పుకున్నదంతా పరిపూర్ణ స్థాయిలో దివ్యబలిపూజకు వర్తిస్తుంది. అందుకనే దైవార్చనంటేనే ప్రధమంగా దివ్యబలిపూజ. మిగతా దైవార్చన భాగాలన్నీ కూడా దివ్యబలిపూజతోనే ముడిపడి ఉన్నవి. పు. తామస్ అక్వైనాస్ మాటల్లో, ఇది "దివ్యసంస్కారాలకే దివ్యసంస్కారం" (Sacrament of Sacraments). అందుకనే దివ్యపూజలో పాల్గొనే విశ్వాసులు అపరిచితులుగానో, మౌనప్రేక్షకులుగానో ఉండకూడదు. కాని అంతరార్ధాలు తెలుసుకొని భక్తిభావముతో దివ్యబలిలో పాల్గొంటూ, పుణ్యఫలాలను అందుకోవాలి అని శ్రీసభ బోధిస్తుంది. మన విశ్వాసానికి, జీవితానికి, మూలం, కేంద్రం మరియు శిఖరం అయిన ఈ దివ్య సంస్కారం గురించి రెండవ అధ్యాయంలో మహాసభ చెబుతున్న నాలుగు అంశాలను ధ్యానపూర్వకంగా తెలుసుకుందాం.

### 1.1 దివ్యబలిపూజ ప్రభు ప్రేమకు చిహ్నం (సంఖ్య 47):

ప్రభువు తాను ఈ లోకమును వీడి తండ్రివద్దకు వెళ్ళవలసిన గడియ సమీపించినదని గ్రహించాడు. వెళ్ళేముందు ఈ లోకంలో ఉన్న తనవారికి వారిపట్ల తనకున్న గాఢమైన ప్రేమకు ఒక చిహ్నం ఇచ్చి వెళ్ళాలనుకున్నాడు (యోహాను 13:1). ఇలా తనవారితో ఎల్లప్పుడు ఉండాలనుకున్నాడు (సంఖ్య 7). కావున తాను తన శిష్యులతో భుజించిన చివరి భోజన సమయంలో సంస్కార రూపంలో దివ్యబలిని స్థాపించాడు. సిలువబలిలో తన స్నేహితులకోసం తన ప్రాణమును ధారపోస్తూ వ్యక్తపరచిన ఆయన గొప్ప ప్రేమకు చిహ్నామిది (యోహాను 15:13). తన నిత్య ప్రేమకు శాశ్వత జ్ఞాపిక, చిహ్నామైన ఈ ప్రేమ సంస్కారాన్ని తన జ్ఞాన శరీరమైన శ్రీసభకు, అనగా విశ్వాసుల సంఘానికి, అప్పగించాడు. ఈ సంస్కారాన్ని కొనియాడు ప్రతిసారీ శ్రీసభ ప్రభు ప్రేమను మననం చేసుకుంటుంది, అనుభవానికి తెచ్చుకుంటుంది, ప్రభు ప్రేమకుగాను కృతజ్ఞతలు అర్పిస్తుంది, తాను కూడా ఒక ప్రేమ సంస్కారంగా మారుతుంది.

ఆ విధంగా ప్రభువు తనను ప్రేమించినట్లు తాను కూడా ప్రేమించటం నేర్చుకుంటుంది, పరస్పర ప్రేమకలిగి జీవిస్తుంది, ఆ ప్రేమను తన జీవితంలో వివిధ రూపాలలో వ్యక్తపరుస్తుంది.

**1.2 ఇది సఖ్యతా సంస్కారం (సంఖ్య 47):**

దివ్యసత్ప్రసాదం యొక్క ప్రధాన ఫలం సఖ్యత. దివ్యసత్ప్రసాదం తీసుకోవటం వలన క్రీస్తుతో అన్యోన్య ఐఖ్యతా బంధం ఏర్పడుతుంది, రోజురోజుకూ అది పెరుగుతూ, బలపడుతుంది. "నా శరీరమును భుజించి నా రక్తమును పానము చేయువాడు నాయందును, నేను వానియందును ఉందుము'' (యోహాను 6:56). అందుకనే సత్ప్రసాద స్వీకరణకు దూరమైపోయిన విశ్వాసులను వారు పాల్గొనే ప్రతిపూజలో గురువు తరువాత సత్ప్రసాదమును తప్పక యోగ్యంగా స్వీకరించవలెను (సంఖ్య 55) అని మహాసభ తెలియజేస్తున్నది. ఒకే ప్రభుని శరీరరక్తములను స్వీకరించువారి మధ్య కూడా ఈ సఖ్యతా బంధం ఏర్పడి వారందరిని చివరికి క్రీస్తు యొక్క ఒకే శరీరంగా మారుస్తుంది (1 కొరింతీ. 10:16). అదే శ్రీసభ. పు. అగస్టీను గారు దీని గురించి మాట్లాడుతూ, "మీరు క్రీస్తు దేహం, ఆ దేహంలో సభ్యులు అయితే, ప్రభువు బల్లపై ఉన్నది మీ సంస్కారమేబీ అట్టి మీ సంస్కారాన్ని మీరు తీసుకొంటున్నారు. అది నీవే, దానికి నీవు "ఆమెన్" ("అవును ఇది నిజం") అని సమాధానం చెబుతావు... క్రీస్తు దేహంలో సభ్యుడవుగా ఉండు. అపుడు నీ 'ఆమెన్', నిజమవుతుంది" అని ఈ సఖ్యతా సంస్కారం గురించి చక్కగా చెప్పాడు.

**1.3 దివ్యబలిపూజలో సిలువబలి ఎల్లకాలం కొనసాగుతుంది (సంఖ్య 47):**

మానవాళిని రక్షించి, దేవునికి మహిమను చేకూర్చిన పరిపూర్ణమైన, దేవునికి సంప్రీతికరమైన ఏకైక బలి, క్రీస్తు సిలువబలి. ఈ రక్షణబలిని ఆయన మరల తిరిగి వచ్చేవరకు (రెండవ రాకడ) శాశ్వతం చేయటానికే సంస్కారబలిగా స్థాపించి శ్రీసభకు అప్పజెప్పాడు. ఈ సంస్కారబలి మనం సిలువబలిలో పాల్గొనుటకు ప్రభువే స్వయానా ఏర్పరచిన మార్గం. దీనిని కొనియాడునపుడెల్లా ఆయన సిలువబలి విజయం, గెలుపు పునఃప్రత్యక్షం చేయబడుచున్నవి (సంఖ్య

6). ఆ విధంగా ఆయన తిరిగి వచ్చేవరకు అన్ని యుగాలలో ఆయనే దివ్యబలిపూజలో అదృశ్యుడుగా ఉంటూ తన రక్షణకార్యాన్ని శ్రీసభ ద్వారా కొనసాగిస్తుంటాడు. ఈ విందులో క్రీస్తును భుజిస్తాము, అందువలన ఆయన రక్షణానుగ్రహంతో నింపబడతాముబీ ఇది మనకు నిత్యజీవిత వాగ్దానమును ఇస్తుంది. మన నిత్యజీవిత ప్రయాణానికి బలమును ఇచ్చే ఆహారమవుతుంది (జబథసబధసర). "నా శరీరమును భుజించి నా రక్తమును పానముచేయువాడు నిత్యజీవము పొందును. నేను అతనిని అంతిమ దినమున లేపుదును" (యోహాను 6:54). ఆయనను భుజించుట వలన, మన శరీరరక్తాలు ఆయన శరీరరక్తాలుగా మారి అమరమవుతాయి.

### 1.4 ఇది విశ్వాస రహస్యము (సంఖ్య 48):

అనగా మన విశ్వాసానికి రహస్యం ఈ దివ్యబలియే. కొనియాడబడు రహస్యమును ప్రకటిస్తూ ఈ మాటలు ప్రతి పూజలో గురువు చెబుతాడు. తండ్రి దేవునకు అర్పించబడు ఈ కృతజ్ఞతాబలిలో, నడిపూజలో కడరాభోజనములో ప్రభువు చెప్పిన పవిత్రీకరణ మాటలను పలకగా, పవిత్రాత్మశక్తిచే ప్రభు శరీరరక్తములుగా మారిన అప్పరసములను ఆశ్చర్యంతో చూస్తూ 'ఇది విశ్వాస రహస్యము' అని గురువు ప్రకటిస్తాడు. ఇది సంభ్రమాశ్చర్యాలతో ప్రకటించబడు విశ్వాసము. ఎందుకనగా ఇది మానవ అవగాహనకు మించిన సత్యం. దీనిని మనం విశ్వసించాలి. రుచి చూడాలి. ఈ దివ్యబలిపూజయే మన విశ్వాసము, విశ్వాస సారాంశమంతా. దివ్యబలిపూజయే ప్రధానంగా మన విశ్వాసమును పోషిస్తుంది, బలపరుస్తుంది.

## 2. ఇతర దివ్యసంస్కారాలు మరియు శ్రీసభ సంస్కారాలు (సంఖ్యలు 59-82)

### 2.1 దివ్యసంస్కారాలు (సంఖ్యలు 59-78) :

శ్రీసభ దైవార్చనా జీవితమంతా దివ్యబలిపూజ, దివ్యసంస్కారాల చుట్టూ తిరుగుతుంది (సంఖ్య 6). దివ్యసంస్కారాలు ప్రాథమికంగా చిహ్నాలు. దేవుడు ప్రసాదించు రక్షణానుగ్రహానికి అవి గుర్తులు. వీటిని కొనియాడుట ద్వారా కంటికి కనిపించని దైవానుగ్రహం కనిపించు రీతిలో సాంగ్యాల నిర్వహణ

ద్వారా మనకు ఇవ్వబడుతుంది. 13వ శతాబ్దానికి చెందిన పు. తామస్ అక్వైనాస్ గారు దివ్యసంస్కారాన్ని ఈ విధంగా వర్ణించాడు: "దివ్యసంస్కారమనగా దానికి ముందున్న దాన్ని, అనగా క్రీస్తు శ్రమలను, జ్ఞాపకం చేసుకొనే చిహ్నం క్రీస్తు శ్రమల ద్వారా మనకు ఇవ్వబడిన, మనలో నెరవేరిన అనుగ్రహాన్ని చూపించు చిహ్నంబీ ఆ శ్రమలు మనకు హామీగా ఇచ్చు భవిష్యత్తు మహిమను (నిత్య జీవితమును) ముందస్తుగా చూపించు చిహ్నం." దివ్యసంస్కారాలగురించి మూడు విషయాలు తెలుసుకుందాం.

## 2.1.1 ఇవి క్రీస్తుని సంస్కారాలు:

అనగా క్రీస్తుచే స్థాపించబడిన ఏడు సంస్కారాలు. క్రీస్తు ప్రక్కలోనుండి "రక్తము, నీరు" (యోహాను 19:34) రూపంలో పుట్టిన పరమరహస్యాలు. ఖచ్చితమైన అనుగ్రహ ప్రసాద సాధనాలు. రక్తములో ప్రాణమున్నట్లు వాటిలో ప్రాణమున్నది, సాక్షాత్తూ ప్రభుని జీవం వాని ద్వారా మనకు ఇవ్వబడుతుంది. తన సంస్కారాలలో క్రీస్తు ఉండి పనిచేస్తాడు (సంఖ్య 7). కాబట్టి పూజను అర్పించేది ఆయనే, వాక్కును ప్రకటించేది, బోధించేది ఆయనే, జ్ఞానస్నానమిచ్చేది ఆయనే. తన సంస్కారాలలో ఉండి క్రీస్తు మానవులను పవిత్రం చేస్తాడు. అందుకనే మనం ఆయనను తన దివ్యసంస్కారాలలో కనుగొందుము.

## 2.1.2 ఇవి శ్రీసభను నిర్మించు విశ్వాస సంస్కారాలు (సంఖ్య 59):

క్రీస్తు వీటిని స్థాపించి వీటి నిర్వహణను శ్రీసభకు, అనగా తన శరీరమునకు, అప్పగించాడు. అలా ఇవి శ్రీసభ సంస్కారాలుగా అయ్యాయి, శ్రీసభను నిర్మిస్తాయి, పెంచుతాయి. దీనిని చక్కగా వ్యక్తం చేస్తూ, పు. అగస్టీను, "దివ్యసత్ప్రసాదమే శ్రీసభను నిర్మించేది" అన్నాడు. క్రీస్తు అపోస్తలులను పంపుతూ, "మీరు ప్రపంచమంతట తిరిగి, సకలజాతి జనులకు సువార్తను బోధింపుడు. విశ్వసించి జ్ఞానస్నానము పొందువాడు రక్షింపబడును" (మార్కు 16:15-16) అన్నాడు. అంటే ముందుగా వాక్యం బోధింపబడాలి, విన్నవారు క్రీస్తును విశ్వసించాలి, అప్పుడే జ్ఞానస్నాన సంస్కారం, ఇతర సంస్కారాలు ఇవ్వబడతాయి. అందుకనే త్రిత్వేక దేవునియందు విశ్వాసం ప్రకటించిన తరువాతనే జ్ఞానస్నానం ఇవ్వబడుతుంది. జ్ఞానస్నానం పొందటానికి నీరుంటే

సరిపోదు, క్రీస్తునందు విశ్వాసముండాలి. ఇతియోపియా ఉద్యోగి "యేసుక్రీస్తు దేవుని కుమారుడని విశ్వసిస్తున్నాను" అని బదులు పలికిన తరువాతనే ఫిలిప్పు అతనికి జ్ఞానస్నానమిచ్చాడు (అపో.కా. 8:36-38). జ్ఞానస్నానంలో ప్రకటించిన విశ్వాసాన్ని దివ్యసంస్కారాలు ప్రతి దినము పోషిస్తూ, బలపరస్తూ, ప్రకటిస్తాయి. శ్రీసభ ప్రార్ధనలోనే ఆమె విశ్వాసమున్నది. అనగా ప్రార్ధనా విధానంలోనే విశ్వాసం వ్యక్తం చేయబడుతుంది. అదే ఆమె ప్రకటన కూడా అవుతుంది. ఆమె ప్రార్ధించినట్లే విశ్వసిస్తుంది, విశ్వసించినట్లే ప్రార్ధిస్తుంది, జీవిస్తుంది (*lex orandi, lex credendi, lex vivendi*).

## 2.1.3 ఇవి రక్షణ అనుగ్రహ శక్తి సంస్కారాలు (సంఖ్య 59):

దివ్యసంస్కారాలకు శక్తి లభించేది పాస్కా పరమరహస్యమునుండియే. పాస్కాపరమరహస్యమే వీటియొక్క కేంద్రబిందువు. క్రీస్తే వానిలో పనిచేస్తాడు కాబట్టి వాటిని ఒక్కసారి ఆచరిస్తే చాలు అవి శాశ్వత ఫలితాలనందిస్తాయి (*ex opere operato*). క్రీస్తుని రక్షణకార్య ఫలం వల్ల అవి సంపూర్ణ ఫలాలనందిస్తాయి. దాని ఫలితం దానిని చేసే వాని మంచితనం మీద ఆధారపడి ఉండదు, క్రీస్తుపైన మాత్రమే ఆధారపడి ఉంటుంది. కావున వాటిని ఆచరిస్తే చాలు ఫలం తథ్యం అంటుంది శ్రీసభ. అయితే ఆ ఫలాలు తమ స్వంతం కావాలంటే విశ్వాసులు వాటిని సిద్ధపడి యోగ్యంగా స్వీకరించాలి (సంఖ్య 11).

## 2.2 శ్రీసభ సంస్కారాలు లేదా ఉపసంస్కారాలు (సంఖ్యలు 60-61, 79-82):

క్రీస్తు ఏడు దివ్యసంస్కారములను స్థాపించినట్లే, ఈ దివ్యసంస్కారములను పోలినటువంటి ఉపసంస్కారాలను శ్రీసభ స్థాపించింది. ఇవి కూడా పవిత్ర చిహ్నములే. దివ్యసంస్కారాలకు భిన్నంగా ఇవి తమంతట తాము ఫలాలను ఇవ్వలేవు. దివ్యసంస్కారాలు ఇచ్చు రక్షణ ఫలాలను పొందుకొనుటకు విశ్వాసులను సిద్ధం చేస్తాయి. శ్రీసభ ప్రార్ధన ద్వారా కలుగు ఆధ్యాత్మిక ఫలాలను అవి సంజ్ఞలుగా సూచిస్తాయి. అవసరాన్ని బట్టి శ్రీసభ కొత్త ఉపసంస్కారాలను స్థాపిస్తుంది.

శ్రీసభ సత్యోపదేశం చెబుతున్నట్లు, 'శ్రీసభలోని కొన్ని సేవలను, కొన్ని జీవనస్థితులను, క్రైస్తవజీవనంలోని పలురకాల పరిస్థితులను, మనిషికి ఉపయోగపడే అనేక వస్తువులను పవిత్రీకరించడానికి ఉపసంస్కారాలు స్థాపించబడినవి. వాటిలో దేవుని వాక్కు, ప్రార్ధన రెండూ ఉంటాయి వాటితో పాటు ఒక ప్రత్యేక చిహ్నం ఉంటుంది (చేతులు చాపటం, సిలువ గురుతు, పవిత్ర జల ప్రోక్షణ,..) ('కతోలిక శ్రీసభ సత్యోపదేశం', సంఖ్య 1668). ఉపసంస్కారాలు జ్ఞానస్నాన యాజకత్వమును ఆధారంగా చేసుకొని ఏర్పాటుచేయబడినవి. అనగా శ్రీసభ అనుమతించిన మేరకు జ్ఞానస్నానం పొందినవారు, పీఠాధిపతులకు, గురువులకు, డీకనులకు కేటాయించబడినవితప్ప, మిగతా దీవెన ప్రార్ధనలు చేయవచ్చును. అందుకనే మహాసభ కొన్ని ఉపసంస్కారాలు, కనీసం కొన్ని ప్రత్యేక సందర్భాల్లోనైనా శిక్షణపొందిన సామాన్య విశ్వాసులు ఇవ్వటానికి పీఠాధిపతులు అనుమతించు ఏర్పాటు చెయ్యాలి (సంఖ్య 79) అని అంటుంది.

కథోలిక శ్రీసభ సత్యోపదేశం, ఉపసంస్కారాలను రెండు రకాలుగా చూస్తుంది. వాటిలో ప్రథమ స్థానంలో దీవెనలు, రెండవ స్థానంలో దుష్టశక్తులను పారద్రోలే ప్రార్ధనలు ఉన్నాయి. వీటిలో వ్యక్తులపై, భోజనంపై, వస్తువులపై, స్థలాలపై ఒసగే దీవెనలు ప్రధాన స్థానంలో ఉంటాయిబీ దేవునికోసం వ్యక్తులను, వస్తువులను ప్రతిష్టించటం ఉదాహరణకు, మఠాధిపతి, మఠాధిపతురాలు, కన్యల ప్రతిష్ట, మఠ ప్రవేశ ప్రమాణ అర్చనాకాండబీ శ్రీసభలోని కొన్ని రకాల పరిచారకుల ఏర్పాటు: పాఠకులు, బలిపీఠం పరిచారకులు, ఉపదేశులు, వస్తువులకు సంబంధించినవి: దేవాలయ ప్రతిష్ట, బలిపీఠ ప్రతిష్ట, పవిత్ర తైలాలు, పూజ పాత్రలు, గంటలు, భూస్థాపన క్రమము, పునాది రాయిని ఆశీర్వదించటం, నూతన గృహమును ఆశీర్వదించటం, ఆహారమును దీవించటం, వాహనాలను దీవించటం, విత్తనములను ఆశీర్వదించటం, స్వరూపములు, జపమాలలు ఆశీర్వదించటం, సిలువను, పూజపాత్రలను, పూజవస్త్రములను, పూజ పుస్తకములను ఆశీర్వదించటం, మానికొమ్మల ఆదివారం రోజున

ప్రమానికొమ్మలను ఆశీర్వదించటం, విభూతి బుధవారం నాడు విభూతిని ఆశీర్వదించటం, మొదలగునవి చాలానే ఉన్నవి.

## 3. దైవార్చనా గడియలు, దైవార్చనా సంవత్సరం, పవిత్ర కళలు, పవిత్ర సంగీతం మరియు పవిత్రాలంకరణలు (సంఖ్యలు 83-130):

దైవార్చన దివ్యబలిపూజకు, దివ్యసంస్కారాలకు, ఉపసంస్కారాలకు మాత్రమే పరిమితం కాదు. దైవార్చన గడియల ప్రార్ధన, దైవార్చన సంవత్సరం, పవిత్ర సంగీతం, పవిత్ర కళలు మరియు పవిత్రాలంకరణలు కూడా దైవార్చనలో భాగాలే. అది ఎలాగో వివరంగా చూద్దాం. ఇది తెలియాలంటే ముందుగా క్రీస్తు మనుష్యావతారం గురించి మరియు దైవార్చనలో సమయం, స్థలం యొక్క ప్రాముఖ్యత గురించి తెలుసుకోవాల్సి ఉంటుంది.

### 3.1 క్రీస్తు మనుష్యావతార పరమ రహస్యం దైవార్చన సమయం, స్థలం (సంఖ్య 83) :

మనుష్యావతార పరమరహస్యం ద్వారా దేవుడు భూలోక సమయంలోకి, మానవ చరిత్రలోకి ప్రవేశించాడు. బెత్లెహేములో జన్మించాడు, నజరేతులో పెరిగాడుబీ యూదా, గలిలీయ ప్రాంతాలలో సంచరించాడుబీ మెస్సయ్యాగా ప్రజలకు బోధించాడు, రోగులను స్వస్థపరచాడు, దుష్టశక్తులచే పీడింపబడువారిని విమోచించాడు, అద్భుత కార్యాలు చేసాడు, వారితో కలిసి ప్రార్ధించాడు, పండుగలలో పాల్గొన్నాడు. యాజకుడుగా అందరికోసం సిలువలో తనను తాను బలిగా అర్పించుకుంటూ, దేవునికి సంపూర్ణ ఆరాధనను సమర్పించాడుబీ సమాధి చేయబడ్డాడు, మూడవ రోజున సమాధినుండి లేచాడు, శిష్యులకు కనిపించాడు, మోక్షారోహణమయ్యాడు, పరిశుద్ధాత్మను శిష్యులపైకి పంపించాడు. దీనిని మనం "క్రీస్తు సమయం" అని పిలవవచ్చు, అనగా మెస్సయ్యాగా, యాజకుడుగా రక్షణకార్యమును నెరవేర్చటానికి మనుష్యావతారమెత్తిన దేవుడైన క్రీస్తు భూలోకంలో గడిపిన సమయం. "క్రీస్తు సమయం" వలన, అనగా క్రీస్తు సమయంలో ప్రవేశించి జీవించటం వలన, సమయం రక్షణసమయంగా మార్పుచెందింది. దీనిని "శ్రీసభ సమయం" లేదా "దైవార్చన సమయం" అని పిలవవచ్చు. ఇలా క్రీస్తు సమయం నుండి శ్రీసభ సమయందైవార్చన సమయం

పుట్టింది. శ్రీసభ క్రీస్తుకు కొనసాగింపైనట్లే, శ్రీసభసమయం క్రీస్తుసమయాన్ని కొనసాగిస్తుంది. అందుకనే దైవార్చన అనగా యేసు క్రీస్తు అప్పుడు అక్కడ చేసినది శ్రీసభ ఇప్పుడు ఇక్కడ చేయటంబీ అలా దైవార్చన 'యేసుక్రీస్తు యాజకవిధిని నెరవేర్చటం' అవుతుంది. దేవుడు సమయంలో, స్థలంలో ప్రవేశించి మానవరక్షణకార్యమును నెరవేర్చాడు. కావున సమయము, స్థలము దేవుడు, మానవులు కలుసుకొను వేదికగా అయ్యాయి రక్షణ సమయాలుగా, స్థలాలుగా మారాయి. దైవార్చనలో పరిశుద్ధాత్మను పంపమని ప్రార్థించినపుడు, గతమున ఆయా స్థలాలలో, కాలాలలో ఆయన చేసిన రక్షణ, స్వస్థత కార్యాలను మన కాలంలో, మనమున్న స్థలంలో మరలా చేయుమని దేవుని అడుగుతున్నాము. అలా క్రీస్తు మనుష్యావతారం వలన, క్రైస్తవులు దైవారాధనకు ఉపయోగించే స్థలం, పర్యావరణం, సమయం రక్షణ అర్ధాన్ని పొందుకున్నాయి.

దైవార్చన సమయం, స్థలం గురించి మాట్లాడేటప్పుడు మనకు గుర్తుకు వచ్చేవి దైవార్చన గడియల ప్రార్ధన, దైవార్చన సంవత్సరంలోని దినములు, పండుగలు, కాలాలు, దేవాలయ నిర్మాణాలు, దైవార్చన అలంకరణలు, పవిత్ర సంగీతం, మరియు దైవార్చన జరిగే ప్రదేశం. దివ్యబలిపూజ, దివ్యసంస్కారాల దృష్ట్యానే గడియల ప్రార్ధన, మరియు దైవార్చన సంవత్సరం కొనియాడబడేది అని, దైవార్చన స్థలం పూజ, దివ్యసంస్కారాలు, గడియల ప్రార్ధన చేసుకోవటానికి అంకితం చేయబడును, అని మనం గ్రహించాలి. ఇప్పుడు దైవార్చన సమయం మరియు స్థలానికి సంబంధించిన దైవార్చన భాగాలను ఒక్కొక్కటిగా చూద్దాం.

### 3.1.1 దైవార్చన గడియల ప్రార్ధన (సంఖ్యలు 83-101):

క్రీస్తు ప్రభువు మరుష్యావతారమెత్తినప్పుడు ఈ భూలోకానికి పరిచయం చేసిన 'పరలోకంలో నిత్యమూ పాడే దైవ స్తుతిగీతమే' దైవార్చన గడియల ప్రార్ధన. కాబట్టి ఇది పరలోక స్తుతి గీతము, నిత్య యాజకుడు క్రీస్తు భూలోకములో ప్రవేశపెట్టిన గీతం. క్రీస్తు మానవులను తనతో కలుపుకొని అందరూ తనతో కలసి తనదైన ఈ దైవ స్తుతి గీతమును పాడేలా చేస్తాడు. తన యాజకవిధిని శ్రీసభ ద్వారా కొనసాగిస్తాడు. ఈ విధంగా శ్రీసభ ఎడతెగక దేవుని స్తుతించుటలో, సర్వ మానవాళి రక్షణకై ప్రార్థించుటలో నిమగ్నమవుతుంది

(సంఖ్య 83). ఈ స్తుతి గీతము ద్వారా రేయింబవళ్ళలో ప్రతి గడియ పవిత్రీకరించబడుతుంది. ఇది క్రీస్తు తన శరీరమైన శ్రీసభతో కలసి పరలోక పితకు చేసే ప్రార్ధన (సంఖ్య 84). ఈ ప్రార్ధన చేసేవారందరూ శ్రీసభ నామములో దేవుని సింహాసనం ఎదుట అహోరాత్రములు నిలచి ప్రార్ధిస్తారు (సంఖ్య 85; దర్శన. 7:15). కావున ఇది శ్రీసభ బహిరంగ ప్రార్ధన. ఇది భక్తిని, వ్యక్తిగతప్రార్ధనాభిలాషను పెంపొందిస్తుంది (సంఖ్య 90). ఈ గడియల ప్రార్ధనను, ముఖ్యంగా సాయంకాల ప్రార్ధనను ఆదివారాల్లో మరియు మహోత్సవ దినాలలో విచారణ దేవాలయాల్లో సమష్టిగా కొనియాడబడునట్లు ఆత్మలకాపరులు చర్యలు తీసుకోవాలి (సంఖ్య 100).

కీర్తనలు, దైవగ్రంథ పఠనాలు, శ్రీసభ పితామహులు, వేదాంత పండితులు, ఇతర ప్రసిద్ధ రచయితల రచనల నుండి చదవబడు పాఠాలు, భక్తి గీతములు, ప్రార్ధనలు కలిగి ఉండు దైవార్చన గడియల ప్రార్ధన, దివ్యబలిపూజ, సంస్కారాలవలె, శ్రీసభయొక్క అధికారిక ప్రార్ధన, అనగా దైవార్చనలో భాగము. పూజ, సంస్కారాలు రోజులో ఏదో ఒక సమయంలో కొనియాడబడతాయి. కాని దైవార్చన గడియల ప్రార్ధన ప్రభువు వేకువజామున (మార్కు 1:35), మధ్యాహ్నం (లూకా 23:44-46) సాయంసమయమున (మత్తయి 14:23), రాత్రంతా (లూకా 6:12) చేసిన ప్రార్ధనను ఒక నిర్దిష్ట విధానంలో, ప్రతి మూడు గంటలకు ఒకసారి చేయబడుతూ (ఉదయం 3, 6, 9 గంటలకు; మధ్యాహ్నం 12, 3 గంటలకు, సాయంత్రం 6 గంటలకు, రాత్రి 9, 12 గంటలకు) రోజంతా (రేయి, పగలు) సాగుతుంది. ఆ విధంగా శ్రీసభ ఎడతెగక ప్రార్ధిస్తుంది (1 తెస్సలో. 5:17). క్రీస్తు ప్రభుని ప్రార్ధనను కొనసాగిస్తుంది.

### 3.1.2 దైవార్చన సంవత్సరం (సంఖ్యలు 102-111):

సమయం ప్రాధాన్యతగా కలిగి చేసుకొనే మరొక ప్రార్ధన లేదా వేడుక దైవార్చన సంవత్సరం. దైవార్చన గడియల ప్రార్ధన రోజులోని గడయలకు ప్రాధాన్యత ఇవ్వగా, దైవార్చన సంవత్సరం రోజులకు, వారాలకు, కాలాలకు ప్రాధాన్యతనిస్తుంది. క్రీస్తు మనుష్యావతారం వలన, సమయం రక్షణసమయంగా మార్పుచెందింది. సమయమంటే క్రైస్థవులకు ఇక కేవలం ఒకదాని తరువాత ఒకటి వచ్చే పగలు, రాత్రి, వారం, నెల, సంవత్సరం కాదు. దైవార్చన ద్వారా

క్రీస్తు పరమరహస్య ప్రత్యక్షతను, రక్షణ శక్తిని చవిచూసే విశిష్ట సమయంగా మారింది.

శ్రీసభ క్రీస్తు ప్రభువు సాధించిన రక్షణ కార్యమును సంవత్సరం పొడవునా (దైవార్చన వృత్తంలో) భక్తిభావంతో స్మరిస్తుంది. ప్రతి ఆదివారము మరియు సంవత్సరానికోసారి ప్రభువు పునరుత్థానమును స్మరించి కొనియాడుతుంది. సంవత్సరకాలములో, క్రీస్తు పరమరహస్యమంతటినీ ఆయన మనుష్యావతారము, జననము నుండి మోక్షారోహణము, పెంతుకోస్తు వరకు మరియు ఆయన రెండవ రాకడను స్మరిస్తుంది (ఆగమన కాలము, క్రిస్మస్ మహోత్సవము, క్రీస్తు జన్మాష్టకము, క్రిస్మస్ కాలము, సామాన్య కాలము, తపోకాలము, పవిత్ర వారము, పాస్కా త్రయాహము, పాస్కామహోత్సవము, పాస్కా అష్టకం, పాస్కా కాలము, మోక్షారోహణము, పెంతుకోస్తు మహోత్సవము, సామాన్యకాలం). ఈ విధంగా ప్రజలు వాటిని అందిపుచ్చుకొని రక్షణానుగ్రహముతో నింపబడుటకు, విశ్వాసులకు ప్రభు దివ్యశక్తి ప్రాభవాల నిధులను వెల్లడిస్తుంది, సాక్షాత్కరిస్తుంది (సంఖ్య 102). సంవత్సరం పొడువునా క్రీస్తు పరమ రహస్యాలను స్మరించుకొనే ప్రక్రియలో, శ్రీసభ ప్రత్యేక ప్రేమతో దేవమాతను రక్షకుని తల్లిగా, క్రీస్తు విమోచన యొక్క శ్రేష్టమైన ఫలంగా, శ్రీసభ మాదిరిగా గౌరవిస్తుంది (సంఖ్య 103). ప్రభు పాస్కారహస్యముచే విమోచించబడి, పరలోకం చేరుకొని, మనకోసం ప్రార్థిస్తున్న, విశ్వాసులకు ఆదర్శవంతులైన పునీతులను, వేదసాక్షులను స్మరిస్తుంది (సంఖ్య 104).

మనుష్యావతారం ద్వారా ప్రభువు కాలంలో నెరవేర్చిన పనులన్నింటినీ మనం కాలెండరు రూపంలో పెట్టవచ్చు, ఎందుకంటే అవి సమయంలో, ఒక ప్రత్యేకమైన సంవత్సరంలో, నెలలో, వారంలో, రోజులో, పగల్లో, రాత్రిలో, గంటలో జరిగాయి. కనుక ప్రతి సంవత్సరం క్రీస్తు శకంలో, సంవత్సరంలో భాగమే. ఈ సత్యాన్నే జ్ఞాపకం చేస్తూ, పాస్కా జాగరణలో, గురువు పాస్కా కొవ్వొత్తిమీద ఒక సిలువను గీసి, "ఆల్ఫ" "ఒమేగా" అను గ్రీకు అక్షరములను గుర్తించి, ప్రస్తుత సంవత్సరపు నాలుగు అంకెలను గీయుచు ఈ మాటలను పలుకును: "నాడు నేడు ఉన్న క్రీస్తు, ఆదియును అంతమును ఆల్ఫ ఒమేగా

కాలములు అతనివే, యుగయుగములు అతని ఆధీనవే, అతనికే మహిమాధికారములు శాశ్వతముగా యుగయుగములు చెల్లునుగాక! ఆమెన్." కావున సంవత్సరంలో ఉన్న రోజులు, వారాలు, కాలాలు దేవుని రక్షణ కార్యానికి వేదికలవుతాయి. ఈ మామూలు సమయం, దేవుని సమయంగా, అనుగ్రహ సమయంగా మారుతుంది.

దైవార్చన ప్రత్యేక కాలెండరును అనుసరిస్తుంది. అది ఆగమనకాలపు మొదటి ఆదివారంతో మొదలై, సామాన్య కాలంలో ఆఖరి ఆదివారం రోజున కొనియాడబడు "విశ్వవిభుడైన క్రీస్తురాజు" మహోత్సవం తరువాత వచ్చే శనివారంతో ముగుస్తుంది. దైవార్చన సంవత్సరంలో ప్రభువు రోజైన ఆదివారము అసలైన మొదటి పర్వదినం. దైవార్చన సంవత్సరానికి ఆదివారమే పునాది మరియు కేంద్ర బిందువు. కావున ఇతరత్రా వేడుకలేమీ, అవి మరీ గొప్ప మహోత్సవాలైతే తప్ప, ఆదివారమునకు మించి ప్రాధాన్యతను పొందుకొనవు. అది క్రీస్తు పునరుత్థాన దినమునుండి జనించినది, అపోస్తులుల కాలం నుండి వస్తోన్న సత్ సాంప్రదాయం. ప్రతి ఏడవ రోజున శ్రీసభ పాస్కా పరమరహస్యమును కొనియాడుచున్నది. కావున ఆరోజున విశ్వాసులందరూ విధిగా నిండుపూజలో పాల్గొని, దేవునికి కృతజ్ఞతలు తెలపాలి (సంఖ్య 106).

### 3.1.3 పవిత్ర కళలు మరియు పవిత్రాలంకరణలు (సంఖ్యలు 122-130):

దైవార్చన గడియల ప్రార్థన, దైవార్చనా సంవత్సరం దైవార్చన సమయానికి చెందిన దైవార్చన భాగాలైతే, పవిత్ర కళలు, పవిత్రాలంకరణలు దైవార్చన స్థలానికి చెందిన భాగాలు. ఈ పత్రంలోని 7వ అధ్యాయం ఆరాధన స్థలాల గురించి, వాటికి సంబంధించిన పవిత్ర కళలు, అలంకరణల గురించి మాట్లాడుతుంది. మానవుల సృజనాత్మక ప్రతిభకు మేలిమి గురుతులైన ఈ కళారూపాలు, లలిత కళలు స్వభావరీత్యా దేవుని అనంత సౌందర్యమును వ్యక్తీకరిస్తాయి. అవి మానవుల మనస్సులను భక్తితో దేవునివైపు త్రిప్పుటకు దోహదపడతాయి (సంఖ్య 122). ఇంతకుముందే చెప్పుకున్నట్లు ప్రభువు మనుష్యావతార పరమరహస్యం వలన, ఆయన ఈ లోకంలో జీవించి సంచరించిన ప్రదేశాలు పవిత్ర ప్రదేశాలుగా, రక్షణ స్థలాలుగా అయ్యాయి. మన ఆరాధన స్థలాలైన దేవాలయాలు, జ్ఞానస్నాన స్థలాలు, దైవవాక్యాసనాపీఠం,

దివ్యమందసం, పాపసంకీర్తన గది, వాటి పర్యావరణం ప్రభు సంచరించిన స్థలాలను, ముఖ్యంగా మూడు స్థలాలు: పై మేడగదిని, కలువరి కొండను, ఆయన సమాధిని, గుర్తుచేస్తాయి, రక్షణ స్థలాలుగా మారతాయి సిలువలో వ్రేలాడిన క్రీస్తు దేహమే నిజమైన దేవాలయమని చూపిస్తాయి అలానే దైవార్చన ప్రదేశం విశ్వాసులకు ఆరాధన స్థలం మాత్రమే కాదని, క్రీస్తు శరీరమైన శ్రీసభయే క్రీస్తుకు నిజమైన ఆలయమని, శ్రీసభ దేవుని ఆలయమైన క్రీస్తుకు కనిపించు రూపం అని తెలియచేస్తాయి. దైవారాధనకు సమావేశమైన సంఘమనే ఆ సజీవ దేవాలయంలోనే దేవుడు తన ప్రజలను కలుసుకుంటాడు (మత్తయి 18:20) ఆత్మయందు సత్యమందు దేవుని ఆరాధించటం (యోహాను 4:24) అనేదానికి ఇదొక అర్థం. దేవాలయం, పూజాపీఠం, దివ్యమందసం, జ్ఞానస్నానపు తొట్టి, గర్భగుడి, పూజ వస్త్రాలు, పూజ పాత్రలు, పూజ పుస్తకాలు, ద్వారములు, ఆసనములు, బల్లలు, ఇలా దైవారాధన వినియోగానికి కేటాయించబడిన వస్తువులన్నీ పారలౌకిక్‌పరలోక సత్యాలకు గౌరవప్రదమైన, సుందరమైన ప్రతీకలుగా, సంకేతాలుగా ఉండాలి. కనుక ఏయే కళారూపాలు దైవార్చనోపయోగానికి యోగ్యమైనవో, అనువైనవో శ్రీసభ నిర్ణయిస్తుంది (సంఖ్య 122). పవిత్రాలంకరణల విషయంలోనూ, అవి దైవార్చనకు యోగ్యమైనవిగా ఉండునట్లు జాగ్రత్త తీసుకోవాలి. వాటిని ఆధ్యాత్మిక సౌందర్యానికి ప్రతీకలుగా సద్వినియోగం చేసుకోవాలే తప్ప, ఆడంబరాలకు, ప్రదర్శనలకు మార్గాలుగా వాడుకోరాదు. అలానే క్రైస్తవ విశ్వాసానికి, నైతిక విలువలకు, భక్తి భావాలకు భంగకరమైన కళారూపాలను అనుమతించకూడదు, అలాంటివిగనక ఉంటే వాటిని దేవాలయాలనుండి, ఇతర పవిత్ర స్థలాలనుండి వెంటనే తొలగించాలి. దేవాలయ నిర్మాణాలు దైవార్చనకు అనువుగా, విశ్వాసులు పాల్గొనుటకు అనుకూలంగా ఉండాలి (సంఖ్య 124). దేవాలయాల్లో పవిత్ర స్వరూపాలను, చిత్రపటాలను ప్రతిష్టించే సత్ సాంప్రదాయమును కొనసాగిస్తూనే, వాటి సంఖ్య పరిమితంగా ఉండేటట్లు చూడాలి. శ్రీసభ ఆయా పుణ్యమూర్తులకు కల్పించిన గౌరవహోదాలకు తగిన క్రమంలోనే దేవాలయంలో వారి స్వరూపాల ప్రతిష్టాపన జరగాలి (సంఖ్య 125). దేవుని నివాసానికి చెందిన కళారూపాలను, అలంకరణలను అవి ధ్వంసం కాకుండా జాగ్రత్తగా కాపాడుకోవాలి (సంఖ్య 126).

ఒక దేవాలయాన్ని నిర్మించినపుడు దాని ప్రతిష్టకు సంబంధించిన వివరాలను శిలాఫలకంపై చెక్కి దానిని గోడలో పెట్టటం జరుగుతుంది. ఇది కేవలం ప్రతిష్టకు సంబంధించిన సమాచారాన్ని భద్రపరచటానికి మాత్రమే కాదుబీ దానికన్నా ముఖ్యమైన విషయాన్ని చదివేవారికి తెలియజేయటానికి అదేంటంటే, ఈ సామాన్య స్థలం పలానా తారీకున, పలానా పీఠాధిపతులచే, పలానా విచారణ గురువు కాలంలో దేవుని ఆలయంగా, దేవుని ఆరాధించుటకు సమావేశమయ్యే సంఘానికి నివాసంగా ఆశీర్వదించబడి పవిత్ర స్థలంగా మార్చబడింది. ఇకనుండి ఇక్కడ విశ్వాసులు దివ్యబలిపూజను కొనియాడుటకు, దేవుని వాక్కును వినుటకు, కలసి ప్రార్థించుటకు, దివ్యసంస్కారములను కొనియాడుటకు సమావేశమగుదురు. అంటే దీనిని ఇక ఇతర వ్యవహారాలకు, అపవిత్రమైన, లౌకికమైన కార్యకలాపాలకు వినియోగించకూడదు అని అర్థం. అలానే దేవాలయంలో ఉండే జ్ఞానస్నాన స్థలం క్రీస్తు సమాధిని మనకు గుర్తుచేస్తుంది. జ్ఞానస్నానం ద్వారా అక్కడ మనం క్రీస్తుతోపాటు సమాధిచేయబడి, ఆయనతోపాటు పునరుత్థానమవుతాము (రోమీ. 6:34). ఈ విధంగా, శ్రీసభ నియమించిన దైవార్చన కాలంలో, ఏర్పాటు చేసిన పవిత్ర స్థలాలలో క్రీస్తు తన విమోచన పనిని కొనసాగిస్తాడు. కావున దైవార్చన సమయం, స్థలం సంస్కారాలుగా పనిచేస్తూ, క్రీస్తు సమయాన్ని సూచిస్తూ, ఆయన మెస్సయ్యాగా, యాజకుడుగా నెరవేర్చిన రక్షణకార్యాన్ని మనమధ్య ప్రత్యక్షం చేస్తాయి, మనం దానిలో పాలుపంచుకొనే అవకాశాన్ని కల్పిస్తాయి.

### 3.1.4 పవిత్ర సంగీతం (సంఖ్యలు 112-121):

భక్తిలోనుండి పుట్టి, భక్తితో పాడే సంగీతమే, మరలా భక్తిని పుట్టిస్తుంది, ప్రార్ధనకు ప్రేరేపిస్తుంది. మాటలు వర్ణించలేని దేవుని, ఆయన పరమరహస్యాలను భక్తులు అనుభూతిచెంది లీనమవునట్లు చేయగలిగే శక్తి పవిత్ర సంగీతానికి, పాటకు ఉన్నది. పాడటం అంటే దేవుని చెంతకు ఎగరటం, పైకి ఎగసిపోవటం (16వ బెనెడిక్టు పోపుగారు). సంగీతం హృదయంతో మాట్లాడుతుంది, హృదయము నుండి మాట్లాడుతుంది. ఇది విశ్వభాష కాబట్టి ఇది అర్థం కానివారంటూ ఎవరూ ఉండరు. మాటలకు అలవికాని లోతైన

భావాలను, రహస్యాలను ఇది వ్యక్తం చేస్తుంది. అందుకనే "ఒక్కసారి పాడితే రెండు సార్లు ప్రార్థించినట్లు" అన్నాడు పు. అగస్టీను గారు. "సంతోషముతో ప్రభువును పూజింపుము. ఆనంద గీతములతో ఆయన సన్నిధికి రమ్ము" (కీర్తన 100:2). పండగంటే పాట ఉండాల్సిందే, అలానే దైవార్చన ఒక వేడుక, పండగ కాబట్టి పాట, సంగీతం తప్పక ఉండి తీరాలి. సంగీతం అనేది ఒక కళారూపం. ఇది ఒక ప్రార్ధన. శ్రీసభ యొక్క పవిత్ర సంగీత సాంప్రదాయం అన్ని కళారూపాలకంటెను గొప్పది, వెలకట్టలేని ఒక అమూల్యమైన నిధి. దీనికి ప్రధాన కారణం, దైవార్చనలో అది అవసరమైన అంతర్భాగం కావటమే. ఇది దైవార్చనలో అంతర్భాగం కావున, దైవార్చనకు ఉండవలసిన లక్షణాలు కలిగి, దైవార్చనకు ఉపకరించేదిగా ఉంటూ, దైవార్చన ఉద్దేశ్యాలను దేవుని మహిమపరచటం మరియు మానవులను శుద్ధిచేసి పవిత్రపరచటం నెరవేర్చేదిగా ఉండాలి (సంఖ్య 112). పాట, సంగీతం ప్రార్ధనకు, వాక్యానికి మరింత సామర్థ్యాన్ని చేకూర్చి, తద్వారా విశ్వాసులు సులువుగా భక్తితో పరవశులై దైవార్చన వేడుకల ద్వారా లభించు అనుగ్రహ ఫలాలను స్వీకరించుటకు తగు రీతిన సిద్ధపడునట్లు చేయవలెను. కావున అది పవిత్రంగా ఉండాలి (Pope Pius XII, *Tra le Sollecitudini*, Instruction on Sacred Music, November 22, 1903, nos. 1-2, 12).

కావున దైవార్చన సంగీతం గాయక బృందం, సంగీత దర్శకులు, వాయిధ్యపరికరాలు, ... భక్తిని ప్రేరేపించేదిగా ఉండాలి, దేవుని ఆరాధించుటకు మనసులను ఏకం చేసి, దేవుని వైపు తిప్పేలా, చూసేలా సహాయపడాలి. ఇందుకు దోహదపడని సంగీతానికి దైవార్చనలో చోటు ఉండకూడదు. గ్రెగోరియన్ బాణిసంగీతం ఈ లక్షణాలన్నీ పుష్కలంగా కలిగి రోమను క్రమంలో దైవార్చనకు అనువైన సంగీతంగా ఉన్నది. కావున దానికి సముచిత స్థానమును కల్పించాలి (సంఖ్య 116). దైవార్చన సంగీతం విశ్వాసులందరు పవిత్ర సాంగ్యాలలో చైతన్యవంతంగా పాల్గొనునట్లు దోహదపడాలి (సంఖ్య 114). అంటే భక్తి గీతాలు భక్తిని ప్రేరేపించేవిగా, సామాన్యులు సైతం నోరారా పాడుకుంటూ దేవుని ఆరాధించటానికి అనువుగా ఉండాలి. వీటి రచన కతోలిక సిద్ధాంతాలకు అనుగుణంగా జరగాలి ప్రధానంగా పవిత్రగ్రంధం, పవిత్ర దైవార్చనా భావాల ఆధారంగానే వాటిని రచించాలి (సంఖ్య 121).

## III. వాటికను మహాసభ దైవార్చన సంస్కరణలు
## నేటి దైవార్చన పరిస్థితులు

వాటికను మహాసభను ఒక పెంతుకోస్తు పండుగగా మనం చెప్పుకోవచ్చు. శ్రీసభ చేపట్టిన సంస్కరణలు, ముఖ్యంగా దైవార్చన సంస్కరణలు, ప్రతిరోజును ఒక నూతన పెంతుకోస్తుగా మార్చాయనడంలో అతిశయోక్తిలేదు. ప్రభువు మోక్షారోహణమైన తరువాత, తల్లి మరియమాతతో కలిసి అపోస్తలులు ఇతర విశ్వాసులు మొత్తం 120 మంది (వాటికను మహాసభలో 2450 మంది సభ్యులు) యెరుషలేములో (రోము నగరంలో) ప్రవేశించి పై మేడగదిలోనికి (పునీత పేతురు బసిలికా) వెళ్ళి ఒకచోట చేరి ఎడతెగక ప్రార్ధన చేయుచుండగా (శ్రీసభ ప్రార్ధన అయిన దైవార్చనను పరిశీలించటం వాటికను మహాసభ చేసిన మొట్టమొదటి పని) ప్రభువు వాగ్దానము చేసినట్లు పరిశుద్ధాత్మను వారిపైకి పంపెను, వారు కూర్చుండియున్న ఇల్లంతయు (శ్రీసభ) పరిశుద్ధాత్మతో నింపబడెను, వారందరు (వాటికను మహాసభలో పాల్గొన్న సభ్యులందరు) పరిశుద్ధాత్మతో నింపబడిరి. దీనికి కనిపించు సంకేతాలు ఆకాశము నుండి అకస్మాత్తుగా వేగముగా వీచిన బలమైన గాలి, దాని శబ్దము, నాలుకల రూపంలో అగ్నిజ్వాలలు, అన్యభాషలలో మాట్లాడటం. పరిశుద్ధాత్మ దేవుడు దిగివచ్చుటవలన చోటుచేసుకున్న రెండు ముఖ్య సంఘటనలు: పండుగ చేసుకోటానికి ఆకాశముక్రిందనుండు ప్రతిదేశమునుండి యెరుషలేముకు వచ్చిన దైవభక్తులందరు పై మేడగది దగ్గరకు రావటం (లూకా 22:12 క్రీస్తు ప్రభువు శిష్యులతో కలసి పాస్కా భోజనమును మేడ పైభాగమున భుజించుటబీ విశ్వాసులు దివ్యబలిపూజకు దేవాలయంలో సమావేశమవటం) దేవుడు చేసిన మహత్తర కార్యములనుగూర్చి (పాస్కా పరమరహస్యము) అపోస్తలులు (పేతురు పదకొండు మంది అపోస్తలులతో ం జగద్గురువులు పీఠాధిపతులతో కలిసి) చెప్పుచుండగా వారు తమ సొంతభాషలలో వినటం (అపో.కా. 2:7 ఇది వారిని కలవరపరచినది, ఆశ్చర్యానికి గురిచేసింది). పేతురు ప్రసంగమును (పాస్కా పరమరహస్యమును గూర్చి) వారి సొంతభాషలో వినుటవలన, దానిని అర్ధం చేసుకొనగలిగారు, పశ్చాత్తాపంతో "మేము ఏమి చేయవలెను?" అని

అడగగలిగారు. ఆరోజు రమారమి మూడువేలమంది జ్ఞానస్నానము పొంది శ్రీసభలో చేర్చబడ్డారు. జ్ఞానస్నానము పొందిన వారందరును అపోస్తలుల బోధయందును, సహవాసమందు, రొట్టెను త్రుంచుటయందు, ప్రార్థించుటయందును ఎడతెగక కొనసాగారు.

వాటికను మహాసభ దైవార్చనలో ప్రాంతీయ భాషల ఉపయోగమునకు ద్వారం తెరవడంతో, సాంగ్యాలను సరళం చేయటంతో దైవార్చనలో జరిగేది విశ్వాసులు సులువుగా అర్థం చేసుకొని నిండు భక్తిప్రపత్తులతో పాల్గొనగలుగుతున్నారు. దివ్యపూజలో, దివ్యసంస్కారాలలో ప్రభువొసగు రక్షణానుగ్రహమును పరిపూర్ణంగా పొందుకొనే అవకాశం కలిగింది. ఖచ్చితంగా శ్రీసభ దైవార్చన నిజంగా ఒక వేడుక అయింది, పెంతుకోస్తు అయింది, దేవుని కలుసుకొనే వేదిక అయింది. దీనిలో ఎటువంది సందేహం లేదు. అయితే దీనిని మరింత పటిష్టం చేసుకోటానికి, అందరికీ ఈ అనుగ్రహం దైవార్చన ద్వారా చేరటానికి, మన పూజలు ప్రార్థనలు, దైవార్చన ఇతర క్రైస్తవులకు, మానవులందరికి మనం ఇచ్చే బహుమానం కావటానికి, మన ప్రస్తుత దైవార్చన పరిస్తితులను ధ్యానం చేసుకుంటూ, ఎక్కడెక్కడ మనం మెరుగు పరచుకొంటే బాగుంటుందో ఈ పత్రంలో మహాసభ సంఘ పరిచర్యను, శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని చేసిన వివిధ ఆదేశాలు, సూచనల ఆధారంగా వీటిని ఎంతమేరకు ఆచరణలో పెట్టుకోగలిగాము, వాస్తవ ఆచరణకు ఎంత దూరంలో ఉన్నాము అనే అంశాలను కొన్నింటిని పరిశీలించుదాం, వ్యక్తిగతంగా ప్రశ్నించుకొని ధ్యానించుకుంటూ దైవార్చనలో పరిపూర్ణంగా పాల్గొని దైవానుభూతిని, రక్షణానుభూతిని పొందుకోవటానికి అడుగులు వేద్దాం.

## 1. దైవార్చనలో విశ్వాసుల భాగస్వామ్యం:

శ్రీసభ దైవార్చన సంస్కరణలు చేపట్టటానికిగల ముఖ్యమైన కారణం ద్వితీయ వాటికను మహాసభకు ముందు కాలంలో శతాబ్దాలపాటు దైవార్చన కేవలం గురువు మాత్రమే చేసుకొనే వ్యక్తిగత ప్రార్థనగా మారిపోవటం (సంఖ్య 26) గురువు చేస్తూ ఉంటే ప్రజలు అక్కడేం జరుగుతుందో సరిగా అర్థం కాక, లతీను భాష తెలియక అపరిచితులుగా, మౌన ప్రేక్షకులుగా (సంఖ్య 48)

చూస్తూ, వింటూ ఉండిపోవటం. కాని దైవార్చన దాని స్వభావ రీత్యా విశ్వాసులందరూ కలిసి కొనియాడే బహిరంగ ప్రార్ధన కాబట్టి దైవార్చనలో విశ్వాసులందరియొక్క భాగస్వామ్యమును, అపోస్తులులు మరియు వారి తరువాతి కాలంలో జరిగినట్లు పునరుద్ధరించటం, ప్రోత్సహించటమే అన్నింటికన్నా ముందుగా సాధించవలసిన లక్ష్యంగా (సంఖ్య 14) పెట్టుకొని దానికి అనుగుణంగా వాటికను మహాసభ సంస్కరణలు చేపట్టినది. ఈ లక్ష్యం ఎంతమేరకు నెరవేరిందో మన విచారణలను, క్రైస్థవ సంఘాలను చూస్తే అర్ధమవుతుంది. ఖచ్చితంగా ఈ సంస్కరణలు ఈ దిశగా అద్భుతంగా ఫలించాయని చెప్పవచ్చు. దైవార్చన (అపోస్తులుల మరియు వారి తదనంతర కాలంలో వలె) మరొక మారు శ్రీసభ అంతా కలిసి చేసుకొనే బహిరంగ ప్రార్ధనగా అవతరించింది. ఐతే ఇది ఒక నిరంతర ప్రక్రియ కాబట్టి సాధించవలసినది మన ముందు ఇంకా చాలా ఉన్నది, ఎప్పుడూ ఉంటూనే ఉంటుంది.

విశ్వాసులు దైవార్చనలో బాహ్యంగాను మరియు అంతరంగికంగాను పాల్గొనాలి (సంఖ్యలు 11, 19). ఇది ఎంతమేరకు జరుగుతుంది? పరిశీలించి చూద్దాం.

## 1.1 బాహ్యంగా పాలుపంచుకోవటం:

దైవార్చనలో విశ్వాసులందరూ భాగస్వాములేబీ అందరికీ ఎవరి పాత్ర వారికి ఉన్నది (సంఖ్య 28). ఖచ్చితంగా పాటలు, ప్రార్ధనలు, సంజ్ఞలు, శారీరక భంగిమలు (నిలబడటం, మోకరించటం, చేతులు జోడించటం,..) మొదలగు వాటి ద్వారా బాహ్యంగా దైవార్చనలో పాలుపంచుకోవటం పునరుద్ధరించబడింది (సంఖ్య 30), పెంపొందించబడుచున్నది. అయితే ఇంకా కొంతమంది వీటికి దూరంగానే ఉన్నారు అనేది మనకు కనిపించే సత్యం. కొంతమందే అన్నీ చేయటం, చేయటానికి ముందుకురావటం: పూజ పఠనాలు చదవటం, వత్తాసు చెయ్యటం, పాటలు పాడటం, విశ్వాసుల ప్రార్ధన చెప్పటం, పూజ ప్రార్ధనలు చెప్పటం, చందా పట్టటం, దేవాలయాన్ని అలంకరించటం, జ్ఞాన తల్లిదండ్రులుగా ఉండటం,...) మరి కొంతమంది అవకాశాలు రాకనో,

మనకెందుకులే అనుకొనో అసలేమీ చెయ్యకపోవటం, దైవార్చనకు దూరమైపోవటం జరుగుతూనే ఉంది. చాలామందికి పూజలో, దివ్యసంస్కారాలలో ఏం జరుగుతుందో ఇంకా తెలియదు పూజ ప్రార్ధనలు రావు, వచ్చినా చెప్పరుబీ నిండు పూజలో పాల్గొనరు. ఇది 'మా హక్కు' అని కొంతమంది వేరేవాళ్ళని చేయనివ్వకపోవటం, ఇది 'మీ బాధ్యత' అని మరికొంతమంది చెయ్యకపోవటం రెండూ కారణాలే. అటువంటి తప్పిపోయినవారిని వెదకి అవకాశమిచ్చి అందరూ భాగస్వాములగునట్లు చేయవలసిన బాధ్యత, అటువంటి సంస్కృతి అందరిలో రావాలి. ఆత్మలకాపరులు విశ్వాసులందరూ దైవార్చనలో నిజంగా భాగస్వాములయ్యే దిశగా వాటికను మహాసభ సూచించినట్లు వారికి ఉపదేశం చేయాలి, వ్యక్తిగత శ్రద్ధ తీసుకొని సహాయపడాలి. ఉదాహరణకు:

a) విశ్వాసుల ప్రార్ధనను చెప్పటానికి విశ్వాసులకు అవకాశమివ్వటం, వారిచే చెప్పించటం (సంఖ్య 53).

b) గాయక బృందంలో బాలబాలికలకు, యువకులకు, విశ్వాసులకు ఎక్కువమందికి అవకాశమిస్తూ, అవసరమైతే ఎక్కువ గాయకబృందాలను ఏర్పాటు చేసి ఒక్కో ఆదివారం ఒక్కో బృందానికి కేటాయించటం (కొన్ని విచారణల్లో గురువులు ఇలా చేస్తున్నారు).

c) పూజ పఠనాలు చదవటానికి విశ్వాసులను ప్రోత్సహించటం, దానికి తగు శిక్షణనిచ్చి వారిని సిద్ధపరచటం.

d) వివిధ దైవార్చన సేవలలో (పూజకు సిద్ధపరచటం – సాక్రిస్టన్ సంఖ్య 79 ఇచ్చిన వెసులుబాటు ప్రకారం పీఠాధిపతులు నిర్ణయిస్తే గురువులులేని చోట నిర్దేశించబడిన కొన్ని ఉపసంస్కారాలు (దీవెనలు) ఇచ్చుటకు, ...) సాధారణ విశ్వాసుల భాగస్వామ్యమును అవకాశమిచ్చి ప్రోత్సహించటం.

### 1.2 అంతరంగికంగా పాలుపంచుకోవటం:

చైతన్యవంతంగా పాల్గొనటం అంటే ఏదోఒకటి చెయ్యటంతో సమానం కాదు. పూజలో చైతన్యవంతంగా పాల్గొనటం అనే మాటను రూపొందించి, మొట్టమొదటిగా ఉపయోగించిన పునీత 10వ భక్తినాథ పాపుగారు

(1903-1914), దీనిని ఇలా వివరించాడు: "నువ్వు పూజలో చైతన్యవంతంగా పాల్గొనాలంటే పూజా పీఠంపై జరిగేది నీ కళ్ళతో, హృదయంతో, నోటితో అనుసరించాలి. ఇంకా, క్రీస్తు గురువు ద్వారా మరియు గురువు క్రీస్తు నామంలో ప్రార్థనలో చేప్పే మాటలతో నువ్వు గురువుతో ఏకీభవించి ప్రార్థించాలి. ఆ మాటలలో ఉన్న పవిత్ర భావాలతో నీ హృదయాన్ని కలపాలి.... ఇలా చేస్తేనే నువ్వు దివ్యబలిపూజను ప్రార్థించినట్లగును." కేవలం పెదవులతో కాకుండా హృదయంతో, త్రికరణశుద్ధిగా పాల్గొనాలి (సంఖ్య 11). పు. పాద్రె పియో గారి మాటలలో, "మరియమాత కలువరి సిలువ చెంతన నిలువబడి (ప్రభుని రక్షణ శ్రమలలో) పాల్గొనిన విధంగా పూజలో పాల్గొనాలి." ఆరాధన, భక్తి, భయం, సంభ్రమాశ్చర్యాలు, విశ్వాసం, ప్రేమ, స్తుతి, కృతజ్ఞతా మొదలగు అంతర్గత భావాలు లోపిస్తే దైవార్చన కేవలం ఒక మాటల చేతల ప్రక్రియగా మారిపోయే ప్రమాదమున్నది. పూజలో మనం పరిపూర్ణంగా, అనగా బాహ్యంగా అంతరంగికంగా పాల్గొంటున్నామా? ఎందుకు పాల్గొనలేకపోతున్నాము? అలా నిండుగా పాల్గొనటానికి మనం చేస్తున్న ప్రయత్నమేంటి?

**2. దైవార్చనోపదేశం (సంఖ్యలు 19,34):**

పిల్లలకు, పెద్దలకు సత్యోపదేశం బోధించటంలో 10వ భక్తినాద పోపుగారు ఒక గొప్ప ఆదర్శాన్ని చూపించారు. ఒక గురువుగా, పీఠాధిపతిగా, కార్డినల్గా, పోపుగారిగా సత్యోపదేశానికి పెద్ద పీట వేసి, తనే స్వయానా బోధించేవారు. ప్రార్థన, విశ్వాస జీవితంలో సోమరితనానికి, నిర్లక్ష్య వైఖరికి కారణం సత్యోపదేశం జరగకపోవటమే అని ఆయన గుర్తించారు, తగు చర్యలు చేపట్టారు. అలానే వాటికను మహాసభ, ఉపదేశం ద్వారా దైవార్చనకు ప్రజలను సిద్ధం చేయకపోతే ఎన్ని మార్పులు చేసినా ఉపయోగం ఉండదని ముందస్తుగా హెచ్చరిస్తూ, దీనిపట్ల ఆత్మలకాపరులు దృష్టిపెట్టాలని చెప్పింది. వాస్తవం ఏంటంటే సత్యోపదేశం నిర్లక్ష్యం చేయబడుచున్నది. దీనివలన సాంగ్యాలు, సంజ్ఞలు, ప్రార్థనలు అర్థంగాక దైవార్చనకు మిగతా క్రైస్తవుల ప్రార్థనా విధానానికి తేడా తెలియక ఏదైనా ప్రార్థనేగా అనే అపోహలో విశ్వాసులు పడుతున్నారు. ఆ విధంగా మరలా ప్రజలు దైవార్చనకు, శ్రీసభకు దూరం అవుతున్నారు. రెండవ

జాన్ పాల్ పోపుగారు అక్టోబరు 9, 1998 లో అమెరికా పీఠాధిపతులతో మాట్లాడుతూ, "దైవార్చనలో చేసిన మార్పులలో అనేకం వాటికి అవసరమైన వివరణ, ఉపదేశం ఇవ్వబడకుండానే చాలాచోట్ల జరిగాయి. అందువలన దైవార్చన స్వభావమే తప్పుగా అర్థం చేసుకోబడి, అనేక దుర్వినియోగాలకు దారి తీసింది", అని అన్నారు. సాంగ్యాలు సవరించి సరళం చేశారు, భాష మార్చారు, మాతృభాషలో పూజలు ప్రార్ధనలు జరుగుతున్నాయి, కొత్త ప్రామాణిక గ్రంథాలు ముద్రించారుబీ కాని వాటి గురించి ప్రజలకు సరైన వివరణ, ఉపదేశం ఆచరణలో అంతగా కనిపించటంలేదు. తొలి శతాబ్దాలలో శ్రీసభ పితామహులు చేసిన విధంగా సాంగ్యాలను, సంజ్ఞలను దివ్యసంస్కారాల స్వీకరణకుముందు తరువాత వివరించి సత్యోపదేశం చేయవలసిన ఆవశ్యకత ఉన్నది. అప్పుడే దైవార్చన విలువను గ్రహించి విశ్వాసులు భక్తితో శ్రద్ధతో పాల్గొంటారు, రక్షణ ఫలాలను పొందుకుంటారు. దీనిపట్ల ఆత్మలకాపరులు మరియు విశ్వాసులు శ్రద్ధ చూపించాలి.

### 3. దైవార్చనా నిర్వహణ:

దైవార్చన క్రీస్తు ఏర్పాటు చేసి శ్రీసభకు అప్పగించిన ప్రార్ధన. దీనిలో ఉన్న దైవాంశాలు (క్రీస్తుప్రభువుచేత స్థాపించబడినవి: ఉదాహరణకు, పూజలో గోధుమఅప్పమును ద్రాక్షారసమును ఉపయోగించటం, నడిపూజలో గురువు పలికే పవిత్రీకరణ మాటలు, మొదలగునవి) మార్పులేనివి. కాని మానవాంశాలు (శ్రీసభచే రూపొందించబడిన వివిధ సాంగ్యాలు, సంజ్ఞలు, ప్రార్ధనలు, మొదలగునవి) అవసరాన్నిబట్టి, మారుతున్న పరిస్థితులనుబట్టి శ్రీసభ మారుస్తుంది (సంఖ్య 21). ఐతే ఈ అధికారం ఇవ్వబడినవారు (సంఖ్య 22) శ్రీసభ అధిష్టానం అమోదం పొందాకే ఏ సవరణలైనా అమలుచేయవచ్చు. అంతేకాని, ఎవరిష్టం వచ్చినట్లు వారు దివ్యపూజాబలి, దివ్యసంస్కారాల క్రమమునుగాని, సాంగ్యాలనుగాని, ప్రామాణికగ్రంథాలలో ఉన్నది ఇంకేదైనాగాని మార్చటానికి వీలులేదు. ఎందుకంటే గురువు క్రీస్తు ప్రతినిధిగా, శ్రీసభ ఏర్పాటు చేసిన ప్రతినిధిగా శ్రీసభ ప్రార్ధనను శ్రీసభ నియమాల ప్రకారం నిర్వహిస్తాడు. అది తన సొంత రూపకల్పన కాదు, అతను దానిని కనిపెట్టినవాడు కాదు, కాబట్టి

క్రీసభ సేవకుడుగా విధేయించాలి (2వ జాన్ పాల్ పోపుగారు). దైవార్చనను ఒక ప్రొటెస్టెంట్ ప్రార్ధనగా చెయ్యటం, ప్రజలచేత “క్రీస్తు ద్వారా, క్రీస్తుతో, క్రీస్తునందు”, అను మహాస్తుతిని (డోక్సోలాజి) తనతో కలిసి పాడించటం, తపోకాలంలో అల్లెలూయా చెప్పటంపాడటం, భక్తిప్రదమైన నిశ్చబ్దానికి చోటు కల్పించకపోవటం ( ప్రసంగం తరువాత మరియు దివ్యసత్ప్రసాదం స్వీకరించిన తరువాతబీ చూడుము, ‘దివ్యపూజ గ్రంధపు సాధారణ నియమావళి’, సంఖ్యలు 136, 164 ), దానిని ఒక ప్రదర్శనగా మార్చటం, మొదలగు దుర్వినియోగాలకు స్వస్థిపలకాలి. విశ్వాసులు కూడా దైవార్చన నియమాలు తెలుసుకొని గురువులతో సహకరించాలి.

## 4. దేవాలయము, పవిత్ర వస్తువులపట్ల భక్తిభావం:

దేవాలయము, పూజాపీఠం, దైవవాక్యాసనాపీఠం, పూజ వస్త్రాలు, పాత్రలు, మొదలగునవన్నీ దైవార్చనలో పరమరహస్యాలకు, పవిత్రతకు సంకేతాలే. అయితే వీటిపట్ల మన పూర్వీకులకున్న పవిత్ర భావం ప్రస్తుతం తగ్గుముఖంపట్టిందనే చెప్పాలి. ఉదాహరణకు దేవాలయాల్లో మనం వ్యవహరించే తీరు గుడిలో ప్రవేశించినప్పుడు ఒంటి మోకాలుమీద లేదా భక్తిభావంతో శిరస్సు వంచి దివ్యమందసంలో లేదా సిలువలో ఉన్న ప్రభువును ఆరాధించకపోవటం ప్రభువుతో మాట్లాడకుండా, ప్రభువును చూడకుండా, ఫోన్లో మాట్లాడటం, చూసుకోవటంబీ ఫొటోలు వీడియోలు తీసుకోవటం, అవి తీసేటప్పుడు వెనుక భాగమును దివ్యమందసంవైపు తిప్పి నిలబడటంబీ గర్భగుడిని ఒక స్టేజిలాగా, దేవాలయాన్ని ఒక ఫంక్షన్ హాలుగా చూడటంబీ చెప్పులు, బూట్లు వేసుకొని వెళ్ళటం (ఇది ఖచ్చితంగా క్రైస్తవేతరులను దిగ్భ్రాంతికి గురిచేసే విషయమే భారతదేశ సంస్కృతికి, పవిత్ర గ్రంధ బోధనకు విరుద్ధమే నిర్గమ 3:5) పూజ జరిగే పవిత్ర ప్రదేశంలో సన్మానకార్యక్రమాలు చెయ్యటం, రాజకీయనాయకులను స్టేజిమీద కూర్చోబెట్టినట్లు పీఠం ముందటి భాగంలో కూర్చోబెట్టడంబీ పూజాపీఠంమీద ఏదిబడితే అది పెట్టటంబీ కొన్ని చోట్ల (గ్రామాల్లో ముఖ్యంగా) పీఠమున్నచోటు ఒక గోడౌన్ను తలపిస్తుంది, ఇవన్నీ మనమున్నది దేవాలయంలోనేనా అనే సందేహం కలిగిస్తుంది. దేవుని

ఆలయముపట్ల ఆసక్తికలిగి ఎల్లప్పుడు దహించబడుచూ, అది ప్రార్ధనాలయముగా మాత్రమే ఉండునట్లు దాని పవిత్రతను కాపాడుతూ ప్రభువు కొరడాపేని అక్కడ జరగగూడనివి, ఉండగూడనివన్నింటిని యెరుషలేము దేవాలయమునుండి వెలుపలికి తోలి శుద్ధి చేసినట్లు (యోహాను 2:14-17) మనమును చేసుకోవాలి (సంఖ్య 124). నిరతము దేవుని సన్నిధిలో ఉండు దేవదూతలు సైతం తమ రెక్కలతో తమ ముఖమును, క్రింది భాగమును కప్పుకొని ఆయనను చూచుటకు సాహసింపక భయభక్తులతో మెలగునట్లు (యెషయా 6:2) దేవుని ఆలయంలో మనం నడుచుకొనే తీరును, దైవార్చన ఉపయోగానికి నివేదించబడిన పవిత్ర వస్తువులను పూజ వస్త్రాలు, పాత్రలు మనం చూసుకొనే తీరును సంస్కరించుకోవాలి. పవిత్ర వస్తువులకు, లౌకిక వస్తువులకు మధ్య తేడా లేదన్నట్టుగా వ్యయహరించకుండా మహాసభ ఆదేశాల మేరకు మన వైఖరి మార్చుకుందాం. పరమపవిత్రుడైన దేవుని పూజించుటకు ఉపయోగించే ప్రదేశాలను, వస్తువులను పవిత్రంగా ఉంచుకుందాం.

## 5. దైవార్చన సంగీతం:

ప్రజలు విశ్వాసంతో, భక్తితో, ఉత్సాహంతో పూజలో పాటలు పాడటం ఈ విధంగా మహాసభ ఆశించినట్లు విశ్వాసులు దైవార్చనలో భాగస్వాములు కావటం అందరు హర్షించవలసిన విషయం. అందుకు ప్రోత్సహిస్తూ, శిక్షణనిచ్చు ఆత్మలకాపరులను తప్పక అభినందించాలి. పవిత్ర సంగీతానికి సంబంధించి తీసుకోవలసిన జాగ్రత్తలు కొన్ని ఇక్కడ చూద్దాం. పాట, సంగీతం దైవార్చనలో అంతర్భాగం కాబట్టి ఆనాటి వాక్యానికి, పూజకు అనుగుణంగా పాటలను ఎన్నికచేసుకోవాలి. భక్తికీర్తన ఏదిబడితే అదికాకుండా, పూజపఠనాల పుస్తకంలో ఆనాడు ఉపయోగించటానికి ఇవ్వబడినదే అయితే పాడాలి, లేకపోతే చదవాలి. గాయక బృందం వారి సామర్ధ్యాన్ని, ప్రతిభను ప్రదర్శించటానికి కాకుండా, అందరూ భక్తి భావంతో పూజలో పాల్గొనునట్లు భక్తిలో లీనమై పాడాలి. ఎన్నికచేసుకొనే పాటలు విశ్వాసులకు తెలిసినవై, సులువుగా పాడగలిగినవై ఉండాలి. మరలా వారిని మూగవారిగా మార్చేవిగా ఉండకూడదు. వాయిధ్యపరికరాలు వాయించేవారు దైవార్చన స్ఫూర్తి కలిగి ఉండాలి. ప్రజల

దృష్టివారిమీదికి కాక దేవుని మీదకు మళ్ళేలా వ్యవహరించాలి (ఈ సందర్భంలో డబ్బులే ప్రధాన లక్ష్యంగా కలిగి సంగీతం వాయించేవారిని దైవారాధనకు పిలవటం సరికాదనే చెప్పాలి). లేకపోతే దైవార్చన సంగీతం యొక్క ఉద్దేశ్యం దెబ్బతింటుంది. అది కేవలం దేవుని ఎదుట చేసే ఒక గోలగానే మిగిలిపోతుంది (ఆమోసు 5:23).

## 6. ప్రజాహిత భక్తి కృత్యాలు:

వాటికను మహాసభకు ముందు కాలంలో పునీతుల పట్ల భక్తి శృతిమించి ఆదివారాలను, ప్రభు మహోత్సవదినాలను సైతము ఆక్రమించి త్రిత్వేకదేవునికన్నా వారే ముఖ్యులేమో అన్న భావన  కల్పించింది. కావున మహాసభ దైవార్చన సంవత్సరమును ప్రక్షాళన చేస్తూ, ఆదివారము ప్రభు పునరుత్థాన స్మరణ దినము కావున, అది అన్నింటికన్న ప్రధానమైనదని, ఆ రోజున పునీతుల పండుగలు చేయరాదని తెలియచేసింది (సంఖ్య 106). కాని కొన్ని సార్లు, ముఖ్యంగా తపోకాలంలో, మరీముఖ్యంగా పవిత్ర వారంలో కూడా పునీతులను, ముఖ్యంగా పాదువాపుర అంతోనివారిని స్మరిస్తూ ఆయన గౌరవార్థం పూజలు చేయటం, భక్తి కృత్యాలు ప్రోత్సహించటం జరుగుతుందిబీ ఇది  దైవార్చన స్ఫూర్తికి, తపోకాల ప్రాముఖ్యతకు విరుద్ధమైన చర్య. కావున భక్తి కృత్యాలు దైవార్చన కాలాలకు అనుగుణంగా ఉండేలా చూడాలి (సంఖ్యలు 13, 108), అవి దైవార్చనకు ప్రజలను దరిచేర్చేలా ఉండాలేగాని, దూరం చేసేవిగా, దైవార్చన ప్రాముఖ్యతను బలహీనపరచేలా ఉండకూడదు. పూజ పుస్తకంలో ఇవ్వబడిన దైవార్చనా దినముల ప్రాధాన్యతా పట్టిక క్రమమును ('దైవార్చనా సంవత్సరమునకును, కాలెండరునకును సర్వ సాధారణ నియమావళి', సంఖ్యలు 59-61) అనుసరించాలి. ఉదాహరణకు ప్రస్తుత దైవార్చన సంవత్సరంలో మంగళవార్త మహోత్సవం (మార్చి 25) పవిత్ర సోమవారం రోజున రాగా ఈ మహోత్సవాన్ని సైతం పాస్కా అష్టకం తరువాత వచ్చే సోమవారానికి (అనగా ఏప్రిల్ 8 కి) మార్చటం జరిగింది. కావున పవిత్ర వారంలో, పాస్కా అష్టకంలో పునీతులను స్మరించటం దైవార్చనకు బద్ధ విరుద్ధం అనేది గ్రహించి విశ్వాసులు, ఆత్మలకాపరులు ఇటువంటి తప్పు దారి పట్టించే సంస్కృతిని ప్రోత్సహించకుండా తగు చర్యలు తీసుకోవాలి.

## 7. వివిధ ఇతర అంశాలు:

### a) సాంకేతిక మాధ్యమాల ద్వారా పూజను ప్రసారం చేయటం:

ఈ విషయంలో నియంత్రణ, విధివిధానాలు ఉంటే బాగుంటుంది (సంఖ్య 20). ఒకప్పుడు దివ్యబలిపూజ చాలా గోప్యంగా నిర్వహించబడేది. జ్ఞానస్నానం పొందిన వెనుకే దివ్యబలిపూజలో రెండవ భాగమైన కృతజ్ఞతార్పనలో పాలుపంచుకోనిచ్చేవారు. జ్ఞానస్నానానికి సిద్ధపడుతున్నవారిని పూజపఠనాలు చదివి ప్రసంగించిన తరువాత బయటికి పంపేసేవారు. వారు వెళ్ళిన తరువాతే విశ్వాస సంగ్రహము, విశ్వాసుల ప్రార్థన (జ్ఞానస్నానం ద్వారా విశ్వాసులైన వారు చేసే ప్రార్థన) తో పూజ రెండవ భాగం మొదలయ్యేది. అటువంటిది సాంకేతిక మాధ్యమాలను వేదికగా చేసుకొని పూజను నిర్వహించటం దైవార్చన స్వభావానికి భంగం కలిగించేది కాదా అనేది అందరూ ఆలోచించాలి. ఇది యధేచ్ఛగా చేయటం వలన పూజను టివిలో, యుట్యూబ్ లో చూసాము, విన్నాము అని చెప్పుకొనే పదజాలానికి, వింత సంస్కృతికి అవకాశమిచ్చినట్లవుతుంది. పూజకు దేవాలయానికి వెళ్ళకపోయినా పర్వాలేదు, ఇంట్లో కూర్చొని టివిలోనో, ఫోన్లోనో చూస్తే సరిపోతుందిలే అని అనుకునేవారు ఎక్కువయ్యే ప్రమాదం ఉన్నది. అప్పుడు దైవార్చన విశ్వాసులందరూ కలసి చేసుకొనే ప్రార్థన అనే దాని స్వభావం మరొకమారు మరుగునపడుతుంది. ఇది ప్రభుని పరమరహస్యాలకు సంబంధించిన విషయం కావున, అందరు అత్యంత వివేకంతో వ్యవహరించవలసి ఉంటుంది.

### b) దైవార్చన గడియల ప్రార్థన:

ఇది ఉందని కూడా మన విశ్వాసులకు తెలియదు దీని అనువాదం కూడా ఇంకా జరగలేదు. మహాసభ సూచించినట్లు ఈ ప్రార్థనను ప్రజలకు ఇకనైనా పరిచయం చేసి ఆదివారాలలో, మహోత్సవదినాలలో ఈ ప్రార్థన చెప్పించటం మొదలుపెట్టటానికి తగు చర్యలు తీసుకోవాలి (సంఖ్య 100). అప్పుడే అది పూర్తి స్థాయిలో శ్రీసభ (విశ్వాసులందరి) ప్రార్థన అవుతుంది.

### c) వ్యాధిగ్రస్తుల అభ్యంగ సంస్కారము:

దీనిని నిర్లక్ష్యం చేయక సంవత్సరానికొకసారన్నా వృద్ధాప్యంలో ఉన్నవారికి,

తీవ్రమైన వ్యాధులతో బాధపడుచున్నవారికి దేవాలయంలో దివ్యపూజలో విశ్వాసులందరితో కలసి ఈ సంస్కారమును ఒక విచారణ వేడుకగా కొనియాడితే బాగుంటుంది. అలా రోగులలో, వృద్ధులలో ధైర్యాన్ని నింపి గొప్ప భరోసా ఇచ్చినట్లవుతుంది. అప్పుడు ఈ సంస్కారంపట్ల విశ్వాసులకు సరైన అవగాహన ఏర్పడి ఇది మరణావస్థలో ఉన్నవారికి మాత్రమే ఇచ్చేది అనే అపోహ తొలగి అనేకమంది కోరుకొనునట్లు దోహదపడగలదు. అలానే చివరి దివ్యసత్ప్రసాదం *(Viaticum)* ఇచ్చే విషయంలో కూడా ఆత్మలకాపరులు, విశ్వాసులు తగు శ్రద్ధ తీసుకొని మరణావస్థలో ఉన్నవారికి అది అందేలా చూడాలి.

### d) దివ్యసత్ప్రసాద స్వీకరణ:

'దివ్యపూజ గ్రంధపు సాధారణ నియమావళి', సంఖ్య 161లో దివ్యసత్ప్రసాదమును అప్పరూపములో మాత్రమే ఇచ్చినప్పుడు నాలుకమీదగాని, పీఠాధిపతుల సమాఖ్య ఆమోదముతో హస్తములో గాని స్వీకరించవచ్చు అని ఉన్నది. దివ్యసత్ప్రసాదమును హస్తములో స్వీకరించటం ప్రాచీన ఆచారం అయినప్పటికీ, నాలుకమీద తీసుకోవటాన్నే శ్రీసభ ఇష్టపడుతుంది. ఎందుకంటే నాలుకమీదకన్నా హస్తములో స్వీకరించినప్పుడు ప్రజల్లో దివ్యసత్ప్రసాదం పట్ల అగౌరవభావము, ఉదాసీనత, చులకనభావం పెరిగి పవిత్రభావము, విశ్వాసము తగ్గే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది (2వ జాన్ పాల్ పోపుగారు, *Dominicae Cenae,* సంఖ్య 11). కొరోనా వైరస్ కాలంనుండి దివ్యసత్ప్రసాదమును విశ్వాసుల చేతిలో పెట్టడం సాధారణ నియమంగా మారిందిబీ నోట్లో నాలుకమీద పెట్టడం దాదాపు అసాధారణమైపోయింది, నాలుకపై స్వీకరించాలని కోరుకొనే వారికి కూడా బలవంతంగా చేతిలోనే ఇవ్వడం జరుగుతుంది. కొరోనా ముప్పు ముగిసిన తరువాత మిగిలినవన్నీ సాధారణ స్థితిలోకి వచ్చాయి కాని, అసాధారణ పరిస్థితిలో చేపట్టిన ఈ దివ్యసత్ప్రసాద స్వీకరణ నియమం మాత్రం ఇంకా అలానే కొనసాగుతుంది. అయితే దివ్యసత్ప్రసాదమును చేతిలో కాకుండా నాలుకమీద ఇన్ని సంవత్సరాలుగా శ్రీసభ ఇచ్చే సత్ సాంప్రదాయానికి వెనుకున్న బలమైన కారణం: దివ్యసత్ప్రసాదం

సాక్షాత్తూ క్రీస్తు శరీరం కాబట్టి ఆయన శరీరానికి తెలిసీ తెలిసీ ఎటువంటి భంగం, అవమానం కలగకుండా నివారించటానికి. చేతిలో ఇవ్వటంకంటే నోటిలో నాలుకపై గురువే స్వయానా దివ్యసత్ర్పసాదమును పెట్టటం (గురుపట్టాభిషేకంలో గురువు హస్తములు అభిషేకింపబడుటకు ఇది ఒక ముఖ్యమైన కారణం) వలన దివ్యసత్ర్పసాదపు ముక్కలు ప్రమాదవశాత్తు క్రింద పడకుండా (దివ్యసత్ర్పసాద పళ్ళెరం కూడా ఉపయోగిస్తారు కాబట్టి) దాదాపు అరికట్టవచ్చు. కాని చేతిలో పెట్టటం వలన, చేతులు మారటం వలన క్రీస్తు శరీరమునకు, ముక్కలు క్రిందపడే ప్రమాదం పెరగటం వలన, కలిగే అవమానపు శాతం అధికమవుతుంది. కావున ఎంతో అనుభవంతో, వివేకంతో శ్రీసభ చాలా సంవత్సరాలపాటు సాధారణ పద్ధతిగా అవలంబించిన నాలుకమీద దివ్యసత్ర్పసాదమును ఇచ్చుటను సాధారణ పద్ధతిగా పునరుద్ధరించుకోవాలి. క్రైస్తవ విశ్వాసానికి మూలం, ఆధారం ఐన దివ్యసత్ర్పసాదం పట్ల ఉదాసీనత, అశ్రద్ధ తగదు. ఒకవేళ ప్రత్యేక పరిస్థితులలో దివ్యసత్ర్పసాదమును చేతిలో ఇవ్వవలసివస్తే సరైన ఉపదేశం చేసి పద్ధతి ప్రకారం ఇవ్వాలి. 4వ శతాబ్దంలో పు. యెరుషలేము సిరిల్ గారు ప్రజలకు దీని గురించి ఉపదేశం చేస్తూ, "(దివ్యసత్ర్పసాదమును స్వీకరించుటకు) నువ్వు సమీపించునపుడు నీ చేయి చాచో లేక వేళ్ళు తెరిచో కాకుండా, ఒక రాజును స్వీకరించిన విధంగా నీ కుడిచేతికింద నీ యెడమచేతిని ఒక సంహాసనముగా ఉంచి తీసుకోవాలి. నీ చేతిలో ఉంచబడిన రాజును ఏకొంంచెము పోగొట్టుకోకుండా జాగ్రత్తగా స్వీకరించాలి." (ఎడమచేతిలో కుడిచేతిని ఉంచాలిబీ కుడిహస్తంలో దివ్యసత్ర్పసాదమును గురువు పెట్టగా, స్వీకరించువారు మరలా తమ వేళ్ళతో పట్టుకోకుండా నాలుకతో నేరుగా తమ చేతిలోనుండి నోట్లోకి తీసుకోవాలిబీ అరచేతిలో దివ్యసత్ర్పసాద ముక్కలు, పొడి ఏమన్నా ఉన్నాయేమో జాగ్రత్తగా చూసుకొని, వాటిని కూడా నాలుకతో నోట్లోకి తీసుకోవాలిబీ పొరపాటునకూడా ఏ చిన్నముక్కా క్రిందపడకుండా అత్యంత జాగ్రత్త వహించాలి. అలా చెయ్యలేనప్పుడు నాలుకపై స్వీకరించటమే అన్నివిధాలా శ్రేయస్కరం). లేకపోతే ప్రభు శరీరమునకు, రక్తమునకు వ్యతిరేకంగా పాపం చేసినట్లేనని గుర్తుపెట్టుకోవాలి (1 కొరింతీ. 11:27). అమూల్యమైన, పరమపవిత్రమైన

ప్రభు శరీరమును మన కాళ్ళతో మనమే తొక్కినవారమవుతాము, (మత్తయి 7:6) ఆ విధంగా మనల్ని మనమే ప్రభు తీర్పునకు గురిచేసుకున్న వారమవుతాము (1 కొరింతీ. 11:29).

**e) హారతి:**

"క్రీస్తు ద్వారా, క్రీస్తుతో, క్రీస్తునందు", ఈ మహాస్తుతి పాడిన తరువాత సంస్కృతీకరణలో భాగంగా భారతదేశ సాంప్రదాయాన్ని అనుసరించి చేసే హారతి, విశ్వాసులకు దైవధ్యానంనుండి మరలి పరధ్యానంలోకి పోయే ప్రమాదం లేకపోలేదు (హారతి ఇచ్చే పిల్లలు కొన్నిసార్లు కథోలికులు కూడా కాకపోవటం, వారికి ఆ ఘడియ పవిత్రత గురించి సరైన అవగాహన కల్పించకపోవటం, పాట ప్లే చేసే విషయంలో గందరగోళం,...). కావున ఇది భక్తిభావంతో జరిగేటట్లు చర్యలు తీసుకోవాలి.

**f) విశ్వాస ప్రమాణము:**

దివ్యపూజ గ్రంథంలో రెండు విశ్వాస ప్రమాణాలు ఉన్నాయి: 1. 'నీసెయా కాన్స్టాంటినోపులు' విశ్వాస ప్రమాణము 2. 'అపోస్తులుల' విశ్వాస ప్రమాణము. 'పూజావిధానము' లో సంఖ్య 19 ప్రకారం, సాధారణంగా సంవత్సరం పొడవునా చెప్పవలసినది నీసెయాకాన్స్టాంటినోపులు విశ్వాస ప్రమాణము. దానికి బదులు, ముఖ్యంగా తపఃకాలము, పాస్కకాలమునందు అపోస్తులుల విశ్వాస ప్రమాణమును వాడవచ్చు. అయితే వాస్తవ ఆచరణలో మన ప్రాంతంలో నీసెయాకాన్స్టాంటినోపులు విశ్వాస ప్రమాణము దాదాపు పూర్తిగా నిర్లక్ష్యం చేయబడి పూజలో చెప్పబడటంలేదు. దాని స్థానాన్ని తిరిగి దానికిచ్చి మరలా చెప్పటం ప్రారంభించాలి.

21వ మహాసభ అయిన ద్వితీయ వాటికను మహాసభను ప్రారంభిస్తూ, 1962 అక్టోబరు 11న, పునీత 23వ జాన్ పాపుగారు, తన ప్రసంగంలో ఈ విధంగా అన్నారు: "అవసరమైన చోట తనను తాను నవీకరించుకోటం వలన, ... శ్రీసభ మానవులు, కుటుంబాలు తమ మనస్సులను పరలోక వస్తువులపై వాస్తవంగా తిప్పునట్లు చేస్తుంది." దైవార్చన సంస్కరణల లక్ష్యం ఇదే. ఈ లక్ష్యం నెరవేరేలాగా మన దైవార్చన నిర్వహణ ఉందో లేదో అనునిత్యము

పరిశీలన చేసుకోవాలి. గురువు పూజలో "మీ మనస్సులను ఉన్నతమునకు త్రిప్పుము" అంటాడు. అప్పుడు ప్రజలు, "ప్రభువువైపుకు త్రిప్పియున్నాము" అని బదులిస్తారు. విశ్వాసులందరూ కలిసి దేవునివైపుకు తిరిగి ఆయనను ఆరాధించి మహిమపరచి, ఆయనొసగు రక్షణానుగ్రహమును సంపూర్ణంగా పొందుకొనునట్లు దైవార్చన ఒక ప్రభావవంతమైన సాధనంగా ఉపకరించాలి. అందుకు అందరూ విశ్వ శ్రీసభతో ఏకీభవించి విశ్వాస ప్రయాణంలో ముందుకు సాగాలి.

## ముగింపు

దైవార్చన, దేవుడు, తన ప్రజలు కలుసుకొను విశిష్టమైన చోటు. ఇందులోనే దైవార్చనయొక్క శక్తి, ఔన్నత్యము, ప్రత్యేకత ఇమిడియున్నాయి. దివ్యబలిపూజలో మొదటిభాగమైన దైవవాక్యార్చనలో మాట్లాదేది, రెండవ భాగమైన కృతజ్ఞతార్చనలో రొట్టెను విరిచేది క్రీస్తేనని అపోస్తలులు అనుభవ పూర్వకంగా రుచిచూసి తెలుసుకొని బోధించారు (లూకా 24:25,32 "అప్పుడు మోషే మొదలుకొని ప్రవక్తలందరి లేఖనములలో తనను గూర్చి వ్రాయబడినవి అన్నియు వారికి వివరించెను.".. "ఆయన మార్గములో మనతో మాట్లాడునప్పుడు, లేఖనములన్నియు మనకు వివరించునపుడు మన హృదయములు ప్రజ్వరిల్లలేదా?" వచనాలు 30-31 "యేసు వారితో కూడ భోజనమునకు కూర్చుండినపుడు ఆయన రొట్టెను తీసికొని ఆశీర్వదించి, త్రుంచి వారికి ఇచ్చెను. దానితో వారికి కనువిప్పు కలిగినది. వారు యేసును గుర్తించిరి"). కనుక పూజకు వెళ్ళటం అంటే విశ్వాసులు దైవసన్నిధిలో ప్రవేశించటం. ఈ రీతిగా దైవార్చన, దేవుడు తన ప్రజలు కలుసుకొనే చోటుగా పరిణమిస్తుంది. ఇందు చేతనే శ్రీసభ అపోస్తోలిక కాలమునుండి 'ప్రతి రోజు కూటమిగా కలుసుకొనుచు తమ ఇండ్లలో అందరు కలిసి రొట్టెను త్రుంచుట, దేవుని స్తుతించుట, ప్రీతిపాత్రమైన జీవితమును జీవించుట మానలేదు (అపో.కా. 2:46-47).

ఈ విషయమును తొలి శతాబ్దాలకు చెందిన శ్రీసభ పితామహులు చాలా స్పష్టముగా ప్రజలకు వారి ప్రసంగాలలో వివరించారు. పునీత మహా లెయో జగద్గురువులు (క్రీ.శ. 400-461) ప్రభుని మోక్షారోహణము గురించి బోధిస్తూ,

అపోస్తలుల కార్యములు 1:9 లో ఉన్న మాటలపై ("... వారు చూచుచుండగా ఆయన పరలోకమునకు ఎత్తబడెను. అప్పుడు వారి కన్నులకు కనబడకుండ, ఒక మేఘము ఆయనను కొనిపోయెను'') వ్యాఖ్యానిస్తూ, 'కావున మోక్షారోహణముతో క్రీస్తు యొక్క శరీర ప్రత్యక్షత వారి (అపోస్తలుల) మధ్య ఇక ముగిసింది. ఆయన తిరిగి యుగాంతమున అదే శరీరముతో సకలజాతి జనులకు తీర్పు విధించుటకు మరలా తిరిగి వచ్చేంత వరకు, "మన రక్షకునిలో కనిపించినదంతా దివ్యసంస్కారములలోనికి బదిలీ చేయబడినది'' అని తెలియచేసారు. అనగా మనుష్యావతారమెత్తి మన మధ్యన నివసించిన యేసు ప్రభువు, మోక్షారోహణమై తండ్రి కుడి ప్రక్కన ఆసీనుడైయున్న యేసు, ఆయన మరలా తిరిగి వచ్చేంతవరకు దివ్యసంస్కారములలో ప్రత్యక్షమై, సిలువలో నెరవేర్చిన రక్షణ కార్యమును అందరిలో నెరవేర్చుచున్నాడు. క్రీస్తునందు కనిపించినదంతా మన కళ్ళతో చూడగలిగినది, చేతులతో తాక గలిగినది, ఆయన మాటలు, ఆయన చేతలు, ఆయన నెరవేర్చిన రక్షణకార్యము, మనుష్యావతారమెత్తిన వాక్కులో కనిపించినదంతా, ఆయనకు సంబంధించినదంతా దివ్యసంస్కారములలోనికి బదిలీ చేయబడినది. ఈ విషయమును లెయో పోపుగారికన్నా ముందుగానే పునీత ఆంబ్రోసు గారు (క్రీ.శ. 339-397) "ఓ క్రీస్తు ప్రభువా, నిన్ను నీవు నాకు ముఖా ముఖిగా ప్రత్యక్షపరచుకున్నావు. నేను నిన్ను నీ దివ్యసంస్కారములలో కలుసుకొందును కనుగొందును" అని అంటూ దైవార్చనయొక్క శక్తిని, ఔన్నత్యాన్ని చాటి చెప్పాడు.

కనుక క్రీస్తు అదృశ్యుడైయున్న దేవునికి ప్రత్యక్షరూపమైనట్లే (కొలొస్సీ. 1:15), క్రీస్తు శరీరమైన శ్రీసభ, మరియు దైవార్చన అదృశ్యుడైయున్న క్రీస్తుకు ఇప్పుడు ప్రత్యక్ష రూపంగా (సంస్కార రూపం) ఉన్నది. మరణించిన నాయీను వితంతువు కుమారుని ప్రభువు జీవముతో లేపినప్పుడు, ప్రజలు, "దేవుడు తన ప్రజలను దర్శింపవచ్చెను" అని చెప్పుకొనుచు దేవుని స్తుతించిరి (లూకా 7:16). అలానే దైవార్చనలో, అనగా ఆయన స్థాపించి ఇచ్చిన దివ్యబలిపూజ, దివ్యసంస్కారాలలో, కూడా క్రీస్తు తన ప్రజలమైన మనలను దర్శింపవచ్చుచున్నాడు, కావున మనకు ఆయనను కలుసుకొని, రక్షణ, శుద్ధి,

స్వస్థత పొందుకొనే అదృష్టము దైవార్చనలో కలుగుతుంది. అనగా దేవుని వాక్కు అయిన క్రీస్తు మనుష్యావతారమెత్తి మానవులమధ్య నివసించినప్పుడు ప్రజలు ఆయనను కలుసుకొనిన విధంగా, దైవార్చనలో మనమధ్య ఉండుటకు వచ్చే ఆయన చెంతకు మనము ఒక నికోదేముగా (యోహాను 3), సమరియ స్త్రీగా (యోహాను 4), పక్షవాతరోగిగా (మార్కు 2:1-12), అపవిత్రాత్మ సోకినవ్యక్తిగా (మార్కు 1:21-28), క్షమించబడిన పాపాత్మురాలిగా (లూకా 7:36-50), రక్తస్రావ రోగిగా (మార్కు 5:25-34), తన కుమార్తెను బ్రతికించమని వేడిన యాయీరులాగా (మత్తయి 9:18-26), గ్రుడ్డివాడయిన బర్తిమయిగా (మార్కు 10:46-52), లాజరుగా (యోహాను 11), జక్కయ్యగా (లూకా 19:1-10), వెక్కివెక్కి ఏడ్చి క్షమాపణ పొందుకున్న పేతురుగా (లూకా 22:61-62), పాప క్షమాపణ, దైవరాజ్య బహుమానమును పొందుకున్న మంచి దొంగవానిగా (లూకా 23:42-43) విశ్వాసంతో, భక్తితో, పశ్చాత్తాపంతో వెళ్ళాలి. అప్పుడే దివ్యసంస్కారాలలో ఉన్న క్రీస్తు మనలను తన పాస్కాపరమరహస్య శక్తితో క్షమిస్తాడు, స్వస్థపరుస్తాడు, రక్షిస్తాడు.

ఈ అధ్యయనం అచ్చం అటువంటి అనుభూతినే నాకు కూడా కలిగించింది. ఈ పత్రమును ధ్యానపూర్వకంగా, ప్రార్ధనాపూర్వకంగా చదువుతుండగా నాకు ఒక పెంతుకోస్తులాంటి అనుభవం కలిగింది. పెంతుకోస్తుపండుగనాడు పు. పేతురుగారు మాట్లాడునది ప్రతి ఒక్కరు తమ సొంతభాషలో విని అర్ధంచేసుకోగలిగినట్లు, పరిశుద్ధాత్మ దేవుని సహాయం వలన దైవార్చన ప్రతిరోజు మాట్లాడేది ఇంతకుముందుకన్నా ఎన్నో రెట్లు స్పష్టంగా నాకు అర్ధమవటం మొదలయింది. అందువలన నేను పూజలు ప్రార్ధనలు చేసే విధానం నాకు తెలియకుండానే మరింత ఆధ్యాత్మికంగా మారింది. ఆగస్టు 1వ తారీఖున పూజ పరమరహస్యాలలో పూర్తిగా లేనమైపోయి పూజ చేస్తుండగా, నడిపూజాసమయం వచ్చేసరికి లోపలినుండి తన్నుకువస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేక ఒక చిన్నపిల్లాడిలా ఏడ్చేసాను. ప్రభు శరీరరక్తాలుగా మారిన పవిత్రీకరించబడిన అప్పద్రాక్షారసములను పట్టుకొన్నప్పుడు ఒక్కసారిగా నా చేతులు వణికాయి. ప్రభువు స్థానంలో నిలబడి ఒక గురువుగా దివ్యబలిపూజను అర్పించటాన్ని

తలంచుకొని ప్రభువిచ్చిన ఈ అమూల్యమైన అనుగ్రహానికి కృతజ్ఞతతో నిండినవాడనై అలా కొన్ని నిమిషాలపాటు నోటిమాట రాక ఏడుస్తూ ఉండిపోయాను. అప్పుడు నాకు పు. జాన్ మరియ వియాన్నీ గారు చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి, "గురువు ఎంత గొప్పవాడు! అతనేంటో అతను గ్రహిస్తే... అతను చనిపోతాడు... దేవుడు అతనిని విధేయిస్తాడు: ఆయన కొన్ని మాటలు (పవిత్రీకరణ పలుకులు) పలుకగా, చిన్న అప్పంలో ఉండటానికి దేవుడు పరలోకం నుండి దిగివస్తాడు." ఇంత గొప్ప ధన్యతను దేవుడు గురువులకు, శ్రీసభకు ఇచ్చాడు. ఇద్దరు ముగ్గురు ఆయన నామంలో సమావేశమై పిలవగానే ఆయన మన మధ్యకు వస్తాడు (సంఖ్య 7). అలా దైవార్చన దేవుడు తన ప్రజలు కలుసుకొనే గొప్ప అద్భుత సందర్భం అవుతుంది. గొప్ప గొప్ప అద్భుతాలు జరిగే సంఘటన అవుతుంది. బెన్ని హిన్ అనే ఒక పెంతుకోస్తు పాస్టరు గారు ఈ విషయాన్ని చక్కగా గమనించి గ్రహించి బాహాటంగా ఒప్పుకుంటూ ఇలా అన్నాడు, "పెంతుకోస్తు దేవాలయాల్లో కన్నా కథోలిక దేవాలయాల్లో ఎక్కువమంది స్వస్థత పొందుకుంటున్నారు. ఎందుకంటే కథోలికులు దివ్యసత్ప్రసాదమును ఆరాధిస్తారు. దివ్యసత్ప్రసాదము క్రీస్తు శరీరరక్తములని వారు నమ్ముతారు. అందుకనే దివ్యసత్ప్రసాద సమయంలో పెంతుకోస్తు దేవాలయాల్లో కంటె కథోలిక దేవాలయాల్లో ఎక్కువ అద్భుతాలు, స్వస్థతలు జరుగుతున్నాయి. ఇది ముమ్మాటికీ నిజం. కథోలికులు చాలా భక్తిగా ఉంటారు. ప్రతి ఆదివారం దేవాలయానికి క్రమంతప్పకుండా వెళ్తారు." దైవార్చనలో జరిగే ఈ అద్భుతాన్ని విశ్వాసులెవరూ కోల్పోగూడదు అనేదే శ్రీసభ ఆవేదన. ఇది అందరికీ అర్థం కావాలనేదే ఈ సంస్కరణలయొక్క ఉద్దేశ్యం. దివ్యసత్ప్రసాదం, దివ్యబలిపూజ, దివ్యసంస్కారాలు, దైవార్చన యొక్క శక్తి కథోలికులందరూ గ్రహించాలనే శ్రీసభ సదుద్దేశం, కృషి నెరవేరి విశ్వాసులందరి జీవితాలలో సంపూర్ణ రక్షణ ఫలాలను సాధించాలని ప్రార్థించుదాం.

❋ ❋ ❋ ❋

# 4. లోకానికి వెలుగు శ్రీసభ
## (*Lumen Gentium*)

**– ఫాదర్ కొండవీటి అంతయ్య**

**ఉపోద్ఘాతం – చారిత్రక నేపథ్యం :**



"లూమెన్ జెన్సియుమ్" లోకానికి వెలుగు శ్రీసభ. ఇది ద్వితీయ వాటికను మహాసభ శ్రీసభ స్వరూపంపై ధ్యానిస్తూ శ్రీసభకు అందించిన ఒక ప్రతిష్ఠాత్మకమైన సంవిధాన పత్రం. ఈ సంవత్సరం నవంబరు 21వ తేది నాటికి ఈ సంవిధాన పత్రం ఆవిర్భవించి 60 వసంతాలు పూర్తి చేసుకుంటున్న ఈ శుభ తరుణంలో మన విశ్వ శ్రీసభ, 2025లో జరుపుకునే జూబిలీ నేపథ్యంలో మనందరిని ఈ సంవిధాన పత్రాన్ని లోతుగా అధ్యయనం చేసి, అర్థం చేసుకోవాలని ఆహ్వానించడం శుభ పరిణామం. ఈ సంవిధాన పత్రం శ్రీసభ నిగూఢతత్వాన్ని వెల్లడిచేయడంలో, దాని యదార్థ స్వరూపాన్ని క్రైస్తవ సమాజమంతటికి ఆవిష్కరించడంలో చాలా వరకు సఫలీకృతమైంది.

"శ్రీసభ ఈ ప్రపంచానికి తనను గురించి తాను ఏమని చెప్పదలచుకుంటున్నది?" అని బెల్జియం దేశానికి చెందిన కార్డినల్ లెయో జోసఫ్ సువెనెన్స్ సంధించిన ప్రశ్న ఈ సంవిధాన పత్రం యొక్క రూపురేఖలనే మార్చి వేసింది. అంతేకాక, ఈ పత్రం రూపకల్పనకు, లోతైన అధ్యయనానికి ఈ ప్రశ్నే మార్గదర్శి కూడా అయ్యింది. విశ్వ శ్రీసభలోని క్రైస్తవులందరి ఐక్యతను గాఢంగా కాంక్షిస్తూ, ఈ ఆధునిక యుగంలో ఫలవంతమైన సువార్త ప్రబోధం ద్వారా క్రీస్తును ప్రజలకు మరింత చేరువగా తీసుకు వెళ్ళడమే ఏకైక లక్ష్యంగా పరిగణిస్తూ

ప్రారంభించిన ద్వితీయవాటికను మహాసభకు ఈ ప్రశ్న అత్యంత కీలకంగా మారింది.

మహాసభలోని గురువులు, పితామహులు, దైవశాస్త్ర పండితులు అందరూ, శ్రీసభ ఇహలోక సంబంధమైన వ్యవహారాలకు మాత్రమే పరిమితంగా కనిపించే వ్యవస్థగా కాక, నిజమైన శ్రీసభను ఈ ఆధునిక ప్రపంచానికి ఆవిష్కరించాలని అభిప్రాయ పడ్డారు. మహాసభ సూచనల మేరకు రూపుదిద్దుకొన్న ఈ పత్రం ప్రథమంగా 30 సెప్టెంబరు 1963లో మహాసభకు అందించబడింది. ప్రధానంగా క్రీస్తు పరమ రహస్యాన్ని, శ్రీసభకు, క్రీస్తు భగవానునికి మధ్యగల అవినాభావ సన్నిహిత బాంధవ్యాన్ని లోతైన భావజాలంతో పునరుద్ఘాటించింది. ఈ పత్రంలోని మొట్టమొదటి పదాలే మన దృష్టిని క్రీస్తు వైపుకు మళ్లిస్తాయి. "లూమెన్ జెన్సియుమ్" లోకానికి వెలుగైన క్రీస్తు ప్రభుని తేజస్సు సకల జాతి జనుల సమూహమైన శ్రీసభ వదనాన్ని తేజోమయం చేస్తున్నదని దీని అర్థం. 1964వ సంవత్సరం, నవంబర్ 21వ తేదీన 'లోకానికి వెలుగు శ్రీసభ' పేరుతో, అధికారికంగా ఈ పత్రాన్ని ఆమోదించారు. మానవాళి మధ్య దేవుని నివాస స్థానమే శ్రీసభ ప్రామాణిక స్వరూపమని ఈ పత్రం చూచిస్తుంది. ఖచ్చితమైన దృక్పథంతో ఈ సంవిధాన పత్రాన్ని లోతుగా అధ్యయనం చేసేవారు శ్రీసభను ప్రేమించడం అనివార్యం.

**క్లుప్త సారాంశం:**

ఎనిమిది అధ్యాయాలున్న ఈ అధికార పత్రం శ్రీసభ ఉనికిని, నిగూఢ తత్వాన్ని (పరమ రహస్యాన్ని) ముఖ్యంగా దైవ ప్రజల పవిత్రతకు ఉపకరించు అనేక అంశాలను కనుగొనేలా ప్రేరేపిస్తుంది. శ్రీసభ ఒక పరమ రహస్యం. అదే విధంగా ఒక ప్రత్యక్షమైన వ్యవస్థ, నిర్మాణం. శ్రీసభ దైవ ప్రజలకు మారుపేరని గుర్తుచేస్తుంది. సువార్త పరిచర్య, మానవ సేవ విశ్వాసులందరి బాధ్యతని గుర్తుచేస్తుంది. శ్రీసభలో ఉన్న వివిధ స్థాయి పరిచర్యలను విభిన్న పరిచారకులను గురించి విశ్లేషిస్తుంది. మేత్రాణుల, గురువుల, డీకనుల, కన్యా స్త్రీల ముఖ్యంగా గృహస్థ క్రైస్తవుల పనితీరు, శ్రీసభ పరిచర్యలో వారి పాత్రల గురించి, బాధ్యతల గురించి చర్చిస్తుంది.

దైవ ప్రజలుగా శ్రీసభ పరిచర్యలో విభిన్న బాధ్యతలు నిర్వర్తిస్తున్న సకల విశ్వాసులు క్రీస్తు శరీరంలోని భాగాలేనని తెలియజేస్తుంది. శ్రీసభ క్రీస్తు శరీరంలోని ఐక్యతకు మరియు వైవిధ్యానికి రూపమని బోధిస్తుంది. దైవ ప్రజలందరూ పవిత్ర జీవితం జీవించటానికి ప్రాధమికంగా పిలవబడ్డారు అనే విషయాన్ని ప్రస్తావిస్తుంది. మఠవాస జీవిత గొప్పతనాన్ని, ప్రత్యేకతను బలపరచింది. ఈ మఠవాస జీవితం క్రైస్తవ జీవిత పరిపూర్ణత సాధన దిశగా దోహదపడుతుందని, క్రీస్తు శ్రీసభకు అనుగ్రహించిన ఒక బహుమతి అని ధ్రువీకరిస్తుంది. మరియమాత శ్రీసభ మాతని, ఆమె ఔన్నత్యాన్ని శ్లాఘిస్తూ, దైవ ప్రజలందరికి ఆమె మంచి సుమాతృకరాలని బోధిస్తుంది.

కతోలిక శ్రీసభ స్వభావాన్ని, పరిచర్యను, ప్రేషిత కార్యాన్ని లోతుగా అర్థం చేసుకోవటానికి ఉపయోగపడే కొన్ని ముఖ్యంశాలను పరిశీలిద్దాం.

## 1. శ్రీసభ యథార్థ తత్వం - దివ్య సంస్కారం

మొదటి అధ్యాయం ఆరంభంలోనే శ్రీసభ తన స్వభావాన్ని గురించి నిర్వచిస్తూ; అధునాతన సమకాలీన ప్రపంచంలో శ్రీసభ యొక్క సార్వత్రిక అపోస్తోలిక పరిచర్య క్రీస్తు ప్రభుని సువార్త పరిచర్యని ఎలా ప్రతిబింబిస్తుందో వివరిస్తుంది *(LG, 1)*. శ్రీసభ కేవలం మానవ నిర్మితమైన సంస్థ కాదు, దైవ ప్రేరేపణతో నిర్మితమైన వ్యవస్థ, కుటుంబం. శ్రీసభ తండ్రి దేవుని రక్షణ ప్రణాళికలో భాగంగానే ఆవిర్భవించింది. తండ్రి దేవుని అభీష్టంతో క్రీస్తు ప్రభుని పరిచర్యతో, పెంతెకోస్తు రోజున పవిత్రాత్మ ప్రభువు దిగిరావటంతో శ్రీసభ నిర్మితమైంది. శ్రీసభ ఒక దివ్య సంస్కారం. ఈ లోకంలో విశ్వాసులు దైవానుగ్రహాలు, రక్షణానుగ్రహాలు స్వీకరించడానికి ఏర్పాటు చేయబడ్డ ఒక నిర్దిష్టమైన సాధనం.

శ్రీసభ దేవుని మీద పూర్తిగా ఆధారపడి తన మనుగడ సాగిస్తుందని తెలియచేయడానికి, పరిశుద్ధ గ్రంథ ఆధారంగా, శ్రీసభను పలు ప్రతీకలతో అభివర్ణించారు : "శ్రీసభ ఒక గొర్రెల దొడ్డి, దాని ఏకైక ద్వారం క్రీస్తు ప్రభువు (యోహాను 10:11); శ్రీసభ ఒక గొర్రెల మందని, క్రీస్తు ప్రభువు ఆ మంద యోగక్షేమాలు చూచే మంచి గొర్రెల కాపరని; అదే విధంగా శ్రీసభను ఒక వ్యవసాయ భూమితో పోల్చుతూ ఆ భూమిని స్వయానా దేవుడు సాగు చేస్తున్నట్లుగా

(1 కొరింతీ 3:9), అందమైన ద్రాక్ష తోటగా, క్రీస్తుని అంటిపెట్టుకుని ఉంటే ఫలభరితులమౌతామని చూడగలం. శ్రీసభను తరచూ దేవుని భవంతితో పోల్చారు. ఇది దేవుని మందిరమని, విశ్వాసుల నివాస గృహమని గ్రహించగలం (ఎఫెసీ 2:19-22). ప్రత్యేకంగా శ్రీసభను 'నిష్కళంకమైన వధువు'గా (దర్శన 19:7; 21:2,9; 22:17) వర్ణిస్తూ, మచ్చలేని ఆ నవవధువునే క్రీస్తు ప్రాణప్రదంగా ప్రేమించి, ఆమె కోసమే మరణించాడు' అని చెప్పడం ద్వారా శ్రీసభ జీవం జీవనం క్రీస్తు ప్రభువే అని విశదీకరిస్తుంది. శ్రీసభ క్రీస్తుని ఆధ్యాత్మిక శరీరంగా అభివర్ణించబడింది. క్రీస్తు శిరస్సుగా మరియు విశ్వాసులందరూ శరీర భాగాలుగా, వారి విశ్వాసంలో, దివ్య సంస్కారాలలో క్రీస్తుని దేహంలో ఐక్యమై ఉన్నారు. దివ్య సంస్కారాలైన బప్తిస్మం, దివ్యసత్ప్రసాదం (దివ్యబలిపూజ) విశ్వాసులను క్రీస్తులో ఐక్యమయ్యేటట్లుగా మరియు ఒకరితో ఒకరు సన్నిహితంగా మెలిగేలా దోహదపడతాయి.

దైవ రాజ్య విలువలను ప్రకటించటం, విశ్వాసుల మధ్య సంఘీభావం, ఐక్యతా సాధనకు కృషి చేయటం, సకల జనులను సర్వేశ్వరునికి సన్నిహితులుగా చేయటమే శ్రీసభ ప్రేషిత కార్యం. క్రీస్తు ప్రభువును లోకానికి వెలుగని ధృవీకరిస్తూ, పవిత్రాత్మ ప్రభుని దిశా నిర్దేశంతో సర్వమానవాళికి వెలుగును పంచటమే లక్ష్యంగా చేసుకుంటూ శ్రీసభ పరిచర్య చేస్తుంది. లోకానికి వెలుగైన క్రీస్తు ప్రభువును, క్రీస్తుని స్వభావాన్ని, ఆయన పరిచర్యను ప్రతిబింబించేలా ఆయన వెలుగును సకల జాతులపై ప్రకాశింపచేయటమే శ్రీసభ ఉనికి, అస్తిత్వం.

పవిత్రాత్మ నిరంతరం శ్రీసభను పవిత్రపరుస్తూ నూత్నీకరిస్తుంది. విశ్వాసులను ఐక్యపరస్తుంది. సత్యం నేర్పించి సత్యంలోనికి నడిపిస్తుంది. శ్రీసభ వివిధ స్థాయిల్లో చేపడుతున్న పరిచర్యలకు, సేవా కార్యక్రమాలకు కావలసిన వరాలు, అనుగ్రహాలు, వనరులు సమకూరుస్తుంది. శ్రీసభలో కొన్ని స్వల్ప లోపాలున్నప్పటికీ అది నిరంతరం పవిత్రాత్మ ప్రభువు శక్తితో, ప్రేరేపణతో పునరుద్ధరించబడుతూ ముందుకు నడిపించబడుతుంది. పరలోకంలో క్రీస్తుతో ఐక్యత సాధించే వరకు ఈ పవిత్రాత్మ నడిపింపు కొనసాగుతుంది *(LG, 7)*.

శ్రీసభలో విభిన్న జాతులు, సంస్కృతులు, భాషలు, పరిచర్యలు ఉన్నప్పటికీ ఇవి అన్నియు ఐక్యమత్యంతో, ప్రేమతో పనిచేసే క్రీస్తుని ఒకే ఒక దేహంలో

భాగమేనని గుర్తించాలి. శిరస్సయిన క్రీస్తు ప్రభువులో ఐక్యమై, క్రీస్తు దేహంలాంటి శ్రీసభ నిర్మాణంలో ఈ విభిన్న జాతులు మరియు పరిచర్యలు వారి వారి పాత్రలను నిర్వహిస్తుంటాయి. దైవ ప్రణాళికలో భాగంగా లోకాంత్యపు ఘడియల్లో రానున్న ప్రభు మహిమాయుత కీర్తిని శ్రీసభ ప్రపంచానికి ప్రకటిస్తూ ఎదురు చూస్తుంటుంది *(LG, 8).*

మొదటి అధ్యాయం చివరి బాగంలో, క్రీస్తు దేహమైన శ్రీసభ యొక్క దైవ – మానవ అంశాలను ప్రస్తావిస్తుంది: "దేవుడికీ మానవులకు ఏకైక మధ్యవర్తి క్రీస్తు ప్రభువు – భూలోకంలో స్వయంగా తానే స్థాపించి, తానే నిర్మిస్తూ, తానే నడిపిస్తున్న పవిత్ర శ్రీసభ – విశ్వాసం, ఆశాభావం, ప్రేమ సేవా అనే త్రివిధ విశిష్ట గుణాలకు నెలవుగా వర్ధిల్లుతూ ఉంటుంది; లౌకిక మానవ సమాజంలో సాకారమైన నిర్దిష్టమైన వ్యవస్థగా కొనసాగుతున్న శ్రీసభ ద్వారా క్రీస్తు భగవానుడు, లోకంలోని మానవులందరికీ సత్యప్రభోదం చేస్తున్నాడు, కృపావరాలను ప్రసాదిస్తున్నాడు" *(LG, 8).*

లౌకికమైన శ్రీసభ (సామాజిక వ్యవస్థ) పారా లౌకిక శ్రీసభ (ఆధ్యాత్మిక) వేరువేరని తలంచరాదు. వాటి మధ్య ఎటువంటి వైరుధ్యం వుండదు, అవి భిన్నమైనవి కావు. శ్రీసభ ఒక్కటే, లౌకిక – పారాలౌకిక సత్యాలు రెండు శ్రీసభ తత్వంలో మిళితమై ఉంటాయి. ఈ ద్వివిధతత్వం శ్రీసభకు – క్రీస్తు ప్రభువులోని దైవమానవ అస్తిత్వం నుండే సక్రమించింది. ఇదే మనం విశ్వాస ప్రమాణంలో ప్రకటించే క్రీస్తు ప్రభువు స్థాపించిన 'ఏక, పవిత్ర, కతోలిక, ఆపోస్తోలిక' శ్రీసభ. క్రైస్తవ సమాజంలో మనుగడ సాగిస్తున్న యధార్ధమైన ప్రభు శ్రీసభ – కతోలిక శ్రీసభలో నిక్షిప్తమై (*subsists in*) ఉంది *(LG, 8).*

12వ భక్తినాధపాపుగారు తన విశ్వ లేఖయిన *Mystici corporis* లో 'క్రీస్తు ఏర్పరచిన శ్రీసభ – కతోలిక శ్రీసభతో సమానం' అన్న మాటలు, మరియి మొదటి వాటికను మహాసభ పలికిన మాటలు – 'క్రీస్తు శ్రీసభయే కతోలిక శ్రీసభ'కు (*est*), భిన్నంగా, "క్రైస్తవుల పవిత్రీకరణకు, సత్యవేదానికి సంభందించిన అనేక అంశాలు కతోలిక శ్రీసభ వెలుపల కూడా సచేతనంగా ఉన్నట్లు" తెలియజేస్తూ, "ఈ ఆధ్యాత్మిక శక్తులన్నీ నిజానికి శ్రీసభకు చెందిన విశిష్ట వరాలు గనుక –

కాల క్రమంలో ఇవి విశ్వజనీనమైన క్రైస్తవ సంఘ సమైక్యానికే దోహదం చేస్తాయని" వక్కాణించింది.

చివరిగా, 'పవిత్రుడైన క్రీస్తు ప్రభువు ద్వారా, శ్రీసభ పవిత్రురాలైనప్పటికీ, పాపుల సాంగత్యం వలన తనకు సోకిన పాపపు కళంకాన్ని తొలగించుకోడానికి గాను, నిత్యమూ శుద్ధీకరణ కోరుతూనే, ప్రాయశ్చిత మార్గంలోనూ, ఆత్మ సంస్కరణ నూత్నీకరణ పథంలోనూ పయనిస్తూనే ఉంటుంది' *(LG, 8).*

## 2. శ్రీసభ – దైవ ప్రజలు – సహవాస సాంగత్యం

త్రియేక దేవునిలో ముగ్గురు వ్యక్తుల సాంగత్యమే శ్రీసభ జీవనానికి, ప్రేషిత కార్యానికి పునాది. అందువలన 'సహవాసం' (*communion/koinonia*) శ్రీసభ లోతైన వాస్తవికతను తెలియజేస్తుంది. శ్రీసభ అంటే కేవలం ఒక వ్యవస్థ కాదు, అది క్రీస్తు ప్రభుని శరీరమని, దైవప్రజలని వ్యక్తమవుతుంది. పూర్వ నిబంధనలో దేవుడు ఇశ్రాయేలు జాతిని తన ప్రజలుగా ఎంపిక చేసుకొని, వారితో ఏర్పరచు కొన్న నిబంధనకు కట్టుబడి జీవించనప్పుడు దేవుడు నూతన నిబంధన చేసుకొంటానన్న వాగ్దానం ప్రకారం క్రీస్తు రక్తతర్పణతో నూతన నిబంధన నెలకొల్పాడు. క్రీస్తు ప్రభువుని విశ్వసించి, బప్తిస్మం స్వీకరించడం ద్వారా ఈ నూతన దైవ ప్రజా సంఘం నూతన ఇశ్రాయేలీయులుగా, శ్రీసభగా రూపొందింది. ఈ ప్రజలు 'దేవదేవుని బిడ్డలు' 'దేవుని దత్తపుత్రులు'గా పిలవబడే భాగ్యం పొందారు. యూదులు, అన్యులు అనే భేదం లేకుండ; జాతి, వర్ణ, వర్గ, సంస్కృతి భేదం లేకుండ అందరూ దైవ ప్రజలుగా పిలువబడుచున్నారు. అందరూ క్రీస్తు దేహంలో భాగస్తులవుతున్నారు. ఈ విధంగా ఒకే సంఘంగా నిర్మించబడుతున్నారు. శ్రీసభ అంటే ఒక ఐక్యతా సహవాస దివ్య సంస్కారం. క్రీస్తు ద్వారా పవిత్రాత్మయందు దైవత్వంలో పాలుపంచుకోవడమే సహవాస సాంగత్యం. సభ్యులందరు పవిత్రాత్మ సహవాసంలో భాగం పంచుకుంటారు. జ్ఞానస్నానం ద్వారా త్రియేక సర్వేశ్వరుని సహవాసంలో ఐక్యత నొందుతారు. ఈ ఐక్యతానుబంధ జీవనం దివ్యసత్ప్రసాదం ద్వారా బలపడుతుంది.

ఈ దైవ జన సంఘం పాటించే చట్టం – ప్రేమ చట్టం (యోహాను 13:34). అలాగే దాని లక్ష్యం – దైవ రాజ్య నిర్మాణం. బప్తిస్మం స్వీకరించిన ప్రతి ఒక్కరూ

(గృహస్థ క్రైస్తవులు, యాజకులు, మఠవాసులు) శ్రీసభ లక్ష్యమైన పవిత్ర జీవనం, రక్షణ సాధన దిశగా బాధ్యతాయుతంగా జీవిస్తూ, శ్రీసభ అపోస్తోలిక ధర్మంలో పాలుపంచుకోవాలని సూచిస్తుంది *(LG, 9).* పవిత్రాత్మ ప్రభుని స్వేచ్ఛాయుత ప్రేరణతో సువార్తను పాటిస్తూ, ప్రకటించడమే లక్ష్యంగా పిలువబడ్డారు. దివ్య సంస్కారాలు (బప్తిస్మం, పవిత్రాత్మ ధృవీకరణ సాంగ్యం, దివ్యసత్ప్రసాదం, పాప సంకీర్తనం, వ్యాధిగ్రస్తుల అభ్యంగనం, గురుపట్టాభిషేకం, జ్ఞాన వివాహం) శ్రీసభను, విశ్వాసులందరిని నిరంతరం పవిత్ర పరస్తూ క్రీస్తుతో మరింత సన్నిహితంగా ఏకం చేస్తాయి, మరియు శ్రీసభ ఆధ్యాత్మిక జీవిత ఎదుగుదలకు, శ్రీసభ అపోస్తోలిక కర్తవ్య నిర్వహణకు దోహదపడతాయి.

బప్తిస్మం ద్వారా సంక్రమించే 'సామాన్య యాజకత్వానికి' *(common priest-hood)* శ్రీసభ పాలకులకు సాధికారకంగా సంక్రమించిన 'సేవా యాజకత్వానికి' *(ministerial priesthood)* మధ్య ఉన్న వైవిధ్య భరితమైన లక్షణాలను వివరిస్తుంది. ఈ రెండు రకాల యాజకత్వాలకు ప్రభు క్రీస్తు యాజకత్వమే పునాది. కనుక ఈ రెండు రకాల యాజకత్వాలుపరస్పర సంబంధం కలిగి ఉంటాయి. అభిషేకం ద్వారా అసాధారణ యాజకత్వంలో పాలుపంచుకొంటున్న యాజకులు క్రీస్తు ప్రతినిధులుగా దివ్య పూజాబలిని విశ్వాసులందరి తరపున తండ్రి దేవునికి సమర్పిస్తుంటారు. సామాన్య క్రైస్తవులు తమ 'సాధారణ యాజకత్వ' ధర్మాన్ని దివ్య సంస్కారాల ఆచరణ ద్వారా, ప్రార్థనా జీవనం ద్వారా, సాటివారిని ప్రేమించడం ద్వారా, ఇతరత్రా పుణ్య కార్యాలు చేయడం ద్వారా నెరవేరుస్తుంటారు *(LG, 10).*

శ్రీసభను ఏక కతోలిక శ్రీసభగా మరియు సార్వత్రికమైనదిగా వర్ణించారు. అన్ని జాతులను, సంస్కృతులను ఆలింగనం చేసుకుంటుంది. కతోలిక శ్రీసభలో అంతర్భాగాలుగా ఉన్న ప్రత్యేక శ్రీసభల *(particular churches)* ఉనికిని గౌరవిస్తూ, వారి సంస్కృతీ సాంప్రదాయాలను యధాతథంగా కొనసాగిస్తూ శాంతిని, ఐక్యతను ప్రోత్సహిస్తుంది. జగద్గురువుల నాయకత్వంలో 'ప్రత్యేక శ్రీసభల'కు వాటి సాంప్రదాయాలకు ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. ఈ 'ప్రత్యేక శ్రీసభలు' కతోలిక విశ్వాసంతో గానీ, కతోలిక చట్టాలతో గానీ విభేదించవు

*(LG, 13).* సకల జాతి జనులను క్రీస్తు ప్రసాదించే రక్షణలో భాగస్తులను చేస్తూ, సువార్తీకరణ చేయటమే శ్రీసభ స్వధర్మం. ఇందులో భాగంగానే 'మానవ రక్షణకు శ్రీసభ సభ్యత్వం అనివార్యమని' గ్రహించి, కతోలిక విశ్వాసులు క్రీస్తు శ్రీసభ వ్యవస్థాగత నిర్మాణంలో అంతర్భాగలవుతారు, శ్రీసభ పాలన వ్యవస్థలో క్రియాశీలకమైన పాత్ర వహిస్తారు *(LG, 14).*

అయితే 'జ్ఞాన స్నానం పొంది క్రైస్తవులుగా పిలువబడుతున్న సోదర విశ్వాసులందరితో తనకు గల సాన్నిహిత్యాన్ని కతోలిక శ్రీసభ ఏనాడూ విస్మరించదు. వారు కతోలిక విశ్వాస సత్యాలన్నింటిని ఆమోదించక పోయినప్పటికీ, జగద్గురువుల పాలనాధికారాన్ని అంగీకరించక పోయినప్పటికీ, వారిని విస్మరించక, పవిత్రాత్మ ద్వారా కతోలికేతర క్రైస్తవులకూ కతోలికులకు మధ్య ఏర్పడే యథార్థమైన ఆత్మానుబంధం వలన, సర్వ క్రైస్తవ సమైఖ్యత కోసం తన వంతు కృషిని కొనసాగిస్తుంది *(LG, 15).* ఇంకా ఒక అడుగు ముందుకు వేసి, దేవుని రక్షణ ప్రణాళికలో క్రైస్తవేతరులు కూడా దైవజన సంఘంతో పలురూపాల్లో సన్నిహిత సంబంధాలు కలిగి వుంటారని ప్రబోధించింది. మొదటగా దేవుడు ఎన్నుకొన్న ఇశ్రాయేలీ ప్రజలు, దేవుని విశ్వసించే వారిలో అగ్రగణ్యులు ముస్లిములు, దేవుని నమ్మి ఆయన కోసం ప్రకృతిలో అన్వేషించేవారు, చిత్త శుద్ధితో దేవుని కోసం అన్వేషించేవారు, అంతరాత్మల ప్రబోధాలకు విధేయులై ధర్మబద్దంగా జీవిస్తూ దైవసంకల్పాన్ని నెరవేర్చే వారు, దేవుని గురించి తెలియక పోయినా సజ్జనులుగా జీవించేవారు, ఆఖరికి నాస్తికులు సైతం దేవుని రక్షణభాగ్యానికి యోగ్యులు కాగలుగుతారు. అందుకే కతోలిక శ్రీసభ ఇంకా సువార్తను అంగీకరించని వారి భాధ్యతను చేపట్టి, సువార్తా ప్రబోధంతో వారిని దేవుని రక్షణలో బాగస్వాములను చేయాలనే ఉద్దేశ్యంతో ముందుకు సాగుతుంది. "అలా – దైవ జన సంఘం, 'ప్రభు దివ్య దేహం' , పవిత్రాత్మ పావన మందిరం అని పిలువబడే తన ప్రాంగణం లోనికి ప్రపంచంలోని మానవులంతా తరలి రావాలని, ప్రభు అనుయాయులై తరించాలని, శ్రీసభ నిరంతరం ప్రార్థిస్తూ, అదే లక్ష్యంతో కృషి చేస్తుంది" *(LG, 17).*

## 3. శ్రీసభ వ్యవస్థ – వివిధ పరిచారక అంతస్తులు

క్రీస్తును శ్రీసభకు శిరస్సుగా, అధిపతిగా గుర్తిస్తూ, శ్రీసభలోని వివిధ పరిచారక అంతస్తులను సకల విశ్వాసుల ఆధ్యాత్మిక, భౌతిక సంక్షేమానికి మరియు రక్షణానుగ్రహాలు అందించటానికి క్రీస్తు ప్రభువే స్థాపించారని, శ్రీసభలోని సకల విశ్వాసుల సమానత్వాన్ని, ఐక్యమత్యాన్ని బలపరస్తూ శ్రీసభలో ఉన్న వివిధ పరిచారక అంతస్తుల ప్రాముఖ్యతను, ముఖ్యంగా పీఠాధిపతుల ఉనికిని, బరువు బాధ్యతలను గురించి మూడవ అధ్యాయంలో గమనించగలం.

జగద్గురువులు, పీఠాధిపతులు అపోస్తులుల వారసులుగా శ్రీసభకు మార్గనిర్దేశం చేయటానికి ముఖ్యంగా మంచి కాపరులుగా ఉండటానికి ఎన్నుకోబడతారని సూచిస్తుంది. అభిషిక్త గురువులు, డీకనులు శ్రీసభ పీఠాధిపతులుకు అప్పగించిన బాధ్యతల నిర్వహణలో వారికి సహాయం చేస్తారు. శ్రీసభలో ఉన్న ఈ వివిధ పరిచారక అంతస్తుల వ్యవస్థ అపోస్తులుల వారసత్వ సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ నిర్ధారిస్తుంది. శ్రీసభను క్రీస్తు అధికారం క్రింద ఏకం చేయటానికి దోహదపడుతుంది. "ప్రభువు తమకు ప్రసాదించిన 'పవిత్రమైన అధికారాన్ని' సాటి సోదరుల సేవకు వినియోగించాలే తప్ప స్వార్ధ ప్రయోజనాలకు దుర్వినియోగం చేయదగదు' అని హెచ్చరిస్తుంది *(LG, 18).*

"సాక్షాత్తు దేవుడు ప్రసాదించిన దివ్యాధికారం ప్రకారమే పీఠాధిపతులు అపోస్తలులకు వారసులుగా అభిషిక్తులయ్యారు, శ్రీసభ కాపరులుగా నియుక్తులయ్యారు; దీని ప్రకారం – ఎవరు పీఠాధిపతుల మాటలను ఆలకించి పాటిస్తారో – వారు సాక్షాత్తు ప్రభు క్రీస్తు ఆదేశాలను పాటించిన వారవుతారు" *(LG, 20).*

ప్రధాన యాజకత్వం *(high priesthood)* పీఠాధిపతులకు మాత్రమే అపోస్తోలిక వారసత్వంగా లభిస్తుంది. గురుపట్టాభిషేకంలోని పరిపూర్ణత్వం పీఠాధిపతి పట్టాభిషేకంలోనే వ్యక్తం అవుతుంది. ఈ విధంగా వారి అభిషేకం వారిని బోధకులుగా, యాజకులుగా, కాపరులుగా చేస్తుంది; సువార్త ప్రకటనకు, విశ్వాసులను పవిత్రపరచుటకు, శ్రీసభ పాలనా వ్యవహారాలు చక్కబెట్టుటకు నియమింపబడతారు. అదే విధంగా, అపోస్తులుల వారసులుగా పీఠాధిపతులు,

తాము నిర్వర్తించే త్రివిధ పరిచర్యలో "ప్రధాన యాజకుడైన క్రీస్తు ప్రభువే పీఠాధిపతుల ద్వారా విశ్వాసుల మధ్య సంచరిస్తూ, వారికి మార్గనిర్దేశం చేస్తూ ఉంటాడు" *(LG, 21).*

పీఠాధిపతులు పేతురు వారసుడిగా సర్వోన్నత అధికారాన్ని కలిగిన జగద్గురువులతో ప్రత్యేకమైన అనుబంధాన్ని, ఏకీభావాన్ని కలిగి ఉంటారు. ఈ అనుబంధం ప్రపంచవ్యాప్తంగా ఉన్న విశ్వాసుల మధ్య వేదాంతపరమైన, సిద్ధాంతపరమైన పొందికను, ఐక్యతను నిర్ధారిస్తుంది. పీఠాధిపతి పట్టాభిషేకం పొందటంతో పాటు, జగద్గురువుతోనూ ప్రపంచ పీఠాధిపతులందరితోనూ సంఘీభావాన్నీ ప్రకటించడం ద్వారా సార్వత్రిక పీఠాధిపతుల బృందం *(collage of bishops)*లో ప్రవేశార్హత పొందుతారు. పీఠాధిపతులు జగద్గురువులతో కలసి శ్రీసభలో సర్వోన్నత అధికారాన్ని కలిగి ఉంటారు. ముఖ్యంగా శ్రీసభ వ్యవహారాలు పర్యవేక్షించే అన్ని మండలిలు, సమావేశాలు, సమితిలు ఈ సర్వోన్నత అధికారానికి లోబడి వ్యవహరిస్తాయి. ఈ సహకారం శ్రీసభలో ఉన్న భిన్నత్వానికి, ఏకత్వానికి నిదర్శనం. పేతురు వారసుడిగా జగద్గురువుల సర్వోన్నత అధికారం శ్రీసభ ఐక్యతను మరియు పొందికను నిర్ధారిస్తుంది. పీఠాధిపతులు వారి వారి పాలనా అధికారాన్ని, బోధనలను జగద్గురువుల సర్వోన్నత అధికారానికి లోబడి చేపడతారు. ఈ విధంగా పీఠాధిపతులు క్రీస్తు ప్రభుని బోధనలకు జగద్గురువుల ఆలోచనలకు విశ్వసనీయంగా ఉంటారు. 'పొరబడనితనం' *(infallibility)* అనే విశిష్ట గుణాన్ని మన రక్షకుడు క్రీస్తు ప్రభువే శ్రీసభకు ప్రసాదించాడు. జగద్గురువులకు ముఖ్యంగా క్రైస్తవ విశ్వాస సత్యాలను ప్రకటించేటప్పుడు, కొన్ని నైతిక నియమాలకు సంబంధించిన బోధనలు చేసేటప్పుడు ఈ విశిష్ట గుణం వర్తిస్తుంది *(LG, 25).*

"ప్రపంచ పీఠాధిపతుల మధ్య ఉండే ఈ సఖ్యతా సంబంధాలే *(collegiality)* ఆయా పీఠాధిపతులకు తమ తమ స్థానిక శ్రీసభలతోనూ, విశ్వ శ్రీసభతోనూ నిర్విఘ్నంగా కొనసాగుతూ ఉంటాయి" అని తెలియజేస్తూ, "ఈ స్థానిక శ్రీసభల వ్యవస్థాగత నిర్మాణం విశ్వకతోలిక నిర్మాణాన్నే పోలి ఉంటుంది. గనుక ఈ స్థానిక శ్రీసభల సమూహారంతోనే విలక్షణమైన విశ్వ శ్రీసభ రూపు దిద్దుకుంటుందని వ్యక్తపరుస్తుంది. విశ్వ శ్రీసభలో స్థానిక శ్రీసభ తన ఉనికిని కలిగి ఉండదని,

స్థానిక శ్రీసభల యందే విశ్వ శ్రీసభ తన విశ్వ వ్యాప్త ఉనికిని చాటుకుంటుందని తెలియజేసింది. స్థానిక శ్రీసభల ఐక్యతానుబంధ రూపమే విశ్వ శ్రీసభ *(LG, 23).* స్థానిక శ్రీసభలకు ప్రాధాన్యత నివ్వటం ఈ మహాసభ తెచ్చిన మార్పుల్లో అత్యంత ప్రధానమైనదని చెప్పుకోవచ్చు.

ప్రధాన యాజకుడైన క్రీస్తుని గురుత్వంలో పాలుపంచుకుంటున్న గురువులు – 'పవిత్ర గురుపట్టాభిషేక దివ్య సంస్కారంలో భాగస్వాములుగాను, సర్వోన్నతుడు నిత్య యాజకుడైన క్రీస్తు ప్రభు ప్రతిరూపాలుగా' త్రివిధ ధర్మాలైన, ప్రవక్తలుగా, కాపరులుగా, రాజులుగా, పీఠాధిపతులకు సన్నిహితంగా సహకరిస్తూ, విశ్వాసుల ఆత్మ శరీర మేలుల కోసం పరిచర్య చేస్తుంటారు. అలాగే – మానవులకు దేవుడికీ మధ్యవర్తిగా అవతరించిన ప్రభు క్రీస్తుకు (1 తిమోతి 2:5) ప్రతినిధులుగా గురువులు సత్యవేద బోధకులై ప్రభువు ఆవిష్కరించిన వేదాంత సత్యాలను మానవులందరికి బోధిస్తూ ఉంటారు *(LG, 28).* శ్రీసభ పరిచారక వ్యవస్థలోనున్న డీకను అంతస్తుకు అభిషేకం పొందిన వారు పీఠాధిపతులకు, గురువులకు దైవార్చన ఆరాధన కార్యక్రమాలలో సహకరిస్తూ, సాంఘీక అవసరతలను తీరుస్తుంటారు *(LG, 29).*

## 4. గృహస్థ క్రైస్తవులు – సహవాస సాంగత్య జీవనం

శ్రీసభ దైవార్చన ఆరాధనా క్రమాలలో, పరిపాలనా వ్యవహారాలలో గతమున కాస్తంత నిర్లక్ష్యం చేయబడిన గృహస్థ క్రైస్తవుల పాత్రను ఈ ద్వితీయ వాటికను మహాసభ పునరుద్ధరించింది. 'దైవజనం' గా వర్ణించబడిన శ్రీసభ ఒక ఐక్యతా సహవాస దివ్యసంస్కారం. అనగా విశ్వాసుల మధ్య ఐక్యతతో కూడిన సహవాస జీవన సంస్కారమే శ్రీసభఅని అర్ధం. క్రీస్తుద్వారా పవిత్రాత్మయందు దైవత్వంలో పాలుపంచుకోవటమే సహవాస సాంగత్యం. జ్ఞానస్నానం ద్వారా త్రియేక సర్వేశ్వరుని సహవాసంలో ఐక్యత నొందుతారు. ఈ ఐక్యతానుబంధ జీవనం దివ్యసత్ప్రసాదం ద్వారా బలపడుతుంది. క్రీస్తు ప్రభువు ప్రావక్తిక, గురుత్వ, రాచరిక పాలనా సేవల్లో తమదైన రీతిలో పాలుపంచుకుంటారు. అంతేగాక వారు క్రీస్తు ప్రేషితకార్యాలను శ్రీసభ లోపలా, బయటా కొనసాగిస్తారు. ఈ అధికార పత్రం నాలుగవ అధ్యాయంలోని అంశాలు, చర్చలు దీనికి నిదర్శనం.

జ్ఞానస్నానం స్వీకరించి యాజక అంతస్తుకు *(holy orders)*, శ్రీసభ ఆమోదం పొందిన మఠసంస్థలకు *(religious orders)* చెందినవారు మినహా శ్రీసభలోని ఇతర విశ్వాసులందరూ 'గృహస్థ క్రైస్తవులు' గా పిలువబడ్డారు. "క్రీస్తు ప్రభు దేహంలో అంతర్భాగాలుగా, దైవప్రజా సంఘంలో సభ్యులుగా తమ తమ స్థాయీ హోదాల ప్రకారం – క్రీస్తు యాజక ధర్మాన్ని, ప్రవచన ధర్మాన్ని, రాజ (నాయకత్వ) ధర్మాన్ని పుణికి పుచ్చుకునేవారు, తమ శక్తి సామర్థ్యాల మేరకు ఇతర విశ్వాసులతో కలసి లోకరక్షణ ఉద్యమాన్ని ఇటు శ్రీసభలోను అటు ప్రపంచంలోను కొనసాగించడానికి చిత్తశుద్ధితో కృషి చేసేవారే గృహస్థ క్రైస్తవులు" *(LG, 31).*

శ్రీసభలోని యాజక అంతస్తు, మఠవాస జీవిత అంతస్తులో జీవించే వారివలే కాకుండా ఈ లౌకిక ప్రపంచంలో వివిధ వృత్తులు, కుటుంబ జీవితంలో నిమగ్నమై వారి వారిదైనందిన కార్యకలాపాల్లో క్రీస్తు సువార్తావిలువలను పాటిస్తూ, ప్రకటించటం వీరి ముఖ్య లక్ష్యం.

బప్తిస్మం ద్వారా క్రైస్తవులందరూ దేవుని బిడ్డలుగా పిలవబడే భాగ్యాన్ని పొందుతారు. క్రైస్తవుల మధ్య జాతి, వర్ణ, వర్గ, లింగ భేదాలు, అసమానతలు ఉ ండతగదు. నిష్పక్షపాతంగా క్రైస్తవులందరూ విశ్వాస వరాన్ని పొందుకుంటారు. వారి అనుదిన లౌకిక కార్యకలాపాలను క్రీస్తులో ఐక్యమై జీవించినప్పుడు శాంతి సమాధానాలకు నిలయమైన దైవరాజ్య నిర్మాణం జరుగుతుంది.

అసాధారణ యాజకత్వంలో పాలుపంచుకొంటూ అభిషిక్త జీవితాన్ని ఎంచుకొన్న యాజకులకు వారి బోధనా పరిచర్యలో, శ్రీసభను దివ్య సంస్కారాల ద్వారా పవిత్ర పరచే పరిచర్యలో గృహస్థ క్రైస్తవులుగా వీరు సహకరిస్తారు. గృహస్థ క్రైస్తవులు వారి ఆధ్యాత్మిక గురువులతో కలసి వారి ఆలోచనలను, సలహాలను, సూచనలను, శక్తి సామర్థ్యాలను శ్రీసభ ప్రయోజనం కోసం అందించాలి. శ్రీసభలోని వివిధ అంతస్తులలో ఉన్ననాయకుల అధికారాన్ని గౌరవిస్తూ, వారికోసం ప్రార్థిస్తూ వారి నిర్ణయాధికారంలో పాలుపంచుకుంటారు *(LG, 31).* అయితే శ్రీసభలో పరిపాలన నియంత్రణ, అధికార నిర్వహణను అభిషిక్తులైనవారే కలిగి ఉంటారని, గృహస్థ క్రైస్తవులు ఈ విషయాల్లో వారికి సహకారం అందిస్తారని శ్రీసభ చట్టం 129 చెబుతోంది. వీరికి వాక్యపరిచర్య, దైవార్చనలోని ప్రార్థనల

పరివేక్షణ, జ్ఞానస్నానం ఇవ్వడం, దివ్యసత్ర్పసాదం పంచడం వంటి పరిచర్యలను అప్పగించవచ్చని రెండవ జాన్ పాల్ పోపుగారు ప్రతిపాదించారు (*Christifidelis laici, 23*). శ్రీసభ సేవక కర్తవ్యానికి ప్రాధాన్యత ఇస్తూ, ఆధునిక ప్రపంచంలో గృహస్థ క్రైస్తవులు మరింత క్రియాశీలకంగా, ఔదార్యంగా సేవ చేయాలని ద్వితీయ వాటికన్ మహాసభ ఉద్బోధించింది. (*Gaudium et spes, 93*). వారి ద్వారానే శ్రీసభ లోకాన్ని ప్రభావితం చేయగల్గుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేసింది. గృహస్థ క్రైస్తవులంటే ఎవరో సరైన అవగాహన కల్పిస్తూ, గురువులు – గృహస్థ క్రైస్తవులు సహవాస జీవితం కలిగి, సహబాద్యతతో వ్యవహరించే సరికొత్త యుగానికి తలుపులు తెరిచింది.

## 5. సార్వత్రిక పవిత్రీకరణకు పిలుపు – మఠవాస జీవితం

'శ్రీసభ పవిత్రమైనది'. ఇది విశ్వాస సత్యం. శ్రీసభకు ఈ పవిత్రత సాక్షాత్తు శ్రీసభకు శిరస్సయిన క్రీస్తు ప్రభువు ద్వారానే సిద్ధిస్తుంది. గనుకనే శ్రీసభలోని సభ్యులందరు – వారు పాలకవర్గంలో ఉన్న పీఠాధిపతులు గురువులుగానీ, వారి పాలనలో గల క్రైస్తవ విశ్వాసులుగానీ అందరూ పవిత్ర జీవనం గడపటానికి సమర్థులై బద్ధులై ఉన్నారు. శ్రీసభ పవిత్రత స్వభావం విశ్వాసుల జీవితాలలో పవిత్రాత్మ ప్రభావంతో ఫలించే కృపానుగ్రహాల ద్వారా వ్యక్తమవుతుంది (*LG, 39*). క్రీస్తు ప్రభువు తన మరణ పునరుత్థానాల ద్వారా శ్రీసభను పవిత్ర పరచి పవిత్రాత్మను కురిపిస్తూ అనునిత్యం పవిత్ర పరుస్తూనే ఉన్నారు.

పీఠాధిపతులు – ఆత్మ శుద్ధి కలిగి పవిత్రజీవనం గడుపుతూ, మంచి కాపరులుగా ప్రజలకు మార్గదర్శులుగా ఉండాలి (1 పేతురు 5:3); గురువులు తమ యాజక ధర్మాలను చిత్త శుద్ధితో అకుంఠిత దీక్షతో నిర్వర్తించడం, స్థానిక పీఠాధిపతులతో సఖ్యతా సంఘీభావం కలిగి ఉండటం, సహ గురువులతో సౌహార్థ సంబంధాలు కలిగివుండటం, దైవ ప్రజల పట్ల ప్రేమాభిమానాలు, గౌరవభావం కలిగి ఉండాలి; డీకనులు – విధేయులైన సేవకులుగా సకల దుర్లక్షణాలకు దూరంగా, దేవునికి ప్రీతికరమైన పనులను చేస్తూ, సాటివారికి ఆదర్శప్రాయులుగా జీవించాలి (1 తిమోతి 3:8–10,12–13). మరియు మఠవాస జీవితానికి అంకితమైన వారు శ్రీసభలో వారి వారి పరిచర్యల ద్వారా ముఖ్యంగా శ్రీసభ పరిచర్యకు సంపూర్ణంగా అంకితమవటం ద్వారా పవిత్రతను సాధించగలరు.

గృహస్థ క్రైస్తవులు తమ దైనందిన జీవితాల ద్వారా దేవుని రాజ్యాన్ని కాంక్షిస్తారు. దివ్య సంస్కారాలను తరచుగా స్వీకరించటం, ముఖ్యంగా దివ్యబలి పూజలో పాల్గొనటం, తరచుగా ప్రార్థించటం, తోటి వారికి సహాయపడటం, లౌకిక వ్యామోహాలను, వస్తువులను, సంపదలను త్యజించటం, సుకృత పుణ్య కార్యాలు చేయటం లాంటివి పవిత్ర జీవనాన్ని పదిలంగా నిలుపుకోటానికి దోహదపడతాయి. వీటన్నింటికి ప్రేమ మూల కారణమై ఉండాలి. "దేవుడు ఈ లోకం పట్ల చూపిన ప్రేమానురాగాలను – క్రైస్తవ విశ్వాసులు తమ లౌకిక ధర్మనిర్వహణలోనూచూపగలిగితే, ప్రేమ సేవాభావాలతో తమ తమ దైనందిన జీవితాలను గడపగలిగితే – అవన్నీ వారి ఆత్మశుద్ధీకరణకు ఉపకరణాలవుతాయి, వారిని పవిత్రులను చేస్తాయి *(LG, 41).*

ఈ అధ్యాయం వివిధ రకాలైన జీవన స్థితులను (వివాహిత, అవివాహిత, మఠవాస జీవితం, యాజకత్వం) గౌరవప్రదంగా గుర్తిస్తూ వారి వారి జీవిత అంతస్తులకు తగినట్లుగా అందివచ్చిన అవకాశాలను ఉపయోగించుకొని పవిత్ర జీవనం జీవించాలని పిలుపునిస్తుంది. విశ్వాసులందరూ తమ జీవిత విధానాలను, పరిస్థితులను నిత్యం క్రీస్తుకు విశ్వాసపాత్రంగా జీవించేటట్లుగా పవిత్రాత్మ శక్తితో మలచుకోవాలి. వేదసాక్షుల ధన్యమరణాలను క్రీస్తుకు, క్రీస్తు ప్రేమకు కడపటి సాక్ష్యంగా పరిగణిస్తుంది.

అ తరువాత అధ్యాయం మఠవాసులను గురించి వివరిస్తూ, మఠవాస జీవితం ప్రధాన ఉద్దేశ్యం దేవునితో వ్యక్తిగత సంబంధాన్ని మరింతగా బలోపేతం చేసుకోడానికి, క్రీస్తును, ఆయన జీవిత విధానాన్ని కేంద్రంగా చేసుకొని సమగ్ర క్రైస్తవ పరిపూర్ణత సాధన దిశగా పయనించడమేనని ప్రకటించింది. మఠవాస జీవిత విధానం, అసాధారణ యాజకత్వ జీవిత పిలుపుకు, సామాన్య గృహస్థ జీవిత పిలుపుకు మధ్య మధ్యవర్తిత్వ జీవితం కాదని, దైవ సంకల్పం ప్రకారం రూపుదిద్దు కొన్న విలక్షణమైన స్వతంత్రమైన భక్తి జీవన విధానం అని వక్కాణించిది *(LG, 43).* శ్రీసభలో సాంప్రదాయకంగా 'ఇవాంజెలికల్ కౌన్సిల్స్'గా పిలువబడుతున్న బ్రహ్మచర్యం, పేదరికం, విధేయత అనబడే మూడు సువార్త విలువలు, మఠవాస జీవితానికి మూల స్తంభాలు.

ఈ మార్గాన్ని అనుసరించడానికి దేవుడు అటు గురువులను, ఇటు గృహస్థ క్రైస్తవులను ఆహ్వానిస్తాడు. సువార్తా విలువలైన త్రివిధ జీవన ధర్మాలుకు బ్రహ్మాచర్యం, పేదరికం, విధేయత – కట్టుబడి జీవిస్తామని ప్రతిజ్ఞలు చేస్తారు. (మఠవాస జీవితంలో మాట పట్టు అంటారు). మఠవాసులు ఆదర్శ జీవనం గడపాలి. విద్య, వైద్య, సేవా రంగాలలో దేవుని ప్రేమ, దయ, కనికరం కనిపించేలా మఠవాసుల పరిచర్య కొనసాగాలి. మేత్రాసణ అవసరాలకు తగినట్లుగా, వారి పరిచర్యలో మేత్రాణులకు తప్పనిసరిగా సహకరిస్తూ, అను నిత్యం దైవచిత్తానికి విధేయులై కాలానుగుణంగా పరిచర్య విధి విధానాలలో మార్పులు చేర్పులు చేసుకోవాలి.

## 6. పరిపూర్ణత వైపు పయనించే యాత్రిక శ్రీసభ

శ్రీసభ కేవలం ఇహలోకపరమైనది కాదని యాత్రిక శ్రీసభ గుర్తుచేస్తుంది. మహిమాన్వితమైన పరలోకంలో ప్రవేశించాకనే శ్రీసభ పరిపూర్ణత్వాన్ని సంతరించుకుంటుంది. శ్రీసభ ఒక సాంఘీక వ్యవస్థ లాగ కనిపిస్తున్నప్పటికీ మానవ చతురతతో నడపబడుతున్నప్పటికీ క్రీస్తుని దేహమన్న విషయం మరువరాదు *(LG, 49)*. సృష్టి ఆరంభం నుండి ముఖ్యంగాదేవుని పోలికలో సృష్టించబడి, బప్తిస్మంస్వీకరించి, శ్రీసభ సంస్కారాల సంబంధమైన జీవితంలో పాలుపంచుకొంటూ శ్రీసభ సభ్యులు పరలోకం వైపు తీర్థయాత్ర చేస్తున్నారు. ఈ తీర్థయాత్ర మనలను పరలోకంలో పునీతుల సహవాసానికి చేరుస్తుంది.

ప్రభువైన యేసు క్రీస్తుని కృప, పరిశుద్ధాత్మ ప్రభుని అనుగ్రహం ద్వారా శ్రీసభ ఇహలోకం నుండి పరలోకం వైపు పరిపూర్ణత కోసం పురోగమిస్తుంది. శ్రీసభ నిరంతరం శోధనలు ఎదుర్కొంటూ, అప్పుడప్పుడు గాయపడినా మరల దేవుని కృపతో ముందుకు నడిపించబడుతుంది. ఆశాభావంతో నిరీక్షిస్తూ లోకాంత్యాన పునరుద్ధరణ కోసం వేచి ఉంది.

శ్రీసభలో జీవించుచున్న విశ్వాసులు, మరణించిన విశ్వాసులు క్రీస్తులో ఐక్యమై ఆయన దయలో పాలుపంచుకుంటారు. ఒకరి కోసం ఒకరు వేడుదల ప్రార్థన చేసుకుంటారు. సకల విశ్వాసులు క్రీస్తు అంతిమ రాకడకోసం ఎదురు చూస్తూ పవిత్రత సాధన దిశగా ప్రయత్నిస్తూ ముఖ్యంగా దైవరాజ్యస్థాపన పరిపూర్ణత కోసం సిద్ధమవుతున్నారు *(LG,51)*.

## 7. మరియమాత – శ్రీసభ మాత

ఈ అధికార పత్రం శ్రీసభ యదార్ధ స్వభావం గురించి అయినప్పటికీ, రక్షణ ప్రణాళికలో మరియమాత పోషించిన విశిష్ట పాత్రను బట్టి, చివరి అధ్యాయంలో, ఎన్నో చర్చోపచర్చలు తర్వాత, శ్రీసభలో మరియమాత పాత్రను విశ్లేషించడం అనివార్యమైందని చెప్పక తప్పదు. పరిశుద్ధ గ్రంథం మరియు శ్రీసభ పితృపాదుల అధ్యయనం ఆధారంగా, శ్రీసభ శాస్త్రం *(ecclesiology)* మరియు మరియమాత శాస్త్రం *(mariology)* మధ్య చాలా గొప్ప సంభందముందని, ఇది అనాదిగా శ్రీసభ విశ్వాసమని, ఈ మహాసభలో పాల్గొన్న వేదపండితులు ధృవీకరించారు. ఈ ఉద్దేశ్యంతోనే పరిశుద్ద 6వ పాల్ పాపుగారు, మహాసభ మూడవ భాగం ముగిసే సమయంలో మరియ తల్లిని 'శ్రీసభమాత'గా *(Mater ecclesiae)* ప్రకటించారు. శ్రీసభలో క్రీస్తు ప్రభువు తర్వాత అగ్రస్థానం మరియమాతకే చెందుతుంది. "గనకనే ద్వితీయ వాటికను మహాసభ శ్రీసభకు సంబంధించిన మౌలిక సిద్ధాంతాన్ని వివరించే సందర్భంలోనే శ్రీసభకూ మరియమాతకు మధ్య గల సాన్నిహిత్యాన్ని స్పష్టంగా ప్రకటించింది; దైవవాగ్రూపుడైన క్రీస్తుప్రభువు మనుజావతారం దాల్చడంలో, మానవరక్షణ మహత్కార్యాన్ని కొనసాగిస్తోన్న "ప్రభు దివ్యదేహం" (శ్రీసభ) ఆవిర్భావంలోను మరియమాతకు గల పాత్రను వివరించింది; ఆ దేవమాత, క్రీస్తు ప్రభుజనని, మానవులందరి మాతృమూర్తి – ముఖ్యంగా విశ్వాసుల మాత – మరియపట్ల రక్షణపొందిన ప్రజలకు గల బాధ్యతల గురించి కూడా మహాసభ స్పష్టమైన సత్యప్రకటనం చేసింది" *(LG, 54).*

ఇందుకు నిదర్శనమే ఈ ఆధ్యాయం ప్రారంభ పలుకులు: "మానవ రక్షణ ప్రణాళిక ఇది; దేవుడు సిద్ధంచేసిన రక్షాప్రణాళిక దైవకుమారుడు క్రీస్తు ప్రభువు ద్వారా నెరవేరిన విధానము ఇదే. ఇది నిగూఢ సత్యమైనప్పటికీ దానిని దేవుడే మనకు ఎరుకపరచాడు; అదే రక్షణ ప్రణాళికను శ్రీసభ ద్వారా నేటికీ కొనసాగిస్తూనే ఉన్నాడు. శ్రీసభను సాక్షాత్తూ క్రీస్తు ప్రభువే 'దివ్యదేహం'గా రూపొందించాడనీ, తానే దానిని స్థాపించాడనీ ఇంతకు ముందు భాగాల్లో తెలుసుకున్నాం. శ్రీసభకు శిరస్సయిన క్రీస్తు ప్రభువుతో ఏకమై, ఆయన దివ్యదేహంలో అంతర్భాగాలైన విశ్వాసులందరు ప్రభు భక్తులైన పునీతులతో కలసి "దేవమాత, యేసు క్రీస్తు

ప్రియజనని, మహిమాన్వితమైన కన్యమరియను" సగౌరవంగా స్మరిస్తూ ఉండాలి, ఆమె మధ్యవర్తిత్వాన్ని అర్థిస్తూ ప్రార్థన చేస్తూండాలి" *(LG, 52).*

దేవుడు సిద్ధం చేసుకున్న మానవ రక్షణ ప్రణాళికలో మరియమాత విశిష్టతను, కీలకమైన పాత్రను వివరిస్తూ, లోకరక్షణ మహాయాగంలో భాగస్వామినిగా నిలిచింది అని స్పష్టం చేస్తుంది. అయితే "దైవసంకల్పానికి యాంత్రికంగా సహకరించిన బలహీనురాలుగా గాక, ధృడమైన భక్తి విశ్వాసాలు గల ధీశాలి, స్వచ్ఛందంగా స్వేచ్ఛగా చైతన్యవంతంగానే ఆమె మానవ రక్షణోద్యమంలో పాల్గొంది; విశ్వాసము విధేయతా గుణాలు ఇందులో ఆమెకు ఎంతగానో తోడ్పడ్డాయి, కార్యరంగంలో ఆమెను ముందుకు నడిపించాయి" అని ప్రకటించింది *(LG, 56).*

దేవుడికి మానవులకు క్రీస్తు మధ్యవర్తి అయితే, మరియమాత మధ్యవర్తిత్వ పాత్ర తన కుమారుడు క్రీస్తు పనిని పరిపూర్తిచేస్తుంది. "నిజానికి – దైవ మానవ ఏకైక సంధాత క్రీస్తు ప్రభు దివ్య శక్తినే మరియాంబ తన మాతృత్వపు మధ్య వర్తిత్వం ద్వారా వెల్లడిస్తుంది, ప్రభు వాత్సల్యానికి కారుణ్యానికి తానొక వాహికగా నిలుస్తుంది" *(LG, 60).* ఈ మధ్యవర్తిత్వంలో తన కుమారుడితో తనకున్న సాన్నిహిత్యం మరియు రక్షణ ప్రణాళికలో తన ప్రత్యేక స్థానం ప్రతిబింబిస్తున్నాయి. అందుకే 'లోకరక్షణ సాధనలో ప్రభునకు విశ్వసనీయమైన సహచరినిగా నిలచి, లోకరక్షకుడు తలపెట్టిన లోకోద్ధరణ మహత్కార్యంలో మరియ తల్లి భాగస్వామిని కాగలిగింది' అని మహాసభ ప్రకటించింది *(LG, 61).* ఆత్మ శరీరాలతో మోక్షానికి కొనిపోబడిన తర్వాత కూడా మానవ రక్షణోద్యమంలో తాను నిర్వర్తించవలసిన బాధ్యతల నుండి వైదొలగక, విశ్వాసులందరినీ కంటికీ రెప్పలా కాపాడుతూ, ప్రతి ఒక్కరి కోసం ప్రార్థిస్తూ, వారంతా సురక్షితంగా తిరిగి నిత్యనివాసానికి చేరే వరకు మరియాంబ వారి వెన్నంటే ఉంటుంది *(LG, 62).*

శ్రీసభ తన దైవార్చన ఆరాధన క్రమాలలో మరియమాత భక్తి సంప్రదాయాన్ని మరోమారు ద్వితీయ వాటికను మహాసభ సాధికారికంగా రూఢిపరచింది. (జపమాల ప్రార్థన, నవదిన ప్రార్థనలు, మరియమాత వెలసిన పుణ్యక్షేత్రాలకు తీర్థయాత్రలు, మొదలైనవి) శ్రీసభలో అనాదిగా కొనసాగుతున్న మరియమాత భక్తి సాంప్రదాయ

ప్రార్థనలు క్రైస్తవులు త్రియేక దేవునికి చేసే 'దైవార్చనా ఆరాధన సాంప్రదాయం'కు పూర్తిగా భిన్నమైనవని గ్రహించాలి. మరియమాత పట్ల మనం చూపే భక్తి ప్రవత్తులు గౌరవ మర్యాదలన్నీ క్రీస్తు ప్రభువుకే చెందుతాయని తెలియజేసింది *(LG, 67).* కతోలికేతర క్రైస్తవులలో మరియమాతకు ఇవ్వబడిన గౌరవాన్ని, మరియమాత పట్ల వారి భక్తికృత్యాలను అంగీకరిస్తూ, ప్రశంసిస్తుంది. ముఖ్యంగా మరియమాత క్రైస్తవ సమైక్యత సాధన దిశగా తనబిడ్డలలో ఆశను పెంపొందిస్తూ ఉంటుంది.

మరియమాత మోక్షారోపణం యాత్రిక శ్రీసభలోని దైవ జనులకు ఆశాదీపం, స్వాంతన హస్తం. ప్రభుని పునరాగమన రోజు వరకు శ్రీసభకు మార్గచూపరిగా నిలుస్తుంది. లోకమాత అయిన మరియమాత – లోక కళ్యాణం కోరుతూ ప్రార్థిస్తూనే ఉంటారు. ఆ తల్లి సద్గుణాలను పాటించడం ద్వారా ముఖ్యంగా దేవమాత మధ్యవర్తిత్వాన్ని వేడుకోవటం ద్వారా శ్రీసభ తన లక్ష్యమైన సువార్తా ప్రకటన, ఆత్మల రక్షణను సులువుగా చేరుకోగలదు *(LG, 68-69).*

## ముగింపు

శ్రీసభ యొక్క స్వభావాన్ని, ప్రేషితకార్యాన్ని నిర్వచించడంలో ద్వితీయ వాటికను మహాసభ ద్వారా వెలువడిన 'లోకానికి వెలుగు శ్రీసభ' అధికార పత్రం అత్యంత ప్రధానమైన పాత్ర పోషించింది. విశేషంగా శ్రీసభ అంటే ఒక వ్యవస్థ, సంస్థ కాదు. అది ఒక పరమ రహస్యం. దివ్య సంస్కారం. శ్రీసభ అంటే క్రీస్తు శరీరమని, దైవజనమని నిర్వచించడం ద్వారా, జ్ఞానస్నానం స్వీకరించిన ప్రతి ఒక్కరూ త్రియేక సర్వేశరుని సహవాసంలో భాగస్తులవుతారు. తద్వారా శ్రీసభ సభ్యులందరూ సమాన హోదా గౌరవం కలిగి ఉంటారు, పవిత్ర జీవనానికి పిలువబడతారు. తమ తమ సేవాధర్మాన్ని, ముఖ్యంగా త్రివిధ పరిచర్యలను నెరవేర్చడం ద్వారా, క్రీస్తు ప్రభుని ప్రేషిత కార్యాన్ని భాద్యతాయుతంగా నిర్వర్తిస్తారని వక్కాణించింది. శ్రీసభ సేవా కార్యలలో భిన్నత్వం ఉన్నప్పటికీ, సేవాధర్మం, సేవా భాద్యత, సేవా కర్తవ్యం మాత్రం ఒక్కటే అని స్పష్టం చేసింది. ఇందు మూలంగా శ్రీసభ ఆలోచనా విధానంలోనూ నిర్వహణ శైలిలోనూ సమూల మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ మహాసభ ద్వారా తెచ్చిన మార్పులు ఆవిష్కరణలు ఆశ్చర్యపరిచే విధంగా శ్రీసభ ముఖచిత్రాన్ని మార్చివేశాయి అని చెప్పడం సముచితమే.

ద్వితీయ వాటికను మహాసభలో పాల్గొనిన వేదపండితులు, ఆ పిమ్మట ఎన్నుకోబడ్డ జగద్గురువులు; 6వ భక్తినాధ పాపు గారు, 1వ జాన్ పాల్ పాపు గారు, 2వ పునీత జాన్ పాల్ పాపు గారు, 16వ బెనెడిక్ట్ పాపు గారు చేసిన వ్యాఖ్యానాలు, విశ్లేషణలు, ఆలోచనలు శ్రీసభ స్వభావాన్ని మరింతగా వివరిస్తూ శ్రీసభ ప్రేషితకార్య నిర్వహణ పట్ల శ్రీసభ బాధ్యతను గుర్తు చేశారు. ఈ అధికార పత్రం కతోలిక శ్రీసభలోని వేదాంత శాస్త్రాన్ని, ఆలోచనలను, బోధనలను, పాఠ్యాంశాలను ముఖ్యంగా శ్రీసభను గూర్చి నిశితంగా విశ్లేషించే శ్రీసభ శాస్త్రాన్ని లోతుగా అధ్యయనం చేయటానికి దోహదపడుతుంది. శ్రీసభ పవిత్రత సాధన దిశగా చేసే ప్రయాణంలో చాలా సవాళ్లను అధిగమించవలసి వస్తుందని ద్వితీయ వాటికను మహాసభలో పాల్గొనిన పండితులు ముందుగానే ఊహించారు. అయినప్పటికీ క్రీస్తు ప్రభుని కృపానుగ్రహాలతో, పవిత్రాత్మ ప్రభుని నడిపింపుతో శ్రీసభ పవిత్రత సాధ్యమని గమనించాలి. విశ్వాసుల మానవ బలహీనతలను, పాపపు స్వభావాన్ని క్రీస్తు కృపానుగ్రహాలు అధిగమించగలవు, జయించగలవు.

**'సహప్రయాణం' *(synodality)* : శ్రీసభ సరిక్రొత్త జీవన విధానం *(A New Way of being Church)***

ప్రస్తుతం శ్రీసభ చేపట్టిన బృహత్తర ప్రక్రియ 'సహప్రయాణం' లో ధ్యానిస్తున్న అంశాలైన సహవాసం *(communion)* – భాగస్వామ్యం *(participation)* – ప్రేషితకార్యం *(mission)*, 'శ్రీసభ లోకానికి వెలుగు' అధికారక పత్రం నుండి జనించినవే. ప్రస్తుతం శ్రీసభలో కొనసాగుతున్న 'సహప్రయాణం'లో శ్రీసభ సరిక్రొత్త దిశగా అడుగులు వేస్తుంది. ముఖ్యంగా సువార్త విలువలైన ప్రేమ, శాంతి, సమాధానం, న్యాయం ప్రతిబింబించేలా నేటి పరిస్థితులకు అనుకూలంగా శ్రీసభ రూపాంతరం చెందుతుంది. ఈ ఆధునికయుగంలో శ్రీసభ ఒక క్రమానుగత వ్యవస్థగాకాక దైవప్రజల విశ్వాస ప్రయాణంలో కలసి నడుస్తుంది.

**'సహప్రయాణం' :**

- ❖ శ్రీసభ విశ్వాసుల సమూహమని దృఢపరస్తుంది. భిన్నత్వంలో ఏకత్వం ఉన్నదని విశ్వసిస్తుంది.
- ❖ విశ్వాసుల అభిప్రాయాలను, ఆవేదనలను సావధానలగా అలకించాలని

చూచిస్తుంది. ఇతరమతస్తుల అభిప్రాయాలను గౌరవిస్తూ వారితో నిర్మాణాత్మకమైన చర్చలు జరపాలని ప్రోత్సహిస్తుంది.

❖ సకల విశ్వాసులు శ్రీసభ ప్రేషితకార్యంలో మరియు అనుదిన శ్రీసభ పరిచర్యలో చురుకుగా పాల్గొనాలని ఆహ్వానిస్తుంది.

❖ శ్రీసభ తన ప్రేషితకార్యమైన సువార్తీకరనకు మరియు మానవసేవకు పునరంకితంకావాలని స్పష్టం చేస్తుంది. ముఖ్యంగా పేదలను, అవసరాలలో ఉన్నవారిని ఆదుకుంటూ క్రీస్తుకి బలమైన సాక్ష్యంగా నిలవాలని బోధిస్తుంది.

❖ శ్రీసభ పాలన వ్యవహారాలలో పారదర్శకత మరియు జవాబుదారీతనం స్పష్టంగా ఉండాలని చూచిస్తుంది.

సాధారణంగా మన కతోలిక శ్రీసభలో ఒక విధమైన నిర్లిప్త దోరణి కనిపిస్తుంది. ముఖ్యంగా ప్రేషిత కార్య నిర్వహణలో క్రియాశీలత, చైతన్యం, ఆసక్తి కొరవడి ఏదో మొక్కుబడిగా చేసుకుపోయే యాంత్రిక నిద్రాణ స్థితిలోనికి జారిపోయింది. వీటిని అధిగమించాలంటే, మన శ్రీసభ తొలినాటి క్రైస్తవ సంఘ ఆదర్శానుసారం, క్రీస్తుతో మరియు ఇతర సభ్యులతో సహవాసంతో జీవిస్తూ, సమ భావంతో, సహ బాధ్యతతో, సహ భాగస్వామ్యం కలిగి సువార్తను ప్రకటించాలి. ఒక పరిచారక శ్రీసభగా రూపుదిద్దుకొని, సాంప్రదాయకంగా చేస్తున్న సేవలకే పరిమితం కాకుండా, సామాన్య ప్రజల స్థితిగతులను బట్టి సరికొత్త పరిచర్యలు అందించాలి. ఇది దైవ ప్రజలందరి భాధ్యత. ఎంత క్రియాశీలకంగా నిర్వర్తిస్తారో, అంతా ఉన్నతంగా క్రీస్తు ప్రేషితకార్యం నెరవేరుతుంది, ఆ మేరకు దైవ రాజ్య స్థాపన జరుగుతుంది.

## Questions for Discussion

1. నేటి లౌకిక, బహుళ మత విశ్వాసాలు, సంస్కృతులు ఉన్న మనదేశంలో శ్రీసభ ఏవిధంగా రక్షణ మార్గచూపరిగాఉండగలదు?

2. ప్రస్తుతం శ్రీసభలో నిర్వహించబడుతున్న 'సహ ప్రయాణం' నేపథ్యంలో, దైవప్రజల పవిత్రీకరణకు, శ్రీసభ ప్రేషితకార్యంలో నిర్మాణాత్మకమైన భాగస్వామ్యాన్ని స్థానిక శ్రీసభ ఏ విధంగా ప్రోత్సహించగలదు?

# 5. దైవవాక్కు
## *(Dei Verbum)*

**- ఫాదర్ గోవిందు రాయన్న**

### తొలిపలుకులు



'ద్వితీయ వాటికన్ మహాసభ' నాటికి ప్రపంచంలో అనూహ్యామైన మార్పులు సంభవించాయి. అభివృద్ధి చెందుతోన్న దేశాలు స్వేచ్చా స్వాతంత్ర్యాన్ని సాధించుకున్నాయి. సంస్కృతీ సంప్రదాయాలపై మక్కువ పెరగడం ప్రారంభమయింది. నవ నాగరీకత పేరుతో పారిశ్రామికీకరణం, పట్టనాలకూ, నగరాలకూ వలసలు పెరగడంతో సామాజిక వ్యవస్థ దెబ్బతింది. నైతిక విలువల వినాశం మొదలైంది. సమాచార మాధ్యమాల, ముఖ్యంగా టెలివిజన్ ప్రభావంవలన వ్యక్తుల మధ్య, కుటుంబ సభ్యుల మధ్య సంబంధాలు విలవిలలాడ ప్రారంభించాయి.

సామాన్య క్రైస్తవులు చైతన్యవంతులై శ్రీసభలో క్రియాశీలకమైన పాత్ర వహించ ముందుకు వచ్చారు. శ్రీసభలో సంస్కరణలు రావాలని కావాలని కోరుకునే వారి సంఖ్య రోజురోజుకు పెరగడం ప్రారంభమయింది. సర్వ క్రైస్తవ సమైక్యతా ఉద్యమానిక్ని బలమైన పునాదులు ఏర్పడడం, కతోలిక వేదాంత శాస్త్రవేత్తలు "బైబులు గ్రంథ" పారాయణం, ధ్యానాలను ప్రోత్సహించడం, బైబులు వ్యాఖ్యానం, ప్రబోధనం పద్ధతులలో నూతన విధానాలు ప్రవేశపెట్టడం, వెలువరించడం నూతన ఉత్సాహంతో విస్తరిస్తూవచ్చాయి.

ఈ నేపధ్యంలో పునీత 9వ జాన్ జగద్గురువులు 1959 జనవరి 5న పునీత పౌలుగారి మహా దేవాలయ ప్రాంగణంలో క్రైస్తవుల సమైఖ్యత్నా వేడుకల ముగింపు సందర్భంలో ద్వితీయ వాటికన్ మహాసభలను గురించి ప్రకటించారు. ఈ ప్రకటన అచ్చట కూడిన వారందరిని ఆశ్చర్యచకితులను చేసింది.

దాదాపు నాలుగేళ్ళ సిద్ధపాటు అనంతరం చరిత్రాత్మక శ్రీసభ మహాసభ 1962 అక్టోబరు 11న శుభారంభం గావించబడింది. మూడేళ్ళపాటు కొనసాగిన ఈ మహాసభలో ప్రపంచ నలుమూలల నుండి వచ్చిన కతోలిక పీఠాధిపతులు, వేదశాస్త్ర పండితులు, వివిధ రంగాలకు చెందిన నిపుణులు దాదాపు 2500 మంది పాల్గొన్నారు.

ప్రపంచ కతోలిక శ్రీసభకు సరికొత్త దిశా నిర్దేశం చేస్తూ 16 అధికార పత్రాలను జారీచేశారు. వీటిలో నాలుగు చట్ట సంబంధమైన సిద్ధాంత పత్రాలు (Constitutions), తొమ్మిది ఆదేశ పత్రాలు (Decrees), మూడు (ప్రకటన పత్రాలు (Declarations), నాలుగు చట్ట సంబంధమైన సిద్ధాంత పత్రాలలో ఒకటి "దైవ వాక్కు" (Dei Verbum). అరు అధ్యాయాలున్న ఈ సిద్ధాంత పత్రము దివ్యావిష్కరణం, సత్యప్రసారం–పారంపర్యం, దేవుని ప్రేరణ–శ్రీనభ వివరణ, పూర్వ నిబంధన గ్రంథం, నూతన నిబంధన గ్రంథం, శ్రీసభ జీవన ప్రస్థానంలో పవిత్ర గ్రంథం అనే అంశాలను క్రమపద్ధతిలో పొందుపరచి కతోలిక క్రైస్తవ లోకానికి అందించడం జరిగింది.

**ఉపోద్ఘాతం :**

దేవుని వాక్కును అనునిత్యమూ మనం గౌరవభావంతో ఆలకించాలి, విశ్వాసంతో ప్రకటించాలి. ఇదే భావాన్ని "మహాసభ" పునీత యోహాను వారి మాటల్లో చక్కగా వ్యక్తం చేస్తోంది (1 యోహాను 1:1–3).

అలాగే – ట్రెంట్ మహాసభలు, ప్రథమ వాటికన్ మహాసభలు చేసిన సాధికార ప్రబోదాల బాటలోనే ఈ "మహాసభ" (ద్వితీయ వాటికన్ మహాసభ) కూడా దేవుడు ఆవిష్కరించిన (వెల్లడించిన) సత్యసందేశాలను గూర్చి, వాటి ప్రభోదా విధానం గురించీ వివరిస్తూ ఈ అధికార పత్రాన్ని అందజేస్తోంది. ఎందుకంటే దేవుని సత్యోపదేశాలను (దేవుని వాక్కును) లోకంలోని మానవులందరు ఆలకించాలి. అవును రక్షాభాగ్యాన్ని అందుకొమ్మని దేవుడిస్తోన్న పిలుపును లోకమంతా శ్రద్ధాశక్తులతో ఆలకించగలగాలి. ఆలకించి విశ్వసించగలగాలి, విశ్వసించి నిరీక్షించగలగాలి, నిరీక్షణ ద్వారా చివరికి ప్రేమించగలగాలి. (1)

## అధ్యాయం - 1

## దైవ వాక్కు - ఆవిష్కరణ 2-6

దేవుడు తన సౌజన్యం చేతను, జ్ఞానం చేతను తననుతాను మనకు ఏరుకపరచుకున్నారు. మానవులందరూ క్రీస్తు ప్రభువు ద్వారా పవిత్రాత్మతో ఏకమై, తండి దేవునికి సన్నిహితులై తద్వారా దైవస్వభావాన్ని పంచుకోవాలని దేవుని ప్రణాళిక. ఈ దివ్యావిష్మరణం (Divine Revelation) ద్వారానే దేవుడు మానవులను తన దివ్య సన్నిధానికి ఆహ్వానించి ఆక్కున చేర్చుకోదలచారు.

దేవుని తత్త్వ మహత్వాల గురించీ, మానవ రక్షా ప్రణాళిక గురించీ విశదపరిచే దివ్యావిష్కరణ సారాంశమంతా క్రీస్తు ప్రభువులో మూర్తిభవించి ఉంది. ఎందుచేతనంటే- దివ్యావిష్కరణ ప్రక్రియకు మధ్యవర్తి ఆయనే, దివ్యావిష్కరణము ఆయనే (మత్తయి11:27; యోహాను 1:14,17). లోకంలోని సమస్తాన్ని తన వాక్కు ద్వారా సృష్టిస్తూ, పోషిస్తూ కాపాడుతున్న దేవుడు తన ఉనికిని నిరంతరమూ వెల్లడి చేస్తూనే ఉన్నారు (యోహాను 1:8; 1:19-20). (2,3)

ఓర్పుతో సత్కార్యాలు చేస్తూ, అమరత్వాన్ని కోరే వారందరికీ శాశ్వత జీవమును ప్రసాదించాలన్నది దేవుని సంకల్పం (రోమీ 2:6,7). ఈ సత్ సంకల్పం ప్రకారమే దేవుడు నిర్ణీత సమయంలో అబ్రహామును పిలిచి ఆయననొక విస్తారమైన మానవజాతిగా తీర్చిదిద్దారు (ఆది 12:2). అలాగే తాను పంపబోయే రక్షకుని రాకకై నిరీక్షించుమని కూడా బోధిస్తూ వచ్చారు. అంటే - ఆదిమ యుగం నుంచి దేవుడు సువార్తా మహోదయానికి మార్గం సిద్ధపరుస్తూనే ఉన్నారు. రక్షాయుగం వైపు మానవ జాతిని నడిపిస్తూనే ఉన్నారు. (3)

దేవుడు తన నిత్యవాక్కయిన తన ఏకైక కుమారుణ్ణి మానవుల మధ్యకు పంపి వారికి జ్ఞానోదయం కలిగించమని ఆదేశించారు. యేసుక్రీస్తు ప్రభువు తన దివ్యావతారణం ద్వారా ఆత్మావిష్కారం ద్వారా తాను చేసిన సప్రబోధాల ద్వారా మరణ పునరుత్థానాలు ద్వారా చివరికి పవిత్రాత్మను పంపడం ద్వారా ప్రభువు దివ్యావిష్కరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. దేవుడు

నిర్దేశించిన లోకరక్షణ ప్రణాళికను నెరవేర్చారు. ప్రభువు ఆవిష్కరించిన దైవ ప్రణాళికను ప్రభువే నెరవేర్చడం విశేషం. క్రైస్తవ దివ్యావిష్కరణ క్రమం విలక్షణమైనది వినూత్నమైనది, దేవునికి మానవుల మధ్య నెలకొన్న శాశ్వతమైన ఒడంబడికకు సంబంధించినది. గనక ఇది ఎన్నటికీ గతించి పోదు, రద్దు చేయబడదు, దీనికి కాలదోషం పట్టదు. అంతేకాదు యేసు క్రీస్తు ప్రభువు మహిమాన్వితుడై మరల వచ్చు వరకు మరో బహిరంగ దివ్యావిష్కరణం జరగడానికి అవకాశం లేదు (1 తిమోతి 6:14 తీతు 2:18). (4)

విశ్వాసం ద్వారా మానవుడు తనను తాను ప్రత్యక్ష పరచుకుంటున్న దేవునికి తనను తాను అంకితం చేసుకోవాలి. తన మేధస్సును, తన మనసును దేవునికి సంపూర్ణంగా సమర్పించుకోవాలి, దేవుడు తనకు తెలియజేసిన సత్యానికి తన పూర్ణాంగీకారం ప్రకటించగలగాలి. (5)

మానవుడు దేవునిపట్ల పరిపూర్ణమైన విశ్వాసాన్ని ప్రకటించడానికి దేవుని కృపాశక్తి అవసరం. అదే పవిత్రాత్మ అందజేసే ఆంతరంగిక సహాయం. పవిత్రాత్మ ప్రభువే మానవ హృదయాన్ని స్పృశించి పరివర్తనం కావించి దేవునివైపు మరల్చగల్గుతారు. మనోనేత్రాలను తెరపించి సత్యాన్ని అంగీకరించి విశ్వసించే శక్తిని అనుగ్రహిస్తారు. తత్ఫలితంగా దేవుడు వెల్లడించే నిగూడ సత్యాలను మరింత స్పష్టంగా అర్థం చేసుకోగలుగుతాం. (5)

దివ్యావిష్కరణం ద్వారా దేవుడు తననుతాను ప్రత్యక్ష పరచుకోవడంతో పాటు, మానవ రక్షణ ప్రణాళికను (Divine Benefits) దివ్యశక్తులను మనతో పంచుకోవడానికి ప్రత్యక్షపరచుకున్నారు. "సమకాలీన ప్రపంచంలో మానవులు తమకున్న వివేచనా శక్తితో (Human Reason) నిగూఢమైన సత్యాలను సైతం సులభంగా, రూఢిగా, ఎలాంటి పొరపాటుకు తావు లేనంత నిఖరంగా తెలుసుకోగలుగుతున్నారు". అంటే ఆ ఘనత దేవుని సత్యావిష్కరణకు (దివ్యావిష్కరణకు) దక్కుతుంది తప్ప, అది మానవ మాత్రుల గొప్పతనంగా భావించరాదని కూడా మహాసభ స్పష్టం చేస్తోంది. (6)

## అధ్యయం - 2

## సత్యప్రసారం - పారంపర్యం

దేవుడు మానవుల రక్షణార్ధం వెల్లడించిన సత్యాలన్నీ తరతరాలకు అందజేయడంకోసం దివ్యావిష్కరణ మూర్తీభవింపజేసుకున్న క్రీస్తు ప్రభువు సర్వజనులకు బోధించమని అపోస్తులులను ఆదేశించారు. సువార్తా ప్రబోధం ద్వారా దేవుని వరప్రసాదాలను మానవులందరికీ అందజేయాలని వేద బోధనా ధర్మాన్ని అపోస్తులులకు అప్పగించారు. ఈ బోధనా ధర్మాన్ని ప్రబోధం ద్వారా, జీవన విధానం ద్వారా స్థాపిత సంఘాల ద్వారా, సంస్థల ద్వారా సత్యోపదేశం చేయబడింది. ఈ సువార్తా ప్రబోధంలో ప్రభు ఉపదేశాలు, జీవన విధానం, మహత్కార్యాల సందేశాలు, పవిత్రాత్మ పరణ సత్యాలు ఉన్నాయి. అపోస్తలుల సన్నిహితులు అందులో కొందరు పవిత్రాత్మ ప్రేరణతో రక్షా వేదాన్ని సువార్తలుగా వెలువరించారు. సత్యసువార్తను పదిలపరచడానికి, సదాకాలము ప్రబోధించడానికి అపోస్తులులు తమకు వారసులుగా పీఠాధిపతులను నియమించారు. ప్రభువు అపోస్తులుల కొసగిన బోధనాధికారాన్ని పీఠాధిపతులకు ప్రసాదించారు. దేవుని ముఖాముఖి దర్శించే గడియ వచ్చేవరకు ఈ క్రమం కొనసాగుతూనే ఉంటుంది (యోహాను8:2). (7)

అపోస్తలులు శ్రీసభకు అందజేసిన దైవసందేశాల (దైవవాక్కు) లో పవిత్ర సంప్రదాయమూ, పవిత్ర గ్రంథ భాగాలు సమపాళ్లలో ఉంటాయి. పవిత్రమైన దేవుని సందేశానికి (దైవవాక్కునకు) లిఖిత రూపంలో ఉన్న దైవవాక్కునకు గానీ, సంప్రదాయ రూపంలో ఉన్న దైవోపదేశాలకు గానీ భావ్యం చెప్పే అధికారం శ్రీసభ అధిష్టానం వారికి మాత్రమే ఉంటుంది. అపోస్తలుల ప్రభోదాలు ఆత్మ (ప్రేరిత గ్రంథాలలో అక్షరబద్ధమై ఉన్నాయి. ఈ ప్రబోధాలను యుగాంతం వరకు కాపాడుకుంటూ ఈ రక్షణ సందేశాన్ని విశ్వాసులకు అందజేస్తూ పదిలంగా కాపాడుకొమ్మని వారికి ఉద్బోధించారు. (8)

అపోస్తలులు అందజేసిన అమూల్యమైన "సంప్రదాయం" పవిత్రాత్మ ప్రేరణతో ఎప్పటికప్పుడు క్రమ పరిణామం చెందుతూ సరికొత్త మెరుగులు దిద్దుకుంటూనే ఉంటుంది. ధ్యానజీవనం గడిపే భక్తజనుల ద్వారా, శాస్త్రీయ అధ్యయనం చేసే విశ్వాసుల ద్వారా "శ్రీసభ సంప్రదాయం"లో వికాసవంతమైన పరిణామాలు చోటుచేసుకోవచ్చును (లూకా 2:19,51). అపోస్తోలిక సంప్రదాయం

(Tradition) ఆది నుంచి శ్రీభలో వర్ధిల్లుతూనే వస్తున్నదనడానికి శ్రీసభ పితరుల (Holy Fathers) నిర్ధారణలే సాక్ష్యాలు. వీరి ప్రబోధాలను రచనలను పరిశీలిస్తే పారంపర్యంగా వస్తున్న "సంప్రదాయం" శ్రీసభను ఎంతగా ప్రభావితం చేస్తూ వచ్చిందో బోధపడుతుంది. ఈ సంప్రదాయం ఆధారంగానే పవిత్ర గ్రంథాన్ని నిశితంగా పరిశీలించడానికీ, అవగాహనం చేసుకోవడానికీ, తదనుగుణంగా ఆచరణకు పూనుకోవడానికీ, అవకాశం కలిగించి, నేటికీ అదే పద్ధతి కొనసాగుతూ వస్తోంది. (8)

పవిత్ర సంప్రదాయు, పవిత్ర గ్రంథం ఒకే నాణానికి రెండు ముఖాల వంటివి. అవి అత్యంత సన్నిహిత సంబంధం కలిగి ఉంటాయి. అవి రెండూ ఒకే దివ్వ జలధారకు రెండుపాయలవంటివి, ఒకే గమ్యం వైపు ప్రవహిస్తూ ఉంటాయి. ఆవిష్కరింపబడిన (వెల్లడిచేయుబడిన) సత్యాలలోని నిజానిజాలను నిర్ధారించుకోవడానికి శ్రీసభ కేవలం పవిత్ర గ్రంథం మీదనే ఆధారపడదన్న సత్యాన్ని గమనించాలి. ఇందుకు పవిత్ర సంప్రదాయం శ్రీసభకు మార్గ చూపరిగా ఉపకరిస్తుంది. గనక – పవిత్ర గ్రంథాన్ని పవిత్ర సంప్రదాయాన్ని కూడా సమానమైన భక్తి భావనతో గౌరవ ప్రపత్తులతో ఆదరించాలి, అనుసరించాలి. (9)

దీనిని బట్టి మనం గ్రహించవలసిన సత్యం ఒకటి కనిపిస్తుంది. అదేమిటంటే – దేవుడు చేసిన ఏర్పాటు ప్రకారమే – పవిత్ర సంప్రదాయం, పవిత్ర గ్రంథము, శ్రీనభ అధిష్టానం – ఒకదానితో ఒకటి విడదీయలేనంత సాన్నిహిత్యం కలిగి ఉంటాయి. ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉంటాయి. పవిత్రాత్మ ప్రేరణ ప్రకారం శ్రీసభ అధిష్టానం సంప్రదాయబద్ధంగా పవిత్ర గ్రంథ ప్రబోధాలను పాటిస్తూ ప్రకటించినప్పుడే మానవుల ఆత్మకు ముక్తి భాగ్యం లభిస్తుంది. (10)

## అధ్యాయం – 3

## పవిత్ర గ్రంథం

### దేవుని ప్రేరణ – శ్రీసభ వివరణ 11-18

పవిత్ర గ్రంథంలో పొందుపరచిన ఆవిష్కృత సత్యాలు (దేవుడు వెల్లడించిన సత్యాలు) పవిత్రాత్మ ప్రేరణతో లిఖించబడ్డాయి. అపోస్తోలిక కాలం మీద (సంప్రదాయం మీద) విశ్వాసం గల తల్లి "శ్రీసభ పవిత్రాత్మ" ప్రేరణతో లిఖింపబడిన దైవోపదేశాలన్నింటినీ పవిత్ర గ్రంథాలు (Economical Books) గా భావిస్తుంది.

ఈ కారణం చేతనే పూర్వ నిబంధన గ్రంథం, నూతన నిబంధన గ్రంథం రెండింటినీ వాటిలోని ప్రతి భాగాన్ని "దేవుని వాక్కు"గా స్వీకరిస్తుంది (యోహాను 20:31; 2 తిమోతి 8:16; 2 పేతురు 31:19-21; 38:15-16). (11)

ఈ పవిత్ర గ్రంథాల రచనకు దేవుడు కొందరిని ప్రత్యేకంగా ఎంపిక చేసుకొని, వారి శక్తియుక్తులను నైపుణ్యాన్ని సద్వినియోగం చేసుకుంటూ సత్య వృత్తాంతాలనన్నింటినీ వారి చేత గ్రంథస్తం చేయించారు. నిజానికి ఆయా గ్రంథాల రచయితలు వారే, ప్రేరణ శక్తి మాత్రం దేవునిదే. గనక పవిత్ర రచయితలు విశ్వాస పాత్రంగా రూఢిగా ఎలాంటి చిరపాటులకు అవకాశం లేకుండా అక్షర బద్ధం చేశారని మనం గుర్తించాలి, ఆమోదించాలి. (11)

పవిత్ర గ్రంథ రచయితలు తమ రచనలలో వివిధ సాహితీ ప్రక్రియలు (Literary Forms) ఎంచుకున్నారు. బైబిలు వ్యాఖ్యాతలు, ఆయా గ్రంథాల రచయితలు ఉపయోగించిన రచనా ప్రక్రియను బట్టి, రచనలు చేసిన కాలం, స్థలం, ఆనాటి సాహితీ సాంస్కృతిక నేపథ్యం మొదలైనవన్నీ తెలుసుకొని అంతర్లీనమైన సందేశాలను వెలికి తీయాలి. పైన చెప్పుకున్న నియమాల ప్రకారం పవిత్ర గ్రంథ భాగాల అంతరార్థాలను వివరించే ప్రయత్నం చేయాలి. పవిత్రగ్రంథానికి ఎవరు ఏ విధంగా వ్యాఖ్యానాలు చేసినా ప్రామాణికతను నిర్ధారించే అధికారం మాత్రం చివరికి శ్రీసభకే ఉంటుంది. (12)

పవిత్ర గ్రంథంలో మనకు దేవుడు సత్యమూర్తిగా పవిత్రతకు ప్రతిరూపంగా దర్శనమిస్తారు. దేవుని ప్రేమ కారుణ్యాలను మనం పవిత్ర గ్రంథంలో స్పష్టంగా చూడగలుగుతాం. మహోన్నతుడైన తాను తన మనోభావాలను మానవ నైజానికి అనుగుణంగా మలచి మన భాషలో పలికించడానికి ఆయన ఏ స్థాయికి దిగి వచ్చారో మన కళ్లకు కట్టినట్టు కనిపిస్తుంది. ఇది నిత్యుడగు తండ్రి దేవుని వాక్కు (క్రీస్తు ప్రభువు) దుర్బలమైన మానవ దేహాన్ని ధరించి మానవుడుగా అవతరించిన మహత్తర ఘట్టం వంటిది. (13)

## అధ్యాయం - 4

## పూర్వ నిబంధన గ్రంథం 14-16

ప్రేమ స్వరూపుడైన దేవుడు మానవజాతికి ముక్తిని ప్రసాదించడానికిగాను - తనకంటూ ఒక ప్రజను ఎన్నుకున్నారు. వారితో చేసుకున్న ఒడంబడికల

ఫలితంగా తనకొక ప్రజాసమూహాన్ని సంపాదించుకోగలిగారు. వారికి తనను తాను ఎరుకపరచుకున్నారు. ఇలా దేవుడు నడిపించిన మానవ రక్షాచరిత్రను పవిత్ర రచయితలు గ్రంథస్తం చేశారు. వారి రచనలన్నీ మనకు పూర్వ నిబంధన గ్రంథంలో కనిపిస్తాయి. వారు అక్షర బద్ధం చేసిన మానవ రక్షణ వృత్తాంతమంతా “దేవుని వాక్కు” గానే స్వీకరింపబడుతోంది. పూర్వ నిబంధన గ్రంథంలోని ఈ రచనలన్నీ సాక్షాత్తు దేవుని ప్రేరణతో చేసిన రచనలుగా పరిగణింపబడుతున్నాయి:

“ఏలయన, పరిశుద్ధ గ్రంథమున ముందు వ్రాయబడినవి అన్నియు మనకు బోధించుట కొరకే వ్రాయబడినవి. పరిశుద్ధ గ్రంథము మనకు ఒనగు సహనము ప్రోత్సాహముల ద్వారా మనకు నిరీక్షణ కలుగుట కొరకే అవి వ్రాయబడినవి” (రోమీ 15:4). (14)

పూర్వ నిబంధన గ్రంథం ప్రధానంగా - మానవ రక్షకుడు క్రీస్తు ప్రభువు రాకను ప్రవచనాల ద్వారా సూచించడానికి, ఆయన ఆగమనానికి ఆయన రాజ్య అవతరణకు తగిన ఏర్పాట్లు చేయడానికే ఉద్దేశింపబడినది (లూకా 24:44; యోహాను 5:89; 1 పేతురు 1:10). రక్షకుని రాకను సూచించే దృష్టాంతాలెన్నో పూర్వనిబంధనలో “వ్రాయబడినవి” (కొరింతీ 10:11). గనక దేవాధి దేవుడు మన ఎదుట సజీవంగా సాక్షాత్కరింపజేసే పూర్వ నిబంధన రచనలను సగౌరవంగా స్వీకరించాలి, ఆదరించాలి. (15)

పూర్వ నిబంధనం నూతన నిబంధన గ్రంథాలు రెండింటికి కృతికర్త (మూల రచయిత) సాక్షాత్తూ దేవాధిదేవుడేనని ఇంతకు ముందే తెలుసుకున్నాం. అలాగే నూతన నిబంధన, పూర్వనిబంధన గ్రంథంలో అంతర్లీనంగా దాగివుండే ఏర్పాటు, పూర్వనిబంధనం నూతన నిబంధనం ద్వారా పరిపూర్ణమయ్యే ఏర్పాటును కూడా భగవానుడే చేశారన్న సత్యాన్ని మనం గ్రహించాలి. (16).

పూర్వ నిబంధన గ్రంథాల సందేశాలు నూతన నిబంధనంతోనే (నూతన నిబంధన గ్రంథం ద్వారానే) సంపూర్ణత్వాన్ని సంతరించుకుంటాయి. (మత్తయి 5:17; లూకా 24:27; రోమీ 16:25-26; 2 కొరింతీ 38:14-16); అలాగే - నూతన నిబంధనంలోని నిగూఢ సత్యాలను అవగాహనం చేసుకోవడానికి పూర్వనిబంధన రచనలు ఉపయుక్త గ్రంథాలుగా సాయపడతాయి.

## అధ్యాయం - 5

## నూతన నిబంధన గ్రంథం 17-20

కాలము పరివక్వమయినపుడు (గలతీ 4:4) మహాశ్వక్తిమంతమైన దేవుని వాక్కు మానవుడై కృపాసత్య పూర్ణుడుగా మనమధ్య నివసించెను (యోహాను 1:14). ఆయనే క్రీస్తు ప్రభువు. తన ధార్మిక ప్రభోదాల ద్వారా మహత్కార్యాల ద్వారా, మరణ పునరుత్థానాల ద్వారా మోక్షారోహణం ద్వారా, చివరికి తన పవిత్రాత్మను పంపించడం ద్వారా లోకరక్షణ కార్యాన్ని సంపూర్ణ కావించారు. ఈ సత్యాలను ఆకళింపు చేసుకున్న అపోస్తలులు పవిత్రాత్మ పూరితులైన ప్రవక్తలు, సత్యప్రబోధం చేశారు. మానవ రక్షాచరిత్రలో అత్యంత కీలకమైన ఈ సంఘటనలన్నింటికీ నూతన నిబంధన రచనలు నిలువుటద్దాలుగా నిత్య సాక్షులుగా నిలుస్తున్నాయి. (17)

దేవుని ప్రేరణతో రాసిన పవిత్ర గ్రంథాలన్నింటిలోను నూతన నిబంధన రచనల్లో కూడా - సువార్తా గ్రంథాలకు ప్రత్యేక స్థానముంది, ప్రత్యేక ప్రాధాన్యముంది. అది సమంజసం కూడా. ఎందుకంటే - మానవురూపుదాల్సిన దేవుని వాక్కు అవతరణ వృత్తాంతాన్నీ జీవన ప్రస్థానాన్నీ రక్షా ప్రదాయకమైన ఆయన ధార్మిక ప్రబోధాలను తమలో నిక్షిప్తం చేసుకున్న జీవగ్రంథాలు మూలాధారాలు, సువార్తా గ్రంథాలు: మత్తయి, మార్కు, లూకా, యోహాను. (18)

ఈ నాలుగు సువార్తలు - దైవకుమారుడు యేసు ప్రభువు తాను మోక్షారోహణుడయ్యేవరకు ఈలోకంలోని మానవులందరి విమోచనం కోసం చేసిన పనులను ప్రబోధాలను విశ్వసనీయంగా మనకు అందజేస్తున్నాయని శ్రీసభ స్పష్టంగా ప్రకటిస్తోంది.

ఈ సువార్తా రచయితలు తమ తమ సువార్తా గ్రంథాలను తాము కళ్ళారా చూచిన ఘట్టాలు విన్న ప్రబోధాలు ఆధారంగా రచించినా, లేక - మొదటి నుండియు ప్రత్యక్షముగా చూచిన వారివలన, బోధించిన వారివలను తెలుసుకున్న విశేషాలు ఆధారంగా తమ సువార్తా రచనలు చేసినా వారి రచనా లక్ష్యం ఒకటే మనకు “సతు” ప్రకటనల చేయడం, మనకు “ఎరుక చేయబడిన విషయములను గూర్చిన వాస్తవమును” మనం గ్రహించునట్లు చేయడం (లూకా 1:2-4). (19)

నూతన నిబంధన గ్రంథంలో ఈ నాలుగు సువార్తలతోపాటు పునీత పౌలు రాసిన లేఖలు, ఇతర అపోస్తొలిక రచనలు కూడా వున్నాయి. ఇవన్నీకూడా పవిత్రాత్మ ప్రేరణ ప్రకారం జరిగిన రచనలేనని శ్రీసభ నిర్ధారిస్తోంది. ఈ రచనలన్నీ ప్రభువైన క్రీస్తుకు సంబంధించిన సత్యాలనన్నింటినీ రూఢీ పరుస్తున్నాయి, రుజువు చేస్తున్నాయి. ఎందుచేతనంటే – యేసు ప్రభువు తానిచ్చిన మాట ప్రకారం తమ ప్రియతమ అపోస్తలుల వెన్నంటే ఉన్నారు (చూడండి. మత్తయి 28:20), అలాగే సంపూర్ణ సత్యమునకు నడిపించే" పవిత్రాత్మను కూడా ప్రభువు వారికి తోడుగా పంపించారు (యోహాను 16:18). గనకనే వారు జేసిన ప్రబోధాలు, పవిత్ర రచనలన్నీ సత్యానికి సాక్ష్యాలుగా వర్థిల్లగలుగుతున్నాయి. (20).

## అధ్యాయం – 6

## శ్రీసభ జీవన ప్రస్థానంలో పవిత్ర గ్రంథం 21–26

శ్రీసభ క్రీస్తు ప్రభు దివ్య దేహాన్ని ఎంతటి భక్తి విశ్వాసాలతో, ఆరాధిస్తూ గౌరవిస్తుందో, అలాగే దేవుని దివ్యవాక్కును పవిత్ర గ్రంథాన్ని కూడా గౌరవిస్తుంది, ఆరాధిస్తుంది. గనకనే – దైవార్చనా సాంగ్యాలలో (దివ్య పూజలో) ప్రభు దివ్య శరీర రక్తాలను (జీవాహారాన్ని), దైవవాక్కును (వచనాహారాన్ని) కూడా ఒకే పీఠం నుంచి అందజేస్తుంది. (21)

అలాగే – విశ్వాస వికాసానికీ పరిరక్షణకు అపోస్తొలిక సంప్రదాయాన్ని ఏ విధంగా ప్రామాణికంగా భావిస్తుందో, అదే విధంగా పవిత్ర గ్రంథాన్ని (దేవుని వాక్కును) విశ్వాసానికి సర్వోన్నత ప్రమాణంగా స్వీకరిస్తుంది. ఈ కారణంగానే – శ్రీసభ ప్రభోదాలన్నీ పవిత్ర గ్రంథం మీదనే ఆధారపడి ఉంటాయి. మరో మాటలో చెప్పాలంటే – పవిత్ర గ్రంథంలోని దైవోపదేశాలే యావత్ క్రైస్తవ మతానికి దిశా నిర్దేశం చేస్తుంటాయి. (21)

పవిత్ర గ్రంథాన్ని క్రైస్తవ విశ్వాసులందరికి అందుబాటులోకి తేవాలి. అన్ని కాలాలలో అన్ని తరాల వారికి దోషరహితమైన, నమళికమైన పవిత్ర గ్రంథాన్ని అందజేయడం "తల్లి"గా శ్రీసభ బాధ్యత. స్థానిక శ్రీసభల అధిష్టానం అనుమతితో ఆయా ప్రాంతాలలో ఆయా భాషలకు చెందిన కతోలికేతరుల కైస్తవ సంఘాలతో

కలసి పవిత్ర గ్రంథ అనువాదానికి సమష్టిగా కృషి చేయవచ్చును. బైబులు వ్యాఖ్యాతలు, వేదాంత శాస్త్రాధ్యయన రంగంలో ఉన్న వారందరూ పరస్పర సహకారంతో తమ కృషిని కొనసాగించవలసిందిగా శ్రీసభ కోరుతోంది. (22)

శ్రీసభ పాలకవర్గ పర్యవేక్షణలో వీరు శాస్త్రీయమైన సముచితమైన పరిశోధనా విధానాలను అవలంబిస్తూ పవిత్ర గ్రంథ భాగాలను పరిశీలించాలని, వ్యాఖ్యానించాలనీ శ్రీసభ సూచిస్తుంది. పవిత్ర గ్రంథ అధ్యయనంలో నిమగ్నమైన వారు నిర్విఘ్నంగా కొనసాగించడానికిగాను కృషిచేయమని మహాసభ విజ్ఞప్తి చేస్తోంది. (23)

క్రైస్తవ వేదాంతశాస్త్రం – దైవవాక్కు పవిత్ర సంప్రదాయం అనే జంట పునాదులపై ఆధారపడి ఉంటుంది. సంఘ కాపరులు (పీఠాధిపతులు, గురువులు) చేసే సువార్తా ప్రబోధం, సంఘంలో కొనసాగే సత్యోపదేశం, అనేక రూపాల్లో జరుగుతోన్న క్రైస్తవ శిక్షణా కార్యక్రమాలన్నీ – వాక్య పరిచర్యలో అంతర్భాగాలే. వీటన్నింటిలోనూ దివ్య పూజను సమర్పిస్తూ గురువులు చేసే ప్రసంగాలకు అత్యధిక ప్రాధాన్యం ఉంటుంది. (24)

ఇందువలననే – దైవవాక్క పరిచర్య బాధ్యతను అధికారపూర్వకంగా కొనసాగిస్తోన్న క్రైస్తవ గురువులు, డీకనులు, ఉపదేశులు అనునిత్యమూ పవిత్ర గ్రంథాన్ని ధ్యానపూర్వకంగా పఠించడం అలవరచుకోవాలి. "దేవుని వాక్కును" ఎరుగని వారు క్రీస్తును ఎరుగని వారితో సమానం. క్రైస్తవ విశ్వాసులందరు, అందులోను మఠవాస జీవితాన్ని గడుపుతున్నవారు "యేసుక్రీస్తును గూర్చిన అధికమైన విలువగల జ్ఞానమునకై" (ఫిలిప్పీ 3:8) తరచుగా పవిత్ర గ్రంథాన్ని భక్తి శ్రద్ధలతో చదువుతూ ఉండాలి. (25)

అపోస్తోలిక చట్టాన్ని అధికారపూర్వకంగా అందుకున్న పీఠాధిపతులు తమ నేతృత్వంలో భక్తి జీవనం గడుపుతోన్న విశ్వాసులకు పవిత్ర గ్రంథ పఠన ధ్యానాల విషయంలో సరైన మార్గనిర్దేశం చేయాలి. పవిత్ర గ్రంథ పఠనం అధ్యయనం ద్వారా ప్రభువు వాక్కు– త్వరగా వ్యాపించి విజయమును పొంది గలుగుతుంది (2 తెస్సలో 8:1). (26)

తరచు "దివ్యబలి"ని సమర్పించడం ద్వారా భక్తి జీవనంలో శ్రీసభ ఏ విధంగా సత్వర పురోగమనాన్ని సాధించగలుగుతుందో, అదే విధంగా దైవవాక్కు పట్ల భక్తిశ్రద్ధలు గౌరవారాధనలు పెంపొందే కొలది విశ్వాసుల ఆధ్యాత్మిక జీవనం కొత్త చిగురులు తొడుగుతుంది, నవనవోన్మేషంగా వృద్ధి చెందే సువర్ణావకాశం లభిస్తుంది. "దేవుని వాక్కు కలకాలము నిల్చును" (యెషయా 40:8; 1 పేతురు 1:28-25). (26)

## 7. ముగింపు సూచనలు

### దైవ వాక్కు- ప్రభావ ఫలితాలు, ఎదుర్కొంటున్న సవాళ్ళు

**దైవ వాక్కు - ప్రభావ ఫలితాలు :**

"దైవ వాక్కు" అనే ఈ సైద్ధాంతిక సంవిధానం గడిచిన 60 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణంలో శ్రీసభపై చూపిన ప్రభావం ఎటువంటిది? కతోలికులు ఎంత వరకు ఈ సిద్ధాంత పత్రాన్ని స్వీకరించారు? దైవ వాక్కు ప్రభావ ఫలితాలు, ఎదుర్కొంటున్న సవాళ్ళు ఏంటి అని తెలసుకోవటం ఎంతైనా మంచిది. సువార్త ప్రచారానికి ఈ అధ్యయనం ఎంతగానో ఉపయోగపడుతుంది.

అత్యంత ప్రధానమైన "దైవ వాక్కు" (Dei Verbum) అనే సిద్ధాంత పత్రం యొక్క ప్రభావం గమనిస్తే నాలుగు సత్ఫలితాలు కనబడుతున్నాయి.

1. 'దివ్యావిష్కరణం' అనే అంశాన్ని అందరికి అర్థమయ్యేటట్లు వ్యక్తిగత పరిభాషలో వ్యక్తం చేయడం గుర్తించి గౌరవించవలసిన విషయం. తాత్విక, స్థిర పద్ధతులలో కాకుండ పరిశుద్ధ గ్రంథం ధోరణిలో సామాన్యుల పరిభాషలో తెలియజేయబడింది. జటిలమైన వేదాంత విషయాన్ని సులభ పద్ధతిలో ప్రజలకు చేరువైందని చెప్పవచ్చు. ఇదొక మంచి పరిణామం, సత్ఫలితం.
2. వివాదాస్పదంగా ఉండిపోయిన ప్రేరణ (Inspiration), పొరబడని (Inerrancy) అనే పదాలకు, సమకాలీన మార్పులను పరిశీలించి తప్పులు లేని (without error) అనే మాటలను వాడటం వలన సంప్రదాయ వాదుల వ్యాఖ్యానం వలన తలయెత్తే వివాదాలు కూడా తొలగించడం జరిగింది.

3. 1948లో పరిశుద్ధాత్మ ప్రేరణ (Divino Afflante Spiritu) అనే సాధారణ ప్రకటన ద్వారా, 1964లో జగద్గురువుల పవిత్ర గ్రంథం కార్యనిర్వహణ సంఘము ద్వారా చారిత్రిక విమర్శనా పద్ధతికి (Historical-Critical Method) అనుమతి లభించినప్పటికి, బైబులు వ్యాఖ్యాతల బాధ్యతలను గుర్తుచేస్తూ సాహితీ ప్రక్రియల పరిజ్ఞానం పెంచుకోమని అదే సమయములో చారిత్రిక విమర్శనా పద్ధతిని (Historical-Critical Method) ఇక్కడ ప్రోత్సహించడం సంతోషదాయకం.

4. దైవ వాక్కు (Dei Verbum) చివరి అధ్యాయంలో ప్రస్తావించిన "శ్రీసభ జీవన ప్రస్థానంలో పవిత్ర గ్రంథం" అనే అంశం ముఖ్యంగా పవిత్ర గ్రంథాన్ని క్రైస్తవ విశ్వాసులందరికి అందుబాటులోకి తేవాలని ప్రకటించడాన్నీ కతోలిక క్రైస్తవులు ఆహ్వానించారు, ప్రశంసించారు. ఆ కారణంగా ప్రాంతీయ భాషలలోనికి బైబులు గ్రంథాన్ని అనువాదం చేసేటప్పుడు మూలభాషల్లో ఉన్న పవిత్ర గ్రంథ ప్రతుల ఆధారంగా అనువాదాలు చేయవలసిందిగా కోరుతుంది. స్థానిక శ్రీసభల అధిష్టానం అంగీకరిస్తే ఆయా ప్రాంతాలలో ఆయా భాషలకు చెందిన కతోలికేతర క్రైస్తవ సంఘాలతో కలసి పవిత్ర గ్రంథం అనువాదానికి సమష్టిగా కృషిచేయమని కోరుతుంది. ఇది శుభప్రదం, తద్వారా సువార్త ప్రచారం సులభతరం అవుతుంది. (22)

## దైవ వాక్కు – ఎదుర్కొంటున్న సవాళ్ళు :

1. **శ్రీసభ జీవన ప్రస్థానంలో బైబులు పఠనం :** గురువులు, డీకనులు, ఉపదేశులు ప్రత్యేక శ్రద్ధతో క్రైస్తవులు బైబులును పఠించడానికి, పాటించడానికి, ప్రకటించడానికి ప్రోత్సహించాలి. ప్రాంతీయ భాషలలో బైబులు అనువాదం చేస్తూ, సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేటట్లు చూడాలి.

ప్రత్యేకించి బైబులు శిక్షణా శిబిరములను ఏర్పాటుచేస్తూ దైవవాక్కు అనుభూతిని, ఆనందాన్ని తమ నిత్య జీవితంలో అనుభవించునట్లు చేయాలి. అందుకు గురుపీఠం, గురు మండలం, ఉన్నత గురు మండలం, ప్రాథమిక గురు మండలాల స్థాయిలలో చక్కని కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి. ఇది ఎంతో

శ్రమతో కూడిన విషయం. అయినా ఇది క్రైస్తవ విలువలకు, క్రైస్తవ భక్తికి, ముక్తికి ఎంతో అవసరం. కారణం – "దైవ వాక్కు" దైవజనుల విశ్వాసాన్ని పటిష్టపరస్తుంది, వారి ఆత్మలకు దివ్యాహార మవుతుంది, స్వచ్ఛమైన నిత్యమైన జీవజల ధారగా వారి ఆధ్యాత్మిక జీవన వికాసానికి దోహదం చేస్తుంది. (21)

2. **పవిత్ర గ్రంథం అనువాదం :** పవిత్ర గ్రంథ పఠనం, వ్యాఖ్యానం, శిక్షణం రోజురోజుకి పెంపొందుతుంది. ప్రజలు బైబులు పఠనంపై శ్రద్ధచూపుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రాంతీయ భాషల్లో అనువాదాలు చేయాలి. కాని ఇదొక సవాలుగా మారిపోయింది. కారణం – మూల భాషలైన హీబ్రూ, గ్రీకు భాషలే కాకుండా విధిగా 'వల్గేట్' (Vulgate)ను ప్రామాణికంగా తీసికోవలసి ఉంది. అనువాదంలో ప్రధానంగా వ్యక్తీకరణలో లింగ బేధం చూపని భాష (Inclusive Language)ను ప్రయోగించాలనీ కొందరు, కాదుకూడదని కొందరు కోరడం జరుగుతుంది. కొందరు స్వేచ్ఛా అనువాదం కోరుతుంటే మరికొందరు యధాతథమైన అనువాదం కోరుకుంటున్నారు. అంతే కాకుండ దైవార్చనం సాంగ్యాలలో ఉపయోగించే పరిశుద్ధ గ్రంథాన్ని శ్రీసభ నియమాలను అనుసరించి తయారుచేయవలసి ఉంది. ఈ విషయాలన్ని గమనిస్తూ పవిత్ర గ్రంథం అనువాదం చేయవలసి ఉంది.


3. **బైబులు సంప్రదాయ వాదం (Fundamentalism) :** బైబులు సంప్రదాయ వాదం చారిత్రక, సాంఘిక, రాజకీయ, మత సంబంధమైన విషయాలతో కూడిన విషయం. కతోలిక బైబులు వ్యాఖ్యాతలు, వాక్యోపదేశకులు సంప్రదాయ వాదాన్ని అంగీకరించరు. సంప్రదాయ వాదులు వాళ్ళదైన బాటలో వెళ్తారేకాని శాస్త్రీయ పద్ధతిలో వ్యాఖ్యానం చేయడాన్ని అట్టే ఇష్టపడరు. బైబులు వ్యాఖ్యాతలు, వేదాంత శాస్త్రాధ్యయన రంగంలో ఉన్నవారందరు సంప్రదాయ వాదాన్ని దృష్టిలో పెట్టుకొని శాస్త్రీయ పద్ధతిలో సముచితమైన పరిశోధనా విధనాలను అవలంభిస్తూ ముందుకు సాగాలి. దైవవాక్య పరిచర్య బాధ్యతను కొనసాగిస్తోన్న కతోలిక గురువులు, మఠవాసులు, ఉపదేశులు, పరిశుద్ధ గ్రంథం వెలుగులో క్రైస్తవులను నడిపించ కృషిచేస్తూ సరైన మార్గ నిర్దేశం చేయాలి. (28)

# 6. శ్రీసభ ప్రపంచానికి హృదయం

## *(Gaudium et Spes)*

– ఫాదర్ పిల్లి అంతోని దాస్

### ఆధునిక ప్రపంచంలో శ్రీసభ పత్రము – సంగ్రహము (Extract)



ఆధునిక ప్రపంచంలో శ్రీ సభ ఒక నూతన వరవడికి శ్రీకారం చుట్టింది. ఈ వరవడి రెండు పదాల ద్వారా వ్యక్తమవుతుంది: బాధ్యత, సేవ. ఒక నిర్మాణం క్రైస్తవ ధర్మమని తన చివరి అంశముగా శ్రీసభ ఈ పత్రములో ప్రకటిస్తుంది (GS 93). క్రైస్తవులు పరస్పర ప్రేమ కారుణ్యం కలవారని, సాటి మానవులకు తమ శక్తి కొలది భావముతో ఔదార్యముతో సేవలు చేయ తపించు వారిని, సమధర్మం సౌజన్యం వర్ధిల్లే సమ సమాజ నిర్మాణానికి, నవలోక నిర్మాణానికి నడుము కట్టాలని, న్యాయానికి కట్టుబడి ధర్మబద్ధంగా జీవించే సాటి మానవులందరితో చేతులు కలిపి లౌకిక ప్రపంచాన్ని దేవుడు కోరే ప్రేమ సామ్రాజ్యంగా శాంతి ధామముగా తీర్చిదిద్దడానికి అహర్నిశలు కృషి చేయాలని, ఇది క్రైస్తవులందరి బాధ్యత అని ప్రకటిస్తుంది. నేటి ఆధునిక ప్రపంచంలో సాటి మానవులలో ప్రభు క్రీస్తు రూపాన్ని దర్శించి, అమితమైన ఉదారత్వముతో, అమోఘమైన ప్రభావముతో వారిని ప్రేమించడమే క్రైస్తవుల ముందు ప్రస్తుతం ఉన్న అద్భుత బాధ్యత.

ఈ పత్రములో కనిపించే, అందరికీ ఆమోదయోగ్యముగా అనిపించే, అత్యంత ప్రత్యేకమైన అంశము: శ్రీసభ తన స్వీయ అవగాహనతో తనను తాను మానవ కుటుంబ సేవకై అంకితం చేసుకుంది. శ్రీసభ ఒక సేవకురాలు. ఇక రానున్న తరములలో శ్రీసభ ఉనికి గురించి, శ్రీసభ సైని గురించి, శ్రీసభ ప్రవృత్తి గురించి ఇటువంటి అనేక రూపకాలు మనకు కనిపిస్తాయి. ఈ రూపకాలకు ఆధారము, ప్రారంభము "ఆధునిక ప్రపంచంలో శ్రీసభ" అను ఈ పత్రము. అనగా ఈ

పత్రము శ్రీసభను మానవ సేవ వైపు సంపూర్ణంగా నడిపిస్తుంది. అనగా కతోలిక క్రైస్తవత్వం గర్భగుడిని దాటి బయటికి వస్తుంది. అనగా తన గుడి గోడలను దాటి బయటకు చూస్తుంది. అనగా తన సౌకర్యమైన విలాసవంతమైన కట్టలను దాటి ప్రజల హృదయంలోనికి ప్రవేశిస్తుంది. తనదైన జీవితాన్ని ప్రజలకు అందిస్తుంది. ప్రజలకు ఒక మంచి కాపరిగా భరోసా ఇస్తుంది. తన హృదయములో తన పరిచర్యలో మానవాళి ఆవేదనలను ఆందోళనలను నిరంతరము మోస్తుంది.

## శ్రీసభ: ప్రపంచానికి హృదయం
## (ఆధునిక ప్రపంచంలో శ్రీసభ పత్ర అధ్యయనం)

జూబిలీ 2025. ప్రభు వత్సరం పవిత్ర సంవత్సరం. పోపు ఫ్రాన్సిస్ 2025 వ సంవత్సరమును ఒక సాధారణ జూబిలీ సంవత్సరంగా ప్రకటించాడు. ఈ పవిత్ర సంవత్సరం కొరకై సిద్ధపడాలి అని సూచించాడు. ముఖ్యముగా రెండంచెల సిద్ధపాటును ఆయన మనకు అందించాడు. మొదటిది, 2023-24 సంవత్సరం ప్రధానమైన ద్వితీయ వాటికను సమావేశ అధికార పత్రాలను అధ్యయనం చేయాలి: పవిత్ర దైవార్చనా చట్టం (Sacrosanctum Concilium), లోకానికి వెలుగు శ్రీసభ (Lumen Gentium), దైవవాక్కు (Dei Verbum), ఆధునిక ప్రపంచంలో శ్రీసభ (Gaudium et Spes). రెండవది, 2024-25 సంవత్సరమును ప్రార్ధనా వత్సరంగా కొనియాడాలి ఎందుకన, ప్రార్ధన విశ్వాస ఊపిరి, అదే విశ్వాస ప్రకటన. ఈ రానున్న జూబిలీ నిరీక్షణముతో నమ్మకముతో కూడిన వాతావరణమును తిరిగి పునర్నిర్మించాలి. ఇదే మన అత్యవసర కాంక్షకు సంకేతముగా నిలిచిన నూత్నీకరణకు, విశ్వాస పునర్జన్మకు ఆరంభంగా ఉండాలి. మనం మనలో ఉన్న నిరీక్షణ జ్వాలను వెలిగించాలి. తత్ఫలితంగా అందరు కూడా ఒక నిండు ఆత్మతో, నమ్మక హృదయంతో, నూతన దృష్టితో భవిష్యత్తును దర్శించగలిగే వినూత్న బలమును భరోసాను అందరికి అందించాలి. ఈ నిరీక్షణను అందించాలంటే మనలో విశ్వజనీన సహోదరత్వం వెల్లివిరియాలి, అందరినీ గౌరవించగలిగే, సమానత్వం పంచగలిగే ఒక మానవ ఔనత్యం మనలో అధికంగా మెరియాలి. అప్పుడే సువార్తా సంతోష సుబోధం అందరికీ చేరుతుంది. శ్రీసభ ప్రేషిత కార్యం పరిపూర్ణమవుతుంది.

## ఆధునిక ప్రపంచంలో శ్రీసభ: అధికార పత్ర అధ్యయనం

జూబిలీ 2025 సందర్భంగా, ఆధ్యాత్మిక అధ్యయనంలో భాగంగా ద్వితీయ వాటికను మహాసభ సువార్తా నిర్మిత పత్రం “ఆధునిక ప్రపంచంలో శ్రీసభ” ను క్షుణ్ణంగా పరిశీలించి, శ్రీసభ ప్రేషిత కార్యమును, ప్రపంచానికి శ్రీసభ అందించు సువార్తా పరిచర్యను, మానవుని సమగ్ర అభివృద్ధికి శ్రీసభ శ్రమించు విధానమును, తద్వారా నాటి అంశాలు ఏవిధంగా నేటికీ పరిపూర్ణ ప్రయోజనాన్ని కలిగి ఉన్నాయి అని అవగాహన చేసుకొని, ఆచరించడంలో జూబిలీ ఉద్దేశ్యం దాగి ఉంది అని తెలుసుకుంటున్నాము.

“ఆధునిక ప్రపంచంలో శ్రీసభ” – Gaudium et Spes. లతీను పదానికి సరియైన అనువాదము: సంతోషములు – నిరీక్షణలు. మానవాళి ఆనందాలను, నమ్మకాలను ఉద్దేశించి పొందుపరచబడిన ఈ పత్రం ఈ సమావేశ చివరి రోజు, డిసెంబరు 7, 1965 ఆమోదం పొందింది. ఈ మహాసభ ప్రారంభమైన మూడు సంవత్సరాలకు ఈ పత్రం రూపొందించబడింది. రెండువేల సంవత్సరాలలో ఒక సమావేశం ఆవిష్కరించిన పత్రాలలో ఇది సుదీర్ఘమైన పత్రం. 1959 నుండి 1962 మధ్య మహాసభకై సంసిద్ధపడిన ఈ మూడు సంవత్సరాలలో అసలు ఈ పత్రం ప్రస్తావన ఎక్కడా కనిపించలేదు. అయితే ఈ పత్రంలోని మొదటి వాక్యమే పత్రంలోని సమస్త సందేశానికి మూలము: “లోక శ్రేయం శ్రీసభ శ్రేయం మానవ దుఃఖం శ్రీసభ దుఃఖం లోకంలోని మానవులకు మంగళకరమైన విషయాలన్నీ శ్రీసభకూ ఆనందాన్ని కలిగిస్తాయి మానవుల దుఃఖమునకు కారకమైన ఈతిబాధలు ఘోర విపత్తులు యుద్ధ బీభత్సాలు – శ్రీసభ హృదయాన్ని కలిచివేస్తాయి. కంటతడి పెట్టిస్తాయిబీ మానవులనుభవించే ఆశానిరాశలు భావోద్వేగాలన్నీ శ్రీసభను సైతం ప్రభావితం చేస్తాయి. ముఖ్యంగా – సామాజిక వ్యవస్థలో అట్టడుగున గల పేదలు, పీడితులు బాధితులందరి జీవన సమస్యలు అటు ప్రపంచానికే కాదు ఇటు శ్రీసభకూ పెను సవాళ్ళవుతాయి.” (GS 1)

## గౌదియుం ఎత్ స్పేస్: ప్రారంభ పునాదులు

“ఆధునిక ప్రపంచంలో శ్రీసభ” అను అధికార పత్రం వాస్తవరూపం దాల్చడానికి మరో రెండు పత్రాలు దోహదపడ్డాయి. అవి పునాదులుగా కనిపిస్తాయి.

కాబట్టి వాటి గురించి కూడా తెలుసుకోవడం సమంజసం. ప్రస్తుత పత్రానికి ఇవి ఉపోద్ఘాతాలుగా గోచరమవుతాయి. ఈ రెండు పత్రాలు కూడా ద్వితీయ వాటికన్ మహాసభకు పిలునిచ్చిన పోపు ఇరువది మూడవ జాన్ పాలనలో, ఆయన ఆలోచననుండి వెలువడినాయి. అవి: మొదటిది – మాతెర్ ఎత్ మజిస్త్ర (Mater et Magistra), రెండవది – పాచెం ఇన్ తెర్రిస్ (Pacem in Terris). ఈ రెండు కూడా పాపుగారి నుండి లోకానికి అందించబడిన సాంప్రదాయపూర్వక పత్రాల వంటివి.

మొదటిది – మాతెర్ ఎత్ మజిస్త్ర: మాతెర్ ఎత్ మజిస్త్ర – "క్రైస్తవత్వం – సామజిక పురోగతి" అను ఈ పత్రము 1961లో అనగా ద్వితీయ వాటికన్ మహాసభకు ఒక సంవత్సరం ముందుగా లిఖించబడింది. ఈ పత్రము సందర్భంను గ్రహించడం అవసరం. రేరుం నోవారుం అను సాంఘీక పత్రము డెబ్బదియవ వార్షికోత్సవ పత్రముగా ఇవ్వబడింది. అప్పటికే మూడవ స్థాయి ప్రపంచాలు కతోలిక అవగాహనను విమర్శించడం మొదలుపెట్టాయి. ధనిక పేద దేశాల మధ్య వ్యత్యాసం పెరిగిపోయింది. పారిశ్రామికంగా ఎదగని వ్యవస్థలలో కార్మికుల పరిస్థితులు దారుణంగా మారిపోయాయి. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఐరోపా పారిశ్రామిక దేశాలు ఆర్ధికంగా పురోగతిని సాధించాయి. పెట్టుబడి విధానవమే మానవశ్రేయస్సుకు ఆధారం అను సామజిక అవగాహన చోటుచేసుకుంది. పేద దేశాలలోని శక్తిని, వనరులను అధికంగా వినియోగించుకొని ఐరోపా దేశాలు తమ ఆర్థిక వ్యవస్థను బలపరచుకున్నాయి. ఈ పత్రములో పాపుగారు నాటి ఆర్థిక, సాంఘీక, రాజకీయ పరిస్తితులను ప్రస్తావించాడు.

అంతకు ముందు శ్రీసభ ప్రబోధంలోని అంశాలను పరిగణలోనికి తీసుకొని, ఒకవైపు ప్రైవేటు సంస్థల పెట్టుబడులు, మరోవైపు ప్రభుత్వ జోక్యము రెండూ ప్రధానమని, కర్మాగారంలో న్యాయ పరిరక్షణ అవసరమని, కార్మికులకు యాజమాన్యంలో భాగస్వామ్యం ఇవ్వాలని, అంతర్జాతీయ ఆర్ధిక స్థాయిలో ఉత్పన్నమయ్యే నూతన అవసరాలను అందుకోవాలని ఈ రేరుం నోవారుం అను పత్రములో పాపుగారు బాహాటం చేసాడు. ఇంకా ఒక అడుగు ముందుకు వేసి, వ్యవసాయ రంగంలో వివిధ రూపాలలో సహాయం, చేయూత, విధానాలు ఉండాలని సూచించాడు. శాంతిని స్థాపించడం ప్రధానం అని తెలియజేసాడు.

ఆ శాంతికి అవరోధాలుగా నిలిచే ఆర్థిక అసమానతలను తొలగించి, సాంస్కృతిక గౌరవంతో ఉదారత్వంతో అవసరంలో ఉన్న దేశాలకు ప్రైవేటు ప్రభుత్వ అత్యవసర పరిస్థితులను కలిగించాలని, అభివృద్ధి సహకారమును అందించాలని పాపుగారు ప్రకటించాడు. అంతేకాదు, అనవసరమైన జనాభాను అదుపులో పెట్టాలని, పరస్పర ఆధారమును పెంపొందిస్తూ అంతర్జాతీయ సహభాగమును వృద్ధిచేయాలని, న్యాయమును నైతికతను నిలబెట్టాలని, తద్వారా కతోలిక శ్రీసభ సామజిక విలువలలో భాగంగా మానవ ఔనత్యమును సాధించాలని పాపుగారు ప్రబోధించాడు.

రెండవది – పాచెం ఇన్ తెర్రిస్: రెండు సంవత్సరాల అనంతరం ఏప్రిల్ 11,1963 సంవత్సరంలో, మహాసభ మొదటి సెషన్ ముగిసిన తరువాత జాన్ పాపుగారు తన రెండవ సామాజిక పత్రమును విడుదల చేసాడు. అదే పాచెం ఇన్ తెర్రిస్ "భూమిపై శాంతి". దీనిని ముందుగా మేత్రానులను, శ్రీసభను, తదుపరి 'మంచి మనసుగల ప్రజలందరిని' ఉద్దేశించి అందించాడు. ఇది పాపుగారి 'వీలునామాగా సాక్ష్యముగా' కనిపిస్తుంది. ఎందుకంటే, రెండు మాసముల తర్వాత జూన్ 3, 1963 లో ఆయన మరణించాడు. ఆయన తర్వాత జోవాన్ని బతిస్తి మొంతిని పాపుగారుగా ఎన్నిక చేయబడినాడు, ఆయన ఆరవ పౌలుగా పేరును తీసుకున్నాడు. ఈ పాచెం ఇన్ తెర్రిస్ రెండు ప్రపంచ యుద్ధముల తర్వాత, కొరియా ఆందోళనం మధ్య కనిపిస్తుంది. బెర్లిన్ అడ్డుగోడ నిర్మితమైంది. ఆ ముందు సంవత్సరమే పాపుగారి సహకారంతో క్యూబా మిస్సైల్ సంక్లిష్ట పరిస్థితి తొలగిపోయింది. అప్పుడప్పుడే వియత్నాం యుద్ధం ఆరంభ స్థాయిలో ఉంది. అమెరికాలో అప్పుడే బాంబుల నిలయాలు, దానితో న్యూక్లియర్ బాంబు బయాందోళనలు మొదలయ్యాయి. అభివృద్ధి చెందుతున్న మూడవ స్థాయి దేశాలలో కూడా మారణాయుధ తయారీలు ప్రారంభం అయ్యాయి.

ఇటువంటి పరిస్థితుల నడుమ పాపుగారు ప్రకటిస్తున్నాడు: 'దేవుడు నెలకొల్పిన క్రమమును బాధ్యతతో పాటించినపుడు' మాత్రమే శాంతి సాధ్యం అవుతుంది. వ్యక్తులకు, వ్యవస్థలకు, ప్రజల పాలకులకు, ప్రపంచ సంఘమునకు కొన్ని సహజమైన నియమావళి ఇవ్వబడింది. వాటిని నిక్కచ్చిగా ఆచరించాలి. ఇందులో పాపుగారు ఆర్థికపరమైన, రాజకీయ పరమైన, మతపరమైన హక్కులను,

సంచారకుల హక్కులను, పౌరుల పరస్పర బాధ్యతలను కూడా ప్రస్తావించాడు. సామజిక అధికారం ఒకవైపు, సాంప్రదాయ కతోలిక సాంఘీక ప్రబోధనలు మరోవైపు 'మానవ శ్రేయస్సు' ను దృష్టిలో పెట్టుకొని, హక్కుల పరిరక్షణ కోసం, పేదలపట్ల బాధ్యత కోసం కృషి జరపాలని ఆయన తెలియజేసాడు. ఈ పత్రానికి గుండె వంటి ప్రబోధ ఇంకో స్థాయిలో వ్యక్తం చేయబడింది: దేశాల మధ్య సత్సంబంధాల పునరుద్ధరణ. ఇందులోని అంశాలు: జాతి వివక్షను తొలగించడం, స్వయంప్రపత్తిని ప్రోత్సహించడం, సహాయసహకారాలను నిర్బంధన చేయడం, నిరాశ్రయుల హక్కులను రూపొందించడం. పాపుగారు 'మారణాయుధాల తయారీ' ఒక భయానక పరిస్థితిని కల్పిస్తుందని ఆవేదన వ్యక్తం చేసాడు. పాపుగారు తర్వాత మరణించినప్పటికీ ఆయన ప్రబోధాలు తిరిగి మహాసభ అధికార పత్రమైన గౌదియుం ఎత్ స్పెస్ లో చాలా శక్తివంతంగా కనిపిస్తున్నాయి.

## గౌదియుం ఎత్ స్పెస్: చారిత్రాత్మక నేపథ్యం

వాటికన్ మహాసభకు జాన్ పాపుగారు జనవరి 25, 1959న పిలుపునిచ్చాడు. అప్పటికి ఆయన పాపుగారిగా ఎన్నికై కేవలం మూడు నెలలు మాత్రమే. ఇక అప్పటినుండి దాదాపు మూడు సంవత్సరాలకు పైగా రకరకాల సమావేశాలు, సభలు ఏర్పాటు చేసి, పలువిధములైన అంశాలపై అధ్యయనం చేస్తూ మహాసభకు సిద్ధపడుతూ వచ్చారు. అయితే ఈ సిద్దపడు మూడేళ్ళ కాలంలో 'ఆధునిక ప్రపంచంలో శ్రీసభ' పత్రము గురించి ఒక్క ఆలోచన రాలేదు, ఒక్క ప్రయత్నమూ జరగలేదు.

మహాసభ మొదటి సెషన్ సెప్టెంబర్ 11, 1962 లో మొదలైంది. దానికి ఒక నెల ముందు జాన్ పాపుగారు ఒక రేడియో సందేశాన్ని ఇస్తూ ఈవిధంగా సెలవిచ్చాడు: ఇంకనూ అభివృద్ధికి నోచుకోని దేశాలలో, శ్రీసభ తనను తాను తనను వ్యక్తపరచుకుంటుంది. తను అందరి శ్రీసభగా, ప్రత్యేకంగా పేదల శ్రీసభగా ఉండాలని కాంక్షిస్తుంది. దీనికి ఊతమిస్తూ బలమిస్తూ 20 అక్టోబర్ 1962, మహాసభ ఆరంభమైన పది రోజులకు, సభసభ్యులు ప్రపంచానికి ఒక సందేశాన్ని అందించాలని నిర్ణయించారు. అందులో ఒక భాగము ఇలా ఉంటుంది: మేము అత్యవసరంగా మా ఆలోచనలను నేడు మానవాళి ఎదుర్కొంటున్న సమస్యలవైపు

మళ్లిస్తున్నాము. కాబట్టి, మాకు అణగారిన వారి పట్ల, పేదల పట్ల, నిస్సహాయుల పట్ల అమితమైన ఆసక్తి ఉంది. క్రీస్తువలె, ఆకలి, దయనీయం, అజ్ఞానము అను భారములతో క్రుంగిపోయిన వారిపై కనికరమును కలిగిఉన్నాము. మా పనిని ప్రారంభిస్తూ ఉండగా, మనిషి ఔనత్యమును పరిరక్షించు అన్ని అంశాలపై, ప్రజలందరి శ్రేయస్సుకు ఉపకరించు విషయాలపై మా దృష్టిని సారిస్తాము.

కర్దినల్స్ సుయేనెన్స్, మొంతిని, లేర్కారో మొదటి సెషన్ ముగింపులో ఒక పిలుపును ఇచ్చారు. శ్రీసభ 'వెలుపలకు' చూడాలి అని, ప్రపంచ అవసరాలను ప్రస్తావించాలని వారు చేసిన పిలుపు మేరకు గౌడియుం ఎత్ స్పెస్ ఉద్భవించింది. 4 డిసెంబర్ 1962 కార్డినల్ సుయేనెన్స్ జాన్ పాపుగారి రేడియో సందేశాన్ని బాహాటంగా ప్రస్తావిస్తూ తన ఉద్దేశ్యమును తెలియజేసాడు: పాపుగారు ప్రకటించిన విధంగా "క్రీస్తు శ్రీసభ, లోకానికి వెలుగు' గా మన ప్రధాన అంశం ఉండాలి. ఈ అంశానికి రెండు భాగాలు ఉన్నాయి. ఒకటి – శ్రీసభ తన అంతర్గత తత్త్వమును పరిశీలించుకోవాలి, ఇక్కడ శ్రీసభ "నీ గురించి నీవు ఎమనుకుంటున్నావు' అను ప్రశ్నకు జవాబు ఇవ్వాలి. రెండవది – శ్రీసభ బాహ్య ప్రపంచంతో ఎటువంటి బంధమును కలిగి ఉంది అని గ్రహించాలి. ఈ రెండవ భాగంలో మానవుని గురించి, సాంఘీక న్యాయం గురించి, పేదలకు సువార్తపరిచర్య గురించి, ప్రపంచ శాంతి గురించి తలెత్తు ప్రశ్నలకు సమాధానం వెదకాలి.

ఈ ప్రశ్నలకు సమాధానములను అన్వేషించు ప్రయాణంలో వాటికన్ మహాసభ మూడు రకాల సంభాషణలకు తావివ్వాలి: ఒకటి – శ్రీసభ తన స్వీయ సభ్యులతో సంభాషణ జరపాలి, రెండు – క్రైస్తవ సమైఖ్యత సంబాషణ అనగా 'ఇప్పుడు గోచరమగు ఐఖ్యతను కలిగి లేకపోయినా తనతో సంబంధం కలిగిన క్రైస్తవ సహోదరీసహోదరుల'తో సంభాషణ, మూడు – ఆధునిక ప్రపంచంతో సంబాషణ.కార్డినల్ సుయేనెన్స్ చేసిన ఈ ప్రతిపాదనకు చక్కటి స్పందన వచ్చింది. మహాసభ దీనికి అనుగుణంగా తన పనిని నడిపించడం ప్రారంభించింది. 'ప్రపంచంతో సంబాషణ' అనునది ఒక విప్లవాత్మకమైన ప్రతిపాదన. ఎందుకంటే, పంతొమ్మిదవ శతాబ్దంలో శ్రీసభ అనేకమైన ఆధునిక అంశాలను నిరాకరించింది. ఇప్పుడే అదే 'ఆధునిక ప్రపంచం'లో శ్రీసభగా ఆవిర్భవించవలసిన ఆవశ్యకత గ్రహించడం ఒక పెనుమార్పుగా అభివర్ణించవచ్చు.

ఇక మహాసభలో ఆసియా ఆఫ్రికా లాటిన్ అమెరికా మేత్రానులు అధిక ఆధిక్యత ప్రదర్శించి విశ్వ విశ్వాస సంఘ అవసరాలను ప్రస్తావించగా శ్రీసభ తనలోని విశ్వజనీన లక్షణమును గ్రహించింది. ఒకవైపు ఐరోపా అవసరాలు, ఐరోపా మేత్రానులు అనేక చర్చలలో ఆధిపత్యమును చూపినప్పటికీ, జాన్ పాపుగారి రెండు పత్రాలలో పొందుపరచిన మానవ జీవనస్థాయికి, శాంతికి ప్రమాదకరంగా మారిన ఆర్థిక అసమానతలు, భయాలు, క్లుప్తంగా మానవుని 'ఆనందాలు, నిరీక్షణలు, వేదనలు ఆందోళనలు (గౌదియుం ఎత్ స్పెస్) మాత్రం అనేకమంది సభ్యుల మనసులలో మెదులుతున్నాయి.

మహాసభ తదుపరి మూడు సమావేశాలలో ఈ పత్రం గురించి అధికంగా చర్చ జరిగింది. సిద్ధపాటు కమిటీల కంటే సభలో పాలుపంచుకున్న సభ్యులే ఈ పత్రం యొక్క అంశాన్ని పొందుపరిచారు. మహాసభ పత్రాలలో ఈ పత్రము సలక్షణమైన ప్రాముఖ్యత కలిగిన పత్రముగా రూపుదిద్దుకుంది. దీనికి ప్రేరణ కలిగించిన వారు 23వ జాన్ పాపుగారు, అప్పటి కార్డినల్ మొంతిని ( తరువాత ఆరవ పౌలు పాపుగారు), అతి మేత్రానులు కరోల్ వైటిల ( తర్వాత రెండవ జాన్ పాల్ పాపుగారు), గురువులు కారల్ రానర్, జోసెఫ్ రాత్సింగర్ ( తర్వాత 16వ బెనదిక్టు పాపుగారు). మహాసభ చివరి రోజున ఈ పత్రము ప్రకటింపబడింది.

సంక్లిప్తంగా చూద్దాం: కతోలిక సాంఘిక ప్రబోధలలో ఈ పత్రము అత్యంత అధికారికత కలిగిన పత్రము. ఇందులో రెండు భాగాలు ఉన్నాయి. మొదటి భాగంలో మానవ ఔన్నత్యము, సాంఘిక సంబంధాలు, ప్రధానమైన సామాజిక అవసరాలు, ప్రపంచంలో శ్రీ సభ పాత్ర అంశాలు కనిపిస్తాయి. రెండవ భాగంలో నాలుగు అత్యవసర సమస్యలు కనిపిస్తాయి: మొదటిది వివాహం కుటుంబం. ఇందులో అధిక జనాభా సమస్య, తల్లిదండ్రుల బాధ్యత, జీవితము పట్ల గౌరవం, కుటుంబ స్థిరత్వం కనిపిస్తాయి. రెండవది మానవ సంస్కృతి వికాసం. ఇందులో సంస్కృతుల భిన్నత్వం, పురోగతి కనిపిస్తాయి. మూడవది ఆర్థిక సామాజిక రంగం: ఇందులో పేద ధనిక మధ్య అసమానతలు, న్యాయ సాధనకై ప్రయత్నాలు, సహజ వనరులను సరైన విధంగా అందరికీ పంచడం కనిపిస్తాయి. నాలుగవది రాజకీయ రంగం. ఇందులో ప్రభుత్వ అధికారుల బాధ్యతలు, సకల జనుల

శ్రేయస్సు కనిపిస్తాయి. ఈ పత్రం యొక్క చివరి భాగములో యుద్ధ పరికరాల సంక్షోభము, శాంతి పునాదులు గౌరవము, ప్రశాంతత, న్యాయము ప్రేమ అంశాలు కనిపిస్తాయి. అహింస, యుద్ధ వ్యతిరేకత అను అంశాలను బలంగా ఈ పత్రము తెలియజేస్తుంది. ఈ పత్రం నుండి అనేక అంశాలు మనము గ్రహించగలము. ఇక్కడ ఆరింటిని పరిశీలిద్దాం.

## 1. మానవుని పవిత్రత ఔన్నత్యము

సమస్తము మానవుని సృష్టితో ఆరంభమవుతుంది. ఆదికాండములోని మాటల ప్రకారము దేవుడు మానవుని తన రూపములో తన పోలికలో సృష్టించాడు. కతోలిక సాంఘిక ఆలోచనకు మానవులలోని ఈ దైవ రూపము దైవ పోలికలే పునాదులు. ఇందులో మానవ ఔన్నత్యము దాగి ఉంది. ఒకవైపు అనేక సామాజిక తత్వాలు మరియు రాజకీయ ప్రమాణాలు మానవ ఔనత్యం గురించి మాట్లాడుతూ ఉన్నప్పటికీ, మరోవైపు ఆధ్యాత్మికంగా మానవ ఔన్నత్యము మరో స్థాయికి చేరుతుంది. ఈ ఆధ్యాత్మికపరంగా మానవుడు దేవునితో సన్నిహిత సంబంధమును పెంచుకొనగల శక్తిని కలిగి ఉన్నాడు, యేసుక్రీస్తు సంపాదించిన అనుగ్రహం ద్వారా మానవుడు పవిత్ర పరపబడి ఉన్నాడు, రక్షణను అందుకొని ఉన్నాడు. దీని మూలంగా మానవుడు తన ఔన్నత్యంలో పరిపూర్ణతను పరిశుద్ధతను పొందుతున్నాడు. "ప్రపంచంలో శ్రీ సభ" ప్రబోధనను గుర్తుకు చేస్తూ, "శ్రీ సభ సాంఘిక సిద్ధాంతాల సారాంశము" ఇలా ప్రస్తావిస్తుంది: ఉన్నత స్థితికి చేరగల ఔన్నత్యం పట్ల గౌరవము కలిగి ఉన్నప్పుడే ఒక మంచి సమాజము నిర్మితమవుతుంది... కాబట్టి సామాజిక క్రమము సామాజిక పురోగతి మానవుని ప్రయోజనం కొరకు పని చేయాలి. ఎందుకంటే, వస్తు క్రమము వ్యక్తి క్రమమునకు లోబడి ఉండాలి, అంతేకానీ వస్తువుల కొరకు వ్యక్తులను వినియోగించకూడదు.

మానవ ఔన్నత్యము, ఉన్నత స్థితి ఒక విజయంపై, ఒక అభ్యాసముపై, ఒక సంపాదనపై, ఒక వర్గముపై, ఒక జాతిపై, ఒక దేశం పై ఆధారపడి ఉండదు. అదే విధంగా జన్మములో ఒక లోపము ఉన్నంత మాత్రమున, ఒక రోగము వచ్చినంత మాత్రమున, ఒక హత్య చేసినంత మాత్రమున, పేదరికంలో ఉన్నంత మాత్రమున, ప్రతికూల పరిస్థితుల మధ్య జీవిస్తున్నంత మాత్రమున మానవ ఔన్నత్యము, మానవ ఉన్నత స్థితి తొలగిపోవు. ఔన్నత్యము మానవుని వ్యక్తిత్వానికి

సంబంధించినది అంతేకానీ బాహ్యామైన చర్యకు సంబంధించినది కాదు.

మానవ ఔన్నత్యము ఒక ముఖ్యమైన అంశము. దీనినే శ్రీసభ సాంప్రదాయము “ఒక అనుబంధము” అని సంబోధిస్తుంది. దీనిని మొదటిగా 11వ భక్తీనాధ పాపుగారు 1931 లో ప్రకటించాడు. దీనినే గౌదియుమ్ ఎత్ స్పేస్ ఆర్థిక రంగ స్థాయిలో అంతర్జాతీయ భాగస్వామ్యం గురించి జరిగిన చర్చలో ధ్రువీకరిస్తుంది. ఈ అనుబంధములో భాగస్వామ్యమునకు బహుత్వమునకు గొప్ప ప్రాముఖ్యత కనిపిస్తుంది. శ్రీసభ సాంఘిక ప్రబోదల పత్రము ఈ విధంగా ప్రకటిస్తుంది: అనుబంధము అను అంశము ప్రజలను పైఅధికారుల దుర్వినియోగాల నుండి కాపాడుతుంది. అంతేకాకుండా ఈ సామాజిక అధికారాలు వ్యక్తులకు దోహదపడాలని, కుటుంబములు సంఘాలు యూనియన్లు రాజకీయ వర్గాలు అను సమూహాలకు తోడ్పడుతూ వారి బాధ్యతల నిర్వహణకు సహకరించాలని తెలియజేస్తుంది. కాబట్టి ఈ అనుబంధము ఒక ఆజ్ఞగా పని చేస్తుంది. . దీని ద్వారా ఒక వ్యక్తి గాని ఒక కుటుంబము గానీ ఒక వర్గముగాని సమాజానికి తమ వంతు భాగమును అందించాలని ఆజ్ఞాపిస్తుంది.

ఒక పెద్ద ప్రభుత్వానికి అనుకూలముగాను వ్యతిరేకముగాను ఉండడం ముఖ్యం కాదు. కతోలిక సాంఘిక ప్రబోధము ఈ అనుబంధ సూత్రము ద్వారా పెద్ద రాజకీయ వర్గాలు చిన్న సంఘాల లేదా స్థానిక సంఘాల ప్రభావిత కార్యాలను అడ్డుకోకూడదని బలముగా తెలియజేస్తుంది. సాంఘిక వాదానికి, జాతివాదానికి వ్యతిరేకంగా ఉత్తరము పనిచేస్తుంది. అదే సమయంలో, ఈ చిన్న సంఘాలు లేదా స్థానిక సంఘాలు ఒక సమస్యను లేక ఒక అవసరాన్ని పరిష్కరించగల సామర్థ్యాన్ని అందుకొని సమయములో, పెద్ద ప్రభుత్వాలు అనగా రాష్ట్ర ప్రభుత్వము ఆ సమస్యను పరిష్కరించడానికి బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. మరో మాటలో చెప్పాలంటే, సమాజంలోని, ప్రభుత్వములోని, వ్యక్తిగత సంఘాలలోని అనేక వర్గాల మధ్య సరియైన సంబంధమును పెంపొందించడానికి, అనగా అందరి శ్రేయస్సు కొరకై శ్రమించడానికి ఈ అనుబంధ సూత్రము నడిపిస్తుంది.

ఈ అనుబంధ సూత్రము మానవ ఔన్నత్యములో వేళ్ళూనుకొని ఉంది. అనగా మనము మానవులము మానవ వ్యక్తికరణలో మనము చేయు నిర్ణయాలు, పరిష్కరించు సమస్యలు చేసిన వారికి మరియు వాటిని పొందిన వారికి ఉ పయోగపడేలా ఉండాలి. ఈ అనుబంధ సూత్రం ప్రకారము చిన్న కార్యమైనా

ప్రతిఫలము కలిగి ఉండాలని, పర్యావరణం కంటే వ్యక్తికి ప్రాముఖ్యతను ఇవ్వాలని, నిర్ణయాలు చేయడంలో అందరి సహకారమును తీసుకోవాలని తెలుస్తుంది. 16వ బెనదిక్టు పాపుగారు మాటల ప్రకారము అనుబంధ సూత్రము సంఘీభావ సూత్రంతో సంబంధం కలిగి ఉంది. అనగా అనుబంధము సంఘీభావము చేతిలో చేయి వేసి సాగినప్పుడే సామాజిక న్యాయము నీతి సమాజము ఏర్పడుతుంది.

**రెండవది: అందరి శ్రేయస్సు పవిత్రమైనది సాంఘికమైనది**

శ్రీ సభ ఒకవైపు మానవుని ఔన్నత్యమును ఉన్నతత్వమును ప్రకటిస్తూనే, మరోవైపు మానవుడు స్వభావికంగా సంఘజీవి అని ఈ పత్రము ద్వారా బహిరంగ పరుస్తుంది: "మానవుడు స్వభావికంగానే సామాజికుడు, మానవ సంబంధాలు అతని మనుగడకు మూలాధారాలు. ఇలా, పరస్పర సంబంధాలు గల మానవ సమూహమే సమాజం. కనుకనే, మానవ వికాసం, సామాజిక పురోగమనం ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉంటాయి. ఈ విధంగా, తన వ్యక్తిగత వికాసం కోసం సామాజిక జీవనంపై సంపూర్ణంగా ఆధారపడి ఉండే మానవునికి, సామాజిక సంస్థలలోనూ, సామాజిక కార్యకలాపాలన్నిటిలోనూ కీలకమైన ప్రాధాన్యం కల్పించాలి. నిజానికి సామాజిక జీవన రంగాలన్నీ మానవ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగానే ఆరంభం కావాలి. సామాజిక సంస్థలన్నీటికి మానవ సంక్షేమమే పరమావధి కావాలి. మానవ జీవితం సామాజిక జీవనం వేర్వేరు కాదు. సామాజిక జీవనం అనేది మానవ జీవితానికి కృత్రిమంగా తగిలించబడ్డ అదనపు అవయవం వంటిది కాదు.. రెండు ఏక శరీరం వంటివి. మానవుడు వ్యక్తిగా ఇతరులతో ఏర్పరచుకొనే సంబంధాలు, పరస్పరం అందజేసుకునే సేవా సహకారాలు, సహృద్భావంతో కొనసాగించే చర్చోపచర్చలు, ఉమ్మడి ఆలోచనలు, ఉమ్మడి కార్యాచరణ, ఇవన్నీ మానవుని శక్తి, సామర్థ్యాలకు మెరుగుపెడతాయి, అతని వ్యక్తిత్వాన్ని వికసింపజేస్తాయి, దేవుడు తనకు నిర్దేశించిన గమ్యం వైపు నడిపిస్తాయి." (GS 25).

పసిబిడ్డలను, చిన్నారి బిడ్డలను అనురాగంతో చేరదీయాలని మనము వినియున్నాము. అటువంటి వ్యక్తిగత శ్రద్ధ, స్పర్శ, జాగ్రత్త, ఆహారమును ఆశ్రయమును వస్త్రములను ఇతర ప్రధాన అంశములను అందించడం చాలా అవసరము. అలా జరగని పక్షములో ఆ బిడ్డ కోలుకోలేని స్థితిలో ఆగిపోతుంది.

అనగా మానవుడు ఒకరితో ఒకరు పరస్పర సంబంధం కలిగి, ఒకరి అవసరమును మరొకరు గుర్తించి, ఒకరికి ఆదరణగా మనకు జీవిస్తూ, ఒక అనుబంధముతో ముందుకు సాగడమే అతని సామాజిక స్వభావంగా కనిపిస్తుంది. ద్వితీయ వాటికన్ మహాసభ ఈ పరస్పర అనుబంధము గురించి, అందరి శ్రేయస్సు గురించి, సార్వజనీయంగా పరస్పర ఆధారం గురించి ప్రబోధిస్తుంది: "ఆధునిక ప్రపంచంలో వివిధ దేశాలు, విభిన్న జాతులకు చెందిన ప్రజల మధ్య సంబంధ బాంధవ్యాలు పెరగడం, ఒకరిపై ఒకరు ఆధారపడి జీవించే పరిస్థితులు నెలకొనడం వలన ఇటు వ్యక్తులు అటు మానవ సంఘాలు తమ ఆశలు ఆశయాలకు అనుగుణంగా సత్వర అభివృద్ధిని సాధించడానికి అనుకూలమైన వాతావరణం నెలకొంటుంది. సర్వ మానవ సంక్షేమ స్వప్నం సాకారం కావడానికి సానుకూలమైన నేపథ్యం ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో మానవుల మౌలిక హక్కులు, ప్రధాన బాధ్యతల గురించి ప్రపంచవ్యాప్తంగా చర్చలు జరుగుతున్నాయి. సర్వ మానవ సంక్షేమానికి ఏ ఏ విధివిధానాలను పాటించాలో, ఏ ఏ లోటుపాటులను సరిదిద్దుకోవాలో తర్జనభర్జనలు కొనసాగుతున్నాయి. పర్యవసానంగా ఏ జాతి జనులు, ఏ దేశ ప్రజలు ఏ కాకులు కారని, ప్రపంచంలోని ప్రతి మానవ సమాజం సాటి మానవ సమూహాల ఉనికిని గుర్తించి, వాటి అవసరాలను ఆశయాలను పరిగణలోనికి తీసుకొని, వారికి తమ వంతు సహాయ సహకారాలను అందజేయాలని, పరస్పర సహకారం సర్వ మానవ వికాసానికి అనివార్యమని నిర్ధారించడం జరిగింది. మరో మాటలో చెప్పాలంటే యావత్ మానవ కుటుంబ సంక్షేమ వికాసాలకు కృషి చేయవలసిన బాధ్యత ప్రపంచ ప్రజలందరికీ ఉన్నదన్న స్పృహ అందరిలోనూ పెరుగుతూ వస్తుంది." (GS 26). ఈ అంశాన్ని పునర్ఘటించడంలో ఈ పత్రము మాతేర్ ఎర్త్ మజిస్త్ర అను పత్రంలోని 65వ అంశమును బలంగా ఇక్కడ పొందుపరుస్తుంది.

సత్యోపదేశం సర్వ మానవ శ్రేయస్సు గురించి మాట్లాడుతూ మూడు ప్రధానమైన విషయాలను స్పృశిస్తుంది: వ్యక్తికి వ్యక్తిగత గౌరవమును అందించడం, సామాజిక శ్రేయస్సు సంఘ పురోగతికి తోడ్పడటం, సమ సమాజ స్థాపన ద్వారా శాంతిని ప్రసరింప చేయడం. సర్వ మానవ శ్రేయస్సు బీజాలు గ్రీకు మరియు రోమన్ తత్వశాస్త్రములో రాజకీయ జీవిత లక్ష్యంగా, పురపాలక శ్రేయస్సుగా,

సామాజిక నాయకులకు అందించబడిన కర్తవ్యంగా కనిపిస్తాయి. కాబట్టి, ప్రజల చేత ఎన్నిక చేయబడిన ప్రతి నాయకుని ప్రధాన కర్తవ్యం సర్వ మానవ సంక్షేమమే. అనగా ఎన్నికల సమయంలో మనము గుర్తుపెట్టుకోవాల్సింది కేవలము కేవలం సర్వ మానవ శ్రేయస్సు. అంతేకానీ నా వర్గ శ్రేయస్సు, నా పార్టీ నా రాష్ట్రము నా పరిశ్రమ అనునవి కాదు.

## మూడవది: సంఘీభావం

కతోలిక సాంఘిక ప్రబోధములో 'సంఘీభావం' అను పదమును అధికంగా వినియోగించింది పునీత రెండవ జాన్ పాల్ పాపుగారు. అతడే ఈ పదమును దాని అర్థమును అమితంగా విస్తరింప చేశాడు. అదే పదము ఈ పత్రములో బహుళంగా ప్రస్తావింపబడింది. సంఘీభావము అనే ఈ పదము ప్రత్యేక విధంగా 'సార్వజనీన పరస్పర ఆధారము' గురించి చర్చించినప్పుడు (GS 4), 'అంతర్జాతీయ బాంధవ్యాలు' అవసరత గురించి మాట్లాడినప్పుడు (GS 90), ప్రత్యేక విధంగా దేవుని సంకల్పం గురించి చెబుతూ "మానవులంతా ఒకే ప్రజగా సంఘటితులై, అందరూ కలసి తనను తెలుసుకొని, ప్రేమించి సేవించాలన్నదే దేవుని భావన సంకల్పం" అంటూ ప్రకటించే సందర్భంలో (GS 32) ఈ పదము కనిపిస్తుంది. అనగా ఏసుక్రీస్తు ప్రబోధించిన మానవ సంఘ లక్షణం, తన మరణ ఉత్థానముల ద్వారా స్థాపించిన విశ్వాసుల సంఘం, ఇంకా అధికంగా, అంతిమ కాలంలో మానవజాతిని పరిపూర్ణత వైపు నడిపిస్తూ ప్రకటించే సంపూర్ణ సంఘీభావం ఇవన్నీ కూడా ఈ పదములో కనిపిస్తాయి. ఎందుకన, క్రీస్తు మానవ రూపం దాల్చి మానవ సంఘముతో ఒకటి కావడం ద్వారా, దేవుడు సంకల్పించిన మానవ సంఘీభావం సామాజిక లక్షణం ఆయనలో పరిపూర్ణతను సంతరించుకుంది.

అంతేకాదు యేసు ఏనాడు ఏకాకిగా జీవించలేదు. ప్రతి దశలోనూ సంఘంలో ఒకనిగానే జీవించాడు.. సంఘంలో అందరినీ ఉద్దేశించి బోధించాడు.. పౌర చట్టాలను విధేయించాడు... కుటుంబ విలువలను, మానవ సంబంధాల విలువలను పెంచాడు పవిత్రపరిచాడు. తన ప్రబోధనలో సైతం సంఘీభావం గురించి ప్రకటించాడు... అందరూ కలిసి సహోదర భావంతో జీవించడం విశ్వాస కర్తవ్యం అని తెలియజేశాడు... తనను అనుసరించే వారందరూ కూడా ఒకే సంఘంగా ఉండాలని కోరుకున్నాడు, ప్రార్థన కూడా చేసాడు (యోహాను

17). ప్రపంచ ప్రజలందరూ ఒకే దైవ కుటుంబముగా సంఘటితం ప్రభుని సంకల్పం. దైవ ప్రజల సంఘ నిర్మాణం ఈ సంఘీభావం, సౌజన్యం, ప్రేమ సేవాధర్మాల పునాదులపై జరగాలని క్రీస్తు ప్రబోధనాన్ని శ్రీ సభ మరోసారి ఈ పత్రం ద్వారా వెల్లడి చేస్తుంది. వాటికన్ మహాసభ సమావేశ సందర్భములో 23 వ జాన్ పాపుగారు 'పాచెం ఇం తెర్రీస్' పత్రమును లిఖిస్తూ 'చైతన్యవంత సంఘీభావం' అను జీవిత విధానానికి పిలుపునిచ్చాడు. అనగా దీని మూలముగా సర్వ మానవ కుటుంబ శ్రేయస్సు వైపు సమిష్టి కృషి సాగాలని ఆయన ఆశించాడు.

రెండవ జాన్ పాల్ పాపుగారు ఈ సంఘీభావం అను పదాన్ని విస్తరింపజేస్తూ మూలముగా అందరూ కూడా 'సంఘీభావ సాధన బాధ్యత' కలిగి ఉన్నారని గుర్తు చేస్తున్నాడు. సువార్త ప్రేమకు ఒక సమాధానముగా ఈ సంఘీభావం ఆవిర్భవిస్తుందని బోధించాడు. సంఘీభావము మౌలిక ఆర్థిక సాంఘిక మార్పులకు దోహదపడుతుందని తెలియజేశాడు. ఇంకా ఒక అడుగు ముందుకు వేసి ఈ సంఘీభావము ఇటువంటి సందేహం లేకుండా ఒక క్రైస్తవ లక్షణమే అని ప్రకటించారు (Sollicitudo Rei Socialis, 40). ఈ సంఘీభావ బాధ్యత గురించి మాట్లాడుతూ రెండవ జాన్ పాల్ పాపుగారు ఇలా సెలవిస్తున్నాడు: వ్యక్తిగత స్థాయిలోనూ, జాతీయ అంతర్జాతీయ సామాజిక స్థాయిలోనూ దేవుని ప్రణాళికను నెరవేర్చడానికి ఈ సంఘీభావము దోహదపడాలి. సమాజంలో రోజురోజుకు పెరుగుతున్న 'దుష్ట ప్రయత్నాలు' మరియు 'పాప పద్ధతులు' సమస్య పోవాలంటే, తొలగిపోవాలంటే, నిర్మూలింపబడాలంటే అది కేవలము మానవ, క్రైస్తవ సంఘీభావ సాధనం ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. ఇటువంటి బాధ్యత కొరకై శ్రీసభ ప్రతినిత్యం పిలుపునిస్తోంది, అలసిపోకుండా తనవంతుగా చల్పుతుంది. ఈ సంఘీభావ బాధ్యత ద్వారా మాత్రమే మానవ సంఘములోని సానుకూల సామర్థ్యాలన్నీ సామాజిక శ్రేయస్సు కొరకై సామాజిక శాంతి కొరకై వినియోగింపబడతాయి (SS 25).

ఈ సంఘీభావం గురించి మాట్లాడుతున్నప్పుడు రెండవ జాన్ పాల్ మనలను కతోలిక సాంఘిక ప్రబోధనలో ఉన్న మరో ప్రధానమైన అంశము వైపు నడిపిస్తున్నాడు: పేదల పక్షమున నిలబడడం, పేదలకు ప్రాధాన్యత ఇవ్వడం, పేదలను ప్రేమించడం. పేదలను ఆదరించడం ద్వారా సంఘీభావం సంపూర్ణత

సంతరించుకొని సమన్యాయమును నిర్మిస్తుంది అని ఆయన అభిప్రాయపడ్డాడు. “అన్నిటికీ మించి సంఘీభావం అంటే పరస్పర ఆధారము. ఆర్థిక సాంస్కృతిక రాజకీయ మతపరమైన అంశాలలో నేటి ఆధునిక ప్రపంచంలో సంఘీభావము చాలా ఆవశ్యకతను అత్యవసరతను కలిగి ఉంది. ఈ సంఘీభావం నేటి ప్రపంచంలో అన్ని రంగాల అభివృద్ధి సాధనలో ఒక నీతి ప్రమాణముగా కనిపిస్తుంది. ఈ పరస్పర ఆధారము, లేదా సాంఘిక పరస్పర సహకారము, లేదా సంఘీభావం అర్థమైనప్పుడు అది ఒక నైతిక సామాజిక లక్షణముగా రూపొందుతుంది. అప్పుడు జీవితములో అనేక దురదృష్టాలకు లోనై అశాంతితో అలజడితో నశించిపోతున్న అనేకమంది పట్ల కేవలము జాలిని చూపడంతో ఈ సంఘీభావం ఆగిపోదు. అది అందరి బాధ్యతగా ఒక్కొక్కరిని దృఢమైన బలమైన సంకల్పంతో సర్వ మానవ శ్రేయస్సు కొరకై సమర్పించుకొని సాగు లాగున ప్రేరేపిస్తుంది (SS 38).

వ్యక్తిగతమైన నిర్ణయాలు చేయడంలోనూ, ప్రభుత్వ నిర్ణయాలు చేయడంలోనూ, ఆర్థిక నిర్ణయాలు చేయడంలోనూ, పేదల పట్ల నిర్ణయాలు చేయడంలోనూ, సర్వ మానవ శ్రేయస్సు కొరకై జరిగే ప్రతి నిర్ణయం లోనూ ఈ సంఘీభావము ప్రస్ఫుటముగా ఒక బలమైన ప్రభావాన్ని చూపుతుంది. అంతేకాదు పేద ప్రజల నడుమ ఒక సహకార బంధం ఏర్పడాలి. పేదలు ధనికుల మధ్య, పలు విధాల కార్మిక సంఘాల మధ్య, ప్రైవేటు ప్రభుత్వ సంస్థల మధ్య ఒక సమన్వయం ఏర్పడి అందరి సమగ్ర శ్రేయస్సు కొరకై పాటుపడులాగున ఈ సంఘీభావము తన పాత్రను పోషిస్తుంది (Instruction on Christian Freedom and Liberation, 89).

ఈ మొదటి భాగంలో ‘ప్రపంచంలో శ్రీసభ’ అను పత్రము యొక్క నేపథ్యము, 23వ జాన్ పాపు గారి రచనలు దాని ప్రస్తావనము ఆధారంగా చేసుకుని మూడు ప్రధాన ఆలోచనలు ప్రస్తావించాము: మానవ పవిత్రత ఉన్నత జీవితము, మానవుని సామాజిక లక్షణము సర్వ మానవ శ్రేయస్సు, సంఘీభావ లక్షణ ఆవశ్యకత. ఇక రెండవ భాగములో ముఖ్యంగా ఆధునిక ప్రపంచంలో శ్రీసభ పాత్ర ఎంత ప్రభావాన్ని చూపుతుందో తెలియజేస్తూ మరి మూడు అంశాలను అధ్యయనం చేద్దాం. అవి: సంభాషణ సఖ్యత, యుద్ధము యుద్ధ మార్గాలు, శ్రీ సభ ప్రపంచము సంబంధాలు.

## నాలుగవది: సంభాషణ సఖ్యత

ఈ వ్యాసము ఆరంభంలో కార్డినల్ సువనెన్స్ 1962 డిసెంబర్లో ప్రతిపాదించిన మూడు రకాల సంభాషణల గురించి, శ్రీసభ భవిష్యత్తుకు ఆ మూడు సంభాషణలు ఎంత ముఖ్యమో అన్న విషయం గురించి ప్రస్తావించటం జరిగింది. ఆ మూడు సంభాషణలు: శ్రీసభ సభ్యుల మధ్య సంభాషణ, శ్రీసభ నుండి విడిపోయిన కతోలికేతర క్రైస్తవ సహోదరులతో సంభాషణ, ప్రపంచంతో సంభాషణ. అనగా సంభాషణ ఒక సంక్లిష్టమైన సాధనంగా, ద్వితీయ వాటికన్ శ్రీసభ 'శైలిగా' గోచరమవుతుంది.

ఇరువది మాసముల తర్వాత, మహాసభ మూడవ సమావేశపు ఆరంభమునకు మునుపుగా, 'ప్రపంచంలో శ్రీసభ' పత్రం ఇంకా ప్రాథమిక రూపంలో ఉండగా, ఆరవ పౌలు పాపుగారు 'ఎక్లెసియం సువామ్' శ్రీసభ తత్వం పై ఒక అధికార పత్రమును లిఖించాడు. ఈ పత్రములో ఎవరు ఊహించని విధంగా మునుపెన్నడు లేనంతగా సంభాషణ అను అంశంపై, సంభాషణ ఆచరణ పై ఒక దృఢమైన బోధనను అందించాడు. యూదా తాత్వికుడు మార్టిన్ బూబర్ ప్రేరణను అనుసరిస్తూ ఆరవ పౌలు పాపు గారు తన పత్రములో ' సంభాషణ' అను పదమును 77 సార్లు ప్రస్తావించాడు. ఈ సుదీర్ఘమైన పత్రములో సంభాషణ అను పదము, దాని వివరణ, దాని ఆపాద అవసరము అధికమైన పరిధిని కలిగి ఉంది. మహాసభ నాలుగవ చివరిదైన సమావేశంలో, ఇంకా ప్రపంచంలో శ్రీసభ అను పత్రము తీవ్రమైన చర్చలలో ఉండగానే, దానిని ఒక రూపానికి తీసుకొని రావడానికి శ్రమిస్తున్న వారితో, తన పత్రములోని సంభాషణ అను అంశము ఈ ప్రస్తుత పత్రానికి ఒక ప్రేరేపిత కారకముగా పొందుపరచాలని పౌలు పాపుగారు వారికి స్పష్టం చేశాడు.

దాన్ని సారాంశము ప్రకారము ఈ సంభాషణ కేవలము ఇతర క్రైస్తవ సంఘాలతో, ఇతర విశ్వాస ప్రజలతో మాత్రమే కాదు, ప్రపంచమంతటితో కతోలిక సంఘము ఈ సంభాషణ జరపాలి అని ఈ మహాసభ సభ్యులు భావించారు. అనగా శ్రీసభ ఇతరులను ఆలకించాలని, వారి నుండి నేర్చుకోవాలని, సంభాషణను దాటి ఇతరుల సహకారంతో ఈ ప్రపంచ రూపురేఖలను మార్చడానికి సంసిద్ధం కావాలని తెలుస్తుంది.

ఈ పత్రికలోని భావాలను పరిశీలించినప్పుడు కొన్ని వాస్తవాలు తెలుస్తున్నాయి. "ఈ లోకంలో శ్రీసభ అనాథ కాదు. పారలౌకికమైన కృపావర సంపన్నురాలు శ్రీసభ. సాక్షాత్తు క్రీస్తు ప్రభువు ద్వారానే నిర్దిష్టమైన విధివిధానాలతో వ్యవస్థీకృతమై మానవసంఘంగా అవతరించింది. క్రీస్తు ప్రభువే శ్రీసభకు అంతరంగికంగానూ బహిర్గతం గాను ఏకీభవముతో వర్ధిల్లే ఆధ్యాత్మిక వరాలను కూడా సమకూర్చాడు. కనుకనే శ్రీసభ ఏకకాలంలో ఇటు లౌకిక వ్యవస్థ గాను, అటు పారలౌకిక ఆధ్యాత్మిక సమాజం గాను కూడా కొనసాగుతుంది. ఈ లౌకిక యాత్ర ముగిసే వరకు మానవులందరితో కలిసి సహయాత్రికురాలుగా ముందుకు కొనసాగుతూనే ఉంటుంది. భౌతిక జీవనంలో ఎదురయ్యే ఆటుపోట్లను సుఖదుఃఖాలను తాను పంచుకుంటుంది. అంతేకాదు పిండిలో పులుపులా, లౌకిక సమాజానికి ఆత్మలా వ్యవహరిస్తూ, క్రీస్తు ప్రభు ద్వారా లోకాన్ని నూతివీకరించడానికి, మానవ కుటుంబాన్ని దైవజన కుటుంబముగా రూపాంతరం చెందించడానికి కృషి చేస్తుంది. (GS 40. LG 8,9,38.)

తన కర్తవ్యం నిర్వహణలో భాగంగా తనతో పాటు సహ ప్రయాణికులుగా ఉన్న అనేక మందిని తనతో కలుపుకుంటూ వారితో కలిసి నడుస్తూ ప్రపంచ రూపాంతరం వైపు సాగడమే లక్ష్యంగా భావించింది. ఈ ప్రయాణంలో, ఈ లక్ష్యసాధనలో తనతో సహకరిస్తున్న కతోలికేతర క్రైస్తవ సంఘాల సహకారాన్ని, ఇతర సాంప్రదాయాలకు చెందిన కతోలిక సంఘాల సేవలను శ్రీ సభ సాదరంగా ఆహ్వానిస్తుంది, సగౌరవంగా గుర్తిస్తుంది, కృతజ్ఞతతో స్వీకరిస్తుంది. అలాగే క్రైస్తవేతర ప్రపంచం సైతం మానవ సమాజాన్ని సువార్త సుక్షేత్రంగా మలచడములో అనేక విధాలుగా తనకు తోడ్పడగలదన్న విశ్వాసం శ్రీ సభకు ఉంది. లౌకికులైన మానవుల వ్యక్తిగత శక్తి సామర్థ్యాల ద్వారా, లౌకిక ప్రగతి పరిణామాల ద్వారా, ప్రపంచంలో సువార్త సందేశానికి అనువైన వాతావరణం నెలకొంటుంది. ఆ విధంగా లౌకిక ప్రపంచం దైవ దేశాన్ని పాటించడంలో శ్రీ సభకు తోడ్పడుతుంది. అంటే శ్రీసభకు లౌకిక ప్రపంచానికి మధ్య ఇచ్చిపుచ్చుకునే జీవన రంగాలు, సందర్భాలు అనేకం ఉంటాయి. అలా శ్రీసభ, భౌతిక మానవ సమాజము రెండు కూడా పరస్పరం సహకరించుకుంటూ కృషి చేసే జీవన రంగాలేమిటో, అందుకు ఆధారభూతమైన మౌలిక విలువలేమిటో నియమ నిబంధనలేమిటో ద్వితీయ వాటికన్ మహాసభ

స్పష్టం చేస్తుంది (GS 40).

సర్వ మానవ సమైక్యత సాధన శ్రీసభ ప్రధాన ధర్మ నిర్వహణలో అంతర్భాగం. ఎందుకన, మానవులకు దేవునితో గల సాన్నిహిత్యానికి, మానవుల మధ్య గల పరస్పర సంఘీభావానికి శ్రీసభ ఒక సజీవ సంకేతం, దైవ మానవ సఖ్యతను పెంపొందించే ఆధ్యాత్మిక సాధనం, దివ్య సంస్కారం (LG 1). శ్రీసభ ప్రధాన ధర్మం మతపరమైనదైనప్పటికీ ఆయా కాలమాన పరిస్థితులను బట్టి ఇతర రంగాలలో కూడా శ్రీసభ క్రియాశీలక పాత్ర వహించే అవకాశం ఉంది. ముఖ్యముగా అవసరాలలో ఆపదలలో చిక్కుకున్న మానవులను ఆదుకోవలసి వచ్చినప్పుడు, మానవ కళ్యాణానికి తన వంతు సేవలను అందజేయవలసిన తరుణంలోనూ, శ్రీసభ స్వరముగా ఇతర జీవన రంగాలలో సైతం ప్రవేశించి తన సేవలను అందజేస్తుంది. బాధితులకు పీడితులకు అండగా నిలుస్తుంది. సామాజిక జీవన సుస్థిరతకు సంక్షేమానికి వెన్నుదన్నుగా ఉంటుంది. 'ప్రపంచంతో సంభాషణ' లో భాగంగా, సమకాలీన సమాజంలో జరుగుతున్న మంచి పనులన్నింటినీ శ్రీసభ మనఃపూర్వకంగా సమర్థిస్తుంది. ముఖ్యముగా, వివిధ వర్గాల మధ్య ఏకతా సాధనకు జరిగే కృషిని, సామాజిక ఆర్థిక రంగాలలో పరస్పర సహకారాన్ని పెంపొందించే పనులను, ఆరోగ్యకరమైన సామాజిక కార్యక్రమాలన్నింటినీ శ్రీసభ ప్రోత్సహిస్తుంది (GS 42). ఒక్క మాటలో చెప్పాలంటే, సమాజంలోని వ్యక్తులకు, కుటుంబ వ్యవస్థకు గల మౌలిక హక్కులను గుర్తించి గౌరవించే దేశాలతోనూ, ఆయా దేశాల నేలే పాలనా వ్యవస్థలతోనూ సహృదయ భావంతో సంబంధాలను ఏర్పరచుకొని 'సకల మానవుల హితాన్ని కోరుతూ' విస్తృతమైన సేవలందించాలన్నది శ్రీసభ ప్రగాఢ కాంక్ష (GS 42).

ఈ విధంగా శ్రీసభ మూడు రకాల సంభాషణలను ఆచరణలో ఉంచి, ప్రప్రథమముగా తన అంతరంగములోనే అనగా తన సభ్యులలోనే సమిష్టి జీవన విధానం ద్వారా ఒక నూతన ప్రక్షాళన వైపు అడుగులు వేస్తుంది. ఒకే క్రీస్తుని రక్షణ రహస్యం లో భాగంగా ఇతర క్రైస్తవ సంఘాలను కలుపుకుంటూ, వారితో సంభాషిస్తూ, వారి నుండి ఉద్భవించే మంచి ఆలోచనలను స్వీకరిస్తూ కలసికట్టుగా ఒకే దైవ రాజ్యం వైపు పైనుంచి పిలుపునిస్తుంది. అన్నింటికీ మించి శ్రీసభ నేపథ్యం నైజం జీవితం జీవిన విధానం తన కొరకు కాదు ప్రపంచ రక్షణ కొరకు

అని గ్రహించి, మానవ సమాజంలోని అన్ని రంగాలలో సర్వ మానవ శ్రేయస్సు కొరకై పాటుపడుతున్న అన్ని శక్తి సామర్థ్యాలను, అన్ని రంగాలను అన్ని వ్యవస్థలను గౌరవిస్తూ, వాటి ప్రభావం ద్వారా ప్రపంచంలోని వివిధ వ్యవస్థల సహకారం ద్వారా మానవుని సమగ్ర శ్రేయస్సు కొరకై పరితపిస్తుంది. సంభాషణ అంటే మనము ఇతరులకు ఇవ్వడం మాత్రమే కాదు, ఇతరనుండి వచ్చే మంచిని కూడా సాధారంగా ఆహ్వానించి స్వీకరించదము అను నూతన అర్ధాన్ని ఈ పత్రిక ద్వారా శ్రీసభ ప్రకటిస్తుంది.

**ఐదవది: యుద్ధము యుద్ధ మార్గాలు**

ప్రపంచంలో శ్రీసభ అను పత్రము నేటి ఆధునిక మానవ పోకడలను, భయానక జీవనశైలి స్థితిగతులను, యుద్ధ సంక్షోభాలను ఒక వైపు గమనిస్తూనే, మరోవైపు ప్రపంచ ప్రజల్లోని ప్రతి ఒక్కరు ప్రతి జాతి ప్రతి దేశం శాంతిస్థాపనకు నడుము కట్టి అంకితభావంతో కృషి చేస్తూ నవ సమాజం నిర్మించాలి, వసుదైక కుటుంబ నిర్మాణం జరగాలి, సర్వత్ర శాంతి నెలకొనాలి అని శాంతి పిలుపునందిస్తుంది.

ఈ పత్రము స్పష్టంగా ప్రాపంచిక స్థితిగతులను అధ్యయనం చేస్తుంది: “ఆధునిక ప్రపంచం ఒకపక్క సంపూర్ణ పరిణత దశవైపు పురోగమిస్తుంటే, మరోపక్క అనేక అనర్ధాలు ప్రపంచాన్ని తీవ్ర సంక్షోభానికి గురిచేస్తున్నాయి. నేడు ప్రపంచ ప్రజలను పట్టిపీడిస్తున్న అతిపెద్ద అనర్థం యుద్ధం. ఈ యుద్ధాల వల్ల అపారమైన ప్రాణ నష్టం ఆస్తి నష్టం వాటిల్లడమే కాకుండా ఆయా దేశాల జనజీవనం చెల్లా చదరవుతుంది. సామాజిక వ్యవస్థలు సమస్యల వలయాలలో చిక్కుబడుతున్నాయి. లక్షలాదిమంది నిరాశ్రయులుగా అనాథలుగా వీధిన పడుతున్నారు. ప్రగతి కుంటుపడుతుంది. శాంతి మృగ్యమవుతుంది. కనుక యుద్ధభితితో నేడు యావత్ మానవజాతి నిలువెల్లా వణికి పోతుంది” (GS 77).

యుద్ధానికి హింసకు కారణాన్ని కూడా ఈ పత్రము వివరిస్తుంది. యుద్ధ భయానకాన్ని వివరిస్తూనే, హింసాత్మక విధానాలను ఖండిస్తూనే, ప్రపంచశాంతి స్థాపన కొరకు పిలుపునిస్తూనే, ఈ యుద్ధ ప్రమాదాన్ని నిలపడము అంత సులువు కాదు అని కూడా ఒక వాస్తవాన్ని తెలియజేస్తుంది. శాంతి తత్వం గురించి మాట్లాడు సందర్భంలో ఈ సత్యాన్ని తెలియజేస్తుంది: “ఎన్ని జాగ్రత్తలు తీసుకున్న

యుద్ధ ప్రమాదాన్ని ప్రమాదాన్ని పూర్తిగా నివారించడం సాధ్యం కాదు. హింస విధంశాలను సమూలంగా నిర్మూలించను లేము. అందు కారణం మానవుల్లో గూడుకట్టుకొని ఉండే పాపపు ప్రవృత్తి. మానవ జీవితాల్లో పాపపు ప్రభావం ఉన్నంతకాలం అంతర్యుద్ధాలు, బహిర్ యుద్ధాలు ముంచుకొొచ్చే ప్రమాదం పొంచి ఉంటూనే ఉంది. ఈ పరిస్థితి లోకాంతం వరకు అనగా క్రీస్తు పునరాగమనం వరకు ఇలాగే కొనసాగుతుంది" (GS 78).

ఇది ఒక సత్యము. ప్రజలను భయపెట్టడానికి కాదు గాని, మానవ పాపపు ప్రవృత్తి వలన తరచుగా జరుగుతున్న అనర్థాలను ప్రమాదాలను తెలియజేసి వాటి నుండి బయటపడటానికి శ్రీ సభ ఒక పిలుపునిస్తోంది, ఒక పరిష్కారాన్ని చూపిస్తుంది. ఏమిటి ఆ పరిష్కారం. పత్రం యొక్క సారాంశాన్ని గ్రహిద్దాం: మానవులు హింస విధ్వంశాలనుండి యుద్ధ భీతి నుండి బయటపడే మార్గం ఒకటి ఉంది. అదే ప్రేమ మార్గం. మానవులు ప్రేమమూర్తులు అయితే పాపాన్ని జయించగలుగుతారు. పరస్పరం ప్రేమమయ జీవనం గడపగలిగితేహింస ప్రవృత్తిని జయించగలుగుతారు. హింసాత్మక ఘర్షణలను విధ్వంసాలను యుద్ధాలను సైతం నివారించగలుగుతారు. ఇది యదార్థం. ప్రేమ మూర్తులు లోకాన్ని జయించగలుగుతారు (GS 78).

యుద్ధము పట్ల క్రైస్తవుల దృష్టి రెండు విధాలుగా ఉంటుంది అని తెలియజేస్తుంది: నీతి యుద్ధం యుద్ధము, న్యాయబద్ధమైన యుద్ధం. మానవ సంప్రదాయంలో ఈ రెండు కూడా అనాదిగా పాతుకుపోయి ఉన్నాయి. అయితే రెండు భయానక ప్రపంచ యుద్ధాల తర్వాత ఈ మహాసభ శ్రీసభ నైజమును తెలియజేస్తుంది. క్రైస్తవ అహింస విధానము, అవగాహన పూరితమైన యుద్ధ వ్యతిరేకత శ్రీసభ యుద్ధానికి సమాధానంగా ఎంచుకుంది. అనేక దేశాలను అనేక నగరాలను అనుబాంబులతో వినాశనం చేసిన ప్రపంచ యుద్ధాలను చూసిన తర్వాత మహాసభ ఒక ఖచ్చితమైన స్పందనను తెలియజేయటానికి పూనుకుంది.

23వ జాన్ పాపుగారు మరియు 12వ భక్తినాథ పాపుగారు ప్రబోధనలను పరిగణలోనికి తీసుకొని శ్రీసభ యుద్ధం ఎడల ముక్తకంఠ వ్యతిరేకతను ప్రకటిస్తుంది. "ఆధునిక ప్రపంచంలో యుద్ధాన్ని అర్థం చేసుకోవడానికి ఇన్ని కోణాల నుండి ఆలోచించి చూడాలి. పర్యవసానాల తీవ్రత అర్థమైతే కానీ

సమకాలీన ప్రపంచంలో యుద్ధ భూతానికి గల బహుముఖ వినాశక శక్తులను అంచనా వేయలేము. కనుక ఈ తరం మానవులు దువ్వే తమ దుందుడుకు తత్వానికి, యుద్ధోన్ముఖ పాలన విధానాలకు గాను భవిష్య తరాలకు. సంజాయిషీ ఇచ్చుకోవలసి ఉంటుంది. ఈ విషయాన్ని వారు విస్మరింపరాదు. ఎందుకంటే, రానున్న తరాల మనుగడ భవితవ్యం వర్తమాన తరాల విజ్ఞత మీద, వారు తీసుకొని నిర్ణయాల మీదనే ఆధారపడి ఉంటుంది. నేడు వైయక్తికం కాదు, పాక్షికము కాదు. అది సార్వత్రికం. గెలుపు ఓటములు ఎవరివైనా, భారీ మూల్యం చెల్లించేది మాత్రం భావితరాల మానవులే. ఇలా మానవజాతి మనుగడకే పెనుముప్పు వాకీయ ప్రమాదం ఉంది గనుకనే ఆధునిక యుగానికి చెందిన జగద్గురువులు 'సర్వతోముఖ యుద్ధాన్ని' తీవ్రంగా ఖండించారు. వారితో పూర్తిగా ఏకీభవిస్తూ ద్వితీయ వాటికన్ మహాసభ ఈ విధంగా ప్రకటిస్తుంది: విచక్షణ రహితంగా పల్లెలను పట్టణాలను ఇతర జనావాసాలను విధ్వంసం చేసే యుద్ధకాండ దేవునికి సాటి మానవులకు వ్యతిరేకంగా చేసే ఘోరమైన నేరం. కనుక అలాంటి యుద్ధ బీభత్సాలను ముక్తకంఠంతో ఖండించాలి" (GS 80).

ప్రపంచాల మధ్య ఆయుధాల పోటీతత్వాన్ని శ్రీసభ గమనిస్తూనే ఉంది. అందుకే ఇలా అంటుంది: ప్రపంచ దేశాల మధ్య నేడు ఆవిడ పోటీ తీవ్రంగా ఉంది. అధునాతన ఆయుధాలను అతిశక్తివంతమైన ఆయుధాలను అధిక సంఖ్యలో సమకూర్చుకోవడానికి అనేక దేశాలు ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నాయి అన్నది బహిరంగ రహస్యం (GS 81). ఆయుధాల పోటీ కొరకు, ఆయుధాల తయారీ కొరకు జరిగే అమానుష కార్యకలాపాల గురించి కూడా గట్టిగానే హెచ్చరిస్తుంది. "ఆయుధ పోటీ కారణంగా ఆయా దేశాల ప్రజల అభివృద్ధి, ప్రపంచాన్ని ప్రాథమిక జీవన సమస్యల పరిష్కారానికి వెచ్చించవలసిన అమూల్యమైన ధన వనరులు దారిమళ్లి ఆయుధాలు కొనుగోళ్లతో దుర్వినియోగం అవుతున్నాయి. అధునాతన ఆయుధ సామాగ్రిని కనిపెట్టడానికి విస్తారమైన నిధులను ధారబోస్తూ, సమకాలీన ప్రపంచాన్ని సమగ్ర వికాస పదంలో నడిపించడం సాధ్యమయ్యే పని కాదు. మరో మాటలో చెప్పాలంటే, ప్రపంచవ్యాప్తంగా కోటానుకోట్ల మంది దుర్భర దారిద్యములో మగ్గుతున్న నేపథ్యంలో విలువైన నిధులను యుద్ధ రంగానికి తరలించడం ఘోరమైన నేరమవుతుంది. అంతేకాదు ఈ ఆయుధ పోటీ అంతర్జాతీయ స్పర్ధలను శాశ్వతంగా రూపుమాపకపోగా, ఏదో

అంటువ్యాధిలా ప్రపంచ దేశాలు అన్నిటికీ సోకుతుంది. ఆర్థికంగా వెనకబడిన బడుగు దేశాలు సైతం అత్యాధునిక ఆయుధాల కొనుగోళ్లకు ఎగబడడమే ఇందుకు నిదర్శనం" (GS 81).

యుద్ధ చట్ట వ్యతిరేకమని ప్రకటించడం, యుద్ధ నివారణకు దేశాలన్నీ కలిసి రావడం యుద్ధ నివారణకు తక్షణమార్గమని శ్రసభ అభిప్రాయపడుతుంది. దాని కొరకు ఒక పిలుపును అందిస్తుంది. పత్రంలోనికి తొంగి చూద్దాం: ఎప్పటికైనా అంతర్జాతీయ రంగ అన్ని దేశాలు ఒక ఒప్పందానికి వచ్చి యుద్ధాన్ని చట్ట వ్యతిరేక చర్యగా పరిగణించాలి ప్రకటించాలి. ఆ శుభ ఘడియ కోసం మన వంతు కృషిని మనం నిజాయితీగా కొనసాగించాలి. అహర్నిశలు శ్రమించాలి. ఇది దేవుడు మనకు అప్పగించిన సామాజిక ధర్మంగా భావించి నిర్వర్తించాలి. అయితే అలాంటి ఆశవహమైన పరిస్థితి నెలకొనాలంటే ప్రపంచ దేశాలన్నీ ఆమోదించిన ఒక ఉమ్మడి పాలన వ్యవస్థ ఏర్పాటు కావాలి. దానికి నామమాత్రపు అధికారులు కాకుండా చట్టబద్ధమైన అధికారాలు కల్పించాలి. మానవులందరికీ తగిన భద్రత కల్పించగల శక్తి సామర్థ్యాలు ఆ వ్యవస్థకు ఉండేలా చూడాలి. ఎంతటి వారినైనా న్యాయబద్ధంగా చట్టబద్ధంగా నడిపించగల సత్తా దానికి ఉండాలి.

శాంతి పరస్పర విశ్వాసం నుండి పుడుతుంది. కనుక ప్రతి దేశము ప్రతి ప్రజా ఇరుగుపొరుగు దేశాలను ఆయా దేశాల ప్రజలను గౌరవించాలి. వారి పట్ల నమ్మకాన్ని పెంచుకోవాలి. ఆయుధ బలాన్ని ప్రదర్శించి యుద్ధం బూచిని చూపించి శాంతిని స్థాపించలేము కనుక, అన్ని దేశాలు ఈ సత్యాన్ని గుర్తించి అందరూ కలిసి ముందుగా ఆయుధ పోటీని నిలువరించాలి, సంపూర్ణ నిరాయుధీకరణ కోరుతూ ప్రయత్నాలు ఆరంభించాలి. ఇందుకు ప్రజల సహకారం కూడా సంపూర్ణంగా ఉండాలి. ప్రజల మనోభావాలు సాటి మానవుల పట్ల వారికున్న వైఖరి, ఐక్యతకు సఖ్యతకు శాంతియుత సహజీవనానికి అనుకూలంగా ఉండాలి. అంటే ప్రజలలో ఈ తరహా పరివర్తనం జరగకుండా పాలకులు ఎన్ని చర్చలు చేసినా ఎన్ని ఒప్పందాలు కుదుర్చుకున్న ఫలితం ఉండదు (GS 82).

దీని కొరకు శ్రీసభ ఒక మార్గదర్శకాన్ని నిర్దేశిస్తుంది. ముందుగా ప్రజలను చైతన్యవంతులను చేయాలి. వారి మనోభావాలలో వారి ప్రవృత్తులలో

ప్రపంచశాంతికి అనుకూలమైన పరివర్తన జరిగేటట్లు చూడాలి. అలాగే, విద్యా రంగంలో ఉన్న అధికారులు అధ్యాపకులు, తమ విద్యార్థులను చైతన్య పరుస్తూ విశ్వజన భావాలతో వారిని ఉత్తేజితుల్ని చేస్తూ, వారు త్రికరణ శుద్ధిగా నిరాయుధీకరణను, యుద్ధరహిత ప్రపంచాన్ని, విశ్వ మానవ కళ్యానానికి కోరుకునేలా వారిని తీర్చిదిద్దాలి. ఇలా, ప్రజల మనోభావాలను సంస్కరించి వారి అంతరంగాలను ప్రభావితం చేస్తూ, శైశవ దశలోనే శాంతిబీజాలను నాటుతూ, వసుదైక కుటుంబ స్థాపన దిశగా వారి అభిప్రాయాలను ఆలోచనలను వారి నడవడిని మళ్లించడం ఆధ్యాపకులు చేయగలిగిన పని. చేయవలసిన పని.

**ఆరవది: శ్రీ సభ ప్రపంచము**

"ఆధునిక ప్రపంచంలో శ్రీసభ" అను పత్రము మానవ జీవన పురోగతి ఆవశ్యకత గురించి అనేక అంశాలను ప్రస్తావించింది, అందులో ముఖ్యమైనవి శాంతి న్యాయము. అంతర్జాతీయ మానవ సమాజ స్థాపన గురించి మరింత ఎక్కువగా చర్చించింది. ముందుగా నేటి ప్రపంచంలో శ్రీసభ పాత్ర ఏమిటి, మానవ సమాజ స్థాపనకై శ్రీసభ పద్ధతి ఏమిటి అని ఒక అవగాహనను అందించింది. సాంఘిక ప్రబోధ గురించి గురువులకు నేర్పించు వాటికన్ నియమావళి శ్రీసభ పాత్ర గురించి ముఖ్యముగా ద్వితీయ వాటికన్ మహాసభ శ్రీసభ ప్రపంచం పట్ల నిర్వహింపదలచిన బాధ్యత గురించి చెబుతూ ఇలా అంటుంది: శ్రీసభ అధికార పత్రాలలో నేరుగా క్రైస్తవ జీవిత లౌకిక విషయాల గురించి ఇంత అధికంగా ఆలోచించి అందించటం ఈ పత్రంతోనే మొదటిసారి.

ఈ విధంగా తన ప్రబోధమును సమాజం వైపు సామాజిక స్పృహ వైపు మరల్చింది. అనగా తన ప్రబోధనలో ఈ పత్రము సాంఘిక జీవనానికి ప్రధాన పీఠము వేసింది. సాంఘిక సువార్త అనవసర ప్రబోధము కాదని, క్రీస్తు అందించిన సువార్తలో సామాజిక అంశాలు ముఖ్యమైన పాత్రను పోషిస్తున్నాయని, క్రైస్తవులందరూ ఇటువంటి సామాజిక స్పృహతో మానవ సమాజ స్థాపనకై కంకణం కట్టుకొని ముందుకు సాగాలని తెలియజేస్తుంది. ఆధునిక ప్రపంచంలో శ్రీసభ అను పత్రము సువార్తను వక్రీకరించి రాజకీయ లబ్ధి కొర్కై దానిని వ్యక్తీకరించడాన్ని ఖండిస్తుంది. ద్వితీయ వాటికన్ మహాసభ, శ్రీసభ కేవలము ఆధ్యాత్మిక చరిత్రలో

మాత్రమే కాకుండా, సామాజిక బాధ్యతను కూడా కలిగి ఉంది అని గుర్తించింది. ఈ పత్రము ద్వారా శ్రీసభ తన నూతన ఉనికిని, తన నూతన అవగాహనను, తన నూతన విధానంను గ్రహించింది.

ఆధునిక ప్రపంచంలో శ్రీసభ ఒక నూతన వరవడికి శ్రీకారం చుట్టింది. ఈ వరవడి రెండు పదాల ద్వారా వ్యక్తమవుతుంది: బాధ్యత, సేవ. ఒక నిర్మాణం క్రైస్తవ ధర్మమని తన చివరి అంశముగా శ్రీసభ ఈ పత్రములో ప్రకటిస్తుంది (GS 93). క్రైస్తవులు పరస్పర ప్రేమ కారుణ్యం కలవారని, సాటి మానవులకు తమ శక్తి కొలది భావముతో ఔదార్యముతో సేవలు చేయ తపించు వారిని, సమధర్మం సౌజన్యం వర్ధిల్లే సమ సమాజ నిర్మాణానికి, నవలోక నిర్మాణానికి నడుము కట్టాలని, న్యాయానికి కట్టుబడి ధర్మబద్ధంగా జీవించే సాటి మానవులందరితో చేతులు కలిపి లౌకిక ప్రపంచాన్ని దేవుడు కోరే ప్రేమ సామ్రాజ్యంగా శాంతి ధామముగా తీర్చిదిద్దడానికి అహర్నిశలు కృషి చేయాలని, ఇది క్రైస్తవులందరి బాధ్యత అని ప్రకటిస్తుంది. నేటి ఆధునిక ప్రపంచంలో సాటి మానవులలో ప్రభు క్రీస్తు రూపాన్ని దర్శించి, అమితమైన ఉదారత్వముతో, అమోఘమైన ప్రభావముతో వారిని ప్రేమించడమే క్రైస్తవుల ముందు ప్రస్తుతం ఉన్న అద్భుత బాధ్యత.

ఈ పత్రములో కనిపించే, అందరికీ ఆమోదయోగ్యముగా అనిపించే, అత్యంత ప్రత్యేకమైన అంశము: శ్రీసభ తన స్వీయ అవగాహనతో తనను తాను మానవ కుటుంబ సేవకై అంకితం చేసుకుంది. శ్రీసభ ఒక సేవకురాలు. ఇక రానున్న తరములలో శ్రీసభ ఉనికి గురించి, శ్రీసభ సైని గురించి, శ్రీసభ ప్రవృత్తి గురించి ఇటువంటి అనేక రూపకాలు మనకు కనిపిస్తాయి. ఈ రూపకాలకు ఆధారము, ప్రారంభము "ఆధునిక ప్రపంచంలో శ్రీసభ" అను ఈ పత్రము. అనగా ఈ పత్రము శ్రీసభను మానవ సేవ వైపు సంపూర్ణంగా నడిపిస్తుంది. అనగా కతోలిక క్రైస్తవత్వం గర్భగుడిని దాటి బయటికి వస్తుంది. అనగా తన గుడి గోడలను దాటి బయటకు చూస్తుంది. అనగా తన సౌకర్యమైన విలాసవంతమైన కట్టలను దాటి ప్రజల హృదయంలోనికి ప్రవేశిస్తుంది. తనదైన జీవితాన్ని ప్రజలకు అందిస్తుంది. ప్రజలకు ఒక మంచి కాపరిగా భరోసా ఇస్తుంది. తన హృదయములో తన పరిచర్యలో మానవాళి ఆవేదనలను ఆందోళనలను నిరంతరము మోస్తుంది.

ఇందు కొరకై శ్రీసభ ఒక సమిష్టి జీవనాన్ని, సమగ్ర జీవన విధానాన్ని అవలంబించాలని ఈ పత్రము సూచిస్తుంది. ఇందుకు తగిన విధంగానే తరువాతి దశాబ్దాలలో జగద్గురువులు మరియు శ్రీసభ సమావేశాలు సువార్తికరణ తత్వము గురించి అనేక విషయాలను అందించారు. క్రీస్తు తత్వాన్ని విశాలమైన దృక్పథంతో విస్తరింపజేశారు. సంఘీభావం అనే క్రైస్తవ సుగుణమును అందరూ అలవర్చుకోవాలి, కలిసికట్టుగా సమిష్టిగా ప్రపంచ నిర్మాణం కోసం చేయూతను అందించాలి అని పిలుపునిచ్చారు. ప్రస్తుత ఈ కాలములో, ద్వితీయ వాటికన్ మహాసభ తన ఆరువది సంవత్సరాల ఉత్సవాల తరుణములో, ప్రస్తుత ఫ్రాన్సిస్ పాపుగారు అందించిన అపోస్తలిక పత్రం "సువార్తనందంలో" ఆధునిక ప్రపంచంలో శ్రీసభ యొక్క పాత్రలోని అనేక అంశాలు మారు మ్రోగుతున్నాయి.

ఈ శ్రీసభ ఆధారిత అంశాలు, నేటి సామాజిక అభివృద్ధి కొరకై శ్రీసభ నాటిన బీజాలు. ఈ పత్రం ద్వారా మహాసభ పూర్వపు సామాజిక స్పృహ ఇప్పుడు శ్రీసభ కేంద్రబిందువుగా మారింది. మహాసభ పూర్వపు పాపు గార్లు, మహాసభ పాపు గార్లు, మహాసభ తదుపరి పాపు గార్లు శ్రీసభ ఆంతరంగిక క్రమేణ రూపాంతరాన్ని ఆశించారు. శక్తివంతమైన ఆధిపత్యం చెలాయించు దేశాలతో మాత్రమే అధిక సంబంధాలు కలిగి ఉండే బానిసత్వ సంఖ్యల నుండి శ్రీసభకు విముక్తిని కలిగించారు. ప్రస్తుత ఫ్రాన్సిస్ పాపుగారు తరచుగా ప్రకటించు విధానం: క్రైస్తవులు పేదల ఎడల కృష్ణతో కలిగిన అంకితభావమును ప్రదర్శించాలి. ఈ నినాదము ద్వితీయ వాటికన్ మహాసభ పత్రము నుండి వెలువడినదే. ద్వితీయ వాటికను మహాసభ ప్రవచించింది: రానున్న తరములలో ఆసియా ఆఫ్రికా మధ్య అమెరికా దక్షిణ అమెరికాలలో ఉన్నటువంటి నిరుపేదల నుండి క్రీస్తు కొరకు రక్తాన్ని చిందించగల ఒక వేదసాక్షి పంట రానున్నది.

కతోలికా సాంఘిక ప్రబోధ గురించి మాట్లాడుతూ బ్రియన్ హెహిర్ అను గురువు ఇలా అంటాడు: ద్వితీయ వాటికన్ మహాసభ సంపూర్ణ శ్రీసభ తత్వం గురించి ఒక ఔత్సాహకమైన విధానాన్ని ప్రకటించింది. శ్రీసభ ఒక నిర్ణయాత్మక కదలికను చూపెట్టింది. ఈ కదలికలో రెండు కోణాలు ఉన్నాయి: తనను తాను

చూసుకోవడం, ప్రపంచాన్ని చూడడం. ఇది ఒక ప్రత్యేకమైన మార్పు. ప్రపంచంలో శ్రీసభ అను పత్రము ఒక సంఘటనగా మరియు ఒక క్రమముగా కనిపిస్తుంది.కారల్ రానర్ చెప్పిన విధంగా, ఆధునిక ప్రపంచంలో శ్రీసభ పత్రము ద్వితీయ వాటికను మహాసభ పత్రాలన్నిటిలో గొప్ప ప్రాముఖ్యత కలిగి ఉంది. ఈ పత్రము గురించి ముందస్తు ప్రణాళిక లేనప్పటికీ, సువార్త పత్రముగా అభివర్ణింపబడినప్పటికీ ఈ పత్రము అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. దానికి సాక్ష్యము ఆ తరువాత పరిణామాలు. ద్వితీయ వాటికన్ మహాసభ తరువాత లాటిన్ అమెరికా, సౌత్ ఆఫ్రికా, ఈస్ట్ ఆసియా, అమెరికా, యూరోప్ శ్రీ సభలో ఎటువంటి సామాజిక స్పృహ, సాంఘిక అవగాహన, సంఘీభావము, సర్వ మానవ శ్రేయస్సు కొరకై జరిగిన కార్యక్రమాలు పరిశీలించి చూస్తే శ్రీ సభ తనను తాను మార్చుకున్న విధానం అర్థమవుతుంది. దీనికి కారణం " ఆధునిక ప్రపంచంలో శ్రీసభ" అను పత్రము, దాని నుండి వెలువడిన వేదాంత సిద్ధాంతము. దీని ద్వారా సమాజసేవకై శ్రీసభలో గొప్ప పునాది పడింది.

## ముగింపు: శ్రీసభ ప్రపంచ హృదయము

గౌదియుమ్ ఎత్ స్పెస్ ద్వారా ద్వితీయ వాఖ్యకను మహాసభ శ్రీ సభను, శ్రీసభలోని సభ్యులను ఎంతగా ప్రభావితం చేసింది, ఎటువైపు నడిపించింది, ఎంత దూరం ఇంకా నడిపిస్తుంది, మానవ సమాజ పురోగతికై ఎంత సేవలు చేస్తుంది అని ప్రశ్నించుకున్నప్పుడు, ఈ పత్రం నుండి మనకు కొన్ని సమాధానాలు దొరుకుతున్నాయి.

**మొదటిది:** మానవ ఔన్నత్యము పవిత్రత కొరకు శ్రీ సభ ప్రగాఢమైన సమర్పణతో ముందుకు సాగుతుంది.

**రెండవది:** మానవుని ఆధ్యాత్మిక మరియు సామాజిక వివిధ స్వభావమును తెలియపరుస్తూ, మానవ ఔన్నత్యము సర్వజన శ్రేయస్సు రెండు ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయని, వాటిని విడదీయరాదని ప్రబోధించింది.

**మూడవది:** అన్ని రకములైన మానవ విభజనలకు 'సంఘీభావము' అను నినాదం ద్వారా ఒక పరిష్కారాన్ని అందిస్తుంది. దేశీయ జాతీయ సాంఘిక లింగ

వర్గ విభేదాలను తొలగించి, శాంతి కొరకు సమన్యాయం కొరకు దృడవిశ్వాసముతో కృషి చేస్తుంది. ఈ సామాజిక స్పృహలో ప్రధానంగా పేదల కొరకై, పీడితుల కొరకై ప్రత్యేకమైన శ్రద్ధను చూపుతుంది.

**నాలుగవది:** శ్రీసభ అంతరంగిక రూపాంతరం కొరకు కృషి సల్పుతుంది. తద్వారా సంభాషణ సఖ్యత అను సాధనముల ద్వారా ఇతర విశ్వాస సంఘాలతోనూ, మానవత్వం కలిగి మంచితనంతో జీవిస్తున్న అందరితోనూ ఏకమై, సమిష్టిగా మానవ శ్రేయస్సు కొరకై అడుగులు వేస్తుంది.

**ఐదవది:** సేవకీ శ్రీసభగా ఆవిర్భవించింది. అనగా శ్రీసభ ఒక సేవకిగా ప్రపంచం నుండి ఉద్భవించు సకల మంచిని స్వీకరించి, దానిని ప్రపంచం కొరకు సకల మానవాళి కొరకు అందిస్తుంది. ఈ విధముగా ప్రపంచంలో ఉంటూ ప్రపంచం కొరకే జీవిస్తూ మానవ ఆధ్యాత్మిక మరియు సాంఘిక చరిత్రను నూత్నీకరించడానికి ఒక ధ్యేయముతో పయనిస్తుంది. ఇతరులతో కలిసి శ్రీసభ సభ్యులు ప్రపంచ శ్రేయస్సు కొరకై సమర్థవంతమైన కార్యములు నిర్వహించాలని ఆశిస్తుంది, ఆహ్వానిస్తుంది

గౌదియుం ఎత్ స్పెస్ అధ్యయనం మనలను 'మన పరిధి' దాటి బయటకు రమ్మని ఆహ్వానిస్తుంది. శ్రీసభ తన తత్వమును ఉనికిని కాపాడుకుంటూనే, ప్రపంచ మానవాళి శ్రేయస్సుకై తన పరిచర్యను విస్తరిస్తుంది. అదేవిధంగా ప్రతీ క్రైస్తవుడు తన గిరి దాటాలి, తన స్వీయ ఆలోచనను దాటాలి, సమాజంలో ప్రవేశించాలి. పులిసిన పిండి వలె సమాజంలో నిస్తేజమై ఉన్న జీవన స్థితిగతులను మాధుర్యంతో నింపాలి. వెలుగు వలె అందరి మధ్యలో నిలబడి, తమ సన్నిధి ద్వారా ప్రజల అజ్ఞాన అవిశ్వాస అంధకారమును తొలగించి ప్రభు కాంతితో వారిని ప్రకాశింపజేయాలి. అనగా, మన 'పరిచర్య' పరిధిని పెంచాలి. అనగా, సమసమాజ శ్రేయస్సు, నవసమాజ నిర్మాణం జరగాలంటే, మానవుల మధ్య ఉన్న అన్ని రకాల విభజనలను కూకటివేళ్ళతో పెరికి వేయాలి. ఇటువంటి సవాలుతోనే ఈ పత్రము మనలను ఈ జూబిలీ సంవత్సరంలో ప్రవేశించమని కోరుతుంది.

ఇదే ఆశను ఇదే కాంక్షను శ్రీసభ తన పత్రములో చివరి అంశముగా పొందుపరచి క్రైస్తవులందరిని ఈ బృహత్తర పరిచర్యకై వెలుపలకు రమ్మని పిలుస్తుంది. పత్రములోని మాటలతో ఈ వ్యాసమును ముగించు కుందాం: అదే మన పిలుపు, అదే మన మలుపు, అదే ప్రపంచ మానవాళి గెలుపు. "ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు దేవుని ప్రేమకు దైవరాజ్య విలువలకు సాక్షులుగా జీవించగలిగితే, లోకంలోని మానవులందరు తమ భౌతిక జీవనానికి పరమార్థమేమిటో గ్రహించగలుగుతారు. పరలోక రాజ్య ప్రవేశానికి మార్గమేమిటో తెలుసుకోగలుగుతారు. ఏదో ఒక తాము సైతం సుస్థిర శాంతి, అపారమైన ఆనందం, దేదీప్యమానమైన మహిమాయుతమైన దేవుని సన్నిధానం నెలకొని ఉండే మోక్షరాజ్యంలో సముచితమైన స్థానం సంపాదించగలమనే ఆశాభావంతో జీవించగలుగుతారు. వారి అంతరంగాలలో కొలువుదీరి ఉండే పవిత్రాత్మ ప్రభువే వారిలో ఆ ఆశాభావాన్ని కలిగిస్తారు. ఈ విధంగా ప్రభు సాక్షులుగా జీవించే క్రైస్తవులమైన మనం యావత్ మానవ జాతిని ప్రభు నిర్దేశించిన సత్య మార్గంలో సువార్తా మార్గంలో నడిపించగలుగుతాము. వారిని ప్రభువు సిద్ధం చేసిన పారలౌకిక గమ్యానికి చేర్చడంలో మనవంతు ధర్మాన్ని సవినయంగా నిర్వర్తించిన వారమవుతాం."

ద్వితీయ వాటికన్ మహాసభ్ ముగింపు దీవెనతో ముందుకు సాగుదాం: "మన యందు పనిచేయు శక్తి ద్వారా మనం కోరిన దానికంటెను, ఊహించిన దానికంటెను ఎన్నియో రెట్లు అధికముగా నెరవేర్చగల ఆ దేవునకు – దైవ సంఘమునందును, క్రీస్తు యేసు నందును తరతరములు మహిమ కలుగును గాక! ఆమెన్" (ఎఫెసీ 3:20–21).

## Resources:

THE SECOND VATICAN COUNCIL, *Gaudium et Spes, Pastoral Constitution on the Church in the Modern World* (7 December 1965), in Austin Flannery (Editor), *Vatican Council II, The Conciliar and Post Conciliar Documents*, 794-891. For Telugu Translation, Guntur Yesupadam, *Dvitheeya Vatican Mahasabha*

*Adhikara Patraalu, Viswasa Vardhini – 7,* Secunderabad: Jeevan Institute of Printing 2009, 613-812.

Pope JOHN XXIII, *Mater et Magistra, Encyclical on Christianity and Social Progress*, May 15, 1961.

Pope JOHN XXIII, *Pacem in Terris, Encyclical on Establishing Universal Peace in Truth, Justice, Charity and Liberty*, April 11, 1963.

Pontifical Council for Justice and Peace, *Compendium of the Social Doctrine of the Church*, 2005.


Pope John Paul II, *Sollicitudo rei Socialis for the twentieth anniversary of Populorum Progressio*, December 30, 1987.

John W. O'Malley, *What Happened at Vatican II*, Cambridge: The Belknap Press of Harvard University Press, 2008.

Donald R. Campion, "The Church Today" in *The Documents of Vatican II*, New York: Guild Press, America Press, 1966. 183-198.


J. Bryan Hehir, *Catholic Social Teaching as a Framework*, New Orleans Province of the Society of Jesus, at Spring Hill College, June 2, 1988.

❋ ❋ ❋ ❋


తెలుగు కతోలిక దైవశాస్త్ర సమాఖ్య, 10వ సదస్సు
Jubilee 2025 and Preparations:
Study of four Documents of
Vatican II cum Year of Prayer
Most Rev. Udumala Bala, D.D.,
Bishop of Warangal
& Chairman, TCBC Commission for
Doctrine and Theology
అక్టోబర్ 29 & 30, 2024
పునీత యోసేపు ప్రాంతీయ గురు విద్యాలయం,
రామంతపురం, హైదరాబాద్ - 500 013.
తెలుగు కతోలిక పీఠాధిపతుల సమాఖ్య - కతోలిక సిద్ధాంత, దైవశాస్త్ర విభాగము








# భక్త యోహాను ప్రచురణలు

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం

రామంతపురం, హైదరాబాదు - 500 013. ఫోన్ : 91-040-29561761, 29561762

e-mail: stjohnshyd2@gmail.com | www.stjohnseminaryhyd.org

Printed at : Jeevan Institute of Printing